
www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

16 అనంతపురం
శుక్రవారం 4 ఆగస్టు 2017



ఘనంగా యువజనోత్సవాలు

పోటాపోటీగా విద్యార్థుల నృత్యాలు 16

జిల్లా యువజన సంక్షేమశాఖ, ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో నగరంలోని ఆర్ట్స్ కళాశాలలో గురువారం డివిజన్ స్థాయి యువజనోత్సవాలు ఘనంగా నిర్వహించారు.

పదేళ్ల పోరాట ఫలితమిది

- పండిట్లకు దక్కిన ప్రమోషన్లు
- భాషా పండితుల్లో ఆనందం

16

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అనంతపురం
శుక్రవారం 4 ఆగస్టు 2017

టీడీపీ నేత గోళ్ల బాదన్న

దారుణహత్య

- వీలునామా పంచాయితీనే కారణమా.?
- పోలీసుల అదుపులో నలుగురు అనుమానితులు!
- మృతదేహాన్ని పరిశీలించిన ఎస్పీ అశోక్‌కుమార్, ఎమ్మెల్యే ఉన్నం
- గోళ్ల గ్రామంలో విషాదం
- గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు

వివరాలు 12లో



బాదన్న (ఫైల్)



చెట్టును ఢీకొని నుజ్జునుజ్జు అయిన కారు





మృతి చెందిన రంగమ్మ, మమత, ఆదినారాయణ, సత్యనారాయణ

శోకం

రోడ్డు ప్రమాదంలో నలుగురి దుర్మరణం

ఇంకో అర గంటలో ఇంటికి చేరుతారు. ఈ లోపు మృత్యువు ముంచుకొచ్చింది. ఒకే కుటుంబానికి చెందిన నలుగురిని బలితీసుకుంది. మృతుల్లో నూతన వధూవరులతోపాటు వరుడి తల్లి, చిన్నాన్న ఉన్నారు. కణేకల్లు మండలం యర్రగుంట గ్రామం వద్ద గురువారం మధ్యాహ్నం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న రంగమ్మ (55), ఆమె కొడుకు సత్యనారాయణ (26), కోడలు మమత (22), రంగమ్మ మరిది ఆదినారాయణ (54) మృతి చెందారు. బెళుగుప్ప మండలం తగ్గుపర్తి గ్రామానికి చెందిన వీరు బళ్లారిలో నివాసం ఉంటున్నారు. రంగమ్మ మామ అయిన నాగన్న ఐదు నెలల క్రితం మృతి చెందగా ఆయన కర్మ కార్యక్రమానికి బుధవారం వీరంతా బళ్లారి నుంచి తగ్గుపర్తికి వెళ్లారు. గురువారం ఉదయం కార్యక్రమాన్ని ముగించుకుని, మధ్యాహ్నం తిరుగు ప్రయాణమయ్యారు. యర్రగుంట గ్రామం వద్ద వీరు ప్రయాణిస్తున్న కారు ముందు టైరు పగిలిపోవడంతో వాహనం అదుపుతప్పి చెట్టుకు ఢీకొంది.

- మృతులు ఒకే కుటుంబానికి చెందినవారు
- టైరు పగిలి, చెట్టును ఢీకొన్న కారు
- నూతన వధూవరులతో పాటు వరుడి తల్లి, చిన్నాన్న మృతి

వివరాలు 7లో

వానాకాలంలో.. ఎండాకాలం!



తీవ్ర వర్షాభావం..

భానుడి భగ..భగ

ఏడేళ్లలో రికార్డుస్థాయి ఎండలు



బుక్కరాయసముద్రం: ఇది వేసవి కాలం కాదు.. అయినా ఎండలు దడపుట్టిస్తున్నాయి. కొద్ది రోజులుగా జిల్లాలో భానుడు ప్రతాపం చూపిస్తున్నాడు. ఏడు సంవత్సరాల్లో ఎప్పుడూ నమోదు కాని రీతిలో ఈ ఏడాది ఉష్ణోగ్రతలు నమోదవుతూ రికార్డు సృష్టిస్తున్నాయి. గడచిన ఏడు సంవత్సరాల్లో జూలై నెలలో అత్యధికంగా 35.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయింది. అలాంటిది ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో 36.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కావడం విశేషం. సాధారణంగా జూలై నెలలో వర్షాలు కురవడంతో పాటు, తీవ్రమైన గాలులు వీస్తాయి. అయితే ఈ ఏడాది వర్షాలు సరిగా కురవలేదు. పైగా మధ్యాహ్నం దాటితే ఎండలు భగ...భగమంటున్నాయి. ప్రస్తుతం గాలిలో తేమశాతం ఉదయం 11 గంటల సమయంలో 75 నుంచి 85 శాతం నమోదువుతుండడంతో ఉక్కపోత తీవ్రంగా పెరుగుతోంది. గాలిలో తేమశాతం పెరగడం వల్ల వేడి ఎక్కువగా ఉంటుందని వాతావరణ శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. ప్రస్తుతం ప్రధాన పట్టణాల్లో కాకుండా గ్రామీణ ప్రాంతాల్లోనూ ఉష్ణోగ్రతలు అధికంగా ఉన్నాయి. సాధరణంగా వేసవి కాలం మార్చి, ఏప్రిల్, మే వరకు ఎండలు తీవ్రంగా ..... మిగతా 6లో

ఏడేళ్లుగా నమోదవుతున్న ఉష్ణోగ్రతలు

ఏడాది	జూన్	జూలై	ఆగస్టు
2012	36.7	33.7	33.4
2013	34.6	32.7	33.1
2014	36.9	33.7	33.5
2015	34.9	35.6	34.3
2016	33.7	33.7	32.8
2017	37.8	36.5	34.7

ఏసీబీకీ పట్టిస్తాం..



- క్వాలిటీ కంట్రోల్ సీఈకి కాంట్రాక్టర్ల బెదిరింపు
- ఆ మూడు రోడ్లలో తగ్గిన తారు
- సీఈ తనిఖీల్లో బట్టబయలు
- నివేదిస్తే సంగతి చూస్తామంటూ ఒత్తిళ్లు
- ఆమ్యామ్యాల మత్తులో ఆర్అండ్‌బీ అధికారులు
- విజయవాడకు పిలిపించిన ఉన్నతాధికారులు

అనంతపురం జిల్లా పరిషత్తు: 'మీకు కొంత మొత్తం అందజేస్తాం. గమ్మున ఉండండి. లేదు.. నివేదిక అందజేస్తానంటే మేం కూడా ఊరుకోం. ఏసీబీకి పట్టించేస్తాం.. జాగ్రత్త.' ఇది ఓ ఉన్నతాధికారికి కొందరు కాంట్రాక్టర్లు చేసిన బెదిరింపులు. రోడ్ల నిర్మాణంలో నాణ్యతకు తిలోదకాలిచ్చిన విషయమై నివేదిక అందజేసే అధికారిపై కాంట్రాక్టర్లు తీవ్ర ఒత్తిళ్లు తీసుకు వస్తున్నట్టు సమాచారం. రహదారులు, భవనాల శాఖ పరిధిలో జరుగుతున్న ఈ వ్యవహారం ఆ శాఖవర్గాల్లో కలవరం రేపుతోంది. జిల్లావ్యాప్తంగా ఆర్అండ్‌బీ పరిధిలో ఆరు నెలల కాలంలో ఎక్కువ పనులు జరిగాయి. ఆ రహదారుల నాణ్యతను పరిశీలించడానికి 15 రోజుల క్రితం క్వాలిటీ కంట్రోల్ చీఫ్ ఇంజనీర్(సీఈ) రామ్మూర్తి జిల్లాకు వచ్చారు. రెండు, మూడు రోజులపాటు ఇక్కడే మకాం వేశారు. వివిధ రహదారులను పరిశీలించారు. అందులో జిల్లాలోని మూడు రహదారుల నాణ్యతలో తేడా కొట్టొచ్చినట్లు కనిపించింది. రోడ్డు నిర్మాణం కోసం వేయాల్సిన తారు శాతం కంటే తక్కువగా వినియోగించినట్లు ఆయన నిర్ధారించారు. ఈ విషయమై సంబంధిత అధికారులపై అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది. కాంట్రాక్టర్లు రోడ్లు నిర్మిస్తుంటే నాణ్యత చూసుకోకుండా మీరేం చేస్తున్నారంటూ జిల్లా ... వివరాలు 6లో

ఆ నాలుగు మండలాలకు ఎంఈఓలు

9న కడపలో కౌన్సెలింగ్

అనంతపురం అర్బన్: జిల్లాలో ఖాళీగా ఉన్న మండల విద్యాధికారుల(ఎంఈఓ) పోస్టులను భర్తీ చేయాలని విద్యాశాఖ నిర్ణయించింది. ఈ మేరకు గురువారం ఆర్జేడీ ప్రతాప్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం జిల్లాలో ఆమడగూరు, పెనుకొండ, రామగిరి, గుడిబండ మండలాల్లో ఎంఈఓ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వాటిని సీనియర్ ప్రధానోపాధ్యాయుల ద్వారా భర్తీ చేయనున్నారు. సీనియారిటీ జాబితా క్రమసంఖ్య 220 నుంచి గల ప్రధానోపాధ్యాయులను పరిగణనలోకి తీసుకోనున్నారు. ఆ సీరియల్ నెంబర్ నుంచి ఉన్న వారు మాత్రమే ఈనెల 9న కడపలో నిర్వహించే కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని ఆర్జేడీ ఆదేశాలు జారీ చేశారు. ఈ విషయం డీఈఓ లక్ష్మీ నారాయణ తెలిపారు.

ఇసుక అక్రమ రవాణాను అరికట్టండి: కలెక్టర్

అనంతపురం కలెక్టరేట్: జిల్లాలో ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వీరపాండ్యన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో ఎస్పీ అశోక్‌కుమార్, జేసీ రమామణితో కలిసి ఉచిత ఇసుక విధానంపై గురువారం సంబంధిత అధికారులతో ఆయన సమావేశమయ్యారు. జిల్లాలో ఎన్ని రీచ్‌లలో ఇసుక లభ్యత ఉందో గుర్తించాలని గనులు, భూగర్భవనరుల శాఖ అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం ఇసుక లభ్యత ఉన్న రీచ్‌ల నుంచి అక్రమంగా ఇసుక రవాణా జరగకుండా చూడాలన్నారు. జిల్లా సరిహద్దుల్లోని చెక్‌పోస్టుల్లో నిఘా మరింత పెంచాలని ఆదేశించారు. నిబంధనల మేరకు ట్రాక్టర్, టిప్పర్లనుంచి చార్జీలు వసూలు చేయాలన్నారు. టాస్క్‌ఫోర్స్ కమిటీ సభ్యులు ఇసుక అక్రమ రవాణా నివారణకు చర్యలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ఈ విషయంలో ఎవరు నిర్లక్ష్యం వహించినట్లు తెలిసినా చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో డీటీసీ సుందర్ వద్ది, డీఎస్పీ మల్లికార్జున, హెచ్చెల్సీ ఎస్ఈ శేషగిరిరావు, ఆర్డీఓ మలోలా పాల్గొన్నారు.

6న కానిస్టేబుళ్లు హాజరు కావాలి

ఎస్పీ జీవీజీ అశోక్‌కుమార్

అనంతపురం జిల్లాపరిషత్తు: కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికైన సివిల్, ఏఆర్ విభాగాల పురుష, మహిళ అభ్యర్థులు సొంత లగేజీతో ఈనెల 6వ తేదీ జిల్లా పోలీస్ కార్యాలయానికి హాజరు కావాలని జిల్లా ఎస్పీ జీవీజీ అశోక్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. శిక్షణనియామక ఉత్తర్వులు, గుర్తింపు కార్డు, కిట్లను అభ్యర్థులకు అందజేస్తామన్నారు. అదేరోజు సాయంత్రం కేటాయించిన పోలీస్ శిక్షణకేంద్రాలకు అభ్యర్థులను బస్సుల్లో పంపనున్నామన్నారు.

నేడు జనవనరుల శాఖ మంత్రి దేవినేని రాక

అనంతపురం వైద్యం: జనవనరుల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు శుక్రవారం జిల్లాకు రానున్నారని జిల్లా ఉన్నతాధికారుల ద్వారా తెలిసింది. జిల్లాలో జరిగే పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొననున్నట్లు వారు తెలిపారు. దీంతో ఆయా శాఖల అధికారులు ముందస్తుగా వారివారి కార్యక్రమాల్లో నిమగ్నమయ్యారు.




ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును కలిసిన మంత్రులు కాలవ శ్రీనివాసులు, పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్‌కు స్వీటు తినిపిస్తున్న సీఎం

శ్రీరామ్ నిశ్చితార్థానికి రండి..!

సీఎం చంద్రబాబును ఆహ్వానించిన మంత్రి పరిటాల సునీత

అనంతపురం అర్బన్: తన కుమారుడు శ్రీరామ్ వివాహ నిశ్చితార్థానికి రావాల్సిందిగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును స్త్రీ,శిశు సంక్షేమ శాఖమంత్రి పరిటాల సునీత ఆహ్వానించారు. ఈనెల 10న హైదరాబాద్‌లో శ్రీరామ్ వివాహ నిశ్చితార్థం జరగనుందని, ఆ కార్యక్రమానికి హాజరై ఆశీర్వదించాలని ఆమె కోరారు. అమరావతిలో మరో మంత్రి కాలవ శ్రీనివాసులు, పెళ్లి కుమారుడు పరిటాల శ్రీరామ్‌తో కలిసి గురువారం ఆమె ముఖ్యమంత్రి చంద్రబాబును కలిశారు. ఈ సందర్భంగా యువనేత శ్రీరామ్ వివాహం గురించి సీఎంకు ఆమె వివరించారు. హైదరాబాద్‌లో ఈనెల 10న నిశ్చితార్థం ఏర్పాటు చేశామని, అక్టోబర్ 1న వివాహముహూర్తం పెట్టుకున్నామని..తప్పకుండా హాజరై ఆశీర్వదించాలని ఆమె కోరారు. ఇందుకు సీఎం హర్షం వ్యక్తం చేస్తూ పక్కనే ఉన్న పెళ్లికుమారుడు, యువనేత పరిటాల శ్రీరామ్‌కు మిఠాయి తినిపించి ఆశీర్వదించారు.

డమ్మీ ఖాతాల్లో ...

పరిహారం జమపై రైతన్నల ఆగ్రహం




మండల సర్వసభ్య సమావేశాన్ని అడ్డుకుంటున్న రైతులు, ఏడీఏతో వాదనకు దిగిన రైతన్నలు

మండల సమావేశాన్ని అడ్డుకున్న వైనం..

ఏడీఏ ఘెరావ్..

రెండు గంటల పాటు రాస్తారోకో..

ఓబుళదేవరచెరువు: తమకు అందాల్సిన పంటనష్టపరిహారం సొమ్ము డమ్మీ ఖాతాల్లో జమచేసి అధికారులు అన్యాయం చేయడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల సమావేశాన్ని అడ్డుకోవడమే కాకుండా రెండు గంటల పాటు రాస్తారోకో చేసి.. ఏడీఏని ఘెరావ్ చేశారు. గత ఏడాది పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం అందించిన నష్టపరిహారంలో ఓడీసీ మండలం ఇనగలూరు పంచాయతీ రైతులకు అందాల్సిన రూ. అర కోటికి పైగా మొత్తం వారి ఖాతాల్లో కాకుండా ఇతర ఖాతాల్లో జమయిన విషయం విదితమే. ఈ విషయమై అధికారులను రైతులు ప్రశ్నించగా ఐదు రోజుల్లోగా రైతుల ఖాతాల్లో జమ చేస్తామని చెప్పారు. అయితే 25 రోజులు కావస్తున్నా ఇప్పటి వరకు జమ కాలేదు. దీంతో రైతులు గురువారం జరిగిన మండల సర్వసభ్య సమావేశాన్ని అడ్డుకున్నారు. సమావేశానికి వచ్చిన వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రామసురేష్‌బాబు ప్రసంగాన్ని రైతులు అడ్డుకున్నారు. దీంతో సమావేశం గందరగోళంగా మారడంతో ఎంపీపీ ఇస్మాయిల్, జడ్పీటీసీ సభ్యుడు పిట్టా ఓబుళరెడ్డి తదితరులు ఏడీఏతో సహా బయటికి వెళ్లి రైతులకు సర్ది చెప్పారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ.. డమ్మీ ఖాతాల్లో పరిహారం సొమ్ము జమయిందని, దాన్ని రైతుల ఖాతాల్లో జమ చేయాలంటే గుంటూరు ప్రధాన కార్యాలయానికి వెళ్లి చేయించాల్సి ఉందని, అందుకు కొంత సమయం పడుతుందన్నారు. ఏడీఏ సమాధానం సంతృప్తికరంగా లేకపోవడంతో ఆగ్రహించిన రైతులు కదిరి - హిందూపురం ప్రధాన రహదారిపై రెండు గంటల పాటు బైఠాయించి నిరసన తెలియజేశారు. వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడడంతో ఏఎస్ఐ ఇస్మాయిల్ ఖాన్, ఇషాక్‌బాష వారికి సర్దిచెప్పి వ్యవసాయ కార్యాలయానికి రావాల్సిందిగా కోరారు.

దీంతో వారు వ్యవసాయకార్యాలయం వద్దకు చేరుకుని అక్కడ ఉన్న ఏడీఏని ఘెరావ్ చేశారు. దీనిపై స్పందించిన ఏడీఏ తమకు 15 రోజుల వ్యవధి ఇవ్వాలని, ఆలోగా రైతుల ఖాతాల్లోకి పరిహారం జమయ్యేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో శ్రీనివాసరెడ్డి, మున్నా, వెంకటరమణ, ఎంఎస్ షబ్బీర్, గాజుకుంటపల్లి వీరాంజి, రైతులు పాల్గొన్నారు.

'ఎంఆర్ వ్యాక్సిన్ తప్పక వేయించండి'

కుందుర్పి: మండలంలోని పిల్లలకు మీజిల్స్ రూబెల్లా వ్యాక్సిన్ వేయించాలని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్ఓ పురుషోత్తం పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని బండమీదపల్లి, మలయనూరు, తీగలపల్లి, నాగేపల్లి గ్రామాల్లోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో మాట్లాడుతూ తొమ్మిది నెలలు నుంచి 15సంవత్సరాల్లోపు ఉన్న పిల్లలకు మీజిల్స్ రూబెల్లా వ్యాక్సిన్‌ను తప్పనిసరిగా వేయించాలన్నారు. ఈ వ్యాక్సిన్ వేయించడం వల్ల పలు వ్యాధులు సోకకుండా ఉంటాయన్నారు. అదేవిధంగా వైద్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి వ్యాక్సిన్ వేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది సి.హెచ్ రాజు, మధు, శ్రీనివాసులు, సావిత్రమ్మ, మధుబాబు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంపద తయారీపై చెత్తేశారు..

రూ. 5 లక్షలతో కేంద్రం ఏర్పాటు.. ఆరు నెలలైనా ప్రారంభం కాని పనులు..

శెట్టూరు: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రాల్లో వ్యర్థ పదార్థాలతో వర్మీ కంపోస్టు ఎరువుల తయారీ నిర్వహణ కేంద్రంను ఏర్పాటుచేశారు. అందులో భాగంగా మండల కేంద్రంలోని నోముగడ్డ వంక సమీపంలో ఉపాధి హామీ నిధులతో రూ. 5లక్షలు ఖర్చుచేసి ఘన వ్యర్థ పదార్థాల కేంద్రాన్ని ఏర్పాటుచేశారు. ఈ కేంద్రం ఏర్పాటై ఆరు నెలలు కావస్తున్నా దిష్టిబొమ్మలా దర్శనమిస్తోందని ప్రజలు వాపోతున్నారు. ప్రజలకు చెత్తను వేసేందుకు రెండు బుట్టలను అందజేసి తడి, పొడి చెత్తలను వేరువేరుగా సేకరించి వ్యర్థ పదార్థాల నిర్వహణ కేంద్రంలో సేంద్రియ ఎరువుల తయారీకి ఉపయోగించాల్సి ఉంది. అయితే నేటికీ ప్రారంభానికి నోచుకోకపోవడంతో పథకం ఘనం... ప్రగతి శూన్యం అన్న చందంగా మారిందని పలువురు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రారంభించాలని కోరుతున్నారు.



ప్రారంభానికి నోచుకోని ఘన
వ్యర్థపదార్థాల నిర్వహణ కేంద్రం

స్వచ్ఛభారత్‌ను అమలుపరచండి...
రామాంజినేయులు, శెట్టూరు



ప్రభుత్వం లక్షలాది రూపాయల వ్యయంతో నిర్మించిన ఘన వ్యర్థపదార్థాల నిర్వహణ కేంద్రాన్ని త్వరితగతిన ప్రారంభించి గ్రామంలో ఉన్న చెత్తాచెదారాన్ని సేకరించి ఎరువులుగా మార్చితే గ్రామాలు పరిశుభ్రంగా ఉంటాయి. త్వరితగతిన ప్రారంభిస్తే ప్రయోజనకరంగా ఉంటుంది.

- త్వరలోనే ప్రారంభిస్తాం...
సుధాకర్‌బాబు, ఏపీఓ

ఉన్నతాధికారులతో చర్చించి ఘన వ్యర్థపదార్థాల నిర్వహణ కేంద్రాన్ని త్వరలోనే ప్రారంభిస్తాం. సేంద్రియ ఎరువుల తయారీకి శ్రీకారం చుడతాం.

లోకల్ గైడ్
localguide

ఎమ్మెల్యే డైరీ

కళ్యాణదుర్గం టౌన్: శాసనసభ్యులు, ఉన్నం హనుమంతరాయ చౌదరి శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటారు.

కళ్యాణదుర్గం మార్కెట్‌లో కూరగాయల ధరలు



టమోట 50, పచ్చిమిర్చి 50, వంకాయలు 60, లావుమిర్చి 60, ఎర్రగడ్డలు 20, ఆలుగడ్డలు 20, బెండ 40, బీరకాయలు 30, బీన్స్ 80, కాకర 40, చౌడే కాయలు 30, క్యాబేజి 30, బీట్‌రూట్ 40, క్యారెట్ 80

కళ్యాణదుర్గంలో మాంసం ధరలు

మటన్ : 340, చికెన్ : 180, నాటుకోడి : 260
చేపలు : 120, కోడి గుడ్లు(డజన్) : 48

కళ్యాణదుర్గం సినిమాలు

సౌభాగ్య : ఫిదా, వెంకటేశ్వర : వాసుకి
నూర్‌ముబారక్ : గౌతమ్‌నంద

తల్లిపాలు అమృతంతో సమానం

కళ్యాణదుర్గం టౌన్: తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానమని అంగన్‌వాడీ కార్యకర్త అరుణ్‌జ్యోతి పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని గుండ్లప్పదొడ్డిలోని అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానమని, అప్పుడే పుట్టిన బిడ్డకు ముర్రుపాలు తాగించడం వల్ల వ్యాధినిరోధక శక్తి పెరుగుతుందన్నారు. ఆరు నెలల వరకు బిడ్డకు విధిగా తల్లిపాలు ఇవ్వాలన్నారు. తల్లిపాల ప్రాముఖ్యతపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, గర్భవతులు, బాలింతలు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

కంబదూరు : తల్లిపాల ప్రాముఖ్యతపై ప్రతి అంగన్‌వాడీ కార్యకర్త చాటిచెప్పాలని ఇన్‌చార్జి సీడీపీఓ హేమ తెలిపారు. గురువారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నాలుగు మండలాల అంగన్‌వాడీ కార్యకర్తలతో ఆమె ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిపాల వారోత్సవాలను ఈనెల 7వ తేదీ వరకు ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలోను ర్యాలీలు, అవగాహన సమావేశాలు పెద్దఎత్తున జరుపుకోవాలన్నారు. తల్లిపాల సంస్కృతిని ప్రతిఒక్కరు ప్రోత్సహించేందుకు ప్రతిఒక్కరు నడుం బిగించాలన్నారు. అనంతరం ఆయా అంగన్‌వాడీ కార్యకర్తలకు మంజూరైన వస్తువులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి గ్రామసభలు

కుందుర్పి: మండలంలో శుక్రవారం నుంచి 8వ తేదీ వరకు గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ నాగరాజు తెలిపారు. ఇల్లు లేని లబ్ధిదారులకు ఇళ్లను మంజూరుచేయడంతో పాటు పలు పథకాల గురించి గ్రామసభల్లో వివరిస్తామన్నారు. శుక్రవారం తూమకుంట, బెస్తరపల్లి, ఎనుములదొడ్డి, తెనగల్లు గ్రామాల్లో గ్రామసభలు చేపడుతున్నామన్నారు. ఈ గ్రామసభలకు వీఆర్ఓలు, ఎంపీటీసీ, జడ్పీటీసీ, సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు తప్పక హాజరుకావాలన్నారు.

15న శ్రీకృష్ణ జయంతి వేడుకలు

అనంతపురం ప్రెస్‌క్లబ్ : ఈ నెల 15వ తేదీన నగరంలోని శ్రీనక్కా రామారావు యాదవ భవనంలో శ్రీకృష్ణజన్మాష్టమి వేడు కలు ఘనంగా నిర్వహించనున్నట్లు జిల్లా యాదవ మహాసభ నాయకులు నరసింహయాదవ్ తెలిపారు. గురువారం యాదవ భవన్‌లో సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జయంతి సందర్భంగా యా దవ భవన్‌లో 15న ఉదయం 8.30 గంటలకు గోపూజ, శ్రీకృష్ణు డికి అభిషేకం, 10.30 గంటలకు మంగళహారతి చేస్తామన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ యాదవ్, నాయకుడు హరినాథ్ యాదవ్ పాల్గొన్నారు.

అర్హులకే ఎన్టీఆర్ గృహాలు: ఎంపీడీఓ

కంబదూరు (గొల్లపల్లి) : అర్హులకే ఎన్టీఆర్ గృహ నిర్మాణాల మంజూరు కోసం ఆయా గ్రామాల్లో గ్రామసభలు ఏర్పాటుచేసి అర్హులను ఎంపికచేస్తామని ఎంపీడీఓ శివారెడ్డి తెలిపారు. గురువారం మండల పరిధిలోని గొల్లపల్లిలో ఎన్టీఆర్ గృహ నిర్మాణాల ఎంపికపై ఎంపీడీఓ అధ్యక్షతన గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పేదలకు సొంతింటి కల నెరవేర్చాలన్న ఉద్దేశంతో ఎన్టీఆర్ గృహాలను మంజూరు చేసిందన్నారు. అధికారులందరూ బృందంగా ఏర్పడి ఆయా గ్రామాల్లో గ్రామసభలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ గ్రామసభల్లో అర్హులను ఎంపికచేసి వారికి పక్కా గృహాలను నిర్మించేందుకు కృషిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గొల్లపల్లి సర్పంచ్ గంగమ్మ, వీఆర్ఓ, హౌసింగ్ ఏఈ విజయ్‌కుమార్, అధికారులు పాల్గొన్నారు.

శెట్టూరు: కేంద్రప్రభుత్వం మంజూరుచేసే పక్కా గృహాల ఎంపికకు గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు హౌసింగ్ ఏఈ రామమోహన్ గురువారం ఒక పత్రికా ప్రకటనలో తెలిపారు. గ్రామసభల వివరాలిలా ఉన్నాయి. 4వ తేదీన యాటకల్లు, బచ్చేహళ్లి, చిన్నంపల్లి, 5న లక్ష్మంపల్లి, మాకొడికి, కైరేవు, 6న అనుంపల్లి, ములకలేడు, పెరుగుపాళ్యం, 9న కనుకూరు, తిప్పనపల్లి, అనుంపల్లి, 10న అయ్యగార్లపల్లి, చిన్నంపల్లి, శెట్టూరు గ్రామాల్లో గ్రామసభలను నిర్వహిస్తామన్నారు. మూడు బృందాలుగా ఏర్పడి ఆయా తేదీల్లో ఎంఈఓ, తహసీల్దార్, ఎంపీడీఓ అధికారులు గ్రామసభల్లో పాల్గొంటారన్నారు.


గ్రామసభ నిర్వహిస్తున్న ఎంపీడీఓ

రైతుల సమస్యలు పరిష్కరించడానికే గ్రామసభలు

బ్రహ్మసముద్రం: మండలంలోని గుండిగానిపల్లిలో తహసీల్దార్ వెంకటశేషు ఆధ్వర్యంలో గురువారం రైతు సేవలో రెవెన్యూ శాఖ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామస్థులతో సమావేశమై రైతుల భూ సమస్యలను, 1-బి, అడంగల్, ఆన్‌లైన్ నమోదు, తదితర వాటి గురించి అడిగి తెలుసుకున్నారు. రైతులకు సంబంధించిన వివరాలు నమోదు కాకపోతే వాటికి సంబంధించిన ఆధారాలను చూపితే నమోదు చేస్తామన్నారు. అలాగే సాధికారిక సర్వేలో ఇళ్లకు సంబంధించిన లబ్ధిదారుల వివరాలను చదివి వినిపించారు. ఇల్లు కావాలంటూ సర్వే అధికారులకు తెలుపడంతో వాటిలో అర్హులను గుర్తించేందుకు గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ విజయ్‌కుమార్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

కుందుర్పి: మండలంలో అక్రమ పట్టాదారు పాసుపుస్తకాలను తొలగిస్తామని తహసీల్దార్ రమేషన్ పేర్కొన్నారు. మండల పరిధిలోని మలయనూరు గ్రామంలో గురువారం గ్రామసభను ఏర్పాటుచేశారు. ఈ గ్రామసభలో రెవెన్యూ శాఖకు సంబంధించి ఏవైనా తప్పొప్పులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. పట్టాదారు పాసుపుస్తకంలో విస్తీర్ణం తక్కువగా ఉన్నట్లు అర్జీలు వచ్చాయని తహసీల్దార్ తెలిపారు. గతంలో కొంతమంది వీఆర్ఓలు నల్లరాతి కట్టలను చూపించి గ్రామానికి చెందిన బోయ సరోజమ్మకు 5ఎకరాలకు, నాగరాజుకు 5ఎకరాలకు సంబంధించి పట్టాదారు పాసుపుస్తకాలను ఇచ్చారన్నారు. అయితే వారికి పట్టాలున్నా భూమి మాత్రం చూపించకపోవడంతో వాటిని తొలగిస్తామని ఆయన తెలిపారు. రెవెన్యూ శాఖకు సంబంధించి ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో వీఆర్ఓ ఎర్రిస్వామితో పాటు రైతులు తదితరులు పాల్గొన్నారు.


బ్రహ్మసముద్రంలో సమస్యలు
స్వీకరిస్తున్న అధికారులు

ఉపాధి కూలీల బ్యాంకు ఖాతాలకు ఆధార్ అనుసంధానం చేసేందుకు గ్రామసభలు


గ్రామసభను నిర్వహిస్తున్న దృశ్యం

శెట్టూరు: మండల పరిధిలోని అయ్యగార్లపల్లి, ఐదుకల్లు గ్రామాల్లో గురువారం ఆధార్ అనుసంధానం కొరకు ఉపాధి సిబ్బంది గ్రామసభలను నిర్వహించారు. ఈ గ్రామసభలో ఏపీఓ సుధాకర్ బాబు, టెక్నికల్ అసిస్టెంట్ రామకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధి కూలీల బ్యాంకు ఖాతాలకు ఆధార్ అనుసంధానం కాని వారి జాబితాలను తయారుచేసి కూలీల సమస్యలను పరిష్కరించేందుకు గ్రామసభలను నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం పలువురి కూలీల ఆధార్‌కార్డులను సేకరించి బ్యాంకు ఖాతాకు అనుసంధానం చేశారు. కూలీలకు కూలీ సొమ్ము త్వరితగతిన అందజేసేందుకు ఆధార్ అనుసంధాన్ని చేపట్టామన్నారు.

మరుగుదొడ్ల బిల్లులు చెల్లిస్తాం: ఏపీఓ

- ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన

కంబదూరు: వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకున్న ప్రతి ఒక్కరికీ బిల్లులు చెల్లించేందుకు చర్యలు తీసుకుంటామని ఇన్‌చార్జ్ ఏపీఓ హనుమంతరాయుడు తెలిపారు. గురువారం 'నత్తనడకన మరుగుదొడ్ల నిర్మాణం' అన్న శీర్షికన ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితం కావడంతో ఆయన స్పందించారు. నియోజకవర్గంలోనే ఎక్కడా లేని విధంగా కంబదూరు మండలంలోనే అత్యధికంగా వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలను చేపట్టామన్నారు. నిధులు మంజూరు అయిన వెంటనే నిర్మించుకున్న ప్రతి లబ్ధిదారుడి ఖాతాలోకి జమచేయడం జరుగుతుందన్నారు. తమ సిబ్బందితో క్షేత్రస్థాయికి వెళ్లి ఈ నిర్మాణాలను పూర్తిస్థాయిలో చేపడుతామన్నారు.

బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయినికి సన్మానం

కుందుర్పి: మండలంలోని బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు ఘన సన్మానాన్ని చేపట్టారు. గురువారం మండల పరిధిలోని జంబగుంపల ప్రాథమిక పాఠశాలలో పని చేస్తూ బదిలీపై వెళ్లిన సునీతను ఉపాధ్యాయులు పూల మాలలు, దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల విద్యాభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషిచేశారని ఆమె సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శివలింగప్ప, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చేనుకు చేవ.. రైతుకు రొక్కం

సేంద్రియ ఎరువు తయారీతో పెరిగిన ధీమా.. ఆశాజనకంగా పంట దిగుబడి.. విక్రయంతో ఆర్థిక తోడ్పాటు

బొమ్మనహాళ్ : రసాయనిక ఎరువుల వాడకంతో పంటలు, పండ్ల తోటలలో దిగుబడి లేక దిగులు పడిన రైతన్న కృషి ఫలించింది. ఉపాధి హామీ పథకం అధికారులు ఇచ్చిన చేయూతతో ప్రతి నెలా ఒక టన్ను వరకు వర్మీకంపోస్ట్ తయారు చేయడమే కాకుండా ఇతర రైతులకు వర్మీ కంపోస్ట్, వర్మీ పురుగులు కూడా పంపిణీ చేసేందుకు సిద్ధమయ్యారు రైతు శివాజి. ఎల్‌బీనగర్‌కు చెందిన రైతు శివాజీ దానిమ్మ తోటతో పాటు మొక్కజొన్న, ఇతర పంటలను పండించేవారు. కాగా రసాయనిక ఎరువులతోను, పురుగు మందులతోను పంటలలో దిగుబడి రాక సతమతమయ్యేవారు. ఈ నేపథ్యంలో ఉపాధి హామీ పథకం ద్వారా వర్మీ కంపోస్ట్ యూనిట్ల ఏర్పాటు, వర్మీ పురుగుల పెంపకం పథకంను అందజేయడంతో రైతు తన ఇంటి వద్దనే వర్మీ కంపోస్ట్ యార్డును నిర్మించారు. ప్రభుత్వం ఉపాధి హామీ పథకం ద్వారా ఇచ్చిన కేవలం రూ. 20 వేలు కాకుండా తన స్వంత నిధులతో కూడా కంపోస్ట్ యార్డులను నిర్మించుకుని 40 నుంచి 60 రోజులలోపు ఒక టన్ను నుంచి ఒకటిన్నర టన్ను వరకు వర్మీ కంపోస్ట్‌ను తయారు చేస్తున్నారు. ప్రస్తుతం 50 కిలోల ప్యాకెట్ రూ. 250లకు అమ్మకాలు సాగిస్తున్నారు. దీంతో పాటు వర్మీ పురుగులను కూడా ఇతర ఉపాధి హామీ లబ్ధిదారులకు అమ్మకాలు సాగిస్తున్నారు. వర్మీ కంపోస్ట్ యార్డు కోసం తనకున్న ఆవుల సంఖ్యను 20కు పెంచుకుని పేడ, ఎరువును వర్మీ కంపోస్ట్ యార్డుకు ఉపయోగిస్తున్నారు. దీంతో నాణ్యమైన వర్మీ ఎరువు తయారవుతుండటంతో సమీప పండ్లతోటల రైతులు వర్మీ ఎరువులను కొనుగోలు చేస్తున్నారు. తన తోటకు కావాల్సినంత ఎరువును తయారు చేసుకుని మిగతా ఎరువును రైతులకు అమ్మకాలు సాగిస్తున్నట్లు రైతు శివాజీ తెలిపారు. ఉపాధి హామీ అధికారుల పర్యవేక్షణలో వర్మీ కంపోస్ట్ యార్డును సక్రమంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.




వర్మీ కంపోస్ట్ యార్డును పరిశీలిస్తున్న అధికారులు, సిద్ధంగా ఉన్న వర్మీ కంపోస్ట్

ప్రభుత్వం చేయూత ద్వారా ఆర్థికలాభం.. శివాజి, రైతు, ఎల్‌బీనగర్



పంటలకు, పండ్ల తోటలకు గతంలో రసాయనిక ఎరువుల కోసం పెట్టుబడులు అధికమయ్యేవి. ప్రభుత్వం వర్మీకంపోస్ట్ యూనిట్ కేటాయింపు ద్వారా పంటకు తగినంత వర్మీ ఎరువు తయారవుతుండటంతో పాటు పెట్టుబడులు తగ్గుతున్నాయి. వర్మీ ఎరువు, వర్మీ పురుగుల అమ్మకం ద్వారా ఆర్థిక లాభం చేకూరుతోంది. ఉపాధి హామీ వర్మీ కంపోస్ట్ లబ్ధిదారులకు వర్మీ పురుగులు అందుబాటులో ఉంచాము.

రాయదుర్గం సమాచారం

నిబద్ధతతో విధులు నిర్వర్తించినప్పుడే గుర్తింపు



బదిలీ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

కణేకల్లు : నిబద్ధతతో విధులు నిర్వర్తించినప్పుడే సమాజంలో ఉద్యోగులకు గుర్తింపు లభిస్తుందని ఉడేగోళం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగరాజు పేర్కొన్నారు. స్థానిక పాఠశాలలో విధులు నిర్వహిస్తూ ఇటీవలే బదిలీ అయిన నాగభూషణం, అన్నపూర్ణలకు గురువారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మారుతి, పాఠశాల కమిటీ చైర్మన్ రాజు, మాజీ చైర్మన్ రామాంజనేయులు, ఉపాధ్యాయ సిబ్బందితో పాటు గ్రామస్థులు పాల్గొన్నారు.

నేడు కలెక్టర్ రాక

కణేకల్లు : కళేకుర్తి, మాల్యం, తుంబిగనూరు, గరుడచేడు తదితర ప్రాంతాల్లో విస్తరించిన ఇసుక మేటలను పరిశీలించేందుకు జిల్లా కలెక్టర్ వీరపాండ్యన్ శుక్రవారం వస్తున్నట్లు తహసీల్దార్ శ్రీవాణి తెలిపారు. కణేకల్లు, బొమ్మనహాళ్ మండలాల్లో వేలాది ఎకరాల్లో విస్తరించిన ఇసుక మేటల వల్ల ప్రజలు ఆషాఢ మాసంలో పడుతున్న ఇబ్బందుల దృష్ట్యా కలెక్టర్ ఈ ప్రాంతంలో పర్యటించి వీటి నివారణకు చేపట్టాల్సిన చర్యలపై చర్చించే అవకాశాలున్నట్లు తహసీల్దార్ చెప్పారు.

రెండు గ్రామాలకు జింక్, జిప్సం పంపిణీ


బొమ్మనహాళ్ : ఉప్పరహాళ్, కళ్లుహోళ గ్రామాలకు చెందిన రైతులకు జింక్, జిప్సంలను పంపిణీ చేసినట్లు ఏవో అహ్మద్ బాషా తెలిపారు. ఉప్పరహాళ్‌కు చెందిన 120 మంది రైతులకు నాలుగు టన్నుల జింక్, కళ్లుహోళకు చెందిన 140 మంది రైతులకు 35 టన్నుల జిప్సంను పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఈవో వెంకటనారాయణ, ఎంపీఈవోలు ఇలియాజ్, అనిల్, ధనుశ్రీ, నాగరత్న పాల్గొన్నారు.

పీహెచ్‌సీకి వైద్యుల నియామకం

బొమ్మనహాళ్ : మండల కేంద్రంలోని 24 గంటల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రెండో వైద్యాధికారిగా డాక్టర్ సంధ్యను నియమించారు. కాంట్రాక్ట్ పద్ధతిపై నియమించడం పట్ల ఆస్పత్రి కమిటీ చైర్మన్ కే బాబురావు, వైద్య సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

సర్వర్ సమస్యతో స్తంభించిన పోస్టల్ సేవలు

కణేకల్లు : స్థానిక పోస్టాఫీసులో నాలుగు రోజులుగా సర్వర్ సమస్య వేధిస్తుండటంతో పోస్టల్ సేవలు స్తంభించిపోయాయి. సోమవారం పోస్టల్ శాఖకు సంబంధించిన కంప్యూటర్ సర్వర్ డౌన్ అవ్వడంతో ప్రతినిత్యం జరిగే కార్యక్రమాలన్నీ ఆగిపోయాయి. రిజిస్టర్ పోస్ట్, స్పీడ్ పోస్ట్, రికరింగ్ డిపాజిట్, సేవింగ్ డిపాజిట్ లేక వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే ఉన్నతాధికారులు సర్వర్ సమస్యను పునరుద్ధరించి పోస్టల్ సేవలను జరపాలని పలువురు కోరుతున్నారు.




కణేకల్లులోని పోస్టల్ కార్యాలయం

మృతి చెందిన వైద్యుడి కుటుంబానికి చేయూత

- రూ1.8 లక్షల ఆర్థిక సహాయం
- ప్రభుత్వ వైద్యుల సంఘం సేవలు

అభినందనీయం : కేఎస్ఎస్ వెంకటేశ్వరరావు

అనంతపురం వైద్యం : ప్రభుత్వ వైద్యులుగా పనిచేస్తూ అనారోగ్యంతో మృతి చెందిన కుటుంబా లకు ఏపీ ప్రభుత్వ వైద్యుల సంఘం స్వచ్ఛందం గా సేవలందించడం అభినందనీయమని ప్రభుత్వ సర్వజనాస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ కేఎస్ఎస్ వెంకటేశ్వరావు పే ర్కొన్నారు. కొంతకాలంగా అనస్తీషియా విభాగం లో వైద్యుడిగా పనిచేస్తు అనారోగ్యంతో మృతి చెందిన డాక్టర్ అనిల్ కుమార్ కుటుంబానికి స్థానిక ప్రభుత్వాస్పత్రిలోని ఏపీ ప్రభుత్వ వైద్యుల సం ఘం ఆధ్వర్యంలో రూ1.8 లక్షల ఆర్థిక సహాయం గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఇన్‌చా ర్జి సూపరింటెండెంట్ మాట్లాడుతూ అనారోగ్యంతో డాక్టర్ అనిల్‌కుమార్ మృతి చెందడం బాధాకరమన్నారు. సంఘం అధ్యక్షుడు డాక్టర్ రామస్వామి నాయక్, వీరభద్రయ్య మాట్లాడుతూ వైద్యులకు ఎలాంటి సమస్య వచ్చినా సంఘం అండగా ఉంటుందని తెలియజేశారు. కార్యక్రమంలో డాక్టర్లు జ గన్‌మోహన్‌రెడ్డి, వైఎంఎస్ ప్రసాద్, హరిహర ప్రసాద్, రాంకిషోర్, ఎండ్లూరి ప్రభాకర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



చెక్కును అందజేస్తున్న వైద్యులు

నోటు పుస్తకాల పంపిణీ

బ్రహ్మసముద్రం: మండలంలోని బ్రహ్మసముద్రం, నాగిరెడ్డిపల్లి పాఠశాలల విద్యార్థులకు సార్ ఉద్యోగుల సమైఖ్య సహకారంతో గురువారం నోటు పుస్తకాల పంపిణీ చేపట్టారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులకు రెండు సంవత్సరాల నుంచి నో టుపుస్తకాలను అందజేసినట్లు ఉపాధ్యాయులు తెలిపారు. పేద విద్యార్థులను దృష్టిలో ఉంచుకుని నోటు పుస్తకాలను అందిస్తుండడంతో ఉపాధ్యాయులు వారి ఉదారతను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రా జన్న, సురేష్‌బాబు, ముత్యాలప్ప తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాలు పంపిణీ చేస్తున్న దృశ్యం



ఆలయ ప్రాంగణంలో పవిత్రాలకు పూజలు చేస్తున్న దృశ్యం

యాగశాలలో ఘనంగా పవిత్రోత్సవాలు

గుంతకల్లురూరల్: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కసాపురం శ్రీనెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయంలో రెండవరోజు గురువారం కూడా యాగశాల, ఆలయ ప్రాంగణంలో ఘనంగా పవిత్రోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మూలవిరాట్టుకు వేకువ జామునే గంగాభిషేకం, పంచామృతాభిషేకాలు, గణపతి పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ప్రత్యేకంగా స్వామివారిని అలంకరణ చేసి గణపతి హోమాలు నిర్వహించారు. అనంతరం యాగశాలలో ఉంచిన పవిత్రాలను శ్రీసీతారామలక్ష్మణ సహిత ఆంజనేయస్వామి ఉత్సవ మూర్తులకు ప్రత్యేకంగా అలంకరణ చేసి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆలయంలో పవిత్రాలను అర్చకులు తలపై ఉంచుకుని ఆలయ ప్రదక్షిణలు చేశారు. శుక్రవారం పూర్ణాహుతి కార్యక్రమం ఉంటుందని ఆలయ ప్రధాన అర్చకుడు గరుడాచార్యులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ ముత్యాలరావు, ఏఈఓ మధు, సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, వేదపండితులు అనంత పద్మనాభశర్మ, రామక్రిష్ణ అవధాని, అర్చకులు రాఘవచార్యులు, అనంతచార్యులు, ట్రస్టుబోర్డు చైర్మన్ సుగుణమ్మ, సభ్యులు చెల్లూరి నరసింహులు, తలారి రామలింగ, మహేశ్వర్, ఎస్ఎం జగదీశ్ ప్రసాద్, ఆంజనేయులు, నారాయణస్వామి, కందుల ప్రసాద్‌రెడ్డి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

ప్రజల్లో నమ్మకం పెరిగేలా కంట్రోల్ రూం పనితీరు

కలెక్టర్ వీరపాండ్యన్ ఆదేశం

అనంతపురం కలెక్టరేట్: ప్రజల్లో నమ్మకం పెరిగేలా కమాండ్ కంట్రోల్ రూం పనితీరు ఉండాలని కలెక్టర్ వీరపాండ్యన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూంను గురువారం ఆయన పరిశీలించారు. బీటెక్, బీఎస్సీ కంప్యూటర్స్ చేసిన ఏఆర్ఓలను ఎంపిక చేసి కంట్రోల్ రూంలో నియమించామన్నారు. అక్కడికి సమాచారం వస్తే కలెక్టర్‌కు వచ్చినట్లేనన్నారు. కాల్ సెంటర్ ద్వారా పనిచేయడమేనన్నారు. ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు.. తిరిగి మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 10 గంటల వరకు షిఫ్టుల వారీగా ఉద్యోగులు పనిచేయాలన్నారు. శుక్రవారం నుంచే కమాండ్ కంట్రోల్ రూం పని ప్రారంభించాలని ఆదేశించారు. 100, 108, 101 వ్యవస్థల తరహాలో జిల్లాలో ఈ సెంటర్ పనిచేసేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కాల్ సెంటర్‌కు ఫోన్‌చేస్తే ఏ సమస్య అయినా పరిష్కారమవుతుందని ప్రజల్లో నమ్మకం కలిగేంచేలా చిత్తశుద్ధితో పని చేయాలన్నారు. ఈ సెంటర్‌కు చీఫ్ కమాండెంట్‌గా జేసీ, సీపీఓ, డీఐఓ హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్ అంశాలను పర్యవేక్షిస్తారన్నారు. మీకోసం, మీడియా అలర్ట్ మేనేజ్‌మెంట్ సిస్టం తదితర వాటి ద్వారా వచ్చే ఫిర్యాదులపై స్పందించి క్షేత్ర స్థాయిలో విచారించి తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

బాదన్న కుటుంబానికి మంత్రి కాలవ పరామర్శ



నివాళులర్పిస్తున్న మంత్రి కాలవ శ్రీనివాసులు, ఎమ్మెల్యే ఉన్నం

కళ్యాణదుర్గం రూరల్: హత్యకు గురైన రాష్ట్ర వాల్మీకి ఫెడరేషన్ డైరెక్టర్ గోళ్ల బాదన్న కుటుంబానికి అండగా ఉంటామని గ్రామీణ గృహనిర్మాణ శాఖ మంత్రి కాలవ శ్రీనివాసులు హామీ ఇచ్చారు. గురువారం రాత్రి గోళ్లకు చేరుకుని బాదన్న కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. భార్య ఈశ్వరమ్మ, కుమారుడు రమేష్, కూతుళ్లను పరామర్శించి కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. బాదన్న పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. 30 ఏళ్లుగా బాదన్న కుటుంబంతో పరిచయం ఉందని, బాదన్న హత్యకు గురికావడం తనను కలచివేసిందన్నారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటన్నారు. వారి కుటుంబానికి తెలుగుదేశం పార్టీ వెన్నంటి ఉంటుందన్నారు. కాలవ శ్రీనివాసులు వెంట ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయ చౌదరి, ఆర్డీఓ కేఎస్ రామారావు, స్థానిక ప్రజాప్రతినిధులు ఉన్నారు.

ఏసీబీకీ పట్టిస్తాం..

(రెండో పేజీ తరువాయి)

అధికారులకు అక్షింతలు వేసినట్టు సమాచారం. అనంతరం ఆయన విజయవాడకు వెళ్లిపోయారు.

నివేదిస్తే సంగతి చూస్తాం..

క్వాలిటీ కంట్రోల్ చీఫ్ ఇంజనీర్ రాకతో సంబంధిత కాంట్రాక్టర్ల గుండెల్లో రైళ్లు పరుగెత్తుతున్నాయి. తారు శాతం తగ్గించడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేయడంతో వారిలో ఆందోళన అధికమయింది. ఈ విషయంపై ఆయనతో మంతనాలు సాగించడానికి సంబంధిత కాంట్రాక్టర్లు విశ్వప్రయత్నాలు చేశారు. కుదరకపోయేసరికి ఆయనను లొంగదీసుకోవడానికి కొత్త ఎత్తు వేశారు. విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదించకుండా ఉండేందుకు కొంతమొత్తం ఇవ్వడానికి ముందుకువచ్చారు. అయితే అది కూడా పొసగలేదు. చివరికి పైకి నివేదిస్తే ఏసీబీ అధికారులకు పట్టిస్తామని బెదిరింపులకు దిగినట్లు విశ్వసనీయవర్గాల సమాచారం.

ఆ మూడు రోడ్లలో తగ్గిన తారు శాతం

జిల్లాలోని రహదారుల నిర్మాణాల్లో కొందరు ఆర్‌అండ్‌బీ అధికారులు ఆమ్యామ్యాలు పుచ్చుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. తాజాగా క్వాలిటీ కంట్రోల్ చీఫ్ ఇంజనీర్ తనిఖీల్లో తారుశాతం తగ్గించి వేసిన రోడ్లలోనూ ఆ అధికారులు ఆమ్యామ్యాలు పుచ్చుకున్నట్లు సమాచారం. ఆ మూడింటికి గాను ఓ రహదారి నిర్మాణంలో తారుశాతం తక్కువ వేసినట్లు తనిఖీల్లో తేలిందని సమాచారం. అలాగే మరో రహదారిలో 0/0నుంచి 20/0కిలోమీటర్ వరకు తారుశాతం తేడా కనిపించిందనే విమర్శలున్నాయి. ఇక నాలుగు లేన్ల రహదారిలో పెండింగ్‌లో ఉన్న ఓ బ్రిడ్జికి ఇరువైపులా కొంత రోడ్డు వేశారు. అక్కడ తారు శాతం తక్కువ వేసినట్లు నిర్ధారించారు. నిబంధనల మేరకు తారు(బిటుమిన్) నిష్పత్తి కలపలేదనే విషయం స్పష్టమైంది. 1.1క్యూబిక్ మీటరు కంకరకు 72కిలోల తారు కలపాలి. 80 నుంచి 100గ్రేడ్ ఉన్న తారు కలపాలనే నిబంధన ఉంది. ఇక డీబీఎం దశ, బీసీ దశల్లో తారు వినియోగిస్తారు. డీబీఎం దశలో 4.3శాతం, బీసీ దశలో 5.00శాతం కంటెంట్ ఉండాలి. కానీ చీఫ్ ఇంజనీర్ తనిఖీ సమయంలో తక్కువ కంటెంట్ వచ్చింది.

విజయవాడకు వెళ్లిన అధికారులు

జిల్లా ఆర్‌అండ్‌బీ అధికారులు రెండు రోజుల క్రితం హుటాహుటిన విజయవాడకు వెళ్లారు. చీఫ్ ఇంజనీర్ తనిఖీలు, కాంట్రాక్టర్ల నుంచి బెదిరింపులు వచ్చిన నేపథ్యంలోనే వారు అక్కడికి వెళ్లినట్లు తెలిసింది. ఆ శాఖ ఉన్నతాధికారులు ఆ మూడు రహదారులకు సంబంధించిన అధికారులను అక్కడికి పిలిపించినట్లు సమాచారం.

అంతర్రాష్ట్ర దొంగ అరెస్టు..

34తులాల బంగారం స్వాధీనం

పదేళ్లలో అత్యధిక రికవరీ

విలేకరుల సమావేశంలో ఇన్‌చార్జి డీఎస్పీ



వివరాలు వెల్లడిస్తున్న ఇన్‌చార్జి డీఎస్పీ ముక్కా శివరామిరెడ్డి

ధర్మవరం అర్బన్: ధర్మవరం పట్టణంతోపాటు తమిళనాడు, నెల్లూరు, వేలూరు పట్టణాల్లో దొంగతనాలకు పాల్పడుతున్న పాల్తూరి రామక్రిష్ణాచారి అనే అంతరాష్ట్ర దొంగను గురువారం పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. స్థానిక అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో ఇన్‌చార్జి డీఎస్పీ ముక్కాశివరామిరెడ్డి వివరాలు వెల్లడించారు. ఆయన కథన మేరకు.. స్థానిక కేతిరెడ్డికాలనీకి చెందిన పాల్తూరి రామక్రిష్ణాచారి గతంలో డ్రైవర్‌గా పనిచేసేవాడు. అయితే తాగుడు, వ్యభిచారం తదితర దురలవాట్లకు బానిసై చివరికి దొంగగా మారాడు. 2008లో పలుదొంగతనాల కేసుల్లో అరెస్టు చేసి రిమాండుకు పంపారు. కేతిరెడ్డికాలనీకి చెందిన మంజులతో పరిచయం ఏర్పడింది. ఆమెతో కలిసి అనంతపురంలో నివాసం ఉండేవాడు. అక్కడ కమలానగర్‌లో డీసీఎంఎస్ కార్యాలయంలో హమాలీగా, టీటీ ఏసీలో డ్రైవర్‌గా పని చేస్తూ అనంతపురం పట్టణంలో దొంగతనాలు చేసేవాడు. అక్కడ కూడా పోలీసులు అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. అనంతరం జైలు నుంచి 2012లో బయటికి వచ్చి తిరిగి మంజులతో కలిసి హైదరాబాద్‌కు వెళ్లాడు. అక్కడ 8నెలల పాటు కాపురం ఉన్నాడు. హైదరాబాద్‌లో టమోటా మండీలో కూలీగా పనిచేసేవాడు. అక్కడ సంపాదన లేక తిరిగి ధర్మవరానికి వచ్చాడు. మళ్లీ దొంగతనాలకు పాల్పడేవాడు. అలా పట్టణంలోని కేశవనగర్‌లో 180గ్రాములు దొంగిలించాడు. ఎన్టీఆర్ సర్కిల్‌లోని మసీదు వద్ద మహిళకు మాయమాటలు చెప్పి ఆమె మెడలోని 30 గ్రాముల బంగారుగొలుసు అపహరించాడు. అలాగే నాగులబావి వీధిలో నిద్రిస్తున్న ఓ మహిళ మెడలో నుంచి 30గ్రాములు, తేరుబజారులో ఓ ఇంటిలోకి ప్రవేశించి 28 గ్రాములు, లింగశెట్టిపాళ్యంలో మహిళమెడలో నుంచి 20గ్రాములు, శ్రీదేవి థియేటర్ సమీపంలో 10గ్రాములు, అదే ప్రాంతంలో ఓ మహిళ మెడలో నుంచి 15 గ్రాముల బంగారం దొంగిలించాడు. ఈ కేసులను చాలెంజ్‌గా తీసుకున్న సీఐ హరినాథ్, ఎస్ఐ సురేశ్ సిబ్బందితో కలిసి దొంగను పట్టుకోవడానికి రంగంలోకి దిగారు. చివరికి గురువారం ధర్మవరం రైల్వేస్టేషన్ వద్ద అరెస్టుచేసి అతని వద్ద నుంచి రూ.9.60లక్షల విలువైన 34తులాల బంగారం స్వాధీనం చేసుకున్నారు. పదేళ్లలో ఒకేసారి ఇంత భారీగా బంగారం రికవరీ చేయడం ఇదే ప్రథమమని, ఇందుకు సీఐ,ఎస్ఐ, సిబ్బందిని డీఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. కేసును ఛేదించిన సిబ్బందిని కూడా హెచ్‌సీ డోనాసింగ్, మల్లికార్జున, మునేనాయక్, కానిస్టేబుల్ ప్రసాద్, షాకీర్, వెంకటేశ్, నాగార్జునలను కూడా ఆయన అభినందించారు.

వానాకాలంలో.. ఎండాకాలం

(రెండో పేజీ తరువాయి)

ఉంటాయి. ఆ మూడు నెలల్లో పగటి ఉష్ణోగ్రతలు 41 నుంచి 46 డిగ్రీల వరుకు నమోదవుతాయి. జూన్ మాసం నుంచి జిల్లా సగటు ఉష్ణోగ్రత 33-34 డిగ్రీల సెల్సియస్‌గా ఉండాలి. అయితే వాతావరణంలో చోటుచేసుకున్న మార్పులతో ఈ ఏడాది జూలై మాసంలో జిల్లా సగటు ఉష్ణోగ్రత 37.8 డిగ్రీలుగా నమోదయింది. తీవ్ర వర్షాభావం ఉన్న మండలాల్లో పగటి ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉంటుందని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.

వర్షాభావంతోనే ఈ ఏడాది ఎండలు: వాతావరణ శాస్త్రవేత్త సాదినేని మల్లీశ్వరి

ప్రస్తుత వర్షాకాలంలో సకాలంలో వర్షాలు కురవపోవడం, సగటు వర్షపాతం నమోదు కాకపోవడంతో ఈ ఏడాది ఎండలు అధికమయ్యాయి. జిల్లాలోని 24 మండలాల్లో ఈఏడాది తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. అలాగే సగటు వర్షపాతం కురవకపోవడం, వాతావరణంలో మార్పుల ప్రభావంతో ఎండలు ఎక్కువగా ఉన్నాయి. ప్రస్తుతం గాలిలో తేమశాతం ఎక్కువగా ఉన్నందున వేడితో పాటు ఉక్కపోత ఉంటోంది. వేసవి కాలం మే మాసంతో పూర్తవుతుంది. జూన్, జూలై, ఆగస్టు మాసాల్లో పగటి ఉష్ణోగ్రతలు తగ్గాలి. ఈ ఏడాది జూన్ మాసంలో 37.8 డిగ్రీల సగటు ఉష్ణోగ్రత నమోదయింది. గడచిన ఏడేళ్లలో ఆ మాసంలో ఇలాంటి ఉష్ణోగ్రతలు నమోదు కాలేదు.

తెలుగు కళాకారులకు బళ్లారి రాఘవ పురస్కారాలు

బళ్లారి కల్చరల్: బళ్లారి రాఘవ 137వ జయంతి ఉత్సవాల సందర్భంగా గురువారం బళ్లారి పట్టణంలోని రాఘవ కళా మందిరంలో తెలుగు కళాకారులను ఘనంగా సన్మానించారు. రాఘవ మెమోరియల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బళ్లారి రాఘవ రాష్ట్రస్థాయి పురస్కారాన్ని విశాఖపట్నానికి చెందిన కళాకారుడు పిళ్లా సన్యాసిరావుకు , జిల్లాస్థాయి పురస్కారాలను కళాకారులు గాదెం గోపాలకృష్ణ (బళ్లారి)కు, జబీవుల్లా సయ్యద్ ఇస్మాయిల్ (గుంతకల్)లకు అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవాధ్యక్షులు కె.చెన్నప్ప, అధ్యక్షులు కె.కోటేశ్వరరావు, రమేశ్ గౌడ పాటిల్, బసవరాజ్, ధనుంజయ, కె.రామాంజనేయులు, తదితరులతో పాటు కళాకారులు, కళాభిమానులు పాల్గొన్నారు.

ఎంత ఘోరం!



ప్రమాదంలో దుర్మరణం చెందిన రంగమ్మ, మమత, ఆదినారాయణ

కుటుంబాన్ని కబళించిన రోడ్డు ప్రమాదం..

టైరు పగిలి, చెట్టును ఢీకొన్న కారు..

నూతన వధూవరులతోపాటు వరుడి తల్లి, బాబాయ్ మృతి..

కణేకల్లు: ఒక రోడ్డు ప్రమాదం కుటుంబం.. కుటుంబాన్నే కబళించింది. ఏకంగా నలుగురు మృతిచెందారు. మండలంలోని యర్రగుంట గ్రామం వద్ద గురువారం మధ్యాహ్నం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. కారు టైరు పగిలి, అదుపుతప్పి చెట్టును ఢీకొని, పల్టీలు కొట్టిన ప్రమాదంలో నూతన వధూవరులు సత్యనారాయణ (26), మమత (22)తో పాటు రంగమ్మ (55), బాబాయ్ ఆదినారాయణ (54) మృతిచెందారు. ప్రమాద స్థలంలోనే ఆదినారాయణ రంగమ్మ, మమత దుర్మరణం చెందగా.. సత్యనారాయణ తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని రాయదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ ప్రాణాలు విడిచాడు. బెళగుప్ప మండలం తగ్గపర్తి గ్రామానికి చెందిన గన్నే నాగన్న కుటుంబం 30 ఏళ్ల క్రితమే బళ్లారికెళ్లి స్థిరపడింది. అక్కడ పొలాన్ని కౌలుకు తీసుకుని, వ్యవసాయం చేసేవారు. స్వగ్రామంలో భూములుండటంతో అప్పుడప్పుడూ వచ్చి, వ్యవసాయ పనులు చూసుకునేవారు. ఐదు నెలల క్రితం రంగమ్మ మామ గన్నే నాగన్న మృతిచెందాడు. కుటుంబ ఆచారం ప్రకారం అతడికి గుడ్డలు పెట్టుకునేందుకు బుధవారం సాయంత్రం రంగమ్మ, ఆమె కుమారుడు సత్యనారాయణ, కోడలు మమత, మరిది ఆదినారాయణ తగ్గపర్తి వెళ్లారు. గురువారం ఉదయం కార్యక్రమాలను ముగించుకుని, మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో బళ్లారికి కారులో బయల్దేరారు. యర్రగుంట గ్రామం వద్దకు రాగానే కారు ముందు టైరు పగిలి, ఒక్కసారిగా అదుపుతప్పింది. కుడివైపునున్న భారీ చింతచెట్టును ఢీకొని, రెండు పల్టీలు కొట్టింది. దీంతో కారు వెనుక సీట్లో కూర్చున్న మమత, రంగమ్మతో పాటు ముందు సీట్లో కూర్చున్న ఆదినారాయణ అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు. వీరి శరీరంలో పెద్ద దెబ్బలు లేవు. రక్తపు గాయాలు కూడా తక్కువగా ఉన్నప్పటికీ వీరు మృతిచెందారు. కారును నడుపుతున్న సత్యనారాయణ రెండు కాళ్లూ విరిగిపోయి, తలకు బలమైన గాయాలయ్యాయి. సమీప గ్రామస్థులు హుటాహుటిన ప్రమాద స్థలానికి చేరుకున్నారు. మృతిచెందిన రంగమ్మ, మమత, ఆదినారాయణను బయటకు తీశారు. కొన ఊపిరితో ఉన్న సత్యనారాయణను 108 వాహనంలో రాయదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కొద్దిసేపటి తర్వాత అతడు కూడా మృతిచెందాడు. సత్యనారాయణ, మమతకు ఈ ఏడాది మార్చి 16న వివాహమైంది. నవ దంపతులు ఇలా మృత్యువాత పడటంతో బంధువుల రోదనలు మిన్నంటిపోయాయి. రాయదుర్గం సీఐ చలపతిరావు, ఎస్ఐ యువరాజు, వీఆర్వో ఎర్రిస్వామి, పలు వురు అధికారులు ప్రమాద స్థలానికి చేరుకుని, పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని, ద ర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.





చెట్టును ఢీకొని నుజ్జునుజ్జయిన కారు, ఆస్పత్రిలో మృతిచెందిన సత్యనారాయణ

తగ్గుపర్తిలో విషాదఛాయలు..

బెళుగుప్ప: యర్రగుంట వద్ద కారు ప్రమాదంలో మండలంలోని తగ్గుపర్తికి చెందిన ఒకే కుటుంబికులు నలుగురు మృతిచెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. తగ్గుపర్తికి చెందిన నాగన్న కుటుంబికులు సత్యనారాయణ, రంగమ్మ, మమత బళ్లారి వద్ద మౌనల్లిలో వ్యవసాయ భూమి కౌలుకు తీసుకుని, జీవనం సాగిస్తుండేవారు. బళ్లారిలో నివాసముండేవారు. గన్నే నాగన్న ఐదు నెలల క్రితం మృతిచెందాడు. కుటుంబ ఆచారం ప్రకారం పెద్దలకు గుడ్డలు పెట్టుకుని, బళ్లారికి కారులో వెళుతుండగా, చెట్టును ఢీకొంది. కారులోని నలుగురూ మృతిచెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

విద్యార్థులకు సాయం చేద్దామని..



మృతి చెందిన విజయలక్ష్మి

హిందూపురం అర్బన్/ పరిగి: తన పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు సాయం చేద్దామన్న ఉన్నతాశయం.. టీచర్ ప్రాణాలను బలిగొంది. వాటర్ బాటిళ్లు లేక మధ్యాహ్న భోజన సమయంలో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతుండటాన్ని గమనించారు ఆ టీచర్. వారికి సాయపడాలనుకున్నారు. తన ఇంట్లోని వాటర్ బాటిళ్లను తీసుకెళ్లి, వారికి పంచాలనుకున్నారు. వాటిని గురువారం ద్విచక్రవాహనంలో పాఠశాలకు తీసుకెళ్తుండగా.. గాలికి లేచిపోయాయి. వాటిని అందుకునే ప్రయత్నంలో టీచర్ కిందపడి, అక్కడికక్కడే మరణించారు. పరిగి మండలం శాసనకోట వద్ద గురువారం బైక్ నుంచి పడి టీచర్ విజయలక్ష్మి (47) దుర్మరణం చెందారు. రామాంజనేయులు, విజయలక్ష్మి దంపతులు టీచర్లు. విజయలక్ష్మి పరిగి మండలం శాసనకోట, రామాంజనేయులు అదే మండలం పైడేటిలో ఇంగ్లీష్ స్కూల్ అసిస్టెంట్లుగా పని చేస్తున్నారు. హిందూపురం హౌసింగ్ బోర్డులో నివాసముంటున్నారు. గురువారం బైక్‌లో భార్య విజయలక్ష్మిని పాఠశాల వద్ద వదిలేందుకు భర్త వెళ్లారు. విద్యార్థులకు ఇచ్చేందుకు తీసుకెళ్తున్న ఖాళీ నీటి బాటిళ్లు కిందపడ్డాయి. వాటిని పట్టుకోబోయి విజయలక్ష్మి పడిపోయింది. భర్త వెంటనే వాహనాన్ని ఆపి, ఆమెను లేవనెత్తబోయాడు. చలనం లేకపోయేసరికి ఆటోలో హిందూపురం ప్రభుత్వాస్పత్రికి తీసుకొచ్చాడు. అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. విజయలక్ష్మికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. విషయం తెలుసుకున్న పాఠశాల హెచ్ఎం సెలవు ప్రకటించారు.

వివాహిత అనుమానాస్పద మృతి

గుత్తిరూరల్: మండలంలోని జక్కలచెరువు ఆర్ఎస్‌కు చెందిన వివాహిత నాగవేణి (24) గురువారం అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. ఈమెకు పెద్దరాయుడుతో నాలుగేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులున్నారు. బుధవారం రాత్రి నాగవేణి మృతిచెందిన సమాచారం తెలుసుకున్న పోలీసులు వెళ్లి, పరిశీలించారు. నాగవేణి ఉరేసుకుని, మరణించినట్లు భర్త పెద్దరాయుడు తెలిపాడు. నాగవేణి తల్లి అనసూయమ్మ.. తన అల్లుడు పెద్దరాయుడుపై అనుమానం వ్యక్తం చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

తన శృంగార బలహీనత బయట పడుతుందని..

భార్యను హతమార్చాడు..

ఆలస్యంగా వెలుగుచూసిన హత్యోదంతం..

శింగనమల/వజ్రకరూరు: తన శృంగార బలహీనతను ఎక్కడ బయటపెడుతుందోన్న భయంతో పెళ్లయిన నాలుగు నెలలకే భార్యను హత్య చేశాడు ఓ భర్త. వజ్రకరూరు మండలం ఎన్ఎన్‌పీ (నూకనూటిపల్లి) తండాకు చెందిన అంజలీబాయి (19)ని ఇద్దరు బంధువులతో కలిసి భర్త హరినాయక్ చంపేసి, శింగనమల వద్ద పూడ్చినట్లు విచారణలో తేలింది. ఎన్ఎన్‌పీ తండాకు చెందిన హరినాయక్.. అదే ఊరి వాసి అంజలీబాయిని ఈ ఏడాది మార్చి 15న ప్రేమ వివాహం చేసుకున్నాడు. శృంగారం పట్ల హరినాయక్ ఆసక్తి చూపేవాడు కాదని తెలస్తోంది. ఈ విషయమై ఇద్దరూ గొడవ పడేవారు. తన శృంగార బలహీనతను భార్య ఎక్కడ బయటపెడుతుందోనని హరినాయక్ ఆందోళన చెందుతుండేవాడు. దీంతో భార్యను ఎలాగైనా కడతేర్చాలని నిర్ణయించుకున్నాడు. తన అక్క కుమారుడైన శింగనమల మండలం నాగులగుడ్డం తండాకు చెందిన గణేష్‌నాయక్, వజ్రకరూరు మండలం బాదేసారిపల్లి తండాకు చెందిన మిత్రుడు అనిల్‌నాయక్‌తో కలిసి ప్రణాళిక సిద్ధం చేశాడు. ప్రణాళిక ప్రకారం జూలై 11న అంజలీబాయిని హరినాయక్ అక్క ఊరైన శింగనమల మండలం నాగులగుడ్డం తండాకు వెళ్దామని తీసుకొచ్చారు. పథకం ప్రాకరం శింగనమల చెరువు సమీపంలోని ముసలిమడుగు వద్దకు తీసుకెళ్లారు. గణేష్, అనిల్‌తో కలిసి హరి నాయక్.. భార్య అంజలీబాయి గొంతును ఆమె చున్నీతో బిగించి, చంపేశారు. పెట్రోలు పోసి, తగలబెట్టారు. అనంతరం గొయ్యి తవ్వి, పాతిపెట్టారు. మరుసటిరోజు 12న హరినాయక్ తన భార్య అంజలీబాయి కనిపించడం లేదంటూ వజ్రకరూరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

అంజలీబాయిని హత్య పథకంలో భాగంగా జూలై 10న హరినాయక్, అనిల్‌నాయక్, గణేష్ నాయక్ శింగనమల చెరువు ప్రాంతంలో రెక్కీ చేశారు. మరుసటి రోజు అంజలీబాయిని నాగులగుడ్డం వెళ్దామని మాయమాటలు చెప్పి, ముసలి మడుగు వద్దకు తీసుకొచ్చారు. ఆమెను చంపేసి, 2 అడుగుల గుంతలో పాటిపెట్టారు. జూలై 12న వజ్రకరూరు పోలీసులు అంజలీబాయి మిస్సింగ్ కేసు నమోదు చేశారు. అప్పట్నుంచి భర్త హరినాయక్ రోజూ తన భార్య ఆచూకీ తెలిసిందా అంటూ పోలీసు స్టేషన్ చుట్టూ తిరిగేవాడు. పోలీసులకు అనుమానం వచ్చి, అదుపులోకి తీసుకుని విచారించగా.. తానే హత్య చేసినట్లు ఒప్పుకున్నట్లు తెలిసింది.

అంజలీబాయి శవాన్ని శింగనమల ముసలిమడుగులో పాతిపెట్టారన్న విషయం తెలుసుకున్న పోలీసులు నిందితులు హరినాయక్, గణేష్‌నాయక్, అనిల్‌నాయక్‌ను వజ్రకరూరు నుంచి ఘటన స్థలానికి గురువారం తీసుకొచ్చారు. విషయం తెలుసుకున్న ఎన్ఎన్‌పీ తండా వాసులు దాదాపు 300 మంది తరలివచ్చారు. పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. గుంతకల్లు సీఐ గురునాథ్‌బాబు, తహసీల్దార్ నాగేంద్ర, ఎస్ఐలు జయచంద్రనాయుడు, హమీద్ ఖాన్, వీఆర్ఓలు వెంకటరామిరెడ్డి, కొండయ్య సమక్షంలో ప్రొఫెసర్ ముచ్చుకోట భాస్కర్ పంచనామా నిర్వహించారు.

అంజలీబాయి తల్లిదండ్రులు వజ్రకరూరు పోలీసు స్టేషన్ ఎదుట బైఠాయించి, నిరసన తెలిపారు. తమ కుమార్తెను హత్య చేసుంటే నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.





మృతిచెందిన అంజలీబాయి, శవాన్ని పూడ్చిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

తోటలో గడ్డి కోశాడని యువకుడి హత్య





మృతిచెందిన పవన్‌కుమార్, రోదిస్తున్న తల్లిదండ్రులు, బంధువులు (ఎడమ)

ధర్మవరంఅర్బన్: చెప్పకుండా గడ్డి కోశాడంటూ యువకుడిని హత్య చేశాడు తోట యజమాని. పట్టణ సమీపంలోని కేతిరెడ్డి కాలనీ ఎల్1కు చెందిన లింగమయ్య, రత్నశ్రీ దంపతుల కుమారుడు పవన్‌కుమార్ (18) ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతుండేవాడు. గురువారం సాయంత్రం గొర్రెలకు గడ్డిని కోయడానికి కాలనీ పక్కనే ఉన్న బాషా తోటకెళ్లాడు. పవన్‌కుమార్ గడ్డి కోస్తుండగా తోట యజమాని బాషా.. తన తోటలో చెప్పకుండా గడ్డికోస్తావా అంటూ వాగ్వాదానికి దిగాడు. కొడవలితో దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన విద్యార్థిని స్థానికులు ధర్మవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. కుమారుడి శవంపై పడి తల్లిదండ్రులు రోదించిన తీరు పలువురిని కలచివేసింది. అన్యాయంగా తన కుమారుడిని పొట్టన పెట్టుకున్నాడంటూ బోరున విలపించారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ సురేశ్ మృతదేహాన్ని పరిశీలించి, తల్లిదండ్రుల పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేపట్టారు.

చెట్టును బైక్ ఢీకొని ఒకరి మృతి

హిందూపురం అర్బన్: మండలంలోని బిట్ కళాశాల సమీపాన గురువారం సాయంత్రం చెట్టును ద్విచక్రవాహనం ఢీకొన్న ప్రమాదంలో పాండు (42) మృతిచెందాడు. పట్టణ పరిధిలోని కొట్నూరుకు చెందిన ఇతడు.. ద్విచక్రవాహనంలో ఇంకొకరితో కలిసి హిందూపురం నుంచి గోరంట్ల వైపు వెళ్తూ.. చెట్టుకు ఢీకొన్నాడు. ప్రమాదంలో పాండు తలకు బలమైన గాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనంలో హిందూపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం బెంగుళూరు తీసుకెళ్తుండగా చిక్కబళాపురం వద్ద మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని, విచారిస్తున్నారు.

ఇప్పుడే ఇలా...

ఎండకాలమెలా?

తాగునీటి కోసం ఇటీవల రోడ్డుపై బైఠాయించిన మహిళలు (ఫైల్)





ట్యాంకరు ద్వారా నీటిని అందజేస్తున్న దృశ్యం

ఖాళీ బిందెల వరుసలు..
బిందెలతో పొలాలకు పరుగులు..
నీటి కోసం ధర్నాలు..
ఎక్కడ చూసినా.. దాహపు కేకలు..

ఇది ఆగస్టా..
మే నెలా..?
వానకాలమా..
ఎండకాలమా?

ఇప్పుడు నీటి ఎద్దడేంటి?
అంతా.. కరువు మహిమ..
వాన కురవదు..
నీటి జాడ దొరకదు..

ఇప్పుడే ఇలా ఉంటే..
ఎండాకాలం ఎలా ఉండబోతోంది?
తాగడానికి నీరు దొరుకుతుందా?
వామ్మో! తలచుకుంటేనే
భయమేస్తోంది..!

- భయపెడుతున్న నీటి ఎద్దడి..
- మడకశిర నియోజకవర్గంలో 80 గ్రామాల్లో సమస్య..
- ట్యాంకర్ల ద్వారా సరఫరా..
- అడుగంటిపోతున్న భూగర్భజలాలు..
- ఎండిపోతున్న బోర్లు..
- 1000 అడుగులు తవ్వించినా దొరకని జలం..
- ప్రారంభానికి నోచుకోని ఎన్టీఆర్ సుజల స్రవంతి వాటర్ ప్లాంట్లు..



కూగీర్నపాళ్యంలో తాగునీటి కోసం బిందెల క్యూ..

మడకశిర

ఆగస్టు నెలలోనూ తీవ్ర వర్షాభావం చుట్టుముట్టింది. కనీసం తాగడానికి కూడా చుక్క నీరు దొరకని దుర్భిక్షం ఆవహించింది. వర్షాభావ పరిస్థితుల కారణంగా భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి. నీటి మట్టం పాతాళానికి పడిపోతోంది. దీంతో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తీవ్ర రూపం దాల్చుతోంది. సమస్యను పరిష్కరించాలంటూ గ్రామీణ ప్రాంత ప్రజలు రెవెన్యూ కార్యాలయాల ముందు, రోడ్లపై బైఠాయించి, ఆందోళనలు చేస్తున్నారు. గుక్కెడు నీటి కోసం వ్యవసాయ బోర్ల వద్దకు పరుగులు తీయాల్సిన పరిస్థితి దాపురించిందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలో కూడా నీటి ఎద్దడి నెలకొందనీ, ఇలాంటి దుర్భర పరిస్థితులు ఎన్నడూ చూడలేదని గ్రామాల్లో వయసు మళ్లిన వృద్ధులు పేర్కొంటున్నారు.

మడకశిర నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో 1000 అడుగులు తవ్వించినా చుక్క నీరు దొరకడం గగనమవుతోంది. నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో దాదాపు 90 గ్రామాల్లో తాగునీటి సమస్య నెలకొంది. మడకశిర మండలంలో 12, గుడిబండ మండలంలో 8, అమరాపురంలో 3, అగళిలో 19, రొళ్ల పరిధిలో 18 గ్రామాల్లో ఎద్దడి తీవ్రరూపం దాల్చింది. వర్షాభావంతో సమస్య రోజురోజుకీ పెరుగుతోంది. మడకశిర మున్సిపాల్టీలో తాగునీటికి కటకటే. సమస్య ఉన్న ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. ఆ దిశగా చెరువులో బోరు తవ్వించారు. అందులో పుష్కలంగా నీరు లభించినా.. పక్కనే ఉన్న రెండు బోర్లలో నీటి మట్టం పడిపోయింది. మడకశిర మండలంలోని ఆమిదాలగొంది, ఈ అచ్చంపల్లి, చందకచర్ల, హెచ్ ఆర్ పాళ్యం, సీ కొడిగేపల్లి, మణూరు తదితర గ్రామాల్లో నీటి సమస్య నెలకొంది. అగళి మండలంలో దాసేగౌడనహళ్లి ఎస్సీ కాలనీ, పీ బ్యాడిగెర, నరసంబూది, రామనపల్లి, కురుసాంగనపల్లి, హళ్లీకెర ఎస్సీ కాలనీ తదితర గ్రామాల్లో తాగునీటి సమస్య ఉంది. ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసినా అది చాలడం లేదని గ్రామస్థులు అంటున్నారు. పశువుల దాహార్తి తీర్చేందుకు వ్యవసాయ బోర్లను ఆశ్రయిస్తున్నామన్నారు. అక్కడ కూడా బోర్లలో నీరు సక్రమంగా రాకపోవడంతో రానున్న రోజుల్లో సమస్య మరింత తీవ్రమవుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



వ్యవసాయ బోరును ఆశ్రయిస్తున్న పీ బ్యాడిగెర ప్రజలు

ప్రారంభంకాని ఎన్టీఆర్ సుజల స్రవంతి ప్లాంట్లు

ఫ్లోరైడ్ రహిత నీటిని అందించేందుకు ప్రభుత్వం లక్షలాది రూపాయలు వ్యయం చేసి, ఎన్టీఆర్ సుజల స్రవంతి ప్లాంట్లు ఏర్పాటు చేసినా.. నేటికి ప్రారంభానికి నోచుకోవడం లేదు. వర్షాభావ పరిస్థితుల కారణంగా భూగర్భ జలాలు అడుగంటిపోయి, బోర్లలో నీటిమట్టం పడిపోయింది. వాటిలో అరకొరగా వస్తున్న నీటిలో ఫ్లోరైడ్ అధికంగా ఉంటుండటంతో ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు. నియోజకవర్గంలోని మడకశిరకు ఆరు, రొళ్ల, అగళి, గుడిబండ, అమరాపురం మండలాలకు ఐదు చొప్పున ఎన్టీఆర్ సుజల స్రవంతి ప్లాంట్లు మంజూరయ్యాయి. రూ.2.60 కోట్లతో 26 చోట్ల వీటిని ఏర్పాటు చేశారు. ఒక్కో ప్లాంటుకు రూ.10 లక్షలు కేటాయించినట్లు తెలుస్తోంది. ప్లాంట్లు ప్రారంభించి, స్వచ్ఛమైన నీరు అందించాలని ప్రజలు కోరుతున్నారు. గ్రామాల్లోని బోర్ల నీటిలో ఫ్లోరైడ్ అధికంగా ఉంటుండటంతో రోగాల బారిన పడాల్సి వస్తోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు పంచాయతీ కేంద్రాల్లో ఎన్టీఆర్ సుజల స్రవంతి నీటి పథకాన్ని ప్రారంభించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఐదు మండలాలకు ఒకే ఏఈ

ఆర్‌డబ్ల్యుఎస్ శాఖలో ఏఈ పోస్టులు ఖాళీగా ఉన్నా భర్తీ చేయడంలో జాప్యమవుతోంది. నియోజకవర్గంలోని ఐదు మండలాలకు ఒకే ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ ఉన్నారు. గతంలో డిప్యుటేషన్‌పై ఏఈలుగా పనిచేసేవారు. డిప్యూటేషన్ రద్దు చేయడంతో నాలుగు మండలాల్లో ఏఈ పోస్టులు ఖాళీ అయ్యాయి. ఆ గ్రామాల్లో తాగునీటి సమస్యను ఎవరికి చెప్పుకోవాలో ప్రజలకు అర్థం కావట్లేదు. ఉన్నతాధికారులు ఇప్పటికైనా.. ఏఈ పోస్టులను భర్తీ చేయాలని ప్రజలు కోరుతున్నారు.

కిలోమీటరు దూరం వెళ్లాల్సిందే

గ్రామంలోని రెండు బోర్లలో నీటి మట్టం పడిపోయింది. దీంతో నీటి కోసం కిలోమీటరు దూరంలోని వ్యవసాయ బోర్ల వద్దకు వెళ్లాల్సి వస్తోంది. ఎప్పుడూ ఇంత సమస్య లేదు. ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేసినా.. చాలడం లేదు. అధికారులు తాగునీటి సమస్య పరిష్కరించాలి.

- లోకేష్, పీ బ్యాడిగెర

ట్యాంకర్ల ద్వారా సరఫరా..

వర్షాభావంతో బోర్లలో నీటి మట్టం పడిపోయి, తాగునీటి సమస్య తలెత్తింది. నియోజకవర్గంలో తాగునీటి ఎద్దడి ఉన్న గ్రామాలకు ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్నాం. ఇంకా ఎక్కడైనా సమస్య ఉంటే.. మా దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు చర్యలు చేపడతాం.

- వెంకటేశ్వర్లు, డీఈ, ఆర్‌డబ్ల్యుఎస్

'కియా' పనులు వేగవంతం చేయండి : కలెక్టర్

పెనుకొండ రూరల్: పక్కా ప్రణాళికతో కియా కార్ల పరిశ్రమ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ వీరపాండ్యన్.. అధికారులను ఆదేశించారు. గురువారం పెనుకొండ మండలం అమ్మవారిపల్లి సమీపంలో ఎర్రమంచి పొలాల్లో కార్ల పరిశ్రమకు సేకరించిన 600 ఎకరాల్లో కొనసాగుతున్న భూమి చదును పనుల పురోగతిని ఆయన పరిశీలించారు. ఏపీ పర్యాటక శాఖ అతిథి గృహంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఇది ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్ట్ అనీ, దీనిపై రోజూ ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహిస్తున్నారన్నారు. సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. పరిశ్రమకు అవసరమైన తాత్కాలిక విద్యుత్ పనులను నెలాఖరులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. టౌన్‌షిప్ నుంచి పరిశ్రమల వరకు ఫ్లైఓవర్ పనులను వెంటనే ప్రారంభించాలన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కార్ల పరిశ్రమ పనులు వేగవంతంగా సాగుతున్నాయన్నారు. అనంతరం పెనుకొండ సమీపంలో శీఫారం వద్ద పాలిటెక్నిక్ కళాశాలకు కేటాయించిన భూముల పరిశీలనకు వెళ్లారు. సమావేశంలో జెడ్‌ఎం రఘునాథ్, ఆర్డీఓ రామ్మూర్తి, పరిశ్రమల శాఖ జీఎం సుదర్శన్‌బాబు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్‌ఈ హరేరామ్ నాయక్, తహసీల్దార్ హసీనా సుల్తానా పాల్గొన్నారు.



కార్ల పరిశ్రమ పనుల పురోగతిని అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్



◆ పొలాలపై జింకల దాడి ◆ కాపాడుకునేందుకు అవస్థలు పడుతున్న రైతులు ◆ పొలాల వద్ద జాగారం ◆ పట్టించుకోని అటవీ అధికారులు..



ఆముదం పొలంలో మేస్తున్న జింకలు

అడవి దాటి.. పంటలు మేసి..

వజ్రకరూరు

ఆసలే వర్షాలు రాక రైతులు సతమతమవుతున్నారు. అరకొర వర్షానికి సాగు చేసిన కొద్దిపాటి పంటలను జింకలు మేసేస్తున్నాయి. దీంతో పంటలను ఎలా రక్షించుకోవాలో దిక్కు తోచక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో రైతులు అప్పులు చేసి ఆముదం, కంది, వేరుశనగ పంటలను సాగు చేస్తే మొలక దశలోనే జింకలు కొరికేస్తున్నాయి. దీంతో అన్నదాతలు దిక్కు తోచని స్థితిలో సతమతమవుతున్నారు. అటవీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా పంటలను నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వణ్యప్రాణుల నుంచి పంటలను కాపాడాలని పలుమార్లు ఫారెస్టు అధికారులకు విన్నవించినా.. పట్టించుకునే నాథుడే లేడని పేర్కొంటున్నారు. ఈ ఏడాది తొలకరి వర్షాలు ఓ మెస్తరుగా కురవడంతో చాలామంది రైతులు ముందస్తు సేద్యాలు చేసుకున్నారు. జూన్ మొదటి వారంలో మండలంలోని కొనకొండ్ల, గూళపాళ్యం, కమలపాడు, వజ్రకరూరు, రాగులపాడు, కడమలకుంట, పీసీ ప్యాపిలి, గడేహోతూరు, చాబాల, జరుట్ల రాంపురం, వీపీపీ తండా, ఎన్ఎన్‌పీ తండా, పందికుంట, తట్రకల్లు తదితర గ్రామాల్లో వేరుశనగ, కంది, ఆముదం పంటలను సాగు చేశారు. విత్తనం వేసినది మొదలు ఇప్పటి వరకూ వర్షాలు రాకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఈ తరుణంలో ఎన్నడూ లేనంతగా ఈ ఏడాది జింకలు గుంపులు గుంపులుగా సంచరిస్తూ పొలాల్లోకి వచ్చి మొలకలను తినేస్తున్నాయి. వాటి బారి నుంచి పంటను కాపాడు కోవడానికి రైతులు చేయని ప్రయత్నమంటూ లేదు. పనులు వదులుకుని, రేయింబవళ్లు పొలాల్లో కాపలా కాస్తూ.. పంటలపై దాడి చేయడానికి వచ్చే జింకల గుంపులను కేకలు, అరుపులతో హోరెత్తిస్తూ తరుముతున్నారు. కొందరు రైతులు గట్టు మీద మచ్చులు వేసుకుని, శబ్దాలు చేస్తూ తరుముతున్నారు. మరికొందరు పొలం చుట్టూ కర్రలు పాతి, ప్లాస్టిక్ సంచులు, పాత చీరలు చుట్టి, కంచెలా ఏర్పాటు చేశారు. వీటిని చూసి జింకలు చెదిరి పోతాయని రైతులు అంటున్నారు. ఇంత కష్టపడినా రాత్రి వేళల్లో జింకలు.. పంటలపై దాడి చేస్తున్నాయి.



జింకల దెబ్బకు సగం ఖాళీ అయిన ఆముదం కమతం



జింకలను బెదర గొట్టడానికి పొలం చుట్టూ ప్లాస్టిక్ సంచులను కట్టిన దృశ్యం

పై అధికారులు ఆదేశిస్తే తరలిస్తాం

మండలంలోని పలు గ్రామాల పొలాల్లో జింకలు దాడి చేస్తున్నాయని రైతులు మా దృష్టికి తీసుకొచ్చారు. మూడేళ్ల కిందట 3 వేలున్న జింకలు, 7 వేలకు పెరిగినట్లు తెలుస్తోంది. ఉరవకొండ, వజ్రకరూరు మండలాల్లో ఈ ఏడాది జింకల వల్ల నష్ట పోయిన రైతులకు రూ.6 లక్షల పరిహారం అందజేశాం. జింకల దాడిలో నష్టపోయిన కంది, ఆముదం రైతులకు రూ.1.74 లక్షల పరిహారం ఇవ్వాలని సెంట్రల్ జోన్ అథారిటీ అధికారులకు నివేదికలు పంపాం. దెబ్బతిన్న పంటలను పరిశీలించి, ఉన్నతాధికారులకు పంపుతాం. సెంట్రల్ జూ అథారిటీ ఆదేశాలు అందిన వెంటనే జింకలను పట్టుకుని అభయారణ్యాలకు తరలిస్తాం.

- నాగభూషణం, గుత్తి రేంజ్ సెక్షన్ అధికారి



జింకలు కొరికేసిన ఆముదం మొక్కలు

అడవులు అంతరిస్తుండంతోనే..

మండలంలోని ఎన్ఎన్‌పీ తండా, పందికుంట, వీపీపీ తండా, జరుట్ల రాంపురం, షేక్షాన్‌పల్లి గ్రామాల సమీపంలో అడవులున్నాయి. గతంలో ఈ అడవుల్లో చెట్లు ఏపుగా ఉండేవి. వణ్యప్రాణులకు ఈ అడవులు రక్షణగా ఉండేవి. అధికారులు 400 ఎకరాల అటవీ భూములను పేద రైతులకు కేటాయించారు. దీంతో రైతులు అడవులను చదును చేసుకుని, పంటలు సాగు చేసుకుంటున్నారు. మరికొన్ని చోట్ల కొండల ప్రాంతంలోని భూములను చదను చేసుకుంటున్నారు. ఇలా రోజురోజుకీ అడవులు కుచించుకుపోవడంతో వణ్యప్రాణులకు ఆవాస కేంద్రాలు కరువయ్యాయి. వేసవిలో కొందరు అడవులకు నిప్పు పెట్టడంతో పశుగ్రాసం కాలిపోతోంది. అటవీ భూముల్లో నిర్మించిన చెక్‌డ్యాంలో నీరు లేకపోవడంతో వణ్యప్రాణులు నీరు, మేత కోసం పొలాల వైపు వస్తున్నాయి. వాటి కోసం చిరుతలు కూడా వస్తున్నాయి.

అటవీ అధికారులు విఫలం..

ఆరుగాలం శ్రమించి, వేలాది రూపాయలు ఖర్చు పెట్టి, రైతులు పంటలను సాగు చేశారు. విత్తనం మొలకెత్తే సమయంలో జింకలు తీవ్ర నష్టం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాటి నుంచి తమ పంటలను కాపాడాలని పలుమార్లు మీ-కోసం కార్యక్రమంలో అర్జీలిచ్చినా అవి చెత్తబుట్టలకే పరిమితమవుతున్నాయని రైతులు వాపోతున్నారు. అటవీ అధికారులు ఇప్పటి వరకూ ఒక జింకను పట్టుకుని, అడవుల్లో వదిలేసిన దాఖాలాల్లేవని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అడవులు అంతరించి పోతుండటంతో జింకలు పొలాల వైపు వస్తున్నాయన్నారు. అటవీ అధికారులు జింకలను పట్టుకుని, నల్లమల అడవులకు తరలిస్తే బాగుంటుందని రైతులంటున్నారు.



తట్రకల్లు వద్ద జింకలను తరమడానికి గుడిసెలు వేసుకున్న రైతులు



జింకలు నాశనం చేశాయి

నాకున్న ఏడెకరాల్లో ఆముదం పంట సాగు చేశా. జింకలు దాడి చేసి, పంటను పూర్తిగా మేశాయి. దీంతో ఎకరానికి రూ. 10 వేల చొప్పున నష్టం వాటిల్లింది. ఇక్కడి నుంచి జింకలను తరలించి, పంటలను కాపాడాలని అధికారులకు విన్నవించాం.

- జిన్నా నజీర్, రైతు, వజ్రకరూరు



అటవీ అధికారుల నిర్లక్ష్యం : విశ్వనాథ్, రైతు, తట్రకల్లు

ఐదెకరాల్లో కంది సాగు చేశా. పంటను జింకల బెడద నుంచి కాపాడుకోవడానికి చేయని ప్రయత్నమంటూ లేదు. పొలం చుట్టూ కర్రలు పాతి, ప్లాస్టిక్ సంచులు, పాత చీరలను చుట్టి రాత్రి వేళ కాపలాగా వెళ్లి శబ్దాలు చేయడం దినచర్యగా మారింది. ఇంత చేసినా రెండెకరాల్లో పంటను జింకలు మేశాయి. దీనిపై అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అటవీ అధికారులు జింకలను అభయారణ్యాలకు తరలించాలి.



తల్లిదండ్రులతో శ్రీనాథ్

ఎంబీబీఎస్ సీటు సాధించిన రైతు బిడ్డ

గార్లదిన్నె: తల్లిదండ్రుల కష్టాలను కళ్లారా చూసి.. కసితో చదివి, ఎంబీబీఎస్ సీటు సాధించాడు ఓ రైతు బిడ్డ. మండలంలోని పెనకచెర్ల కొత్తపల్లి గ్రామానికి చెందిన చిల్లూరు చితంబరమ్మ, కిష్టా దంపతులు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి ముగ్గురు కుమారులున్నారు. చిన్న కుమారుడైన శ్రీనాథ్ అనంతపురంలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ చదివాడు. ఎంతో కష్టపడి, ఈ ఏడాది నిర్వహించిన నీట్‌లో జాతీయస్థాయిలో 43021 ర్యాంకు సాధించాడు. రాష్ట్ర స్థాయిలో ఎంబీబీఎస్‌లో 2761 ర్యాంకు రాగా.. కుప్పం వైద్య కళాశాలలో సీటు వచ్చింది. పెద్దకుమారుడు శ్రీకాంత్ తిరుపతిలో వెటర్నరీ, రెండో కొడుకు శ్రావంత్ పొద్దుటూరులో ఫార్మడీ చేస్తున్నారు. కుమారులు చదువులో రాణిస్తుండటం పట్ల తల్లిదండ్రులు ఆనందంతో పొంగిపోతున్నారు.



శ్రీనాథ్

What is Composite Cash Credit?

BANK PO/ CLERKS EXAM SPECIAL

BANKING KNOWLEDGE / FINANCIAL AWARENESS

1. **Legislative and regulatory changes made over the last 18 months had created an enabling and supportive operational environment for ARCs and for takeover of stressed assets by PE firms/special situation funds. In the abbreviation ARC, the letter A stands for what?**
a) Asset (ARC: Asset Reconstruction Company)
b) Art c) Aspect d) Atlas e) Actpr

2. **As per Foreign Exchange Regulations, NRIs may invest in which of the following, in of an Indian company under Foreign Direct Investment (FDI) Scheme, subject to the terms and conditions specified in Schedule 1?**
a) Company Shares
b) Compulsory Convertible Preference Shares (CCPS)
c) Compulsorily Convertible Debentures (CCDs)
d) Warrants/ partly paid up shares
e) All the above

3. **The Social Security Scheme namely, AamAadmiBimaYojana (AABY) caters to unorganised sector persons under 48 various vocational groups. Who are such persons / workers?**
a) Beedi Workers b) Brick Kiln Workers, c) Rickshaw Pullers d) Auto Drivers etc.
e) All the above

4. **What are the benefits available to all the RuPay ATM-cum-debit cardholders?**
a) All RuPay ATM-cum-debit cardholders are presently eligible for accidental death and permanent disability insurance cover.
b) RuPay Classic cardholders are eligible for cover of Rs.1 lakh, whereas RuPay Premium cardholders are eligible for cover of Rs.2 lakh.
c) Insurance premium is paid by the National Payments Corporation of India
d) All the above e) None of these

5. **Supervisory Colleges have been setup for which of the following Scheduled Commercial Banks which have sizeable international presence?**
a) State Bank of India, ICICI Bank Ltd.,
b) Bank of India, Bank of Baroda,
c) Axis Bank Ltd.
d) Punjab National Bank
e) All the above six banks

6. **With which bank Long Term Rural Credit Fund (LTRCF), was created with effect from 2014-15, in order to provide long term refinance to Cooperative banks and RRBs to meet the long term inve stment credit lending in agriculture, con tributed out of shortfall in achievement of Priority Sector Lending (PSL) targets by Scheduled Commercial Banks?**
a) NABARD b) NHB c) LIC
d) HDFC e) ICICI

7. **If any bank branch observes Monday as weekly off, that bank branch shall stay open on Monday, July 31, 2017, as it is the last date for payment of crop insurance premium. In order to facilitate collection of insurance premiums on crops. From whom crop insurance premiums are collected?**
a) Farmers b) Tailors c) Traitors
d) Tutors e) Cheaters

8. **The Monetary Policy Committee (MPC) scheduled to meet on August 1 and 2, 2017 for ________ the Monetary Policy Statement for 2017-18.**
a) Third Bi-monthly b) Fourth bi-monthly
c) Fifth bi-monthly d) Sixth bi-monthly
e) None of these

9. **'Bank charges' printed in the bank pass book, would give details about which of the following?**
a) Nature of the charges - fee/commission/fine/ penalty etc.
b) Reasons for the charges, in brief - e.g. return of cheque (number), commission/ fee on draft issued /remittance (draft number), cheque collection charge (number),
c) Charges for issuance of cheque book, SMS alerts, ATM fees, additional cash withdrawals, etc.
d) All the above e) None of these

10. **'Payment to third parties' printed in the bank pass book, should mention which of the following?**
a) Name of the payee
b) Mode - Transfer, clearing, inter-branch, RTGS/ NEFT, cash, cheque (number)
c) Name of the transferee bank, if the payment is made through clearing/inter-branch transaction/ RTGS/NEFT
d) All the above e) None of these

11. **When Reserve Bank of India (RBI) introduced the system of Primary Dealers (PDs) in the Government Securities (G-Sec) Market?**
a) 1935 b) 1995 c) 1949 d) 1980 e) 1969

12. **What are the objectives of the Primary Dealers (PD) system?**
a) To strengthen the infrastructure in G-Sec market
b) Development of underwriting and market making capabilities for G-Sec
c) Improve secondary market trading system
d) To make PDs an effective conduit for open market operations (OMO)
e) All the above

13. **At all times, at least how much of the paid-up share capital of the private sector banks shall be held by resident Indians?**
a) 49% b) 26 % c) 15% d) 25% e) 30%

14. **From all sources viz., Foreign Direct Investment, Foreign Institutional Investors, Non Resident Indians, foreign investment shall not exceed how much of paid-up capital of the private sector bank?**
a) 51% b) 74 % c) 26% d) 49% e) None

15. **Banks normally issue shares in which method?**
a) Public Issues [(i)Initial Public Offer (ii)Further Public Offer]
b) Private Placement (Preferential Issue / Qualified Institutional Placement)
c) Rights Issue d) Bonus Issues
e) All the above methods

16. **"A loan on which the interest rate is fixed for the entire tenor of the loan" is called as what?**
a) Fixed rate loan b) Bank rate loan
c) Repo rate loan
d) Reverse repo rate loan e) None of these

17. **What is "Floating rate loan"?**
a) A loan on which interest rate does not remain fixed during the tenor of the loan.
b) It is for a boat c) It is for a ship
d) It is for bus e) None of these

18. **What is "Term loan"?**
a) Loan for one day
b) A loan which is repayable after a specified term period
c) Loan for 6 days d) Loan for 10 days
e) None of these

19. **Interest shall be charged on all advances at which period?**
a) Monthly rests b) Half yearly c) Yearly
d) For 5 years e) None of these

20. **From which date all rupee loans sanctioned and credit limits renewed are priced with reference to the Marginal Cost of Funds based Lending Rate (MCLR) which will be the internal benchmark for such purposes?**
a) w.e.f. April 1, 2016 b) 1.1.2015
c) 2014 d) 2013 e) None of these

21. **The MCLR shall comprise, which of the following?**
a) Marginal cost of funds
b) Negative carry on account of CRR
c) Operating costs d) Tenor premium
e) All the above

22. **What is "Bulk Deposit"?**
a) It means Rupees one crore and above for Scheduled Commercial Banks other than Regional Rural banks
b) Rs. 50 lakhs c) Rs.25 lakhs
d) Rs.10 lakhs e) None of these

23. **What is "Composite Cash Credit?**
a) It is withdrawal
b) It means a type of loan product having a cash credit limit with a fully savings module designed to take care of farmer's interest
c) It is a mortgage d) It is a pledge
e) None of these

24. **What is "Current Account"?**
a) It means a form of non-interest bearing demand deposit where from withdrawals are allowed any number of times depending upon the balance in the account or up to a particular agreed amount. and shall also be deemed to include other deposit accounts which are neither Savings Deposit nor Term Deposit
b) Only for housewives
c) Only for agriculturist
d) Only for teachers e) None of these

25. **What is "Daily product"?**
a) Production of cotton
b) It means the interest applied on the end of day balance
c) Production of milk
d) Production of rice e) None of these

26. **What is "Demand deposit"?**
a) Cash withdrawal
b) It means a deposit received by the bank, which is withdrawable on demand
c) Money payment d) Fixed deposit
e) None of these

27. **What is "Notice deposit"?**
a) Notice period
b) It means term deposit for specific period but withdrawable on giving at least one complete banking day's notice
c) Keys deposit d) Gold deposit
e) None of these

28. **What is "Scheduled commercial Bank"?**
a) Banks other than co-operatives banks included in second schedule of Reserve Bank of India Act, 1934.
b) Banks mentioned in Constitution of India
c) World Bank d) ADB e) None of these

Praturi Potayya Sarma

ANSWERS

1) a	5) e	9) d	14) b	19) a	24) a
2) e	6) a	10) d	15) e	20) a	25) b
3) e	7) a	11) b	16) a	21) e	26) b
4) d	8) a	12) e	17) a	22) a	27) b
		13) b	18) b	23) b	28) a

ఉద్యోగాలు

మిథాని

హైదరాబాద్, కంచన్‌బాగ్‌లోని మిశ్రధాతు నిగమ్ లిమిటెడ్(మిథాని) - మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
ఖాళీలు: 10
పోస్టులు: అడిషనల్ జనరల్ మేనేజర్/ డిప్యూటీ జనరల్ మేనేజర్(మెటీరియల్స్) 2, డిప్యూటీ జనరల్ మేనేజర్/ సీనియర్ మేనేజర్(మెల్ట్ ఆపరేషన్స్) 1, సీనియర్ మేనేజర్/ మేనేజర్/ డిప్యూటీ మేనేజర్(మార్కెటింగ్ - రింగ్ ప్రొడక్ట్స్ 1, డై, టూల్ స్టాక్ 1), డిప్యూటీ జనరల్ మేనేజర్ (మార్కెటింగ్) 2, సీనియర్ మేనేజర్ (మార్కెటింగ్) 3
వయసు: 45 నుంచి 48 ఏళ్ల మధ్య ఉండాలి
అర్హత: అడిషనల్ జనరల్ మేనేజర్, డిప్యూటీ జనరల్ మేనేజర్(మెటీరియల్స్) పోస్టులకు 60 శాతం మార్కులతో బిఇ/ బిటెక్ + ఎంబిఏ లేదా స్పెషలైజేషన్(మెటీరియల్స్ మేనేజ్‌మెంట్/ ప్రొడక్షన్ మేనేజ్‌మెంట్/ ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్/ సప్లయ్ చెయిన్ మేనేజ్‌మెంట్) పూర్తిచేసి ఉండాలి. పదిహేడేళ్ల అనుభవం ఉండాలి. డిప్యూటీ జనరల్ మేనేజర్ పోస్టులకు డిగ్రీ ఉత్తీర్ణతతోపాటు పదమూడేళ్ల అనుభవం ఉండాలి. మిగిలిన పోస్టులన్నింటికీ సంబంధిత విభాగంలో ఇంజనీరింగ్ డిగ్రీ + నిర్దేశించిన మేర అనుభవం ఉండాలి.
ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఆగస్టు 16
వెబ్‌సైట్: www.midhani.com

ఎన్‌పిసిఐఎల్

న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్(ఎన్‌పిసిఐఎల్)- **ట్రేడ్ అప్రెంటిస్**ల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
మొత్తం ఖాళీలు: 120
కర్ణాటకలోని ఖాళీలు: 80
ట్రేడ్స్ వారీ ఖాళీలు: ఫిట్టర్ 15, టర్నర్ 5, మెషినిస్ట్ 5, ఎలక్ట్రీషియన్ 20, వెల్డర్ 10, ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్స్ 15, ఎలక్ట్రానిక్ మెకానిక్ 10
గుజరాత్‌లోని ఖాళీలు: 40
ట్రేడ్స్ వారీ ఖాళీలు: ఫిట్టర్ 9, టర్నర్ 3, ఎలక్ట్రీషియన్ 9, ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్ 2, పాసా 9, వెల్డర్ 2, మెషినిస్ట్ 3
అర్హత: పదోతరగతి/ పన్నెండో తరగతి ఉత్తీర్ణతతోపాటు సంబంధిత ట్రేడ్‌లో ఐటిఐ పూర్తిచేసి ఉండాలి
వయసు: జూలై 31 నాటికి 16 నుంచి 24 ఏళ్ల మధ్య ఉండాలి
ట్రైనింగ్ వ్యవధి: ఏడాది
ఎంపిక: రాత పరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా అభ్యర్థులు ముందుగా www.apprenticeship.gov.in వెబ్‌సైట్లో రిజిస్టర్ చేసుకోవాలి. ఆ తరవాత ఎన్‌పిసిఐఎల్ వెబ్‌సైట్ నుంచి దరఖాస్తు ఫారాన్ని డౌన్‌లోడ్ చేసుకొని నింపి కింది చిరునామాకు పంపుకోవాలి.
దరఖాస్తుకు ఆఖరు తేదీ: గుజరాత్ పోస్టులకు ఆగస్టు 16, కర్ణాటక పోస్టులకు ఆగస్టు 24
కర్ణాటక చిరునామా: Manager(HRM), Nuclear Power Corporation of India Limited Kaiga Site, Via Karwar, Po- Kaiga, Uttara Kannada - 581400, Karnataka
గుజరాత్ చిరునామా: Manager(HRM), Nuclear Power Corporation of India Limited Kakrapar Gujarat Site, PO - Anumala, Via -Vyara Dt, Tapi - 394651, Gujarat
వెబ్‌సైట్: www.npcil.nic.in/Opportunities

ఎన్‌హెచ్‌డిసిఎల్

ఎన్‌హెచ్‌డిసి లిమిటెడ్- కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
ఖాళీలు: 12
పోస్టులు: మెడికల్ ఆఫీసర్ 2, ట్రైనీ ఆఫీసర్(లా 2, కంపెనీ సెక్రటరీ 1, హెచ్‌ఆర్ 3, ఫైనాన్స్ 3), సూపర్‌వైజర్ (సేఫ్టీ) 1
ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం: ఆగస్టు 8 నుంచి
ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఆగస్టు 22
వెబ్‌సైట్: www.nhdcindia.com

సిమెంట్ తయారీలో వాడే ప్రధాన ముడి పదార్థం?

జనరల్ స్టడీస్ - కెమిస్ట్రీ



వేముల అశోక్
సీనియర్ ఫ్యాకల్టీ

1. ఉప్పులో కరిగి ఉన్న మలినాలను తొలగించడానికి ఉపయోగపడేది?
ఎ) $CaCO_3$ బి) NaOH
సి) $Ca(OH)_2$ డి) $2nCO_3$

2. పరిశుద్ధమైన ఉప్పును పొందడానికి ఉప్పు ద్రావణంలోకి ఏ వాయువును పంపుతారు?
ఎ) Cl_2 బి) H_2 సి) HCl డి) N_2

3. బ్రైన్ ద్రావణం అంటే ....
ఎ) HCl ద్రావణం బి) క్లోరిన్ జలం
సి) బ్లీచింగ్ పౌడర్ డి) Nacl జల ద్రావణం

4. దూది, కాగితం, సిల్కు మొదలైన వాటిని విరంజనం చేయడానికి ఉపయోగించేది?
ఎ) SO_2 బి) Cl_2 సి) $CaOCl_2$ డి) $COCl_2$

5. టియర్ గ్యాస్ రసాయన ఫార్ములా?
ఎ) $COCl_2$ బి) $CHCl_3$ సి) $CaOCl_2$ డి) Cl_3CCNO_2

6. పాస్‌జీన్ రసాయన నామం?
ఎ) కాల్షియం క్లోరైడ్ బి) కార్బోనైల్ క్లోరైడ్
సి) కార్బన్ మోనాక్సైడ్ డి) ఏదీకాదు

7. తడిసిన రంగు పూలను క్లోరిన్ జాడీలో వేస్తే పూలు రంగును కోల్పోతాయి. దానికి కారణం? క్లోరిన్ ఏవిధంగా పనిచేస్తుంది?
ఎ) క్షయకరిణి బి) విరంజనకారి
సి) ఉత్ప్రేరకం డి) ఏదీకాదు

8. ఆకుపచ్చ రంగు గల వాయువు?
ఎ) ఫ్లోరిన్ బి) క్లోరిన్ సి) బ్రోమిన్ డి) అయోడిన్

9. ఎముకల్లో ఉండేది?
ఎ) కాల్షియం ఫాస్ఫేట్ బి) కాల్షియం ఫాస్ఫైట్
సి) కాల్షియం హైడ్రాక్సైడ్
డి) కాల్షియం హైపో క్లోరేట్

10. ఫాస్ఫారికామ్లాన్ని దేనితో కలిపి మట్టి పాత్రలో స్వేదనం చెందిస్తే ఫాస్పరస్ లభిస్తుంది?
ఎ) O_2 బి) C సి) H_2 డి) సల్ఫర్

11. ఫాస్పరస్ ఏ వాసనను కలిగి ఉంటుంది?
ఎ) కుళ్లిన కోడిగుడ్డు బి) పూరైన
సి) వెల్లుల్లి డి) అమ్మోనియం

12. ఆకాశంలో మెరుపులు ఏర్పడినప్పుడు వాతావరణంలో విడుదలయ్యే వాయువు?
ఎ) O_2 బి) CO_2 సి) N_2O డి) NO

13. గాలిలో నైట్రోజన్ భారశాతం, ఘన పరిమాణాత్మకత శాతాలు?
ఎ) 3/4, 4/5 బి) 1/5, 1/3
సి) 3/2, 4/3 డి) 1/2, 1/3

14. నైట్రోజన్ ఘనీభవన స్థానం?
ఎ) -210.5°C బి) -33°C
సి) 0°C డి) -330°C

15. జింక్, సల్ఫర్‌లను చీకటిలో నెమ్మదిగా వేడి చేసినప్పుడు ఏ రంగు మంట ఇస్తుంది?
ఎ) పసుపు బి) ఆరెంజ్
సి) ఆకుపచ్చ డి) బంగారు రంగు

16. సల్ఫర్ డై ఆక్సైడ్ గాలి కంటే ఎన్ని రెట్లు బరువైనది?
ఎ) 2 1/2 బి) 1 1/2 సి) 1 డి) 2

17. పెట్రోల్ హైడ్రోజనీకరణ ప్రక్రియను కనుగొన్న శాస్త్రవేత్త?
ఎ) హేబర్ బి) బెర్జిలియస్
సి) కావెండిష్ డి) డాల్టన్

18. ప్రయోగశాలలో సులువుగా ఆక్సిజన్ తయారు చేయడానికి వాడే రసాయనం?
ఎ) KCl బి) KNO_3 సి) $Kmno_4$ డి) $K_2Cr_2o_7$

19. సోడియం లోహాన్ని ఆక్సిజన్‌తో మండిస్తే ఏర్పడే జ్వాల వర్ణం?
ఎ) ఎరుపు బి) ఆకుపచ్చ సి) నీలం డి) బంగారం

20. జుట్టును విరంజనం చేయడానికి వాడే ద్రవం?
ఎ) $Kmno_4$ బి) H_2O సి) H_2O_2 డి) D_2O

21. ఉప్పునీటి ద్రావణాన్ని ఏమని అంటారు?
ఎ) బ్రైన్ ద్రావణం బి) కఠిన జలం
సి) భారజలం డి) ఏదీకాదు

22. నీటిని విద్యుత్ విశ్లేషణం చేస్తే వెలువడే ఆక్సిజన్, హైడ్రోజన్ వాయువుల ఘన పరిమాణాల నిష్పత్తి?
ఎ) 1:2 బి) 1:3 సి) 1:1 డి) 2:3

23. కాస్టిక్ సోడా అంటే?
ఎ) సోడియం కార్బోనేట్ బి) సోడియం బైకార్బోనేట్
సి) సోడియం హైడ్రాక్సైడ్ డి) సోడియం క్లోరైడ్

24. లెడ్ పెన్సిల్‌లో ఉండే నల్లని భాగం?
ఎ) లెడ్ బి) గ్రాఫైట్ సి) సీసం డి) జింక్

25. కింది వాటిలో ద్రవరూపంలో ఉండే లోహం?
ఎ) వెండి బి) బంగారం సి) ప్లాటినం డి) పాదరసం

26. కింది వాటిలో వాయువు కానిది?
ఎ) CO_2 బి) SO_2 సి) O_2 డి) Br_2

27. ఉప్పు, కర్పూరంల మిశ్రమాన్ని ఏ పద్ధతి ద్వారా వేరు చేస్తారు?
ఎ) బాష్పీభవనం బి) ద్రవీభవనం
సి) ఉత్పతనం డి) సంఘననం

28. ఘన పరిమాణాత్మకంగా గాలిలో ఎంత ఆక్సిజన్ ఉంటుంది?
ఎ) ఒకటో వంతు బి) రెండో వంతు
సి) ఐదో వంతు డి) నాలుగో వంతు

29. దుక్క ఇనుము లేదా పోత ఇనుములో కార్బన్ శాతం ఎంత?
ఎ) 3.4% బి) 2.0% సి) 8.0% డి) 1.2%

30. పొటాషియం లాటిన్ పేరు?
ఎ) నేట్రియం బి) కాలియం
సి) భాస్వరం డి) గంధకం

31. రుణ ధృవ కిరణాలను కనిపెట్టింది?
ఎ) జె.జె.థామ్సన్ బి) న్యూటన్
సి) జె.చాడ్విక్ డి) సోమర్‌ఫీల్డ్

32. అత్యధికంగా చొచ్చుకొని పోయే కిరణాలు?
ఎ) α - కిరణాలు బి) β - కిరణాలు
సి) γ - కిరణాలు డి) ఏదీకాదు

33. ఆహార పదార్థాలను నిల్వ చేయడానికి ఉపయోగించే పదార్థం?
ఎ) ఎసిటికామ్లం బి) సిట్రికామ్లం
సి) బోరికామ్లం డి) బెంజోయికామ్లం

34. కింది వాటిలో అత్యంత వల్లబరిచిన పదార్థం?
ఎ) పాదరసం బి) ఐస్‌క్రీం సి) టెఫ్లాన్ డి) గ్లాస్

35. సిమెంట్ తయారీలో వాడే ప్రధాన ముడి పదార్థం?
ఎ) సున్నపురాయి బి) కాల్షియం
సి) మెగ్నీషియం డి) అల్యూమినియం

36. మరకతం సాధారణ రంగు?
ఎ) పసుపుపచ్చ బి) ముదురు ఆకుపచ్చ
సి) ప్రష్యన్ నీలం డి) ఊదా రంగు

37. రేడియోథెరపీ పద్ధతిలో కోబాల్ట్-60 ఏ కిరణాలను విడుదల చేస్తుంది?
ఎ) α - కిరణాలు బి) β - కిరణాలు
సి) γ - కిరణాలు డి) X - కిరణాలు

38. తెల్ల స్పిరిట్ రసాయన నామం?
ఎ) పెట్రోలియం హైడ్రోకార్బన్‌ల మిశ్రమం
బి) శుభ్రపరచిన ఈథనాల్
సి) సంపూర్ణ ఈథైల్ ఆల్కహాల్
డి) డినేచర్డ్ ఆల్కహాల్

39. భారతదేశంలో ఏ రాష్ట్రం నికోటిన్, పొగాకు కలిగి ఉన్న పదార్థాలను పూర్తిగా నిషేధించింది?
ఎ) హర్యానా బి) ఉత్తరప్రదేశ్
సి) గుజరాత్ డి) రాజస్థాన్

40. చల్లని నీటితో తీవ్రంగా ప్రతి చర్య జరిపే లోహం ?
ఎ) కాల్షియం బి) సోడియం
సి) మెగ్నీషియం డి) పొటాషియం

41. మానవ మూత్రపిండాల్లోని రాళ్లలో కనిపించే ప్రధానమైన రసాయన సమ్మేళనం?
ఎ) యూరికామ్లం బి) కాల్షియం ఆక్సలేట్
సి) కాల్షియం ఆక్సైడ్ డి) కాల్షియం క్లోరైడ్

42. జాతీయ పోషకాహార సంస్థ ఎక్కడుంది?
ఎ) బెంగళూరు బి) ముంబై
సి) హైదరాబాద్ డి) ఢిల్లీ

43. అంటుకోని వంటపాత్రలను దేనితో పూత పూస్తారు?
ఎ) సిలికాన్ బి) పి.వి.సి సి) గ్రాఫైట్ డి) టెఫ్లాన్

44. కింది వాటిలో సులభంగా లభించని లోహం?
ఎ) రేడియం బి) వెండి సి) స్టానియం డి) పాదరసం

45. సున్నపు నీరు రసాయనిక పేరు?
ఎ) కాల్షియం సల్ఫేట్ బి) కాల్షియం హైడ్రాక్సైడ్
సి) కాల్షియం కార్బోనేట్ డి) కాల్షియం ఆక్సైడ్

46. వేసవి ద్రవం అని ఏ మూలకానికి పేరు?
ఎ) గాలియం బి) థాలియం
సి) రేడియం డి) పోలోనియం

47. పెట్రోల్‌కు ప్రతి విస్ఫోటనకారిగా కలిపే పదార్థం?
ఎ) కార్బన్ మోనాక్సైడ్ బి) టెట్రా ఈథైల్‌లెడ్
సి) ఆల్కహాల్ డి) ఏదీకాదు

48. ఎల్‌పీజీ లీకేజీని గుర్తించడానికి కలిపే పదార్థం?
ఎ) మిథైల్ లెడ్ బి) ఈథైల్ ఆల్కహాల్
సి) మిథైల్ మెర్కప్టాన్ డి) క్లోరాల్ హైడ్రేట్

49. కింది వాటిలో అత్యధిక కఠినమైన లోహం?
ఎ) టంగ్‌స్టన్ బి) వెండి సి) ఇత్తడి డి) ఉక్కు

సమాధానాలు

1) సి	8) బి	15) సి	22) సి	29) ఎ	36) బి	43) డి
2) బి	9) ఎ	16) ఎ	23) సి	30) బి	37) సి	44) ఎ
3) డి	10) బి	17) బి	24) బి	31) ఎ	38) ఎ	45) బి
4) సి	11) సి	18) సి	25) డి	32) సి	39) ఎ	46) ఎ
5) డి	12) డి	19) డి	26) డి	33) డి	40) బి	47) బి
6) బి	13) ఎ	20) సి	27) సి	34) డి	41) బి	48) సి
7) బి	14) ఎ	21) ఎ	28) సి	35) డి	42) సి	49) ఎ

ఉద్యోగాలు

టిఎంఆర్‌బి

తమిళనాడు మెడికల్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్- తాత్కాలిక ప్రాతిపదికన కింది విభాగాల్లో **అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్** పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. **మొత్తం ఖాళీలు: 106**

విభాగం: హోమియోపతి **ఖాళీలు:** 4

అర్హత: ఆగస్టు 2 నాటికి పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా (ఎఫ్.ఎఫ్/ ఎంఎఫ్/ డిఎఫ్ - హోమియోపతి) లేదా వెస్ట్ బెంగాల్‌లోని ప్రముఖ సంస్థల నుంచి డిప్లొమా లేదా హైదరాబాద్‌లోని బోర్డ్ ఆఫ్ ఇండియన్ మెడిసిన్ వారి డిప్లొమా ఇన్ ఇంటిగ్రేటెడ్ మెడిసిన్(హోమియోపతి) లేదా డిగ్రీ + డిప్లొమా లైసెన్స్ సర్టిఫికెట్ (ఆంధ్రా బోర్డ్ ఫర్ ఆయుర్వేద అండ్ హోమియోపతి, హైదరాబాద్ తదితర సంస్థల నుంచి) లేదా డిప్లొమా(హోమియోపతి మెడిసిన్ అండ్ సర్జరీ) లేదా బిహెచ్ఎంఎస్/ ఎంబిఎస్ తదితర కోర్సులు పూర్తిచేసి ఉండాలి.

విభాగం: ఆయుర్వేద **ఖాళీలు:** 1

అర్హత: హెచ్‌పిఐఎం(ఆయుర్వేద)/జిసిఐఎం (ఆయుర్వేద) / ఎల్ఐఎం/ బిఐఎంఎస్ పూర్తిచేసి ఉండాలి.

విభాగం: సిద్ధ **ఖాళీలు:** 101

అర్హత: (హెచ్‌పిఐఎం/ జిసిఐఎం/ ఎండీ/ బిఐఎం/ ఎల్ఐఎం)(సిద్ధ) లేదా బిఎస్ఎంఎస్ పూర్తిచేసి ఉండాలి.

వయసు: 35 ఏళ్లలోపుండాలి

ఎంపిక: అండర్ గ్రాడ్యుయేట్ లెవెల్ ఎగ్జామినేషన్ ద్వారా

అండర్ గ్రాడ్యుయేట్ లెవెల్ ఎగ్జామినేషన్: అక్టోబరు 8న

పరీక్ష కేంద్రం: చెన్నై **పరీక్ష ఫీజు:** రూ.750

ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఆగస్టు 22

ఆఫ్‌లైన్ ఫీ పేమెంట్‌కు ఆఖరు తేదీ: ఆగస్టు 24

వెబ్‌సైట్: www.mrb.tn.gov.in

మద్రాస్ ఫెర్టిలైజర్స్

మద్రాస్ ఫెర్టిలైజర్స్ లిమిటెడ్- **గ్రాడ్యుయేట్ ఇంజనీరింగ్ & డిప్లొమా అప్రెంటీస్‌ల** భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

మొత్తం ఖాళీలు: 89

గ్రాడ్యుయేట్ ఇంజనీరింగ్ అప్రెంటిసెస్‌లు

ఖాళీలు: 6

విభాగాలు - ఖాళీలు: కెమికల్ ఇంజనీరింగ్ 5, ఎలక్ట్రికల్ & ఎలక్ట్రానిక్స్ 1 **స్టయిపెండ్:** నెలకు రూ.10,000

అర్హత: బిఇ/ బిటెక్(కెమికల్/ ఎలక్ట్రికల్& ఎలక్ట్రానిక్స్) ఉత్తీర్ణులై ఉండాలి.

టెక్నీషియన్(డిప్లొమా) అప్రెంటీసెస్ ఖాళీలు: 45

విభాగాలు - ఖాళీలు: కెమికల్ 13, మెకానికల్ 20, ఎలక్ట్రికల్ & ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ 5, సివిల్ 2, ఎలక్ట్రానిక్స్ & ఇన్‌స్ట్రుమెంటేషన్/ ఇన్‌స్ట్రుమెంటేషన్ & కంట్రోల్ ఇంజనీరింగ్ 5

స్టయిపెండ్: నెలకు రూ.9,000

అర్హత: డిప్లొమా(కెమికల్/ మెకానికల్/ ఎలక్ట్రికల్ & ఎలక్ట్రానిక్స్/ సివిల్/ ఎలక్ట్రానిక్స్ & ఇన్‌స్ట్రుమెంటేషన్& కంట్రోల్ ఇంజనీరింగ్) పూర్తిచేసి ఉండాలి.

డిప్లొమా ఇన్ మోడరన్ ఆఫీస్ ప్రాక్టీస్ అప్రెంటిసెస్ ఖాళీలు: 18

స్టయిపెండ్: నెలకు రూ.9,000

అర్హత: డిప్లొమా ఇన్ మోడరన్ ఆఫీస్ ప్రాక్టీస్

ట్రేడ్ అప్రెంటీస్‌లు ఖాళీలు: 20

ట్రేడ్స్ - ఖాళీలు: ఫిట్టర్ 6, టర్నర్ 1, వెల్డర్ 1, ఎలక్ట్రీషియన్ 4, ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్ 4, రిఫ్రిజిరేటర్ & ఎసి మెకానిక్ 1, మెకానిక్ మోటార్ వెహికిల్ 1, మెకానికల్ డీజిల్ 1, డ్రాఫ్ట్స్‌మన్ మెకానిక్ 1

అర్హత: సంబంధిత విభాగంలో ఐటిఐ పూర్తిచేసి ఉండాలి

స్టయిపెండ్: నెలకు రూ.8630 (డీజిల్ మెకానిక్ ట్రేడ్‌కు మొదటి ఏడాది రూ.7,666) **ట్రైనింగ్:** ఏడాది

అభ్యర్థులు తప్పనిసరిగా www.mhrdnats.gov.in వెబ్‌సైట్లో రిజిస్టరై ఉండాలి. డిగ్రీ/ డిప్లొమా పూర్తిచేసి మూడేళ్లు నిండకూడదు

ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఆగస్టు 9

దరఖాస్తు హార్డు కాపీ పంపాల్సిన చిరునామా: The General Manager - P&A, Madras Fertilizers Limited, Post Bag No - 2, Manali, Chennai- 600068

వెబ్‌సైట్: www.madrasfert.nic.in

ఎడ్యుకేషన్

ఎన్ఐఇఎల్ఐటి

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఎన్ఐఇఎల్ఐటి)- పీజీ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.

విభాగాలు: వీఎల్ఎస్ఐ& ఎంబెడెడ్ హార్డ్‌వేర్ డిజైన్, ఎలక్ట్రానిక్ సిస్టం డిజైన్ అండ్ మ్యానుఫ్యాక్చరింగ్

కోర్సు వ్యవధి: 24 వారాలు

అర్హత: బిఇ/ బిటెక్/ ఎమ్మెస్సీ

కోర్సు ప్రారంభం: ఆగస్టు 21

వెబ్‌సైట్: http://nielit.gov.in/calicut

ఎన్ఎల్ఎస్ఐయు

బెంగళూరులోని నేషనల్ లా స్కూల్ ఆఫ్ ఇండియా యూనివర్సిటీ దూరవిద్యా విభాగం- కింది కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.

కోర్సులు: మాస్టర్ ఆఫ్ బిజినెస్ లాస్ (ఎంబిఎల్), ఏడాది పీజీ డిప్లొమా(హ్యూమన్ రైట్స్ లా/ మెడికల్ లా & ఎథిక్స్/ ఎన్విరాన్‌మెంటల్ లా/ ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్ లా/ చైల్డ్ రైట్స్ లా / కన్స్యూమర్ లా & ప్రాక్టీస్/ సైబర్ లా & సైబర్ ఫోరెన్సిక్స్)

అర్హత: డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.

ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఆగస్టు 31

వెబ్‌సైట్: http://ded.nis.ac.in







వేటకొడవళ్లతో తలపై నరికిన దృశ్యం, మృతి చెందిన బాదన్న, మృతదేహాన్ని పరిశీలిస్తున్న ప్రకాష్‌నాయుడు, ఆలం నరసానాయుడు, మారుతి, ఆర్డీఓ రామారావు, ఎమ్మార్వో శ్రీనివాసులు, కాలవ సతీమణి, కుమారుడు, రోదిస్తున్న కుటుంబికులు







విలపిస్తున్న బాదన్న బంధువులు, అనుచరులు, మృతదేహం వద్ద మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, ఎస్పీ అశోక్‌కుమార్, ఎమ్మెల్యే ఉన్నం, గోల్ల గ్రామంలో పోలీసు బందోబస్తు

టీడీపీనేత గోల్ల బాదన్న దారుణహత్య

వీలునామా పంచాయితీనే కారణమా.?

పోలీసుల అదుపులో నలుగురు అనుమానితులు..!

కళ్యాణదుర్గం: టీడీపీ నేత, రాష్ట్ర వాల్మీకి ఫెడరేషన్ డైరెక్టర్ గోల్ల బాదన్న(63) గురువారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తుల చేతిలో దారుణ హత్యకు గురయ్యారు. పోలీసులు, బంధువుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. దినచర్యలో భాగంగా గురువారం ఉదయం 5 గంటల సమయంలో తన ఇంటి నుంచి కళ్యాణదుర్గానికి వెళ్లే ప్రధాన రహదారిపై బాదన్న వాకింగ్ చేయసాగారు. అప్పటికే కాపుకాచిన కొందరు గుర్తుతెలియని వ్యక్తులు ఒక్కసారిగా చుట్టుముట్టి వేటకొడవళ్లు, కత్తులతో ఆయనపై దాడి చేశారు. అదే సమయంలో కళ్యాణదుర్గం నుంచి అనంతపురం వైపు ఆర్టీసీ బస్సు వెళుతుండడం గమనించిన దుండగులు రక్తపుమడుగులో పడి ఉన్న బాదన్నను వదిలేసి పరారయ్యారు. అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తన పొలంలోకి వెళుతూ రోడ్డు పక్కన పడి ఉన్న బాదన్నను గుర్తించి కుటుంబసభ్యులు, గ్రామస్థులకు సమాచారం చేరవేశారు. వారు వచ్చి కొన ఊపిరితో ఉన్న ఆయనను హుటాహుటిన కళ్యాణదుర్గం ఆర్డీటీ ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. మృతుడికి భార్య ఈశ్వరమ్మ, కొడుకు రమేష్, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

వీలునామా పంచాయితీనే హత్యకు కారణమా..?

గ్రామానికి చెందిన నరసింహప్ప తనకున్న 12 ఎకరాల పొలంలో తన ఐదుగురు కూతుళ్లకు ఆరు ఎకరాలు, కుమారుడు సోమశేఖర్‌కు ఆరు ఎకరాలు చెందేలా వీలునామా రాసి మృతి చెందారు. ఆ వీలునామా ప్రకారం కూతుళ్లకు వాటా దక్కేలా చేయడమే బాదన్న హత్యకు కారణమని గ్రామంలో గుప్పుమంటోంది. ఇటీవల గ్రామంలో చోటుచేసుకున్న రస్తా వివాదంలో బాదన్న, బ్రహ్మయ్య వర్గాలు ఘర్షణకు దిగి ఒకరిపై ఒకరు కేసులు నమోదు చేయించుకున్నారు. దీన్ని తనకు అనుకూలంగా మలచుకుని తన ఆస్తి అక్కా, చెల్లెళ్లకు దక్కేలా పంచాయితీ చేసిన బాదన్నను హతమారిస్తే కేసు తమపై పడదని భావించి సోమశేఖర్ ఈ దురాఘాతానికి పాల్పడినట్లు గ్రామస్థులు పేర్కొంటున్నారు.

పోలీసుల అదుపులో నలుగురు అనుమానితులు..?

గోల్ల బాదన్న హత్య జరిగిన గంట వ్యవధిలోనే నలుగురు అనుమానితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. కర్ణాటక రాష్ట్రానికి చెందిన తిప్పారెడ్డిపల్లి, శిరువాళం గ్రామాలకు చెందిన ముగ్గురు యువకులతో పాటు గోల్ల గ్రామానికి చెందిన సోమశేఖర్‌ను రూరల్ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు విశ్వసనీయవర్గాల సమాచారం.

బాదన్న హత్య దారుణం

బాదన్న హత్య దారుణమని మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ చమన్‌సాహెబ్ పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వాస్పత్రిలో వారు బాదన్న మృతదేహాన్ని సందర్శించి.. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీకి బాదన్న చేసిన సేవలు మరవలేనివని కొనియాడారు. ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయ చౌదరి, నాయకుడు ఉన్నం మారుతీ చౌదరి, వైస్ ఎంపీపీ గోల్ల వెంకటేశులు, మార్కెట్‌యార్డు చైర్మన్ పాపంపల్లి రామాంజనేయులు, సీనియర్ నాయకులు చౌళం మల్లికార్జున, ఆర్‌జీ శివశంకర్, మున్సిపల్ చైర్‌పర్సన్ బిక్కి రామలక్ష్మి, బీకే గోవిందప్ప, వైపీ రమేష్, శ్రీనివాసరెడ్డి తదితరులు బాదన్న మృతదేహాన్ని సందర్శించి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

టీడీపీ నేత బాదన్న హత్యతో ఉలిక్కిపడ్డ అనంత

అనంతపురం అర్బన్: తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు బాదన్న దారుణ హత్యకు గురి కావడంతో జిల్లా ఒక్కసారిగా ఉలిక్కిపడింది. కళ్యాణదుర్గం మండలం గోల్ల గ్రామానికి చెందిన బాదన్న టీడీపీలో అత్యంత కీలకమైన నేతగా గుర్తింపు పొందారు. జడ్పీటీసీ సభ్యుడిగా, కళ్యాణదుర్గం మార్కెట్ యార్డు చైర్మన్‌గా, మండల పరిషత్ ఉపాధ్యక్షుడిగా పనిచేశారు. ప్రస్తుతం వాల్మీకి ఫెడరేషన్ డైరెక్టర్‌గా ఉన్నారు. ఆవిర్భావం నుంచి పార్టీలోనే కొనసాగుతున్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయచౌదరికి కుడి భుజంగా ఉంటున్నారు. ఆ ప్రాంతంలో బడుగు, బలహీనవర్గాలతో పాటు ఇతరులు కూడా తమ సమస్యల పరిష్కారం కోసం బాదన్నను ఆశ్రయించేవారు. పెద్దాయనగా వ్యవహరిస్తూ.. సమస్యను తన నెత్తిన వేసుకుని పరిష్కరించేవారు. జిల్లాలో ప్రముఖ వాల్మీకి నాయకుడిగా గుర్తింపు తెచ్చుకున్నారు. ప్రస్తుత మంత్రి కాలువ శ్రీనివాసులుతోపాటు ఇతర కీలక నేతలందరికీ సన్నిహితుడిగా మెలిగేవారు. తన సొంత గ్రామంలోని స్థల వివాదంలో తలదూర్చి ప్రత్యర్థుల చేతిలో దారుణ హత్యకు గురయ్యారు. రోజువారీలాగే గురువారం ఉదయం కూడా ఆయన వాకింగ్‌కు వెళ్లారు. ఉదయం 5 గంటల సమయంలో ముందుగా వేసుకున్న పథకం ప్రకారం బాదన్నపై దాడిచేసి కొడవళ్లతో దారుణంగా నరికారు. ఈ దాడిలో ఆయన తలతో పాటు, కీలకమైన శరీర భాగాల్లో దెబ్బలు తగలడంతో కుప్పకూలిపోయారు. కొనఊపిరితో ఉన్న ఆయనను బంధువులు కళ్యాణదుర్గం ఆర్డీటీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం జిల్లా కేం ద్రంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. దీంతో మృతదేహాన్ని ప్రభుత్వ సర్వజనాస్పత్రికి తరలించారు.

ఆస్పత్రిలో మిన్నంటిన ఆర్తనాదాలు..

బాదన్న మృతి వార్త తెలుసుకుని కళ్యాణదుర్గం నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలతోపాటు జిల్లావ్యాప్తంగా గల నేతలు, కార్యకర్తలు, వాల్మీకి నాయకులు, బంధువులు పెద్దఎత్తున తరలివచ్చారు. దీంతో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి కిక్కిరిసిపోయింది. తమ నాయకుడిని చూడడానికి అభిమానులు బారులు తీరారు. కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీటి పర్యంతమయ్యారు. 'దేవుడా! మంచితనానికిదేనా శిక్ష?' అంటూ వారు విలపించడం అక్కడున్న వారందరినీ కంట తడి పెట్టించింది. మంత్రి కాలవ శ్రీనివాసులు సతీమణి బాదన్న కుటుంబ సభ్యులను ఓదార్చుతూ కనిపించారు.

మృతదేహాన్ని సందర్శించిన ఎమ్మెల్యే ఉన్నం, ఎస్పీ..

టీడీపీ నేత బాదన్న మృతదేహాన్ని కళ్యాణదుర్గం ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయచౌదరి, ఆయన తనయులు మారుతీ చౌదరి, ఉదయ్‌కుమార్, నియోజవర్గనాయకులు మల్లికార్జున, శివశంకర్, రామాంజనేయులు, జిల్లా నేతలు సరిపూటి సూర్యనారాయణ, బాంబేడయింగ్ నాగన్న, అనంతపురం మార్కెట్ యార్డు చైర్మన్ ఆదినారాయణ, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ రాయల్ మురళి తదితరులతోపాటు పెద్దఎత్తున నాయకులు, కార్యకర్తలు తరలివచ్చారు. మృతదేహాన్ని సందర్శించి కంట తడిపెట్టుకున్నారు. ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయచౌదరి ఏకాంతంగా ఉంటూ.. బాధను దిగమింగుతూ.. నేతలు, కార్యకర్తలతో చర్చిస్తూ కనిపించారు. అలాగే జిల్లా ఎస్పీ అశోకకుమార్ ఆస్పత్రికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. జరిగిన ఘటనపై కళ్యాణదుర్గం డీఎస్పీ, ఇతర అధికారులతో ఆరా తీస్తూ.. తగు ఆదేశాలిస్తూ కనిపించారు.

అమరావతి నుంచి మంత్రుల దిగ్భ్రాంతి

బాదన్న హత్యపై జిల్లా మంత్రులు కాలవ శ్రీనివాసులు, పరిటాల సునీత దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విషయం తెలిసిన వెంటనే అమరావతి నుంచి కళ్యాణదుర్గం ఎమ్మెల్యే హనుమంతరాయచౌదరి, జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్‌కు ఫోన్‌చేసి ఘటనపై ఆరా తీశారు. దోషులను త్వరగా పట్టుకుని కఠినంగా శిక్షించాలని జిల్లా పోలీసు యంత్రాంగానికి సూచించారు.

అంచెలంచెలుగా ఎదిగిన బాదన్న

సాయం చేయబోయి ప్రాణాలు పోగొట్టుకున్న వైనం

వీలునామా పంచాయితీనే హత్యకు కారణమా.?

కళ్యాణదుర్గం టౌన్: గ్రామస్థాయి టీడీపీ కార్యకర్తగా రాజకీయ రంగ ప్రవేశం చేసిన గోల్ల బాదన్న అంచెలంచెలుగా ఎదిగి ఎన్నో పదవులు చేపట్టారు. చివరికి తనను ఆశ్రయించిన వారికి న్యాయం చేసి ప్రాణాలు పోగొట్టుకున్నారు. గ్రామానికి చెందిన బొజ్జన్న, మారెక్కలకు నలుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వారిలో బాదన్న అందరికన్నా పెద్దవాడు. 1986లో టీడీపీలో చేరి అంచెలంచెలుగా ఎదిగి అనేక పదవులు చేపట్టి నియోజకవర్గ నాయకుడిగా ప్రత్యేక గుర్తింపు పొందారు. 1987లో సర్పంచ్‌గాను, మండల పరిషత్ ఉపాధ్యక్షుడిగాను బాధ్యతలు నిర్వర్తించారు. 1995లో జడ్పీటీసీ సభ్యుడిగా గెలుపొందారు. అనంతరం వైఎస్ మరణానంతరం మార్కెట్ రామన్న రాజీనామాతో జరిగిన జడ్పీటీసీ ఉపఎన్నికల్లో ఓడిపోయారు. 2014లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చాక మార్కెట్‌యార్డు చైర్మన్‌గా రెండున్నరేళ్లపాటు పదవీ బాధ్యతలు నిర్వర్తించారు. అనంతరం రాష్ట్ర వాల్మీకి ఫెడరేషన్ డైరెక్టర్‌గా ప్రభుత్వం నియమించింది. ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయ చౌదరితో పాటు గ్రామీణ గృహనిర్మాణ శాఖ మంత్రి కాలవ శ్రీనివాసులుతో కూడా సన్నిహిత సంబంధాలున్నాయి. గ్రామస్థాయిలో నెలకొన్న విభేదాలు, మనస్పర్థలే హత్యకు కారణమని భావిస్తున్నారు. ప్రశాంతంగా ఉన్న నియోజకవర్గంలో ఈ హత్య జరగడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

గోల్ల గ్రామంలో విషాదం

గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు

అండగా ఉంటాం.. అధైర్యపడకండి: ఎమ్మెల్యే ఉన్నం

కళ్యాణదుర్గం రూరల్: టీడీపీ నేత, రాష్ట్ర వాల్మీకి ఫెడరేషన్ డైరెక్టర్ గోల్ల బాదన్న హత్యతో గోల్ల గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది. గురువారం ఉదయం వాకింగ్‌కు వెళ్లిన బాదన్నను గుర్తుతెలియని వ్యక్తులు దారుణంగా హతమార్చారు. హత్య గురించి తెలుసుకున్న ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయ చౌదరి, తనయుడు మారుతీచౌదరి హుటాహుటిన అనంతపురానికి చేరుకుని ఆస్పత్రిలో వైద్య చికిత్స చేయించి కాపాడడానికి ప్రయత్నించారు. అయినా ప్రయోజనం లేకుండాపోయింది. బాదన్న మరణాన్ని వారు జీర్ణించుకోలేకపోయారు. ఒకానొక దశలో ఎమ్మెల్యే ఉన్నం కన్నీటి పర్యంతమయ్యారు. బాదన్న కుటుంబసభ్యులను ఎమ్మెల్యేతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు పరామర్శించి.. కుటుంబానికి అండగా ఉంటామని, అధైర్యపడవద్దని హామీ ఇచ్చారు. హత్య గురించి తెలుసుకున్న డీఎస్పీ వెంకటరమణ ఆధ్వర్యంలో పెద్దఎత్తున గ్రామంలో బందోబస్తు ఏర్పాటుచేశారు. ఇద్దరు సీఐలతో పాటు 11 మంది ఎస్‌ఐలు, సబ్ డివిజన్ పరిధిలోని పోలీసులు, స్పెషల్ పార్టీ సిబ్బందితో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. హత్య జరిగిన గంట వ్యవధిలోనే పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించి అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు.


రాయంపల్లిలో వైద్య శిబిరం ఏర్పాటు

రాయదుర్గంరూరల్ : మండలంలోని రాయంపల్లి గ్రామంలో జ్వరాలు ప్రబలుతుండటంతో ఆవులదట్ల పీహెచ్‌సీ వైద్యులు కార్తీక్ కుమార్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. గురువారం ఆంధ్రజ్యోతి దినపత్రిలో ప్రచురితమైన రాయంపల్లిలో డెంగీ అన్న వార్తకు స్పందిస్తూ ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ తిరిగి జ్వరాలతో బాధపడుతున్న రోగలను గుర్తించి శిబిరానికి చేర్చారు. వైద్యపరీక్షలు నిర్వహించి తగిన మందులు పంపిణీ చేశారు. గ్రామంలోని కాలనీలు, ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దోమలు పెరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని, రాత్రి వేళల్లో దోమతెరలు తప్పనిసరిగా వాడాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రామాంజినేయులు, ఏఎన్ఎంలు కొల్లమ్మ, మారుతేశ్వరి, చంద్రకళ పాల్గొన్నారు.

లోకల్ గైడ్ localguide

ఎమ్మెల్యే డైరీ

రాయదుర్గం : శాసనసభ్యులు, గ్రామీణ గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కాలవ శ్రీనివాసులు శుక్రవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు అనంతపురంలో ఉంటారు. మధ్యాహ్నం నంద్యాలకు బయలుదేరి వెళతారు.



రాయదుర్గం : మధు : ఫిదా
కేబీ ప్యాలెస్ : నక్షత్రం
ఎస్‌వీ సినిమాక్స్ : మాయామాల్
ఉద్దేహాళ్ : తాజ్ : ఏజెంట్ భైరవ
కణేకల్లు – శ్రీ చిక్కణ్ణేశ్వర : గౌతమ్‌నందా

సమస్యల పరిష్కారానికే గ్రామసభలు



గ్రామసభ నిర్వహిస్తున్న తహసీల్దార్

రాయదుర్గంరూరల్ : గ్రామాల్లో భూ సమస్యలు పరిష్కరించేందుకే రెవెన్యూ గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ నాగరాజు తెలిపారు. గురువారం మండలంలోని కొంతానపల్లి గ్రామంలో సర్పంచ్ హనుమంతు ఆధ్వర్యంలో రెవెన్యూ గ్రామసభలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ భూ సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమానికి ఆరు దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో వీఆర్వో హరి, రైతులు పాల్గొన్నారు.

బొమ్మనహాళ్‌లో : ఆయా రెవెన్యూ గ్రామాలలోనే రైతుల సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం గ్రామసభలు నిర్వహిస్తోందని, ఆర్ఐ ఎంఎం వీరేష్ అన్నారు. గురువారం ఏళంజి గ్రామంలో గ్రామసభ నిర్వహించారు. పొలాల వద్దనున్న సమస్యలను పరిష్కరించడంతో పాటు ఆన్‌లైన్ కోసం రెండు దరఖాస్తులు వచ్చినట్లు ఆర్ఐ తెలిపారు. కార్యక్రమంలో వీఆర్వో బాలాజీనాయక్, రెవెన్యూ సిబ్బంది, జన్మభూమి కమిటీ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా ఏకాదశి

బొమ్మనహాళ్: ఉంతకల్లులో వెలిసిన రుక్మిణీపాండురంగ స్వామి ఆలయంలో శ్రావణ మాస ఏకాదశిని ఘనంగా నిర్వహించారు. గురువారం ఉదయం నుంచి స్వామి వారికి పవిత్ర గంగాజలాభిషేకం, పంచామృతాభిషేకం, కుంకుమార్చన, పుష్పార్చనతో పాటు ఆకుపూజ, ప్రత్యేక అలంకరణలు చేశారు. మహామంగళ హారతి, అన్న సంతర్పణ చేశారు. భక్తులు విరివిగా పాల్గొని స్వామిని దర్శించుకొన్నారు. సాయంకాలం స్వామి పల్లకిసేవ, ధ్వజస్థంభంపై దీపారాధన, పాండురంగ భజనలు, శుక్రవారం తెల్లవారుజామున పాండురంగ స్వామి మాలధారణకు ఏర్పాట్లు చేశారు. పాండురంగ భజనమండలి కార్యనిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు.



పూజలందుకుంటున్న రుక్మిణి పాండురంగస్వామి

విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో వస్త్ర దుకాణం దగ్ధం

డీ హీరేహాళ్ : ఓబుళాపురం గ్రామంలోని బసప్పకు చెందిన వస్త్ర దుకాణంలో గురువారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో కావడంతో చీరలు, నూతన వస్త్రాలు కాలిపోయాయి. వివరాల మేరకు బసప్పకు చెందిన వస్త్ర దుకాణంలో షార్ట్‌సర్క్యూట్ కావడంతో వ్యాపారం కోసం ఉంచిన నూతన వస్త్రాలు, చీరలు అన్నీ కాలిపోవడం తో రూ. 1.50 లక్షలు మేర నష్ట వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు.



దుకాణంలో దగ్ధమైన నూతన వస్త్రాలు



రాయదుర్గం, బొమ్మనహాళ్‌లో విద్యార్థులకు ఎంఆర్ వ్యాక్సిన్ వేస్తున్న వైద్య సిబ్బంది

ప్రతి చిన్నారికీ ఎంఆర్ వ్యాక్సిన్ వేయించాలి

రాయదుర్గంరూరల్ : తొమ్మిది నెలల నుంచి 15 సంవత్సరాల పిల్లలకు తప్పనిసరిగా ఎంఆర్ వ్యాక్సిన్‌ను వేయించాలని ఆవులదట్ల పీహెచ్‌సీ వైద్యాధికారి కార్తీక్ కుమార్ సూచించారు. గురువారం మండలంలోని బీఎన్‌హళ్లి, రాయంపల్లి, వడ్రవన్నూరు, ఆయతపల్లి, బొమ్మక్కపల్లి గ్రామాలలో తట్టు, రూబెల్లా టీకాలను విద్యార్థులకు వేశారు. ఆయా పాఠశాలలో 767 మంది విద్యార్థులకు గాను 679 మంది విద్యార్థులకు టీకాలు వేశామన్నారు. విద్యార్థులు పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రామాంజినేయులు, ఏఎన్ఎంలు చంద్రకళ, కొల్లమ్మ, ఆదిలక్ష్మీ, పార్వతి, మారుతేశ్వరి పాల్గొన్నారు.

బొమ్మనహాళ్‌లో : బొమ్మనహాళ్, శ్రీధరఘట్ట పీహెచ్‌సీ పరిధిలోని ప్రాథమిక పాఠశాలలో ఎంఆర్ వ్యాక్సిన్ పంపిణీ చేసినట్లు డాక్టర్లు గౌతమి, ఈరణ్ణ తెలిపారు. బొమ్మనహాళ్ ప్రధాన ప్రాథమిక పాఠశాల, డీపెప్ పాఠశాల, వేద ఇంగ్లీష్ మీడియం స్కూలు, సిద్దలింగేశ్వర స్కూలు, కేజీబీవీ విద్యాలయంలో 917 మంది విద్యార్థులకు వ్యాక్సిన్ వేసినట్లు తెలిపారు. 92 శాతం వేసినట్లు డాక్టర్ గౌతమి తెలిపారు. శ్రీధరఘట్ట పీహెచ్‌సీ పరిధిలోని గోనేహాళ్, ఎల్‌బీనగర్, శ్రీరంగాపురం క్యాంపు పాఠశాలల్లోని 761 మంది విద్యార్థులకు గాను 680 మంది విద్యార్థులకు వ్యాక్సిన్ పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు బాబురాజు, క్రిష్ణవేణి, రమేష్, సీహెచ్‌వో ప్రదీప్‌కుమార్, లోకనాథ్, పాఠశాల హెచ్ఎంలు పాల్గొన్నారు.

టీడీపీ బూత్ కమిటీల ఏర్పాటు

రాయదుర్గంరూరల్ : మండలంలోని వివిధ గ్రామాల్లో గురువారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు పసుపులేటి రాజు ఆధ్వర్యంలో బూత్ కమిటీలను ఏర్పాటు చేశారు. మూడేళ్ల కాలంలో టీడీపీ అభివృద్ధి కార్యక్రమాలపై గ్రామప్రజలకు విస్తృతంగా ప్రచారం చేసే నేపథ్యంలో కొత్త కమిటీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సామాజిక పరంగా అందరికీ అనుకూలంగా బూత్ కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ గాజుల వెంకటేశులు, కౌన్సిలర్లు సంపత్‌కుమారి, పరశురామ్, నాయకులు వెంకటస్వామినాయుడు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పట్టణ అధ్యక్షుడు రాజు

బొమ్మనహాళ్‌లో : మండలంలోని దర్గాహోన్నూరు, గోవిందవాడ, బొమ్మనహాళ్, తదితర గ్రామాలలో గురువారం బూత్ కమిటీ కన్వీనర్లను ఎంపిక చేసినట్లు జడ్పీటీసీ సభ్యులు వాణీ జగన్నాథరెడ్డి, మాజీ జడ్పీటీసీ కే మల్లికార్జున, మండల కన్వీనర్ బలరామిరెడ్డి తెలిపారు. దర్గాహోన్నూరులో కుమ్మరి వన్నారెడ్డి, హిమాచల్, వెంకటేశులు, చిన్న వన్నూరప్ప, సోమశేఖర్‌లను ఎంపిక చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షుడు కే మల్లి, కేశప్ప, ముక్కన్న, మల్లికార్జున గౌడ్, రుద్రప్ప, బసప్ప, ముక్కణ్ణ పాల్గొన్నారు.

నేడు సాగునీటి సంఘం అధ్యక్షుల సమావేశం

కణేకల్లు : హెచ్చెల్సీ అతిథి గృహంలో శుక్రవారం ఉదయం తాగునీటి సంఘాల అధ్యక్షుల సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు హెచ్చెల్సీ డీఈ రామసంజన్న తెలిపారు. కణేకల్లు హెచ్చెల్సీ సబ్ డివిజన్ పరిధిలోని కణేకల్లు, బొమ్మనహాళ్ మండలాలకు చెందిన ఆయా సాగునీటి సంఘాల అధ్యక్షులు ఈ సమావేశానికి హాజరు కావాలన్నారు. ప్రధానంగా టీబీ డ్యాం పరిస్థితి దృష్ట్యా సాగునీటి విషయంపై చర్చలు జరిపేందుకు సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

డివిజన్ సర్వేయర్‌తో సర్వే చేయించేందుకు అంగీకారం

కణేకల్లు : పట్టణంలోని చిక్కణ్ణేశ్వరస్వామి దేవాలయం నుంచి దిగువ గేరి వరకు రోడ్డుకిరువైపులా ఉన్న ఆక్రమణలను తొలగించే ప్రక్రియలో భాగంగా సరిహద్దులు గుర్తించేందుకు 7వ తేదీన డివిజనల్ సర్వేయర్‌తో సర్వే చేయించేందుకు ఆర్డీవో రామారావు అంగీకరించినట్లు ఉప సర్పంచ్ ఆనంద్ తెలిపారు. బుధవారం కణేకల్లు పంచాయతీ కార్యాలయంలో రోడ్డుకిరువైపులా ఉన్న దుకాణదారులతో నిర్వహించిన సమావేశంలో పలువురు జిల్లా సర్వేయర్‌తో సర్వే చేయించిన అనంతరం ఆక్రమణలు తొలగించాలని కోరిన నేపథ్యంలో ఉప సర్పంచ్ ఈ విషయాన్ని ఆర్డీవోకు తెలియజేశారు.

ముర్రుపాలే బిడ్డకు మొదటి టీకా



భూపసముద్రంలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు, చిన్నారులు

రాయదుర్గంరూరల్ : బిడ్డపుట్టగానే గంటలోపు ముర్రుపాలు తాగించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సరోజమ్మ పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని అంగన్‌వాడీ కేంద్రాలలో అంతర్జాతీయ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా ర్యాలీని సూపర్‌వైజర్ భారతి ఆధ్వర్యంలో నిర్వహించారు. సీడీపీవో మాట్లాడుతూ తల్లిపాలు ముద్దు డబ్బా పాలు వద్దు అంటూ, తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో వర్కర్లు అరుంధతి, సునంద, ప్రమీళ పాల్గొన్నారు.

గుమ్మఘట్టలో : భూపసముద్రం గ్రామంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. గర్భవతులకు, బాలింతలకు పౌష్ఠికాహారం వినియోగంపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు రుద్రమ్మ, తదితరులు గర్భవతులకు సామూహిక సీమంతాలు చేపట్టారు.

ఎన్టీఆర్ గృహ లబ్ధిదారుల ఎంపికకు గ్రామసభలు

రాయదుర్గంరూరల్ : మండలంలోని అన్ని పంచాయతీ గ్రామాల్లో ఎన్టీఆర్ గృహాల నిర్మాణం కోసం లబ్ధిదారుల ఎంపికకు గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శ్రీనివాసులు, హౌసింగ్ ఏఈ జనార్ధన్ తెలిపారు. ఆయా గ్రామాలలో లబ్ధిదారుల ఎంపిక కోసం తహసీల్దార్, ఎంపీడీవో, ఈవోఆర్డీ ఆధ్వర్యంలో మూడు బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆయా గ్రామాలలో ఎన్టీఆర్ ఇళ్ల కోసం లబ్ధిదారులు గ్రామసభలలో దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. సొంత ఇల్లు, పక్కా ఇల్లు లేని వారు, ద్విచక్ర, త్రిచక్ర, నాలుగు చక్కాల వాహనాలు లేని వారు అర్హులన్నారు. ఆయా గ్రామాలలో ఉదయం 11 గంటల నుంచి 2 గంటల వరకు జరుగు కార్యక్రమంలో గ్రామ సచివాలయాలు, రచ్చబండల వద్ద పాల్గొని దరఖాస్తులు అందజేయాలని కోరారు. 4వ తేదీన వడ్రవన్నూరు, ఉడేగోళం, ఆర్‌బీవంక, రేకులకుంట, 5వ తేదీన వేపరాల, కెంచానపల్లి, చదం గొల్లలదొడ్డి, మల్లాపురం, 7న జుంజురాంపల్లి, చదం, మెచ్చిరి, 8న ఆవులదట్ల, డీ కొండాపురం, నాగిరెడ్డిపల్లి, 9న బీఎన్‌హళ్లి, గ్రామదట్ల, టీ వీరాపురం, కొంతానపల్లి, పల్లేపల్లి గ్రామాల్లో గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

బొమ్మనహాళ్‌లో : పల్స్ సర్వే ఆధారంగా ఆయా గ్రామాలలో ఎన్టీఆర్ ఇళ్ల నిర్మాణం కోసం లబ్ధిదారుల ఎంపిక ఉంటుందని తహసీల్దార్ శివయ్య, ఎంపీడీవో గంగన్న, ఎంఈవో భీమప్ప తెలిపారు. బొల్లనగుడ్డం, నేమకల్లు, గోవిందవాడ గ్రామాలలో ఎన్టీఆర్ ఇళ్ల నిర్మాణం కోసం లబ్ధిదారుల ఎంపికకు గ్రామసభ నిర్వహించారు. ప్రభుత్వం పంపిణీ చేసిన మార్గదర్శకాలతో పాటు గతంలో నిర్వహించిన సర్వే ప్రకారం ఆయా గ్రామాలలోని లబ్ధిదారులలో అర్హులైన వారిని గుర్తిస్తామన్నారు. కార్యక్రమంలో కార్యదర్శులు బాబు, నాగరాజు, శివయ్య, వీఆర్వోలు వంశీకృష్ణ, శ్రీరాములు, ప్రహల్లాదరావు, సర్పంచ్‌లు దేవేంద్రప్ప, లక్ష్మీ, జన్మభూమి కమిటీ సభ్యులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

గుమ్మఘట్టలో : ప్రభుత్వం గ్రామాల్లోని అర్హులైన నిరుపేదలందరికీ ఇళ్లు నిర్మించాలనే లక్ష్యంతో గ్రామాల్లో దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న కుటుంబాలన్నింటినీ గుర్తించే కార్యక్రమంలో అధికారులు నిమగ్నమయ్యారు. ఇందులో భాగంగా గురువారం ఎంపీడీవో మునెయ్య, తహసీల్దార్ అఫ్జల్‌ఖాన్, ఐసీడీఎస్ సీడీపీవో సరోజమ్మ, హౌసింగ్ ఏఈ గోవర్దన్‌రెడ్డిలు మూడు గ్రూపులుగా ఏర్పడి బేలోడు, 75 వీరాపురం, శిరిగేదొడ్డి గ్రామాల్లో ఇళ్లు లేని నిరుపేదలను గుర్తించేందుకు సర్వే చేపట్టారు. మండలం మొత్తం అన్ని గ్రామాల్లో సర్వే చేపట్టి జాబితాను సిద్ధం చేయనున్నట్లు హౌసింగ్ ఏఈ గోవర్దన్‌రెడ్డి తెలిపారు.



బొమ్మనహాళ్, గుమ్మఘట్టలో నిర్వహించిన గ్రామసభలో మాట్లాడుతున్న ఎంపీడీఓలు గంగన్న, మునెయ్య

నేడు జాబ్‌మేళా

అనంతపురం అర్బన్: నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించడం కోసం శుక్రవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు డీఆర్‌డీఏ పీడీ వెంకటేశ్వర్లు, జేడీఎం సూర్యనారాయణ తెలిపారు. ప్రముఖ ల్యాప్‌టాప్ తయారీ కంపెనీలో ఉద్యోగాలు కల్పించనున్నట్లు తెలిపారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు స్థానిక పంగల్‌రోడ్డులోని టీటీడీసీలో మేళా ఉంటుందన్నారు. 24 సంవత్సరాల వయస్సు ఉండి.. ఐటీఐ చేసిన అభ్యర్థులు ఇందుకు అర్హులన్నారు. బయోడేటా, రేషన్‌కార్డు, ఆధార్ కాపీలతో పాటు విద్యార్హత పత్రాలు తీసుకుని అభ్యర్థులు హాజరుకావాలన్నారు.

16 వరకూ ఇంటర్

అడ్మిషన్లు: ఆర్ఐఓ

అనంతపురం అర్బన్: ఈనెల 16 వరకూ ఇంటర్మీడియట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు ఆర్ఐఓ సురేష్‌బాబు తెలిపారు. తొలుత జూలై 31 వరకూ అవకాశం ఉండేదని, ప్రస్తుతం మరో పదిరోజుల పాటు గడువు పొడిగించామన్నారు. ఈ మేరకు ఇంటర్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారన్నారు. ఈ విషయం ప్రతి ప్రిన్సిపాల్ గమనించి పిల్లలను ప్రభుత్వ కళాశాలల్లో చేర్పించేలా చూడాలని ఆర్ఐఓ కోరారు.

ఐటీఐ మిగులు సీట్ల

భర్తీకి దరఖాస్తులు

అనంతపురం అర్బన్: ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలలో మొదటివిడత అడ్మిషన్లు పూర్తి కాగా.. మిగిలిన సీట్ల భర్తీ కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఐటీఐ ప్రిన్సిపాల్ గురువారం తెలిపారు. చేరదలచిన అభ్యర్థులు ఈ నెల 15వ తేదీలోగా దరఖాస్తులు సమర్పించాలన్నారు. అడ్మిషన్ల కౌన్సెలింగ్ గురించి ఆయా ఐటీఐలలో తెలుసుకోవాలన్నారు. ఎలాంటి కాల్ లెటర్లూ పంపబోరన్నారు.

15 వరకూ

ఇన్‌స్పైర్‌కు దరఖాస్తులు

అనంతపురం అర్బన్: ఇన్‌స్పైర్ అవార్డుల కోసం ఈనెల 15 వరకూ దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించినట్లు డీఈఓ లక్ష్మీనారాయణ తెలిపారు. తొలుత రిజిస్ట్రేషన్ చేసుకుని ఆ తర్వాత నామినేషన్లు పంపాలన్నారు. గతంలో రిజిస్ట్రేషన్ చేసుకున్నవారు కేవలం నామినేషన్లు మాత్రమే పంపాలన్నారు. నాణ్యమైన ప్రాజెక్టుల నమూనాలు ఎంపిక చేసుకుని ఆన్‌లైన్‌లో నమోదు చేసి పంపాలన్నారు. హెచ్ఎంలు ఇందుకు తగిన చర్యలు తీసుకోవాలని డీఈఓ సూచించారు.

సినిమా గైడ్

అనంతపురం

గంగ	: దర్శకుడు
గౌరి	: ఫిదా
గాయత్రి	: దండుపాళ్యం-2
గౌతమి	: వశం
త్రివేణి	: నక్షత్రం
తరంగిణి	: మాయామాల్
తేజస్విణి	: నిన్ను కోరి
శాంతి	: జబ్ హర్రి మీట్ సీజల్
సుధ	: గౌతమ్‌నంద
స్వప్న	: టక్కర్ ఫంచ్
శ్రీవెంకటేశ్వర	: గౌతమ్‌నంద
నీలిమా	: బహుబలి-2

జిల్లాలో కొనసాగిన ఆర్టీసీ ఉన్నతాధికారుల పర్యటన

అనంతపురం సప్తగిరిసర్కిల్: ఏపీఎస్ఆర్టీసీ ఉన్నతాధికారుల జిల్లా పర్యటన గురువారం కూడా కొనసాగింది. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(ఆపరేషన్స్, మార్కెటింగ్)జయరావు హిందూపురం, పెనుకొండ, చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ (ఆపరేషన్స్, మార్కెటింగ్)బ్రహ్మానందరెడ్డి తాడిపత్రి, అనంతపురం, డిప్యూటీ సీటీఎం(బస్‌పాస్)రాజారావు రాయదుర్గం, డిప్యూటీ సీటీఎం(మార్కెటింగ్) సత్యనారాయణ పుట్టపర్తి, డిప్యూటీ సీటీఎం(సెంట్రల్ షెడ్యూల్ సెక్షన్) ఎన్కే నాథ్ ఉరవకొండ డిపోల్లో పర్యటించారు. ఆయా డిపోల్లో నష్టాల్లో నడుస్తున్న రూట్లు, నష్టాలకు గల కారణాలు తదితర వాటిపై ఆరా తీసినట్లు ఆ శాఖ వర్గాల సమాచారం. నష్టాలు, అధికారుల పనితీరుపై ఉన్నతాధికారులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఇదే క్రమంలోనే పలువురు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం.

నేడు అధికారులతో సమావేశం..

జిల్లా పర్యటనకు వచ్చిన ఉన్నతాధికారులు శుక్రవారం జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించనున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. జిల్లా కేంద్రంలోని డ్వామా హాల్‌లో శుక్రవారం ఉదయం 11 గంటలకు సమావేశం నిర్వహించనున్నారు. జిల్లా అధికారులతో పాటు అన్ని డిపోల మేనేజర్లు, ట్రాఫిక్ సూపర్‌వైజర్లు పాల్గొననున్నారు.

నష్టాలు వస్తోంటే.. ఏం చేస్తున్నారు..?

డిపో అధికారులపై సీటీఎం ఆగ్రహం

అనంతపురం సప్తగిరిసర్కిల్: గతంలో ఎన్నడూలేని విధంగా డిపోలో నష్టాలు వస్తోంటే ఏం చేస్తున్నారంటూ డిపో అధికారులపై ఆర్టీసీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్(ఆపరేషన్స్, మార్కెటింగ్)బ్రహ్మానందరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన తాడిపత్రి డిపో పరిశీలన అనంతరం అనంతపురం డిపోకు గురువారం వచ్చారు. తొలుత నగరంలోని ప్రధాన కూడళ్లను సందర్శించి.. అక్కడ ఆర్టీసీ సిబ్బంది పనితీరు, బస్సుల రాకపోకలను పరిశీలించారు. అనంతరం డిపో కార్యాలయంలో డిపో నష్టాలపై సమీక్షించారు. ఏఏ రూట్లలో బస్సులు తిరుగుతున్నాయి, ఎన్ని కి.మీ తిరుగుతున్నాయి?, ఎంత ఆదాయం వస్తోంది? తదితర అంశాలు, రికార్డులు పరిశీలించారు. నష్టాలకు గల కారణాలు ఆరా తీశారు. ఈ ఏడాది విద్యార్థులకు ఎన్ని బస్సు పాసులు జారీ చేశారో అధికారులను ప్రశ్నించారు. తెలుగు వెలుగు బస్సులు ఏఏ రూట్లలో ఎన్ని ట్రిప్పులు తిప్పుతున్నారు? వంటి అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన డిపో అధికారులపై ఆగ్రహం వ్యక్తంచేశారు. పల్లెలకు సర్వీసులు సక్రమంగా నడపడం లేదని ఈ గణాంకాలను బట్టి తెలుస్తోందని డిపో అధికారులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీటీఎం గోపాల్‌రెడ్డి, డీఎం బాలచంద్రుడు, సీఐ వినయ్‌కుమార్ పాల్గొన్నారు.

స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

కలెక్టర్ వీరపాండ్యన్

అనంతపురం కలెక్టరేట్: స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వీరపాండ్యన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో స్వాతంత్ర్య దినోత్సవాల నిర్వహణపై సంబంధిత అధికారులతో గురువారం ఆయన సమీక్షించారు. గత ఏడాది తరహాలోనే ఈసారి కూడా వేడుకలు అంగరంగ వైభవంగా జరిగేలా చూడాలన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల విద్యార్థులు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులు త్రివర్ణాలతో కూడిన దుస్తులు ధరించేలా చొరవ చూపాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఆ మేరకు యూనిఫాం సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. వేడుకలకు హాజరయ్యే విద్యార్థులకు అల్పాహారం ఏర్పాటు చేయాలన్నారు. పరేడ్ మైదానంలో వేదికతోపాటు బ్యారికేడింగ్ తదితర ఏర్పాట్లపై ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మార్చ్‌ఫాస్ట్‌లో రెసిడెన్షియల్ విద్యార్థులు హాజరయ్యేలా చూడాలన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించేలా ఉండాలన్నారు. ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో స్టాల్స్ ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా కేంద్రంతో పాటు మండల, గ్రామ స్థాయిల్లోనూ త్రివర్ణ పతాకం ఎగురవేసి పంద్రాగస్టు వేడుకలు ఘనంగా నిర్వహించేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ రమామణి, జేసీ-2 ఖాజామొహిద్దీన్, ట్రైనీ కలెక్టర్ వెంకటేశ్వర్, డీఆర్ఓ మల్లీశ్వరి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

యాంటీ ర్యాగింగ్ స్క్వాడ్ నియామకం


ఎస్కేయూ వైస్ చాన్స్‌లర్

ఆచార్య రాజగోపాల్

ఎస్కేయూ: ఎస్కేయూలో ఆరుగురు ప్రొఫెసర్లతో కూడిన యాంటీర్యాగింగ్ స్క్వాడ్‌ను నియమించినట్లు ఎస్కేయూ వైస్ చాన్స్‌లర్ ఆచార్య రాజగోపాల్ పేర్కొన్నారు. ఎస్కేయూ కాన్ఫరెన్స్ హాల్‌లో గురువారం ప్రిన్సిపాళ్లు, వార్డన్లు, డిప్యూటీ వార్డన్లతో వీసీ ఆచార్య రాజగోపాల్ ర్యాగింగ్ నిరోధక చర్యలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్ట్స్, సైన్స్, ఇంజనీరింగ్, ఫార్మసీ ఎడ్యుకేషన్ కళాశాలల ప్రిన్సిపాళ్లు ఆయా కళాశాలల వారీగా ప్రత్యేక యాంటీ ర్యాగింగ్ కమిటీలను రూపొందించాలని, వాటిలో సభ్యులుగా విభాగాధిపతులు, ముగ్గురు ఫ్యాకల్టీ సభ్యులు, ముగ్గురు బోధనేతర సిబ్బంది, ఒక డిప్యూటీ వార్డన్ సభ్యులుగా ఉంటారన్నారు. ర్యాగింగ్‌కు పాల్పడితే జరిగే దుష్పరిణామాల గురించి పోస్టర్ల రూపంలో అన్ని విభాగాలు, వసతి గృహాల్లో ప్రదర్శించాలన్నారు. యాంటీ ర్యాగింగ్ స్క్వాడ్ ఎప్పుడైనా, ఏ హాస్టల్‌లోనైనా తనిఖీ చేసి ర్యాగింగ్‌కు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ లజపతిరాయ్, రిజిస్ట్రార్ సుధాకర్ బాబు, వివిధ కళాశాలల ప్రధానాచార్యులు, వార్డన్లు, డిప్యూటీ వార్డన్లు పాల్గొన్నారు.

మళ్లీ తెగిన ట్రాక్షన్‌లైన్ వైరు

మరమ్మతులు చేపట్టిన అధికారులు



గుంతకల్లు: స్థానిక రైల్వేస్టేషన్‌లోని ఐదవ ప్లాట్‌ఫాంపై విద్యుత్ లైన్‌కు ఉన్న కరెంటు వైరు మళ్లీ తెగింది. గురువారం సాయంత్రం ఐదున్నర గంటల ప్రాంతంలో విజయవాడ ప్యాసింజర్ వెళ్లిపోయిన అనంతరం విద్యుత్ లైన్ నుంచి ఓ కరెంటు వైరు వేలాడుతూ కనిపించింది. దీన్ని గమనించిన అధికారులు వెంటనే విద్యుత్ సరఫరా నిలిపివేసి.. వేలాడుతున్న వైరును మరో విద్యుత్ వైరుకు కలిపి కట్టి ఉంచారు. ట్రాక్షన్ లైన్ మరమ్మతులు చేయడానికి గుత్తి నుంచి ఎస్ఎస్ఈ డీహెచ్ఈ యంత్రాన్ని తెప్పించారు. సుమారు ఏడున్నర గంటల సమయంలో మరమ్మతులు చేపట్టారు. సమస్యను పరిష్కరించేంత వరకూ రైళ్లను 4వ నెంబరు ప్లాట్‌ఫాంలోకి మళ్లించారు.

కస్టమర్లకు క్వాలిటీ ఫుడ్ అందించడమే ధ్యేయం

అనంతపురం జిల్లాపరిషత్తు: నగర పరిధిలోని పోలీస్ వెల్ఫేర్ కాంప్లెక్స్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన సిద్ధార్థ బార్ అండ్ రెస్టారెంటును గురువారం ప్రారంభించారు. బార్ ప్రొప్రయిటర్ ఎన్.వెంకటేసులు తన కుటుంబసభ్యులతో కలిసి పూజాకార్యక్రమం నిర్వహించారు. అనంతరం బార్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకటేసులు మాట్లాడుతూ.. గతంలో రెస్టారెంట్ నిర్వహణపై ఉన్న అనుభవంతో సిద్ధార్థ బార్ అండ్ రెస్టారెంట్ ఏర్పాటు చేశామన్నారు. శుచి, శుభ్రత పాటించి నాణ్యమైన ఆహార పదార్థాలను కస్టమర్లకు అందించడమే తమ ధ్యేయమన్నారు. కార్యక్రమంలో కుటుంబసభ్యులు, బంధుమిత్రులు పాల్గొన్నారు.



సిద్ధార్థ బార్ అండ్ రెస్టారెంటు

దినఫలాలు

అదృష్టసంఖ్యలు : 4, 6

మేషరాశి: (మార్చి21-ఏప్రిల్20): బోధన, రవాణా రంగాల వారికి ప్రోత్సాహకరం. బంధుమిత్రులతో ఉల్లాసంగా గడుపుతారు. సాంకేతిక కోర్సుల్లో చేరేందుకు చేసే ప్రయత్నాలకు ఆటంకాలు ఎదురవుతాయి. కీలక సమాచారం అందుకుంటారు.

వృషభరాశి: (ఏప్రిల్21-మే20): రుణప్రయత్నాలు ఫలిస్తాయి. బీమా, గ్రాట్యుటీ, పింఛన్ వ్యవహారాలు ఒక కొలిక్కి వస్తాయి. ఇంటికి అవసరమైన నిధులు సర్దుబాటవుతాయి. కుటుంబ సభ్యుల ఆరోగ్యం కలవరపెడుతుంది.

మిథునరాశి:(మే21-జూన్21): జనసంబంధాలు విస్తరిస్తాయి. ప్రియతములతో ప్రయాణాలు, సంభాషణలు ఉల్లాసం కలిగిస్తాయి. భాగస్వామ్యాలు లాభిస్తాయి. విలువైన డాక్యుమెంట్లు కనిపించకుండా పోయే ప్రమాదం ఉంది.

కర్కాటకరాశి:(జూన్22-జూలై23): అదనపు ఆదాయం కోసం చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి. వైద్యం, పరిశ్రమలు, సేవల రంగాల వారికి ఆర్థికంగా లాభిస్తుంది. ఉద్యోగ ప్రయత్నాలకు ఆటంకాలు ఎదురయ్యే అవకాశాలున్నాయి.

సింహరాశి:(జూలై24-ఆగస్ట్23): విద్యార్థులు లక్ష్యాలు సాధిస్తారు. ప్రేమలు ఫలిస్తాయి. సృజనాత్మకంగా వ్యవహరించి లక్ష్యాలు సాధిస్తారు. చిన్నారుల విషయాల్లో శుభపరిణామాలు సంభవం. చిన్నారుల వైఖరి మనస్తాపం కలిగిస్తుంది.

కన్యారాశి: (ఆగస్ట్24-సెప్టెంబర్23): ఎంతో కాలంగా వాయిదా పడుతున్న పనులు పట్టుదలతో పూర్తి చేస్తారు. ఇంట్లో వేడుకలకు ఏర్పాట్లు చేస్తారు. కుటుంబ వ్యవహారాల కారణంగా అశాంతికి గురవుతారు

తులారాశి: (సెప్టెంబర్24-అక్టోబర్23): విద్యార్థులకు శుభప్రదం. విలువైన పత్రాలు అందుకుంటారు. కొత్త స్నేహాలు చిగురిస్తాయి. ప్రియతములతో ప్రయాణాలు ఆనందం కలిగిస్తాయి. రవాణా, బోధన రంగాల వారికి కొంత నిరుత్సాహకరంగా ఉంటుంది.

వృశ్చికరాశి: (అక్టోబర్24-నవంబర్22): ఆర్థిక విషయాల్లో పెద్దల సహకారం లభిస్తుంది. ప్రమోషన్లు, ఇంక్రిమెంట్లకు అవకాశం ఉంది. అదనపు ఆదాయం సమకూర్చుకుంటారు. బ్యాంకులు, చిట్‌ఫండ్‌ల రంగాల వారికి నిరుత్సాహకరంగా ఉంటుంది.

ధనూరాశి: (నవంబర్23-డిసెంబర్21): ఉన్నత విద్య, విదేశీ వ్యవహారాలకు అనుకూలం. కొత్త వ్యూహాలను సమర్థవంతంగా అమలు చేయగలుగుతారు. కళలు, సాహిత్యం, బోధన రంగాల వారికి ప్రోత్సాహకరం. సంకల్ప సిద్ధికి అధికంగా శ్రమించాలి.

మకరరాశి:(డిసెంబర్22-జనవరి21): పైచదువులు, విదేశీ ప్రయాణాలకు అవసరమైన నిధులు సర్దుబాటవుతాయి. రుణాలు మంజూరవుతాయి. పూర్వ మిత్రులను కలుసుకుంటారు. గతం గుర్తు చేసుకుంటారు. ఆరోగ్యం మందగించే అవకాశం ఉంది.


కుంభరాశి: (జనవరి22-ఫిబ్రవరి18): స్పెక్యులేషన్లు లాభిస్తాయి. ఆర్థిక పరిస్థితి ప్రోత్సాహకరంగా ఉంటుంది. వేడుకల్లో బంధుమిత్రులను కలుసుకుంటారు. షాపింగ్‌కు అనుకూలం. బహుమతులు ఇచ్చిపుచ్చుకుంటారు.

మీనరాశి: (ఫిబ్రవరి19మార్చి20): వృత్తి, వ్యాపారాల్లో సత్ఫలితాలు సాధిస్తారు. పైఅధికారుల సహకారంతో లక్ష్యాలు సాధిస్తారు. ఉన్నత పదవులు అందుకుంటారు. పెద్దల ఆరోగ్యం కొంత కలవరపెడుతుంది.

-బిజుమళ్ళ బిందుమాధవ శర్మ

టంగ్ ట్విస్టర్స్

1.There those thousand thinkers were thinking how did the other three thieves go through.
2. Rory the warrior and Roger the worrier were reared wrongly in a rural brewery.
3.Green glass globes glow greenly.



సూక్తి

నీ సందేహం తీర్చడానికి ఎవరూ లేనప్పుడు నీ అనుభవమే నీకు మార్గదర్శి

చుక్కలు కలపండి





గోల్ఫ్ సాధించాడు

హరియాణాలోని పానిపట్‌కు సమీపంలో 'ఇస్రానా' గ్రామం ఉంటుంది. ఆ గ్రామంలో అడుగుపెడితే.. యువకులంతా కుస్తీపట్లలో మునిగిపోయి ఉంటారు. కానీ ఓ కుర్రాడు మాత్రం గోల్ఫ్ స్టిక్ పట్టుకుని పచ్చిక మైదానంలో సాధన చేస్తుంటాడు. అతడి పేరే 'శుభమ్ జగ్లాన్'. చిన్న గ్రామంలో పుట్టిన ఆ కుర్రాడు, ప్రపంచ గోల్ఫ్ వేదికలపై సత్తా చాటుతున్నాడు. గోల్ఫ్ క్రీడలో దూసుకెళ్తున్న శుభమ్ ఇప్పటికే 100కు పైగా టోర్నీల్లో విజేతగా నిలిచాడు.

పానిపట్‌లోని ఇస్రానాలో ఎక్కువమంది రెజ్లింగ్ సాధన చేస్తుంటారు. శుభమ్ జగ్లాన్ కుటుంబ సభ్యుల్లో కూడా రెజ్లింగ్‌లో పట్టు సాధించిన వారున్నారు. కానీ శుభమ్ మనసు మాత్రం మట్టికోర్టు దాటి.. పచ్చిక మైదానం వైపు ఆలోచించింది. గోల్ఫ్ ఆటపై మక్కువ పెంచుకున్నాడు. సరిగ్గా అదే సమయంలో కపూర్‌సింగ్ అనే ఓ ఎన్‌ఆర్‌ఐ 'ఇస్రానా'లో గోల్ఫ్ అకాడమీని ప్రారంభించాడు. ఐదేళ్ల వయసులో గోల్ఫ్‌ను సాధన చేయడం ప్రారంభించాడు శుభమ్. రోజు రోజుకూ ఆటలో రాటుదేలుతూ జాతీయ, అంతర్జాతీయ గోల్ఫ్ టోర్నీల్లో సత్తా చాటాడు. ఇప్పటి వరకు దాదాపు 100కు పైగా టోర్నీల్లో విజేతగా నిలిచాడు.

"ఓ రోజు మా తాతయ్య మా గ్రామంలో కొత్తగా ప్రారంభించిన గోల్ఫ్ అకాడమీకి నన్ను తీసుకు వెళ్లాడు. అకాడమీ యజమాని కపూర్‌సింగ్‌తో నన్ను చేర్చుకోమని చెప్పాడు. అందరిలా నేను కూడా రెజ్లర్‌లా కాకుండా, మరేదైనా సాధించాలనే ఉద్దేశంతోనే ఆయన నన్ను గోల్ఫ్ అకాడమీలో చేర్చాడు. కానీ రెండు నెలల్లోనే ఆ అకాడమీని మూసి వేశారు. గోల్ఫ్‌లో నా ప్రతిభను గమనించిన కపూర్ సార్, ఊరి నుంచి తిరిగి వెళ్తూ మా నాన్నతో నన్ను ప్రోత్సహించమని చెప్పారు. దాంతో మా ఇంటి వెనుక ఉన్న కొద్ది స్థలాన్ని నాన్న బాగు చేసి, గోల్ఫ్ మైదానంలా తీర్చిదిద్దారు. ఓ కంప్యూటర్ కొనిచ్చి, యూట్యూబ్‌లో వీడియోలు చూస్తూ, గోల్ఫ్ ఆటను నేర్చుకోమన్నారు. వారాంతాల్లో కర్నాల్ గోల్ఫ్ కోర్సుల వద్దకు నన్ను తీసుకెళ్లేవారు. దేశంలోనే ప్రఖ్యాతిగాంచిన 'ఢిల్లీ గోల్ఫ్ క్లబ్'కు ఓ రోజు ప్రత్యేకించి నన్ను తీసుకు వెళ్లారు నాన్న. దాని వ్యవస్థాపకుడు అమిత్ లుత్రాను కలిసి, నా గురించి వివరించారు. నా ఆటతీరును పరిశీలించిన ఆయన నన్ను వాళ్ల క్లబ్‌లో చేర్చుకున్నారు. అదే నా జీవితంలో మలుపు తీసుకు వచ్చింది. అంతేకాదు నాన్న నన్ను ఢిల్లీలోని 'లక్ష్మణ్ పబ్లిక్ స్కూల్లో' చేర్పించాడు.నా మకాం ఢిల్లీకి మారింది. ఉదయం స్కూల్లో పాఠాలు, సాయంత్రం గోల్ఫ్ క్లబ్‌లో సాధన. కొన్ని సంవత్సరాలుగా ఇదే నా జీవితం. నేను సాధించిన విజయాలు నాన్న కష్టాన్ని మరిపించాయి. అవి నాన్నను ఎంతో సంతోషపెట్టాయి'

- శుభమ్ జగ్లాన్



నవ్వుల్ నవ్వుల్

తల్లి : రవీ! తమ్ముడు ఎందుకు ఏడుస్తున్నాడు రా?
రవి : నేనే కొట్టానమ్మా!
తల్లి : ఎందుకు రా వెధవా!
రవి : నేనేం అడిగినా వాడు జవాబు చెప్పడం లేదు అమ్మా!
తల్లి : తమ్ముడికి ఇంకా మాటలు రాలేదు కదరా!
రవి : మరి ఆ మాట చెప్పొచ్చు కదమ్మా!
తల్లి : !!!!!!!!!!!!!!!!






మీకుతెలుసా?


'బీవర్' అనే జంతువు దంతాలు ఎప్పటికీ పెరుగుతూనే ఉంటాయి.



బొమ్మ గీయండి



ఔనా!



- మనిషి తన జీవిత కాలంలో సుమారు 25 సంవత్సరాలు నిద్రకు కేటాయిస్తాడు.
- అందులో ఆరు సంవత్సరాలు కలలకే సరిపోతాయి. రోజుకు మూడు నుంచి ఏడు కలలొస్తాయట.
- నిద్ర లేచిన నిమిషం లోపే దాదాపు 90 శాతం కలలను మరిచిపోతాం.

శుభమ్ విజేతగా నిలిచిన ప్రధాన టోర్నీలు

- **2013** – వరల్డ్ మాస్టర్స్ ఆఫ్ జూనియర్ గోల్ఫ్
- **2015** – జూనియర్ వరల్డ్ గోల్ఫ్ చాంపియన్‌షిప్
- **2016** – యూరోపియన్ జూనియర్ చాంపియన్‌షిప్
- **2017** – వెస్ట్‌బెంగాల్ జూనియర్ బాయ్స్ గోల్ఫ్ చాంపియన్‌షిప్





పోటీపోటీగా విద్యార్థుల నృత్యప్రదర్శనలు

కళారంగానికి పుట్టినిల్లు..భారత్

-పోటాపోటీగా విద్యార్థుల నృత్యాలు - ఘనంగా యువజనోత్సవాలు

- జిల్లాయువజన సంక్షేమాధికారి వెంకటేశం

అనంతపురం వైద్యం: కళారంగానికి భారతదేశం పుట్టినిల్లని జిల్లా యువజన సంక్షేమాధికారి వెంకటేశం, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ రంగస్వామి పేర్కొన్నారు. జిల్లాయువజనసంక్షేమశాఖ, ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వ ర్యంలో స్థానిక ఆర్ట్స్ కళాశాలలో గురువారం డివిజన్ స్థాయి యువజనోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా వారు హాజరయ్యారు. తొలుత వివిధ కళాశాలల విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు, పోటాపోటీగా నృత్యాలు ప్రదర్శిం చారు. అందులో ప్రతిభ కనబరిచిన 8మందిని ఎంపికచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ విద్యతో పాటు కళల్లో రాణించి ఉన్నతస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కళలు వ్యక్తి సంపూర్ణ వికాసానికి దోహదం చేస్తాయన్నారు. ఇలాంటి కార్యక్రమాల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థినీవిద్యార్థులకు సెప్టెంబర్ 1న నిర్వహించే జిల్లాస్థాయి పోటీల్లో బహుమతులందజేయనున్నట్లు పేర్కొన్నారు. కాబట్టి ప్రతిఏటా నిర్వహించే యువజనోత్సవ కార్యక్రమాల్లో విద్యార్థులు పాల్గొని ప్రతిభ చాటాలని ఆకాంక్షించారు. అలాగే త్వరలో ప్రకృతి వైప రీత్యాలు అనే అంశంపై జిల్లాలోని వివిధ కళాశాలల విద్యార్థులకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో యువజన సర్వీసుల శాఖ అధికారులు భవానీ, బాషా, కళాశాల ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్లు శ్రీరాములు, సుధాకర్, జ్యోత్స్న, శ్రీధర్, సలీంబాషా, సాంస్కృతిక అధికారి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.





యువత కేరింత

7న కేతుగ్రస్థ చంద్రగ్రహణం

మూతపడనున్న ఆలయాలు

అనంతపురం టౌన్: భారత కాలమాన పంచాంగం ప్రకారం ఈనెల 7న కేతుగ్రస్థ చంద్రగ్రహణం ఏర్పడనుంది. సోమవారం ఉదయం 10.15 గంటలకు గ్రహణ వేదన ప్రారంభమవుతుంది. గ్రహణాన్ని పురస్కరించు కుని ఉదయం 10.30 గంటలకు జిల్లావ్యాప్తంగా గల ఆలయాలన్నింటినీ మూసివేసి, మరుసటిరోజు మంగళవారం ఉదయం 7 గంటలకు ఆలయ శుద్ధి, సంప్రోక్షణ అనంతరం ఆలయాలు తెరిచి పూజలు నిర్వహించను న్నారు. కాగా, రాత్రి 10.52గంటల నుంచి 12.53 గంటల వరకు సంపూర్ణ చంద్రగ్రహణం ఉంటుందని ఆర్ఎఫ్ రోడ్డు వెంకటేశ్వరస్వామి దేవా లయం ప్రధానార్చకుడు ఏఎల్ఎన్ శాస్త్రి పేర్కొన్నారు. శ్రవణానక్షత్రం మకరరాశివారిపై గ్రహణప్రభావం ఎక్కువగా ఉంటుందని తెలిపారు. గర్భవతులు సోమవారం సాయంత్రం 6 గంటల్లోగా అల్పాహారం తీసుకో వాలని, తర్వాత 8 గంటల వరకు పాలు, జ్యూస్ వంటి ద్రవపదార్థాలు తీసుకోవచ్చునన్నారు. అనంతరం రాత్రి ఒంటిగంట వరకూ ఎలాంటి పదార్థాలూ సేవించరాదని తెలిపారు.

పట్టు తప్పితే గోవిందా..!



లేపాక్షి: పాఠశాల వదలగానే ఇంటికి చేరుకోవాలనే ఆతృతలో ప్రమాద మని తెలిసినా.. జీపు వెనుక డ్రమ్ములపై వేలాడుతూ ప్రయాణిస్తున్న విద్యార్థుల ఉదంతమిది. స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు పాఠ శాల వదలగానే అటు నుంచి డ్రమ్ముల లోడుతో ఓ వాహనం రాగా.. దాన్ని ఆపి డ్రమ్ములపై కూర్చొని.. కొంతమంది వేలాడుతూ ప్రయాణిం చారు. ఇలాంటి ప్రయాణాలు ప్రమాదకరమంటూ పోలీసులు, ఉపాధ్యా యులు విద్యార్థులకు అవగాహన కల్పించాల్సిన అవసరముంది.

పదేళ్ల పోరాట ఫలితమిది..

పండిట్లకు దక్కిన ఉద్యోగోన్నతులు

భాషాపండితుల్లో ఆనందభాష్పాలు

అనంతపురం అర్బన్: పదేళ్ల పోరాటానికి ఫలితం లభించింది. పండిట్లకు పదోన్నతులు లభించాయి. స్థానిక జిల్లా సైన్స్‌సెంటర్‌లో గురువారం అప్‌గ్రేడ్ పోస్టుల కోసం లాంగ్వేజ్ పండిట్లకు విద్యాశాఖ పదోన్నతుల కౌన్సెలింగ్ నిర్వహించింది. డీఈఓ లక్ష్మీనారాయణ పర్యవేక్షణలో కౌన్సెలింగ్ చేపట్టి పదో న్నతులు కల్పించారు. మొత్తం 93 మందికి పదోన్నతులు లభించాయి. తెలు గులో 60 మందికి దక్కగా.. వారిలో జడ్పీ పండిట్లు 58 మంది, ప్రభుత్వ పండిట్లు ఇద్దరు ఉన్నారు. అలాగే హిందీలో 28 మందికి ఎస్ఏ హిందీగా పదోన్నతులు లభించాయి. ప్రభుత్వ ఉర్దూలో ఇద్దరికి, జడ్పీ ఉర్దూలో ఇద్ద రికి, జడ్పీ సంస్కృతంలో ఒకరికి చొప్పున పదోన్నతులు లభించాయి. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న పండిట్లకు పదోన్నతులు లభించడంతో ఆనం దంతో వారు ఉప్పొంగిపోయారు. విద్యాశాఖాధికారులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, మీడియాకు కృతజ్ఞతలు తెలియజేశారు.



పదోన్నతులు కల్పిస్తున్న డీఈఓ లక్ష్మీనారాయణ

తుంగభద్ర జలాశయ సమాచారం

3-8-17	ప్రస్తుతం	గత ఏడాది
నీటిమట్టం (అడుగులు)	1612.83	1612.57
సామర్థ్యం (టీఎంసీలు)	40. 955	40. 409
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	7, 315	5, 561
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	120	7, 641



కల సాకారమయింది

ఎర్రిస్వామి, జిల్లా అధ్యక్షుడు, పండిత పరిషత్

దాదాపు 18 ఏళ్లుగా మాకు (పండిట్లు) అన్యాయం జరుగుతూవచ్చింది. దానిపై పదేళ్ల పాటు పోరాటాలు చేశాం. చివరికి ప్రభుత్వం మాపై దయచూపింది. పదోన్న తుల కల్పనకు జీవోలు జారీ చేసింది. ఆ మేరకు ఇప్పుడు విద్యా శాఖ పదోన్నతలులు కల్పించడం ఆనం దంగా ఉంది. పండిట్ల తరపున సీఎంకు, మంత్రికి ప్రత్యేక కృజ్ఞ తలు తెలుపుతున్నాం.



చిరకాల కోరిక నెరవేరింది

శివానందరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర భాషోపాధ్యాయ సంఘం

చిరకాల కోరిక ఇప్పుడు నెరవేరింది. కొన్నేళ్లుగా పదోన్నతుల కోసం ఎస్ఎల్‌టీఏ పోరాడుతూ వస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై మా నాయకుడు ఒంటేరు శ్రీనివాసులురెడ్డి ఒత్తిడి పెడుతూ వచ్చారు. చివరికి మా పోరాటం ఫలించింది. పదోన్న తులు లభించడం ఆ నందంగా ఉంది. ఇందు కు సహకరించిన ప్రజా ప్రతినిధులు, సంఘా లు, అధికారులకు రుణ పడి ఉంటాం.



హౌసింగ్‌బోర్డులో చోరీ

అనంతపురం జిల్లా పరిషత్తు : నగరంలోని హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన శ్రీ తేజ ఇంట్లో చోరీ జరిగింది. భార్య గర్భిణి కావడంతో ప్రసవం కోసం కుటుంబసభ్యులంతా గత నెల 24వ తేదీ కర్నూలుకు వెళ్లారు. అదే సమయంలో అదును చూసిన దొంగలు ఇంట్లో చొరబడి రూ.2.50లక్షల విలువైన 85 గ్రాముల బంగారం అపహరించారు. గురువారం ఇంటికి వచ్చిన కుటుంబసభ్యులు చోరీ జరిగినట్లు గుర్తించారు. ఘటనపై శ్రీ తేజ వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

అనంతపురం టౌన్ : శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని స్థానిక ఐదో రోడ్డు కనకదుర్గ భవాని దేవాలయంలో శుక్రవారం ఉదయం సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకురాలు హైమావతి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని, భక్తులు తరలిరావాలని కోరారు.

శివాలయం ట్రస్టుపై ముగిసిన విచారణ

అనంతపురం టౌన్ : స్థానిక మొదటి రోడ్డు కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయం ట్రస్టు సభ్యులపై దేవాదాయశాఖ అధికారుల విచారణ గురువారం ముగిసింది. సభ్యులు సహకరించ లేదని అభియోగిస్తూ ఛైర్‌పర్సన్ సంధ్యామూర్తి గత ఏప్రిల్‌లో రాజీనామా చేశారు. ఈ నేపథ్యంలో స్థానిక హెచ్చెల్సీ కాలనీలోని ఆ శాఖ సహాయ కమిషనర్ కార్యాలయంలో విచారణాధికారి లక్ష్మినారాయణ సమక్షంలో ట్రస్టు సభ్యులపై విచారణ చేపట్టారు. కాగా విచారణకు ఛైర్‌పర్సన్ గైర్హాజరయ్యారు. అభియోగాలు మోపబడ్డ సభ్యులు స్వప్న, నరసింహామూర్తిలు హాజరయ్యారు. దీంతో వివరణ మాత్రమే తీసుకుని ఉన్నతాధికారులకు నివేదిక పంపారు.

8న వార్షికోత్సవ వేడుకలు

అనంతపురం టౌన్ : స్థానిక హెచ్చెల్సీ కాలనీ రామకృష్ణ మఠంలో ఈనెల 8న రామకృష్ణ ఆధ్యాత్మిక ఉద్యానకేంద్రం 14వ వార్షికోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రతినిధులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, భజనలు నిర్వహిస్తామని తెలిపారు. వేడుకలు జయప్రదం చేయాలని కోరారు.

'పెన్షన్ ఇవ్వకుండా వేధిస్తున్నారు'

అనంతపురం ప్రెస్‌క్లబ్ : తనకు రావాల్సిన పెన్షన్‌ను ట్రెజరీ అధికారులు ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఇరిగేషన్ శాఖ రిటైర్డ్ వైర్లెష్ ఆపరేటర్ డీ రామదాసు ఆరోపించారు. గురువారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. అకౌంటెంట్ జనరల్ రిమైండర్ లెటర్ పంపినా ట్రెజరీ అధికారులు వేధిస్తున్నారన్నారు. ఇప్పటికైనా స్పందించి న్యాయం చేయాలని కోరారు.

తొమ్మిది మందిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు

అనంతపురం జిల్లా పరిషత్తు : నగరంలోని పలు ప్రాంతాల్లో మద్యం తాగి వాహనాలు నడిపిన తొమ్మిది మందిపై బుధవారం రాత్రి పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. రెండు గంటల పాటు ట్రాఫిక్ విధులు, రూ.1500 జరిమానా విధించారు. ట్రాఫిక్ ఎస్‌ఐలు లక్ష్మినారాయణ, నాగేంద్ర, ఆర్ఎస్‌ఐలు వీరేష్, సురేష్, ఏఎస్ఐ అజయ్ ఆధ్వర్యంలో సిబ్బంది బృందంగా ఏర్పడి తనిఖీలు చేశారు. నగరానికి చెందిన చెన్నప్ప, శ్రీకాంత్, సాయికుమార్, యోగానందరెడ్డి, హరి, నాగేంద్రచారి, అశోక్, సంగప్ప, రామకృష్ణ మద్యం తాగి వాహనాలు నడుపుతున్నట్లు నిర్ధారణ కావడంతో వారిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. వారిని స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరచగా మెజిస్ట్రేట్ క్రిష్ణమూర్తి ఒక్కొక్కరికి రూ.1500జరిమానా, మధ్యాహ్నం ట్రాఫిక్ క్రమబద్ధీకరణ విధులు నిర్వహించేలా ఆదేశాలు జారీ చేశారు.

10న పెన్నార్ భవన్ ముట్టడి

అనంతపురం ప్రెస్‌క్లబ్ : గిరిజన గురుకుల పాఠశాలల్లో సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 10వ తేదీన గిరిజన విద్యార్థి సమాఖ్య ఆధ్వర్యంలో పెన్నార్ భవన్‌ను ముట్టడిస్తున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు మల్లికార్జున నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 9 గురుకుల పాఠశాలల్లో నీరు, మరుగుదొడ్లు, మౌలిక సౌకర్యాలు, టీచర్లు లేరన్నారు. సమస్యల పరిష్కారం కోరుతూ చేపట్టే ముట్టడికి జిల్లాలోని గిరిజన విద్యార్థులు, ఉద్యోగులు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

15న శ్రీకృష్ణ జయంతి వేడుకలు

అనంతపురం ప్రెస్‌క్లబ్ : ఈ నెల 15వ తేదీన నగరంలోని శ్రీనక్కా రామారావు యాదవ భవనంలో శ్రీకృష్ణజన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు జిల్లా యాదవ మహాసభ నాయకులు నరసింహయాదవ్ తెలిపారు. గురువారం యాదవ భవన్‌లో సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జయంతి సందర్భంగా యాదవ భవన్‌లో 15న ఉదయం 8.30 గంటలకు గోపూజ, శ్రీకృష్ణుడికి అభిషేకం, 10.30 గంటలకు మంగళహారతి చేస్తామన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వేలూరు వెంగన్న హాజరై శ్రీకృష్ణతత్వ ఉపన్యాసం చేస్తారన్నారు. అనంతరం యాదవ విద్యార్థులకు యాదవ ప్రముఖుల చేత ప్రతిభా పురస్కార అవార్డులు ప్రదానం చేస్తారన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ యాదవ్, నాయకులు హరినాథ్ యాదవ్, చంద్రమోహన్ యాదవ్ పాల్గొన్నారు.

ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకం పేదలకు వరం : మేయర్


ఇంటిని ప్రారంభిస్తున్న మేయర్ స్వరూప

అనంతపురం వైద్యం :ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకం పేదలకు వరమని నగర మేయర్ స్వరూప పేర్కొన్నారు. స్థానిక ఇందిరాగాంధీ నగర్‌లో గురువారం ఎన్టీఆర్ పక్కా ఇంటిని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అర్హులైన పేదలందరికి ఇల్లు నిర్మించాలనే లక్ష్యంతో ముందుకెళ్తోందన్నారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన, గ్రామీణ గృహ నిర్మాణ పథకాల కింద లబ్ధిదారులను ఎంపిక చేస్తామన్నారు. అర్హులైన పేదలందరూ దరఖాస్తు చేసువాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సరళ, రహమత్‌బీ, బంగారక్క, కృష్ణకుమార్ తదితరలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సేవలు సద్వినియోగం చేసుకోండి


ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

అనంతపురం వైద్యం : అంగన్‌వాడీ సేవలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ ఇన్‌చార్జి పీడీ క్రిష్ణకుమారి పేర్కొన్నారు. అనంతపురం అర్బన్ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని 1, 2, 3, 4, 5 సెక్టార్ల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి పీడీ మాట్లాడారు. పుట్టిన పిల్లలకు ముర్రుపాలు తాగించాలని, ఆరోగ్యవంతంగా ఎదుగుతూ చురుకుదనంగా ఉంటారన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహారాన్ని గర్భిణిలు, బాలింతలు, చిన్నారులు, కిషోర బాలికలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బంది, బాలింతలు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

చైనా వస్తువులు వ్యతిరేకిద్దాం : ఆర్ఎస్ఎస్

అనంతపురం టౌన్ : మన దేశంలో చైనా వస్తువులేవీ ప్రవేశించకుండా వ్యతిరేకిద్దామని ఆర్ఎస్ఎస్ విభాగ్ కార్యవాహ్ రాఘవేంద్ర పిలుపునిచ్చారు. గురువారం స్వదేశీ జాగరణ్ మంచ్ ఆధ్వర్యంలో స్థానిక కోర్టు రోడ్డులోని ఆర్ఎస్ఎస్ కార్యాలయంలో 'చైనా వస్తువులకు వ్యతిరేకంగా ఉద్యమం' పేరుతో కరపత్రాలు ఆవిష్కరించారు. ఐక్యరాజ్యసమితిలో భారత సభ్యత్వాన్ని వ్యతిరేకిస్తున్న చైనాను మనమూ వ్యతిరేకించాలన్నారు. చైనాను శత్రుదేశంగా భావించి ప్రతిపౌరుడు చైనా వస్తువులు చౌకధరలకు వస్తున్నాయని భావించి కొనడం ద్వారా గ్యారంటీలేని వస్తువులతో మన దేశ పర్యావరణాన్ని నాశనం చేయడమేనన్నారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు జగదీష్, విజయ్, తాళంకి ప్రసాద్, నిషాంత్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

మృతి చెందిన వైద్యుడి కుటుంబానికి చేయూత

- రూ1.8 లక్షల ఆర్థిక సహాయం
- ప్రభుత్వ వైద్యుల సంఘం సేవలు అభినందనీయం : కేఎస్ఎస్ వెంకటేశ్వరరావు


చెక్కును అందజేస్తున్న వైద్యులు

అనంతపురం వైద్యం : ప్రభుత్వ వైద్యులుగా పనిచేస్తూ అనారోగ్యంతో మృతి చెందిన కుటుంబాలకు ఏపీ ప్రభుత్వ వైద్యుల సంఘం స్వచ్ఛందంగా సేవలందించడం అభినందనీయమని ప్రభుత్వ సర్వజనాస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ కేఎస్ఎస్ వెంకటేశ్వరావు పేర్కొన్నారు. కొంతకాలంగా అనస్తీషియా విభాగంలో వైద్యుడిగా పనిచేస్తు అనారోగ్యంతో మృతి చెందిన డాక్టర్ అనిల్‌కుమార్ కుటుంబానికి స్థానిక ప్రభుత్వాస్పత్రిలోని ఏపీ ప్రభుత్వ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో రూ1.8 లక్షల ఆర్థిక సహాయం గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి సూపరింటెండెంట్ మాట్లాడుతూ అనారోగ్యంతో డాక్టర్ అనిల్‌కుమార్ మృతి చెందడం బాధాకరమన్నారు. సంఘం అధ్యక్షుడు డాక్టర్ రామస్వామి నాయక్, వీరభద్రయ్య మాట్లాడుతూ వైద్యులకు ఎలాంటి సమస్య వచ్చినా సంఘం అండగా ఉంటుందని తెలియజేశారు. కార్యక్రమంలో డాక్టర్లు జగన్‌మోహన్‌రెడ్డి, వైఎంఎస్ ప్రసాద్, హరిహర ప్రసాద్, రాంకిషోర్, మురళీక్రిష్ణ, నవీన్‌కుమార్, నాగేంద్ర, ఎండ్లూరి ప్రభాకర్, హేమలత, శ్రీదేవి, నీలిమా, శివశంకర్‌నాయక్, శ్రీనివాసులు, సైదన్న, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వర్సిటీలో ర్యాగింగ్ భూతాన్ని తరిమేయండి

ఎస్కేయూ : శ్రీకృష్ణదేవరాయ యూనివర్శిటీలో ర్యాగింగ్ భూతాన్ని తరిమివేయాలని విద్యార్థి సంఘాల నాయకులు వైస్‌చాన్సలర్ ఆచార్య రాజగోపాల్‌కు గురువారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా విద్యార్థి నాయకుడు పులిరాజు మాట్లాడుతూ యాంటీర్యాగింగ్ కమిటీలో విద్యార్థి సంఘం నాయకులకు చోటు కల్పించాలన్నారు. సైన్స్, ఇంజనీరింగ్, ఎంబీఏ విభాగాల్లో ర్యాగింగ్‌కు ఎక్కువ అవకాశం ఉందన్నారు. సంబంధిత విభాగాల్లో విద్యార్థులకు కౌన్సెలింగ్ నిర్వహించాలన్నారు. ఈ సందర్భంగా వైస్ చాన్సలర్ మాట్లాడుతూ వర్సిటీలో ర్యాగింగ్‌కు చోటే లేదన్నారు. ఇందుకోసం విద్యార్థులు సహకరించాలన్నారు. యంత్రాంగం కట్టుదిట్టమైన చర్యలు చేపట్టిందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పులిరాజు, జయచంద్రారెడ్డి, క్రాంతికిరణ్, నరేష్ పాల్గొన్నారు.

ఎస్కేయూ వీసీకి అభినందనల వెల్లువ

ఎస్కేయూ : ఎస్కేయూకు అటల్ ఇంక్యుబేషన్ కేంద్రం రావడానికి కృషి చేసిన వీసీ రాజగోపాల్‌ను విద్యార్థి సంఘాల నాయకులు గురువారం అభినందించారు. వేమనా అధ్యయన అభివృద్ధి కేంద్రం అధ్యక్షుడు శరత్‌కుమార్ రెడ్డి, ఎస్టీ, ఎస్సీ, బీసీ, మైనార్టీ ఐక్యవేదిక అధ్యక్షుడు శ్రీనివాస్ నాయక్, ఏబీవీపీ నాయకులు, హరికృష్ణ, మల్లికార్జున నాయక్, పవన్‌కళ్యాణ్, సూర్య మాట్లాడారు. యువత ఇంక్యుబేషన్ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

బీసీ రిజర్వేషన్ల సాధనకు చలో ఢిల్లీ

అనంతపురం ప్రెస్‌క్లబ్ : బీసీ ఉద్యోగులకు పదోన్నతుల్లో రిజర్వేషన్లు కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య ఆధ్వర్యంలో ఈ నెల 5న చలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆవుల చంద్రశేఖర్ యాదవ్ తెలిపారు. గురువారం కమలానగర్‌లోని సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాటాడారు. బీసీల రాజ్యాంగబద్ధమైన వాటా కోసం కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు అన్ని రాజకీయ పార్టీ నేతలతో చర్చిస్తామన్నారు. సమస్యల పరిష్కారానికి ఢిల్లీలో నిర్వహించే నిరసనకు జిల్లా నుంచి బీసీ ఉద్యోగులు, విద్యార్థి, యువజన సంఘాల నాయకులు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు రాజేష్, నారాయణస్వామి, రవికుమార్, తిరుపాల్ పాల్గొన్నారు.

ఏబీవీపీ చెన్నై విశ్వవిద్యాలయం ఇన్‌చార్జిగా హరికృష్ణ

ఎస్కేయూ : అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఎస్కేయూ ఇన్‌చార్జిగా ఉన్న హరికృష్ణను చెన్నై విశ్వవిద్యాలయాల థింక్ ఇండియా విభాగానికి ఇన్‌చార్జిగా బాధ్యతలు ఇచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. గతంలో ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా బాధ్యతలు నిర్వహించారు. ఈ సందర్భంగా హరికృష్ణకు ఎస్కేయూ ఏబీవీపీ నాయకులు అభినందనలు తెలిపారు.

జేఎన్‌టీయూ ఫైనాన్స్ ఆఫీసర్‌గా రంగానాయక్?

జేఎన్‌టీయూ : జేఎన్‌టీయూ ఫైనాన్స్ ఆఫీసర్‌గా రంగనాయక్ నియామకానికి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేయనున్నట్లు అధికారిక సమాచారం. రంగానాయక్ ఓటీపీఆర్‌ఐలో డిప్యూటీ రిజిస్ట్రార్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఫైనాన్స్ ఆఫీసర్ కోసం వర్సిటీలో గట్టి పోటీ నెలకొంది. ఇందుకోసం కమిటీ కూడా నియమించారు. కమిటీ సూచనల మేరకు తుదిగా వర్సిటీలో సీనియర్ అయిన రంగానాయక్‌ను నియమించనున్నారు.

బీఎడ్ కళాశాలల అధ్యాపకుల సర్టిఫికెట్ల పరిశీలన

ఎస్కేయూ : ఎస్కేయూ అనుబంధ కళాశాలల బీఈడీ అధ్యాపకుల సర్టిఫికెట్ల పరిశీలన వర్సిటీలోని సీడీసీ కార్యాలయంలో గురువారం ప్రారంభమైంది. మూడు రోజుల పాటు ఈ ప్రక్రియ కొనసాగుతుందని సీడీసీ డీన్ వేణుగోపాల్ రావు తెలిపారు. వర్సిటీకి అనుబంధంగా 28 బీఈడీ కళాశాలలున్నాయి. ఉన్నత విద్యామండలి ఆదేశాల మేరకు ప్రతి కళాశాల అధ్యాపకుడి సర్టిఫికెట్లు పరిశీలన చేస్తున్నారు. 100 మంది అధ్యాపకుల సర్టిఫికెట్లను గురువారం పరిశీలించారు.

ఏఐటీయూసీలోకి హమాలీల చేరిక

అనంతపురం సెంట్రల్ : నగరంలోని పాతూరు గాంధీ మార్కెట్‌లో పనిచేస్తున్న ఏ బ్యాచ్‌కు చెందిన హమాలీలు ఏఐటీయూసీలోకి చేరారు. గురువారం స్థానిక హమాలీ యూనియన్ కార్యాలయంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రాజారెడ్డి సమక్షంలో యూనియన్‌లోకి చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హమాలీలు ఐకమత్యంగా సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు. అనంతరం పాతూరు మార్కెట్ హమాలీ యూనియన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు.

ఆఫీస్ ఆటోమేషన్ కోర్సుకు
దరఖాస్తు చేసుకోండి

అనంతపురం సప్తగిరిసర్కిల్: రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆఫీస్ ఆటోమేషన్ కంప్యూటర్ కోర్సుకు ఈ నెల 10వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని విజయ కంప్యూటర్ ఇన్‌స్టిట్యూట్ ప్రిన్సిపాల్ వెంకటేశులు పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సెప్టెంబర్ 5న కోర్సుకు సంబంధించి పరీక్షలు ఉంటాయన్నారు. పది, ఇంటర్, డిగ్రీ పూర్తి చేసినవారు అర్హులన్నారు. ఏపీపీఎస్సీ, గ్రూప్-2, ట్రెజరీస్ అండ్ అకౌంట్స్ డిపార్ట్‌మెంట్‌లలో సీనియర్ అకౌంటెంట్, జూనియర్ అకౌంటెంట్, పంచాయితీరాజ్ ఉద్యోగాలకు ఆఫీస్ ఆటోమేషన్ కోర్సును ప్రభుత్వం అర్హతగా నిర్ణయించిందన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు కోర్సుకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9440323907 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రామ్మోహన్‌కు ఘనసన్మానం

అనంతపురం కలెక్టరేట్ : హంద్రీనీవా సుజల స్రవంతి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రామ్మోహన్ తూర్పుగోదావరి జిల్లా రంపచోడవరం ఆర్డీఓగా బదిలీ అయిన విషయం తెలిసిందే. గురువారం ఆయన రిలీవ్ అయ్యారు. ఈ సందర్భంగా రెవెన్యూ ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నీలకంఠారెడ్డి, కోశాధికారి కుళ్లాయప్ప,కార్యాలయ సిబ్బంది ఆయనకు పూల మాలలు వేసి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. కాగా పీఏబీఆర్ స్పెషల్ డిప్యూటీ శ్రీనివాసులును ఇన్‌చార్జి అధికారిగా నియమించారు.

ఉద్రిక్తత నడుమ ఇళ్లు, గుడిసెల కూల్చివేత





ఇళ్లు కూల్చేయడంతో మిగిలిన శిథిలాలు, ఆందోళనకు దిగిన బాధితులు

అనంతపురం వైద్యం : నగరంలోని జిల్లా కలెక్టర్ కార్యాలయం సమీపంలోని కొన్ని ఇళ్లను, గుడిసెలను అధికారులు గురువారం ఉదయం కూల్చివేశారు. అధికారపార్టీకి చెందిన కార్పొరేటర్ ఉమామహేశ్వరరావు తన డివిజన్ పరిధిలోని నివాసాలను కూల్చడం అన్యాయమంటూ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానిక ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి అధికారులను పురమాయించి కూల్చివేశారంటూ విమర్శించారు. కాగా నిబంధనలకు విరుద్ధంగా ఇళ్లు, గుడిసెలు నిర్మించారని ఆర్డీవో మలోల, రెవెన్యూ అధికారులు, సిబ్బంది పోలీసుల బలగాలతో తెల్లవారుజామున విజయనగరకాలనీకి చేరుకున్నారు. అప్పటికప్పుడే నివాసాలకు నోటీసులు అతికించారు. యంత్రాలతో నివాసాలను తొలగించే ప్రయత్నం చేశారు. బాధితులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. లక్షలు పెట్టి ఇళ్లు నిర్మించుకున్నామని, కూల్చవద్దని బతిమాలుకున్నారు. ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా హడావుడిగా తొలగించడం అన్యాయమని అధికారులకు వివరించారు. ఈ నేపథ్యంలో అధికారులు, స్థానికులకు మధ్య తోపులాట జరిగింది. పోలీసులు జోక్యం చేసుకున్నారు. ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన బాధితులను ప్రభుత్వాసుపత్రికి తరలించారు. విషయం తెలియడంతో విజయనగర కాలనీ వాసులు పెద్దఎత్తున ఆసుపత్రికి ప్రాంగణానికి చేరుకుని న్యాయం చేయాలంటూ ఆస్పత్రి ఎదుట రోడ్డుకు అడ్డంగా అందోళన చేశారు. టీడీపీ నాయకులు జయరాం నాయుడు, కోగటం విజయభాస్కర్‌రెడ్డి, శ్రీకృష్ణ మద్దతు తెలిపారు. నిర్మాణాలను తొలగించడం అన్యాయమన్నారు. దాదాపు రెండు గంటలపాటు ఆస్పత్రి ఎదుట ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. డీఎస్పీ మల్లికార్జునవర్మ బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇవ్వండంతో పరిస్థితి సద్దుమణిగింది. అనంతరం కలెక్టర్ కార్యాలయం ఎదుట కూడా బాధితులు ఆందోళన చేశారు.

మేమంత పేదలమని, కష్టపడి ఇళ్లు కట్టుకుంటే నోటీసులు కూడా ఇవ్వకుండా ఉన్నఫళంగా నివాసాలను కూల్చేస్తున్నారని బాధితులు వాపోయారు. కాగా విజయనగరకాలనీ స్థలానికి సంబంధించి ప్రభుత్వ నిబంధనలు, కలెక్టర్, జాయింట్ కలెక్టర్ అదేశాలకు మేరకే అక్రమ కట్టడాలను తొలగించామమని ఆర్డీఓ మలోల తెలిపారు. రాజకీయ నాయకుల అండ ఏమీ లేదన్నారు. మేయర్ స్వరూప మాట్లాడుతూనగర అభివృద్ధికోసం పాటుపడే ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరిపై విమర్శలు చేయడం తగదన్నారు. మున్సిపల్ అతిథిగృహంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. కార్పొరేటర్ ఉమామహేష్ డబ్బు వసూలు చేసి గుడిసెలు వేయించారని విమర్శించారు. ఇదిలా ఉండగా గుడిసెలు తొలగింపును ఆపాలని రాయలసీమ కమ్యూనిస్టుపార్టీ నాయకులు డిమాండ్ చేశారు. కాలనీలో అధికారులు తొలగించిన పేదల గుడిసెలను పరిశీలించారు.

పీవీకేకే విద్యా సంస్థల్లో క్రమశిక్షణ కట్టుదిట్టం

- యాజమాన్య ప్రతినిధి శ్రీకాంత్‌రెడ్డి

అనంతపురం కలెక్టరేట్ : తమ విద్యా సంస్థల్లో క్రమశిక్షణ కట్టుదిట్టంగా ఉంటుందని పీవీకేకే విద్యా సంస్థల యాజమాన్య ప్రతినిధి శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన స్పష్టం చేశారు. ఇంజనీరింగ్ విద్యార్థికి గాయాలైన సంఘటనలో అతని బంధువులు చేసిన అరోపణల్లో వాస్తవం లేదన్నారు. తమ కళాశాలలో ర్యాగింగ్ ఉండదన్నారు. విద్యార్థి బంధువులు ఆరోపిస్తున్నట్లుగా సీనియర్లు మద్యం తాగి ర్యాగింగ్ చేస్తున్నారనడం అవాస్తవమన్నారు.

బీసీల అభివృద్ధికి ఐక్యతతో ఉద్యమించాలి

అనంతపురం ప్రెస్‌క్లబ్ : పాలక ప్రభుత్వాలు బీసీలను ఓటు బ్యాంకుగా ఉయోగించుకుంటూ అభివృద్ధి, హక్కులు విస్మరిస్తున్నారని, బీసీలందరూ ఐక్యతతో ఉద్యమించి సాధించుకోవాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రమేష్‌గౌడ్ అన్నారు. గురువారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు బ్యాళ్ల నాగేంద్ర అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరువు పరిస్థితుల్లో నిరుద్యోగులు ఉపాధి కోసం ఇతర రాష్ట్రాలకు వలసలు వెళ్లి దుర్భర పరిస్థితులు ఎదుర్కొంటున్నారన్నారు. అనంతరం బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడిగా విష్ణువర్ధన్, జిల్లా ఉపాధ్యక్షుడిగా మధు, నగరాధ్యక్షుడిగా సందీప్‌ను ఎంపిక చేశారు. కార్యక్రమంలో నాయకులు జోగిరాజేంద్ర, విశ్వనాథ్, శివబాల, కార్పొరేటర్ లోక్‌నాథ్, దండు కేశవ్, యశ్వంత్ పాల్గొన్నారు.

లోఓల్టేజీ సమస్య పరిష్కరించండి

అనంతపురం సప్తగిరిసర్కిల్: కనగానపల్లి మండలంలో లోఓల్టేజీ సమస్య పరిష్కరించాలని రైతు సంఘం నాయకులు విద్యుత్ అధికారులను కోరారు. గురువారం ఎస్ఈ కార్యాలయంలో డీఈ సంపత్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కాటమయ్య మాట్లాడుతూ మండలంలో లోఓల్టేజీ కారణంగా గ్రామాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు నిత్యం కాలిపోతున్నాయన్నారు. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. మండలంలోని తగరకుంట, బద్దలాపురం, తూముచర్ల, పాతపాళ్యం, కుంటపల్లి, సీఎన్‌కోట గ్రామాల్లో పరిస్థితి దయనీయంగా తయారైందన్నారు. సింగిల్ ఫేస్ ట్రాన్స్‌ఫార్మర్లు అమర్చి రైతుల కష్టాలు తీర్చాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రామక్రిష్ణ, వన్నారెడ్డి, మహదేవ, మల్లేష్ పాల్గొన్నారు.

రేపు ఆధార్, బ్యాంకు ఖాతాల అనుసంధానంపై అవగాహన సదస్సు : డ్వామా పీడీ

అనంతపురం అర్బన్: ఉపాధి కూలీల ఆధార్, బ్యాంకు ఖాతాల అనుసంధానంపై ఉపాధి సిబ్బందికి అవగాహన కల్పించనున్నామని డ్వామా పీడీ నాగభూషణం తెలిపారు. శనివారం మధ్యాహ్నం సీఎల్ఆర్‌సీలో శిక్షణతరగతులు నిర్వహించనున్నామన్నారు. ఏపీడీలు, ఏపీఓలు, టీఏలు, ఆపరేటర్లు, ఈసీలు, ఫీల్డ్ అసిస్టెంట్లు అందరూ హాజరుకావాలని ఆయన కోరారు.

మానవత్వంతో అనాథ పిల్లలకు సేవలందించండి

అనంతపురం కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా బాలల సంరక్షణ సమితి అధికారులు,సిబ్బంది పర్యటించి బాలల సంరక్షణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని జేసీ-2 ఖాజామొహిద్దీన్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో ఇన్‌చార్జి పీడీ కృష్ణకుమారితో కలిసి సంబంధిత అధికారులు,సిబ్బందితో సమీక్షించారు. కదిరి, రాయదుర్గం, మడకశిర తదితర సుదూర ప్రాంతాల్లోనూ అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఆ మేరకు డీసీపీయూ సిబ్బంది అప్రమత్తం కావాలని ఆదేశించారు. జిల్లాను బాల్య వివాహాల రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలన్నారు. మానవత్వంతో అనాథపిల్లలకు సేవలు అందించాలని సూచించారు. భిక్షాటన, మత్తుకు అలవాటుపడిన పిల్లలు, అనాథలను గుర్తించి వారికి పునరావాసం కల్పించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో డీసీపీఓసుబ్రహ్మణ్యం,పీఓ వెంకటేశ్వరి, సిబ్బంది నాగలక్ష్మి, చంద్రకళ, శ్రీలక్ష్మి, భార్గవి పాల్గొన్నారు.

వైద్య పోస్టుల భర్తీ జాగ్రత్తగా చేపట్టాలి : జేసీ

అనంతపురం వైద్యం : జిల్లా వైద్యఆరోగ్య శాఖ పరిధిలోని వివిధ విభాగాలకు చెందిన పోస్టుల భర్తీపై ఎలాంటి తప్పిదాలు లేకుండా జాగ్రత్తగా భర్తీ చేయాలని జేసీ-2 సయ్యద్ ఖాజామొహిద్దీన్ పేర్కొన్నారు. జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి వెంకటరమణ, అదనపు వైద్య శాఖాధికారి పద్మావతిలు జిల్లా క్షయ నివారణ కేంద్రం, ఇటీవల స్టాఫ్‌నర్సులు తదితర విభాగాలలోని పోస్టులకు సంబంధించిన అభ్యర్థుల మెరిట్ జాబితాను కలెక్టర్ కార్యలయంలోని జేసీ-2 సయ్యద్ ఖాజామొహిద్దీన్ వద్దకు తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో ఆయన పరిశీలించి ప్రభుత్వ నిబంధనలు మేరకు అభ్యర్థుల మెరిట్ జాబితా తయారు చేశారా, ఏవైనా తప్పులున్నాయా అన్ని అధికారులను ఆరా తీశారు. అభ్యర్థుల్లో ఏ ఒక్కరికి అన్యాయం జరగకూడదని, మెరిట్ ఆధారంగానే అర్హులైన అభ్యర్థులను ఎంపిక చేసి ఉద్యోగ అవకాశం కల్పించాలన్నారు. అభ్యర్థుల ఎంపికలో ఏవైనా తప్పులుంటే మాత్రం సంబంధితులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అర్హులైన వారికి మాత్రమే ఉద్యోగ అవకాశం కల్పించాలన్నారు. కార్యక్రమంలో అతావుల్లా, క్షయ నివారణ కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

రిజర్వేషన్లు సమీక్షించి రాజ్యాంగ సవరణ చేయాలి

అనంతపురం ప్రెస్‌క్లబ్ : దేశవ్యాప్తంగా ప్రస్తుతం అమలవుతున్న విద్యా, ఉద్యోగ రిజర్వేషన్లు సమీక్షించి రాజ్యాంగ సవరణ చేయాలని ఓసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి అన్నారు. గురువారం నగరంలోని అశోక్‌నగర్‌లో ఓసీ సంక్షేమ సంఘం జిల్లా కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్థిక అసమానతలు రూపుమాపనందునే రిజర్వేషన్ల ఉద్యమాలు ఎక్కువయ్యాయన్నారు. ఎన్నికల హామీలు నెరవేర్చనందునే దేశవ్యాప్తంగా జాట్లు, గుజ్జర్లు, పటేళ్లు, కాపులు రిజర్వేషన్లకు ఉద్యమాలు చేస్తున్నారన్నారు. ఓటు బ్యాంకు రాజకీయాలతో రాజకీయ పార్టీలు అగ్రవర్ణాలను విడదీస్తూ పబ్బం గడుపుతున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు బుర్రాజయవర్దన్ రెడ్డి, మంజునాథ్‌రెడ్డి, అల్లెమాధవరెడ్డి, మురారిరాము, శ్రీనివాస్‌రెడ్డి, రంగారెడ్డి, సమరసింహారెడ్డి, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, భార్గవరెడ్డి పాల్గొన్నారు.

ఉపాధి ఖర్చులో అనంత ఫస్ట్ : డ్వామా పీడీ

అనంతపురం అర్బన్: ఉపాధి హామీ పథకం నిధుల వ్యయంలో జిల్లా అగ్రస్థానంలో నిలిచిందని డ్వామా పీడీ నాగభూషణం తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను గురువారం ఆయన తెలిపారు. ఈ ఏడాది మార్చి నుంచి ఇప్పటి వరకూ రూ. 286 కోట్లకుపైగా ఖర్చు పెట్టామన్నారు. కూలీలకు 1.33 కోట్ల పనిదినాలు కల్పించామన్నారు. ఇందులో 24,850 కుటుంబాలు వంద రోజుల పనిదినాలు పూర్తి చేశాయన్నారు. కూలీకి సరాసరి వేతనం రూ. 164 లభించిందన్నారు. గతంలో ఖర్చులో ప్రకాశం జిల్లా ప్రతమ స్థానంలో ఉండేదని, ఇప్పుడు ఆ జిల్లాను దాటి అగ్రస్థానంలో ఉన్నామన్నారు. మరుగుదొడ్ల నిర్మాణాల్లోనూ జిల్లా ముందు వరుసలో ఉందన్నారు. ఇప్పటికే 12,113 మరుగుదొడ్లు పూర్తి చేశామన్నారు. పంట సంజీవని కింద ఈ ఆర్థిక సంవత్సరం ప్రారంభం నుంచి 11,115 కుంటలు పూర్తి చేశామన్నారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు



అంత్యక్రియల కోసం తరలిస్తున్న దృశ్యం

అనంతపురం సప్తగిరిసర్కిల్: స్థానిక రైల్వే ప్లాట్‌ఫారంపై మృతి చెందిన అనాథ మృతదేహానికి సంజీవిని హెల్పింగ్ హ్యాండ్స్ ఆద్వర్యంలో గురువారం అంత్యక్రియలు నిర్వహించారు. ఈ నెల 2న రైల్వేప్లాట్‌ఫారంపై మృతి చెందిన అనాథ మృతదేహాన్ని రైల్వే పోలీస్ హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసులు ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల వివరాలు తెలియరాకపోవడంతో రైల్వే పోలీస్ హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసులు, కానిస్టేబుల్ గణేష్ సంజీవిని సంస్థను ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో నిర్వహకులు గుత్తిరోడ్డులో ఉన్న హరిచ్చంద్ర ఘాట్‌లో మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు రమణారెడ్డి, సభ్యులు సూర్యశేఖర్, రామాంజినేయులు, శ్రీనివాసులు,క్రిష్టారెడ్డి పాల్గొన్నారు.

మున్సిపల్ టీచర్ల సమస్యలపై ప్యాప్టో నిరసన

అనంతపురం అర్బన్ : మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ఏపీ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య(ప్యాప్టో) నిరసన చేపట్టింది. గురువారం స్థానిక నగరపాలక కార్యాలయం వద్ద దాదాపు గంటపాటు బైఠాయించి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మున్సిపల్ టీచర్ల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. తెలుగు మీడియం రద్దు చేసి ఇంగ్లీష్ మీడియం కొనసాగించాలనుకోవడం సరికాదన్నారు. రెండు మీడియంలను నిర్వహించాలని డిమాండ్ చేశారు. సర్వీస్ రూల్స్‌కు సంబంధించి ఉత్తర్వుల్లో ఉన్న అసంబద్ధాలను సవరించాలన్నారు. ప్రస్తుత ఖాళీలను పాత పద్ధతిలోనే పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలన్నారు. అనంతరం కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు ప్రభాకర్, సాయప్ప, యూటీఎఫ్ నాయకులు రమణయ్య, సుధాకర్, సురేష్, తిప్పయ్య, ఆదిశేషు, టీఎన్‌యూఎస్ నాయకులు ఫణిభూషణ్, నాగభూషణ్, యుగంధర్ పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
4
ధర్మవరం
శుక్రవారం 04, ఆగస్టు 2017
● ధర్మవరం ● బత్తలపల్లి ● ముదిగుబ్బ ● తాడిమర్రి

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

ముదిగుబ్బ: మండల కేంద్రంలోని పాతవూరిలో వెలసిన ఆంజనేయస్వామికి గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించి వెండి కిరీటం, కవచం దరింపజేశారు. ఎదురుగా ఉన్న స్వామివారి పాదుకలకు కూడా పూజలు చేశారు. భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు.


ప్రత్యేక అలంకరణలో ఆంజనేయ స్వామి

ఎంఆర్ వ్యాక్సిన్‌తో సంపూర్ణ ఆరోగ్యం

డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ యుగంధర్

ధర్మవరం: రాష్ట్ర ప్రభుత్వం చిన్నారుల భవిష్యత్తు కోసం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని ఏర్పాటు చేసిన మీజిల్స్, రుబెల్లా ఎంఆర్ వ్యాక్సిన్‌తో చిన్నారులకు సంపూర్ణ ఆరోగ్యాన్ని ఇస్తుందని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ యుగంధర్ పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్యాన్ని నిత్యం కాంక్షించే డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ ఎంఆర్ వ్యాక్సిన్‌పై ప్రత్యేక దృష్టి సారించి 15 సంవత్సరాల్లోపు పిల్లలకు వందశాతం ఎంఆర్ వ్యాక్సిన్ వేయడానికి తీవ్రంగా కష్టపడుతున్నారు. ధర్మవరంలో 34 వేల మంది 15 సంవత్సరాల్లోపు బాలబాలికలను గుర్తించిన ఆరోగ్యశాఖ రెండు రోజుల్లోనే దాదాపు 1200 మందికి వ్యాక్సిన్ వేసి వారి పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. గు రువారం పట్టణ పరిధిలోని వివేకానంద విద్యాసంస్థల అనుబంధంగా కొనసాగుతున్న విశ్వభారతి ఇం గ్లీష్‌మీడియం స్కూల్‌లో విద్యార్థులకు ఎంఆర్ వ్యాక్సిన్ వేశారు. కరస్పాండెంట్ రిజ్వాన్, డైరెక్టర్ తిప్పారెడ్డి ఆధ్వర్యంలో డాక్టర్ యుగంధర్, డాక్టర్ ఉమాదేవి, ఆశావర్కర్లు విద్యార్థులకు వ్యాక్సిన్ వేశారు. ఈ సందర్భంగా యుగంధర్ మాట్లాడుతూ...ప్రభుత్వం విధించిన గడువులోగా వందశాతం పిల్లలకు వ్యాక్సిన్ వేయాలన్నదే తమ ఆకాంక్ష అన్నారు. దీనివల్ల భవిష్యత్తులో బిడ్డలకు కొన్ని రోగాలు సోకే ప్రమాదం ఉండదన్నారు. టీకాలు వేసిన తరువాత కొందరు పిల్లలకు ఇంజక్షన్ పొంగే అవకాశం ఉంటుందని, ఎలాంటి ఆందోళన అవసరం లేదని ఆయన తల్లిదండ్రులకు వివరించారు. సాధ్యమైనంత వరకు తల్లిదండ్రుల్ని పిలిపించి వారి ముందే వ్యాక్సిన్‌ను వేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్‌సెంటర్ సిబ్బంది వేణుగోపాల్, లక్ష్మీనారాయణ, పాఠశాల సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.


వ్యాక్సిన్ వేస్తున్న దృశ్యం

తాడిమర్రి: మీజిల్స్, రుబెల్లా వ్యాక్సిన్ వేయడం మనందరి బాధ్యత, కావున వైద్య సిబ్బంది బాధ్యతగా పనిచేయాలని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ యుగంధర్ అన్నారు. మండలంలోని దాడితోట ప్రాథమిక, ఉన్నతపాఠశాలల్లో గురువారం నిర్వహించిన ఎంఆర్ వ్యాక్సిన్ ప్రక్రియను ఆయన పరిశీలించారు. మండలంలో ఇప్పటికి 90 శాతం మంది విద్యార్థులకు వ్యాక్సిన్ వేయడం పూర్తి అయిందని, ప్రైవేటు పాఠశాలలకు కూడా వెళ్లి వ్యాక్సిన్ వేయాలని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించిన సర్వే ప్రకారం అందరికీ వ్యాక్సిన్ అందిందా లేదా అని గమనించి చర్యలు చేపట్టాలని తెలిపారు. మిగిలిన వ్యాక్సిన్‌ను ప్రతిరోజూ సాయంత్రం తాడిమర్రి పీహెచ్‌సీకి చేర్చి తిరిగిర ఉదయం తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. ఈకార్యక్రమంలో డాక్టర్ గిరిధర్, సీహెచ్‌ఓ కళావతి తదితరులు పాల్గొన్నారు.

లోకల్ గైడ్

ఎమ్మెల్యే డైరీ

-ధర్మవరం ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ శుక్రవారం నియోజకవర్గంలో అందుబాటులో ఉండటం లేదు.

-నంద్యాల ఉపఎన్నికల్లో భాగంగా టీడీపీ అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డి విజయం కోసం ప్రచారంలో పాల్గొంటున్నారు.

ధర్మవరం మార్కెట్‌లో కూరగాయల ధరలు



పచ్చిమిర్చి 50, వంకాయలు 30, కాకర 50 టమోట 60, క్యారెట్ 60, బీన్స్ 50, ఎర్రగడ్డలు 20, బంగాళాదుంప 20, ముల్లంగి 20, క్యాబేజి 40, చౌడేకాయలు 30, బీరకాయలు 40, బీట్‌రూట్ 30, బెండ 40.

ధర్మవరం సినిమాలు

సిద్దార్థ: ఫిదా, **లక్ష్మీనారాయణ:** రాధా, **లక్ష్మీచక్రవర్తి:** వైశాఖ, **వరలక్ష్మి:** డీజే, **విజయలక్ష్మి:** బాహుబలి-2, **రంగా సెంట్రల్:** నిన్నుకోరి, గౌతమ్‌నంద దండుపాళ్యం-2, పిశాచి

ధర్మవరం డిపో నుంచి ఆర్టీసీ బస్ సర్వీస్‌లు

ధర్మవరం-హైదరాబాద్ : ఉదయం 11.30 గంటలకు, మధ్యాహ్నం 1.30, 3.30, రాత్రి 8.30, 9.30, ధర్మవరం-చెన్నై: రాత్రి 8 గంటలకు, ధర్మవరం-విజయవాడ: సాయంత్రం 4.30, 6.30 గంటలకు, ధర్మవరం-నెల్లూరు: సాయంత్రం 6.15కు, ధర్మవరం-ఒంగోలు : మధ్యాహ్నం 3.30గంటలకు, ధర్మవరం-తిరుపతి : సాయంత్రం 4.30గంటలకు

నేడు సామూహిక కుంకుమార్చన

బత్తలపల్లి: మండల కేంద్రమైన బత్తలపల్లిలో గల లక్ష్మీదేవి ఆలయంలో శుక్రవారం సామూహిక కుంకుమార్చనలు చేపడుతున్నట్టు సమరసత సేవాఫౌండేషన్ తెలిపింది. గ్రామంలోని మహిళలందరూ హాజరై ఈ పూజాకార్యక్రమాల్లో పాల్గొనాలని కోరింది. సాయంత్రం అమ్మవారి విగ్రహ ఊరేగింపు ఉంటుందని ఫౌండేన్ పేర్కొంది.

జిప్సంను సరైన సమయంలో వినియోగించండి: ఏడీఏ

తాడిమర్రి: ఖరీఫ్‌లో వేరుశనగను సాగు చేసిన 30-45 రోజుల్లోపు జిప్సంను పంటకు వేయాలని ఏడీఏ విశ్వనాథం అన్నారు. మండలంలోని నిడిగల్లు గ్రామంలో 184 మంది రైతులకు, ఒక్కొక్కరికి 5 బ్యాగుల చొప్పున పంపిణీ చేశారు. ఈసందర్భంగా తమ సెల్‌ఫోన్లకు 20 బ్యాగుల జిప్సం తీసుకొన్నట్టు సందేశం వస్తోందని ఆయన దృష్టికి తెచ్చారు. సాంకేతిక సమస్య వల్ల అలా వస్తోందన్నారు. ఈకార్యక్రమంలో ఏఓ కాత్యాయని, ఎంపీఈఓలు అమర్‌నాథ్‌రెడ్డి, చందన తదితరులు పాల్గొన్నారు.

రేపు సౌత్‌జోన్ కరాటే పోటీలు

ధర్మవరంఅర్బన్: పట్టణంలోని గ్లోబల్‌మార్షల్ ఆర్ట్స్ వారు శనివారం సౌత్‌జోన్ కరాటే పోటీలను నిర్వహించనున్నట్టు నిర్వాహకులు శ్యాంకుమార్ రాయల్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పోటీలకు పలు రాష్ట్రాల నుంచి విద్యార్థులు పాల్గొంటారన్నారు.

మలకవేమలలో రైతుసేవలో రెవెన్యూశాఖ

ముదిగుబ్బ: రైతుసేవలో రెవెన్యూ కార్యక్రమంలో భాగంగా గురువారం మలకవేమల గ్రామంలో రెవెన్యూ అధికారులు గ్రామసభ నిర్వహించారు. తహసీల్దార్ మాధవరెడ్డి హాజరై రైతుల నుంచి సమస్యలు తెలుసుకున్నారు. ఈ గ్రామసభల ద్వారా రెవెన్యూ సమస్యలను ప్రభుత్వం పరిష్కరిస్తోందని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వెంకటరెడ్డి, ఆర్ఐ రామకృష్ణ, సర్పంచ్ రమణమ్మ, నాయకులు పతిరెడ్డి, నాగారెడ్డిపల్లి రమణ తదితరులు పాల్గొన్నారు.

బత్తలపల్లి: రైతుసేవలో రెవిన్యూశాఖ అనే కార్యక్రమాన్ని రైతన్నలందరూ తప్పక సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జ్ తహసీల్దార్ సురేశ్‌బాబు పేర్కొన్నారు. మండలంలోని రాఘవంపల్లి గ్రామంలో గురువారం రైతుసేవలో రెవిన్యూశాఖ గ్రామసభ నిర్వహించారు. ఈసందర్భంగా రైతుల నుంచి మూడు అర్జీలు వచ్చాయి.

‘చేనేత మహాధర్నాను విజయవంతం చేయండి’

ధర్మవరంఅర్బన్: చేనేత కార్మికుల సమస్యల పరిష్కారం కోసంఈనెల 8న చేనేత మహాధర్నా నిర్వహిస్తున్నామని, ఇందుకు సంబంధించిన కరపత్రాలను గురువారం మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి సోదరుడు వెంకటక్రిష్ణారెడ్డి, వైసీపీ నాయకులు విడుదల చేశారు. స్థానిక కేతిరెడ్డి నివాసంలో ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో వెంకటక్రిష్ణారెడ్డి మాట్లాడుతూ...చేనేతకార్మికులకు రావాల్సిన శిల్క్‌రాయితీలను సాధించుకునేందుకే ఈ మహాధర్నాను నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

10న యువజనోత్సవ పోటీలు

ధర్మవరంఅర్బన్: స్పెషల్ కమిషనర్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ యువజన సర్వీసుల శాఖ, జిల్లాకలెక్టర్ ఆదేశాల మేరకు ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ధర్మవరం డివిజన్ యువజనోత్సవ పోటీలను ఈనెల 10న నిర్వహించనున్నట్టు కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ క్రిష్ణయ్య తెలిపారు. ఈ పోటీలు 10న స్థానిక కేహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరుగుతాయని, అందులో గెలుపొందిన వారికి జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్టు ఆయన తెలిపారు. ఇందుకు సంబంధించి గురువారం కళాశాలలో కరపత్రాలను వైస్ ప్రిన్సిపాల్ చాంద్‌బాషా, అధ్యాపకులతో కలిసి ఆయన విడుదల చేశారు. అనంతరం వైస్‌ప్రిన్సిపాల్ చాంద్‌బాషా మాట్లాడుతూ..ఈ పోటీలకు 15 నుంచి 29 సంవత్సరాల వయస్సుగల విద్యార్థులు ఎవరైన పాల్గొనవచ్చున్నారు. శాస్త్రీయ సంగీతం, నృత్యాలు, ఒన్‌యాక్ట్‌ప్లే, వక్తృత్వం, జానపద తదితర పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆసక్తిగల వారు 9తేదీలోపు పేర్లను కేహెచ్ ప్రభుత్వ కళాశాలలో నమోదు చేసుకోవాలన్నారు ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు శివప్రసాద్, రఘురామమూర్తి, అధ్యాకులు పాల్గొన్నారు.

13 ఇసుక ట్రాక్టర్ల స్వాధీనం

తాడిమర్రి: మండలంలోని సీసీ.రేవు, దాడితోట గ్రామాల వద్ద నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న 13 ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నట్టు తహసీల్దార్ సుబ్బలక్ష్మమ్మ, ఎస్ఐ రాంభూపాల్ తెలిపారు. ఏకకాలంలో దాడితోట, సీసీ.రేవు ప్రాంతాల్లో రెవెన్యూ, పోలీసులు దాడులు నిర్వహించి 17 ట్రాక్టర్లను అదుపులోకి తీసుకుని, వాటిలో 13 ట్రాక్టర్లలో ఇసుక ఉండటాన్ని గమనించి ధర్మవరం ఆర్డీఓకు సమాచారం ఇవ్వడం జరిగిందని తెలిపారు. మిగిలిన నాలుగుకు స్థానిక పోలీసులు జరిమానా విధించి వదిలేశారు.

గిర్రాజుకాలనీలో పారిశుధ్య పనులు

పర్యవేక్షించిన మున్సిపల్ కమిషనర్, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ

ధర్మవరంఅర్బన్: పట్టణంలోని గిర్రాజుకాలనీలో డెంగీతో బుధవారం జయశ్రీ అనే యువతి మృతిచెందిన విషయం తెలిసిందే. విషయం తెలుసుకున్న మున్సిపల్ కమిషనర్ గుర్రం రవికుమార్, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ యుగంధర్ గురువారం ఉదయాన్నేగిర్రాజు కాలనీలో పర్యవేక్షించారు. మున్సిపల్ సిబ్బందితో కాలనీలో మురుగుకాలువలను శుభ్రం చేయించారు. అనంతరంమురుగు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఆయిల్ బాల్స్ వేయించారు. జయశ్రీ డెంగీతో మృతిచెందడానికి కారణాలను తల్లిదండ్రులతో అడిగితెలుసుకున్నారు.పరిసరాలు పరిశుభ్రత, ఎక్కువ రోజులు నీరు నిల్వతో దోమల వ్యాప్తి తదితర వాటిని పరిశీలించారు. కాలనీలో పెద్ద మురుగుకాలువను నూతనంగా నిర్మిస్తుండటంతో మురుగునీరు మొత్తం ఇళ్లమధ్యనే నిలిచిపోయిందనికాలనీ మహిళలు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లడంతో వారు మురుగుకాలువలను పరిశీలించారు. దోమలు వ్యాప్తి చెందకుండా ఆయిల్‌బాల్స్, మిలాథిన్‌ను వేయిస్తామని ప్రజలకు అధికారులు తెలిపారు. కాలనీలో ఎక్కడా కంపచెట్లు, పిచ్చిమొక్కలు లేకుండా మున్సిపల్ సిబ్బంది తొలగించారు. ఇళ్ల మధ్య పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని ట్రాక్టర్‌ల ద్వారా తొలగించారు. ఈ కార్యక్రమంలో శానటరీ ఇన్‌స్పెక్టర్లు లక్ష్మీనారాయణశర్మ, బాబ్జాన్, మలేరియా సబ్‌యూనిట్ అధికారి జయరాంనాయక్ పాల్గొన్నారు.


మురుగు కాలువలను పరిశీలిస్తున్న అధికారులు

ఘనంగా సత్యసాయి విగ్రహ ప్రతిష్ఠ

బత్తలపల్లి: మండలంలోని మాళ్యవంతం గ్రామంలో గురువారం సత్యసాయి విగ్రహ ప్రతిష్ఠను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చుట్టుపక్కల గ్రామస్థులు భారీగా తరలివచ్చారు. ఉదయం 6.30 గంటల నుంచి పూజలు, హోమాలు చేశారు. ఉదయం 7.30 గంటలకు గణపతిహోమం, నవగ్రహహోమం, రుద్రహోమం, లక్ష్మీహోమం, పూర్ణాహుతి, సత్యసాయిబాబా మూలమంత్ర హోమాలు చేపట్టి విగ్రహ ప్రతిష్ఠ చేశారు. అనంతరం మహా మంగళహారతి ఇచ్చి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కరువుజిల్లా అనంతలో తాగేందుకు నీరు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్న తరుణంలో సత్యసాయిబాబా వాటర్‌ప్రాజెక్టు ఏర్పాటు చేసి తాగునీరు అందించారన్నారు. ప్రజల కష్టాలు తెలుసుకుని నీరందించిన దేవుడన్నారు. ఈకార్యక్రమంలో గ్రామపెద్దలు, భక్తులు పాల్గొన్నారు.


సత్యసాయి విగ్రహం

వైభవంగా వెంగమునిస్వామి ఆరాధన

ముదిగుబ్బ: మండలంలోని తిమ్మానాయునిపాలెంలో వెలసిన అవధూత వెంగమునిస్వామి(వెంగగు రు వు) ఆరాధన మహోత్సవాన్ని గురువారం వైభవంగా ని ర్వహించారు. స్వామివారిని పల్లకీలో ఊరేగించి గ్రా మో త్సవం చేపట్టారు. భక్తులు మాంసం నైవేద్యంగా ఉంచి మొక్కులు చెల్లించారు. ఆలయం వద్ద ఉన్న వేపవృక్షానికి మహిళలు ఊయలలు కట్టి, తమకు సంతానం కలగాలని వేడుకొన్నారు.

సేవా కార్యక్రమాలను విస్తృతం చేస్తాం

-ఆర్యవైశ్య యువజనసంఘం నూతన అధ్యక్షుడు



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గం

ధర్మవరంఅర్బన్: ఆర్యవైశ్యయువజనసంఘం ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలను విసృతం చేస్తామని యువజన సంఘం నూతన అధ్యక్షుడు సత్రసాల నాగకిరణ్ పేర్కొన్నారు. గురువారం సాయంత్రం ఆర్యవైశ్య కొత్తసత్రంలో ఆర్యవైశ్యయువజన నూతన పాలక వర్గం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు సత్రసాల నాగకిరణ్ మాట్లాడుతూ...యువజనసంఘం ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలను విస్తృతం చేస్తామన్నారు. లక్ష్మీచెన్నకేశవస్వామి రథోత్సవంలో, ఆగస్టు 15వతేదీన, వినాయకచవితి పండుగ రోజులతో పాటు సేవాకార్యక్రమాలను విసృతం చేస్తామన్నారు. యువజన సంఘం అధ్యక్షుడుగా సత్రసాలనాగకిరణ్, కార్యదర్శిగా కిశోర్, కోశాధికారిగా ఈరటరాఘవేంద్ర, గౌరవాధ్యక్షుడిగా బండ్లపల్లిరంగనాథ్, సలహాసంఘసభ్యులు గ్రంథే శ్రీనివాసులు, కట్టా వెంకటేశ్, ముంటిమడుగు రాఘవేంద్ర, ఉపాధ్యక్షుడిగా సత్రసాల సుబ్రహ్మణ్యం, కట్టాప్రసాద్‌తో సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం పలువురు నూతన పాలక వర్గ సభ్యులకు పూలమాలలు వేసి శుభాకాంక్షలు తెలిపారు.

పిల్లలకు ద్విచక్రవాహనాలు ఇవ్వకండి

ధర్మవరంఅర్బన్: 18ఏళ్లలోపు పిల్లలకు తల్లిదండ్రులు ద్విచక్రవాహనాలను ఇవ్వరాదని, అలా ఇవ్వడం వల్ల రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారని ఇన్‌చార్జి డీఎస్పీ ముక్కాశివరామిరెడ్డి పేర్కొన్నారు. బీజేవైఎం పట్టణాధ్యక్షుడు రాప్తాటి రవీంద్ర ఆధ్వర్యంలో మన పిల్లలు-మనబాధ్యత అన్న నినాదంతో రోడ్డుప్రమాదాలపై అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీని కాలేజ్‌సర్కిల్‌లో గురువారం ఇన్‌చార్జ్ డీఎస్పీ ముక్కాశివరాడిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...18 సంవత్సరాలలోపు ఉన్న పిల్లలకు ద్విచక్రవాహనాలు ఇవ్వరాదని తల్లిదండ్రులకు పిలుపునిచ్చారు. ఈ ర్యాలీ ప్రధాన రహదారులలో కొనసాగింది. ఈ కార్యక్రమంలో సీఐ హరినాథ్, ఎస్ఐలు సురేశ్, జయానాయక్, జాతీయ నాయకులు అంబటి సతీశ్, బీజేవైఎం జిల్లా ప్రధానకార్యదర్శిసాకే ఓబుళేశు, నాయకులు చట్టా నారాయణస్వామి, మాధవరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు గుండాపుల్లయ్య, పట్టణ ప్రధానకార్యదర్శి రాప్తాటి రాము, సీనియర్ నాయకులు బిల్లేరవీంద్ర, పుట్లూరు నరసింహులు, రామక్రిష్ణ, వెంకటేశ్, నాగరాజు, క్రిష్ణప్రసాద్, శ్రీనాథ్, అనిల్, బాలచౌడప్ప, శంకర, వీర తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ పాఠశాలలో తెలుగుమాధ్యమాన్ని కొనసాగించాలి

ధర్మవరంఅర్బన్: మున్సిపాలిటీల్లో తెలుగుమాధ్యమాన్ని కొనసాగించాలని, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ప్యాప్టో నాయకులు డిమాండ్ చేశారు.స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట గురువారం ప్యాప్టో నాయకులు ధర్నా చేపట్టారు. ఈసందర్భంగా ప్యాప్టో నాయకులు మాట్లాడుతూ..మున్సిపల్ ఉపాధ్యాయులు సర్వీసు రూల్స్‌ను సవరించి వెంటనే అమలుచేయాలని, పండిట్లు, పీఈటీలు అప్‌గ్రేడేషన్ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి శెట్టిపిజయచంద్రారెడ్డి,ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు బీకే ముత్యాలప్ప, నాయకులు రవీంద్రారెడ్డి, రామక్రిష్ణానాయక్, లక్ష్మయ్య, అమానుల్లా, హరిక్రిష్ణ, నాగప్ప, గంగాధర్ నాయుడు, హరిశంకర్, సాయికిరణ్, హసీమ్ తదితరులు పాల్గొన్నారు.





పెద్దమ్మ మూలవిరాట్, గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

వైభవంగా కలశ మహోత్సవం

ముదిగుబ్బ: మండల కేంద్రంలోని పాతవూరిలో వెలసిన గ్రామదేవత పెద్దమ్మదేవి నూతన కలశ ప్రతిష్ఠను గురువారం ఘనంగా నిర్వహించారు. వేదపండితులు హోమం నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్ఛారణలతో ముదిగుబ్బ పులకించింది. ఈ హోమంలో ఆలయకమిటీ సభ్యులు, దాతలు, గ్రామస్థులు పాల్గొన్నారు. అనంతరం కలిశాలను గ్రామంలో ఊరేగించారు. మహిళలు, పురుషులు సాంప్రదాయదుస్థుల్లో హాజరై గ్రామోత్సవంలో పాల్గొన్నారు. ముదిగుబ్బ పాతవూరి యువత శ్వేతవస్త్రాలు ధరించి ఆకర్షణగా నిలిచారు. భక్తులకు గ్రామస్థులు అన్నదానం చేశారు. శుక్రవారం కలిశ స్థాపన జరుగుతుందని కమిటీ సభ్యులు తెలిపారు.

అమ్మవారిని దర్శించుకోవడానికి పట్టణం నుంచే కాకుండా చుట్టుపక్కల గ్రామాల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. వాహనాల రాకపోకతలను పోలీసులు దారి మళ్లించారు.

వర్షం కోసం జలాభిషేకం

ముదిగుబ్బ: మండల కేంద్రంలోని పాతవూరిలో వెలసిన కనకదుర్గమ్మ, బొడ్రాయికి వర్షం కోసం జలాభిషేకం చేశారు. 108 బిందెలనీరు పోసి కనకదుర్గమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలోని 9 బొడ్రాళ్లకు జలాభిషేకం చేశారు.



ప్రత్యేక అలంకరణలో కనకదుర్గమ్మ

క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యసించండి

బాలికల ప్రభుత్వ జూనియర్ కళాశాల అభివృద్ధి కమిటీ చైర్మన్

ధర్మవరంఅర్బన్: ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించినప్పుడే ఉన్నతశిఖరాలను అందిపుంచుకుంటారని బాలికల ప్రభుత్వ జూనియర్ కళాశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ బండివేణుగోపాల్ పేర్కొన్నారు. గురువారం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో సీనియర్ విద్యార్థినిలు ప్రెషర్స్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ మాట్లాడుతూ..ప్రతి విద్యార్థి శ్రద్ద వహించి కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితే ఉన్నత స్థానం చేరుకుంటారన్నారు. ఒకటికి పదిసార్లు అర్థమయ్యేలా విద్యను అందించే నిష్ణాతులైన అధ్యాపకులున్నారని, వారితో సఖ్యతగా మెలిగి మంచిగా చదువుకుని తల్లిదండ్రులకు, కళాశాలకు మంచి పేరుప్రతిష్టలు తీసుకురావాలని విద్యార్థులకు ఆయనసూచించారు. ప్రధానంగా తల్లిదండ్రులను, పెద్దలను గౌరవించడం మన సాంప్రదాయమన్నారు. ఈ ఏడాదిలాగే కళాశాలకు మంచి ఉత్తీర్ణత శాతాన్ని తీసుకురావాలని ఆయన ఆకాక్షించారు. ప్రధానంగా క్రమశిక్షణ, మంచి నడవడికతో కూడినవిద్యను అభ్యసించాలన్నారు. అనంతరం విద్యార్థినులు నిర్వహించిన ఆటపాటలు, గ్రూప్‌డ్యాన్స్‌లు, మ్యూజికల్స్ డ్యాన్స్‌లు,నృత్యాలను పలువురిని ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో బాలుర, బాలికల ప్రభుత్వ కళాశాలల ప్రిన్సిపాళ్లు ప్రభాకర్, లక్ష్మీకాంతరెడ్డి, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

భోజనం నాణ్యతగా లేదు

- మున్సిపల్ చైర్మన్ ఆకస్మిక తనిఖీలో విద్యార్థుల ఫిర్యాదు

ధర్మవరంఅర్బన్: మధ్యాహ్న భోజనం సరిగా ఉడకం లేదని, అప్పుడప్పుడు పురుగులు వస్తున్నాయంటూ మున్సిపల్, మార్కెట్‌యార్డ్ చైర్మన్‌లు బీరేగోపాలక్రిష్ణ, కమతంకాటమయ్య దృష్టికి విద్యార్థులు తెచ్చారు. ఆదర్శపాఠశాలకు చెందిన ఓ విద్యార్థిని స్వయంగా మధ్యాహ్న భోజనం సరిగా లేదంటూ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ లేఖ రాసింది. దీంతో ఎమ్మెల్యే గోనుగుంట్ల ఆదేశాల మేరకు మున్సిపల్, మార్కెట్‌యార్డ్ చైర్మన్‌లు బీరేగోపాలక్రిష్ణ, కమతంకాటమయ్య గురువారం ఆదర్శపాఠశాలను ఆకస్మిక తనిఖీ చేపట్టారు. ముందుగా పాఠశాల పక్కన ఉన్న కొబ్బరి టెంకాయలు ఉండటంతో వెంటనే వాటిని అక్కడితొలగించాలని, లేకపోతే దోమలు వృద్ధి చెంది రోగాల బారిన పడతారన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ సతీశ్‌ను ఆదేశించారు. ఈ సందర్భంగా తరగతి గదిలోకి వెళ్లి మ.ధ్యాహ్న భోజనం ఎలా ఉంది, సక్రమంగా వడ్డిస్తున్నారా, మెను ప్రకారం గుడ్డు, అరటిపండు ఇస్తున్నారా అని తదితర సమస్యలను అడిగితెలుసుకున్నారు. దీంతో కొందరు విద్యార్థులు భోజనంలో నాణ్యత లేదని, మరికొందరు భోజనంలో అప్పుడప్పుడు పురుగులు వస్తున్నాయని, మెనులో లేని ముద్ద, చట్నీ ఇస్తున్నారని తదితర సమస్యలను వారి దృష్టికి తెచ్చారు. అనంతరం వారు మధ్యాహ్న భోజనాన్ని తిని అసంతృప్తి వ్యక్తం చేశారు.



భోజనాన్ని తింటున్న మున్సిపల్ చైర్మన్

తల్లిపాలే బిడ్డకు శ్రీరామరక్ష

ధర్మవరంఅర్బన్: తల్లిపాలే బిడ్డకు శ్రీరామరక్ష అని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సుజాతమ్మ, జయంతి పేర్కొన్నారు. పట్టణంలోని కేతిరెడ్డికాలనీ, సాయినగర్‌లలో గురువారం తల్లిపాల వారోత్సవాలను అంగన్‌వాడీ కేంద్రాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...తల్లిపాలను బిడ్డకు తాపించడం వల్ల బిడ్డ సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారన్నారు. బిడ్డకు తల్లిపాలు 6 నెలల పాటు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లు సులోచన, సరోజ, సునిత, ఆయాలు పాల్గొన్నారు.

పాఠ్యపుస్తకాలను పూర్తి స్థాయిలో అందించాలని ఆందోళన

ధర్మవరంఅర్బన్: పాఠశాలనుపునఃప్రారంబించిన రెండునెలలు దాటిన ఇంతవరకుపూర్తి స్థాయిలో గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేయాలేదని ఏఐఎస్ఎఫ్‌నాయకులు స్థానిక కాలేజ్ సర్కిల్‌లో ఆందోళనచేపట్టారు.ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ డివిజన్ ఇన్‌చార్జ్ టిప్పుసుల్తాన్ మాట్లాడుతూ...విద్యార్థులు కార్పోరేట్ పాఠశాలలకు ధీటుగా విద్యను అభ్యసించలేకపోతోందన్నారు. అదేవిధంగా యూనిఫాం కూడా సరఫరా చేయలేదన్నారు.ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో సాంకేతిక విద్యను అందించడంలో కూడా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించకపోతే ఉద్యమాలుచేపడుతామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు సుంకరమహేశ్, ఏఐఎస్ఎఫ్ పట్టణ కార్యదర్శి మణికంఠ, ఆర్గనైజింగ్ కార్యదర్శి శంకర, పట్టణ అధ్యక్షుడు పోతలయ్య, సహాయకార్యదర్శులు జగదీశ్, రాము, రవితేజ, ఉపాధ్యక్షుడు జాకీర్‌హుస్సేన్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పిల్లలకు ఆంగ్లమాధ్యమం పుస్తకాల పంపిణీ

ధర్మవరంఅర్బన్: పట్టణంలోని గూడ్‌షెడ్‌కొట్టాలలోని కేవీఎస్ పాఠశాలలో 1,3,4 సెక్టార్లలోని అంగన్‌వాడీ పిల్లలకు హెచ్‌ఎం ఆదిశేషయ్య చేతుల మీదుగా ఆంగ్ల మాధ్యమం పుస్తకాలను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ...కార్పొరేట్ పాఠశాలకు ధీటుగా అంగన్‌వాడీ పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలన్న ఉద్దేశ్యంతోనే ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లో నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ విద్యార్థులకు అంగ్లమాధ్యమం పుస్తకాలను అందించడం జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు రేవతమ్మ, సుభద్ర, లలితమ్మ పాల్గొన్నారు.

చదవుతోపాటు క్రీడల్లో రాణించాలి

ధర్మవరంఅర్బన్: చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని యువర్స్‌ఫౌండేషన్ ప్రతినిధులు విద్యార్థినులకు సూచించారు. స్థానిక బాలికల జూనియర్ కళాశాలలో గురువారం యువర్స్‌ఫౌండేషన్ ప్రతినిధులు విద్యార్థినులకు క్యారమ్‌బోర్డు, టెన్నీకాయిట్ తదితర క్రీడాసామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా యువర్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు వైకే శ్రీనివాసులు మాట్లాడుతూ...ప్రతి విద్యార్థి చదువుతోపాటు క్రీడల్లో రాణించి ఉన్నతశిఖరాలను అధిరోహించాలన్నారు. అనంతరం కళాశాల చైర్మన్ బండివేణుగోపాల్ మాట్లాడుతూ...యువర్స్‌ఫౌండేషన్ పట్టణంలో ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీకాంతరెడ్డి, యువర్స్ ఫౌండేషన్ ప్రతినిధులు చాంద్‌బాషా, బండ్లపల్లి రంగనాథం, కోటేశ్వరరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోండి..

-డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ

ధర్మవరంఅర్బన్: ప్రతి ఒక్కరు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోకపోతే రోగాల బారిన పడతారని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ యుగంధర్ తెలిపారు. గిర్రాజు కాలనీలో గురువారం పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమాన్ని అక్కడి ప్రజలకు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గుర్రంరవి, శానిట రీ ఇన్‌స్పెక్టర్‌లు లక్ష్మీనారాయణశర్మ, బాబ్జాన్, మలేరి యా సబ్‌యూనిట్ అధికారి జయరాంనాయక్ పాల్గొన్నారు.

15 వరకూ ఐటీఐలో ప్రవేశానికి గడువు

గుంతకల్లు: స్థానిక ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ప్రవేశాల కోసం రెండవ విడత అడ్మిషన్ల కార్యక్రమాన్ని చేపట్టినట్లు ప్రిన్సిపాల్ ఎస్ఏ కరీముల్లా గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. తొలి విడత అడ్మిషన్లు పూర్తికాగా మరికొన్ని సీట్లు ఖాళీగా ఉండటంతో రెండో దఫా దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆయన తెలియజేశారు. విద్యార్థులు ఈ నెల 15వ తేదీలోపు దరఖాస్తులను అందజేయాలని, 17వ తేదీ ఉదయం 10 గంటల నుంచి కౌన్సెలింగ్ నిర్వహిస్తామని ఆయన తెలిపారు. దరఖాస్తు చేసుకునే విద్యార్థులందరూ 17న ఒరిజినల్ సర్టిఫికెట్లతో ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో జరిగే కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని తెలియజేశారు.

వానొస్తే ప్రత్యామ్నాయమే శరణ్యం

- వేరుశనగ సాగుకు ముగిసిన గడువు

- మార్కెట్‌కు తరలనున్న విత్తన వేరుశనగ

గుత్తిరూరల్: ఖరీఫ్‌లో వేరుశనగ సాగుకు గడువు ముగిసింది. రెండు నెలలుగా వర్షం కోసం ప్రజలు చేసిన పూజలు, గ్రామ దేవతలకు పెట్టిన బోనాలు, వృథాగా పోయాయి. అదునులోపు పదును వాన కురువలేదు. ఆగస్టులో వర్షం కురిసినా వేరుశనగ పంట సాగుకు ప్రయోజనం లేదు. దిగుబడి రాదు. కరువు రైతుకు ఇక ప్రత్యామ్నాయమే శరణ్యంగా మిగిలింది. సమయం దాటి పోవడంతో రైతులు విత్తనాలు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. రోజు, రోజుకు కరువు ఛాయలు కమ్ముకుంటున్నాయి. జూన్ మాసంలో ఆరకొరగా కురిసిన వర్షానికి వేరుశనగ పంటసాగు చేశారు. ఆ పైరు ఎండిపోతోంది. ఖరీఫ్ సీజన్‌లో మండల వ్యాప్తంగా 19,500 హెక్టార్లలో వేరుశనగ పంట సాగు కావాల్సి ఉండగా జూన్, జూలై మాసాల్లో 3 వేల హెక్టార్లలో వేరుశనగ సాగు చేశారు. అదును దాటిపోవడంతో రైతులు కొర్ర, సజ్జ, అలసంద, ఉలవ, పెసర, జొన్న సాగు చేసుకోవాల్సి వస్తోంది. ఈ నెలలో వర్షం వస్తే నెలాఖరు వరకు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకోవచ్చని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

ఈ నెల ఆఖరు వరకు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకోవచ్చు : వెంకటరాముడు, ఏఓ



ఖరీఫ్ సీజన్‌లో జూన్ మాసంలో వేరుశనగ పంట కొద్దిగా మాత్రమే సాగు చేశారు. ప్రస్తుతం వర్షాలు వచ్చినా వేరుశనగ పంట సాగు చేస్తే దిగుబడి రాదు. వేరుశనగ పంట రైతులు వేయరాదు. ప్రత్యామ్నాయ పంటలైన కొర్ర, సజ్జ, అలసంద, ఉలవ, జొన్న విత్తనాలను రాయితీతో వారం రోజుల్లో రైతులకు అందజేస్తాం. వర్షం వస్తే ఈ నెలాఖరు వరకు పంటలు సాగు చేసుకోవచ్చు.

అదును దాటిపోయింది : రవి కిశోర్,పెద్దొడ్డి



ప్రస్తుతం వేరుశనగ పంటకు సాగు చేయడానికి అదును దాటిపోయింది. ఇంత వరకు వర్షం రాలేదు. నేను మూడు ఎకరాల్లో వేరుశనగ వేయడానికి విత్తనం, ఎరువులను సిద్ధం చేసుకున్నా. అయినా ఫలితం లేకుండా పోయింది. విత్తనాన్ని మార్కెట్‌కు తరలిస్తున్నా.




మార్కెట్‌కు తరలించడానికి సిద్ధంగా ఉంచి వేరుశనగ విత్తనం

లోకల్ గైడ్

ఎమ్మెల్యే డైరీ

గుంతకల్లు: స్థానిక ఎమ్మెల్యే ఆర్ జితేంద్ర గౌడ్ శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకు క్యాంపు కార్యాలయంలో గుంతకల్లు, గుత్తి, పామిడి మండలాలకు చెందిన కౌన్సిలర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలతో సమావేశం అవుతారు. ఆ తర్వాత నంద్యాలకు బయలుదేరుతారు.

కూరగాయల ధరలు



కిలో.. టమోట రూ. 40, మిరప రూ. 40, బీరకాయ రూ. 30, ఉర్లగడ్డ రూ. 20, వంకాయ రూ. 40, బెండకాయ రూ. 30, క్యారెట్ రూ. 60, ఉల్లిగడ్డ రూ. 20

సినిమా గైడ్

గుంతకల్లు

వాసవి : గౌతమ్‌నందా

చైతన్య : నక్షత్రం

కేపీఎస్ : ఫిదా

గుత్తి

అమృత్: ఫిదా

కేపీఎస్ : గౌతమ్‌నంద

పామిడి

మంజు: ఫిదా

హనుమాన్ : గౌతమ్‌నందా

బదిలీపై వెళ్తున్న టీచర్లకు సన్మానం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎంఈఓ తదితరులు

గుత్తిరూరల్: మండలంలోని తొండపాడు, జక్కలచెరువు గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలలో పని చేస్తున్న నలుగురు ఉపాధ్యాయులు బదిలీపై వెళ్తుండటంతో వారికి గురువారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తొండపాడు పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు మధుబాబు అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఎంఈఓ వేణుగోపాల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ పాఠశాలలో పని చేస్తున్న ఖాదర్‌బాషా, వేదవతి, కిరణ్‌కుమార్‌లకు పూలమాలలు వేసి శాలువాతో సన్మానించారు. అదేవిధంగా జక్కలచెరువు పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయురాలు లక్ష్మిదేవికి సర్పంచు లక్ష్మీనారాయణమ్మ పూలమాల వేసి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు గుండూరావు, ఎస్ఎంసీ చైర్మన్ శ్రీనివాస యాదవ్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు వెంకటనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఎస్పీ నాయకులు

గుంతకల్లుటౌన్: నియోజకవర్గం బీఎస్పీ మైనార్టీ నాయకుడు ఖాదర్‌వలి ఖాన్ గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ దౌల్తాపురం ప్రభాకర్ ఆధ్వర్యంలో ఖాదర్‌వలి ఖాన్‌తోపాటు 50 మంది మైనార్టీ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి పార్టీ కండువాలను వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి గాలి మల్లికార్జున, జిల్లా అధికార ప్రతినిధి కే శివ, కార్యదర్శి వై హనుమంతరావు, పట్టణ అధ్యక్షుడు పీ లక్ష్మీనారాయణ యాదవ్, బీసీ సెల్ పట్టణ అధ్యక్షుడు ఈశ్వ రయ్య, మైనార్టీ పట్టణ అధ్యక్షుడు ఎస్ ఆలం నవాజ్, కార్యదర్శి ఎస్ సుభాన్, నాయకులు నజీర్ అహమ్మద్, ఎం బాషా, రహంతుల్లా, నబిరసూల్, మహబుబ్ బాషా, తదితరులు పాల్గొన్నారు.

పీఎంజీవై గృహాల మంజూరుకు గ్రామ సభలు

పామిడి: పీఎంజీవై(ప్రధానమంత్రి గ్రామోదయ యోజన) కింద గ్రామీణ గృహాల మంజూరుకు గ్రామ సభలను నిర్వహిస్తున్నట్లు ఎంపీడీ ఓ రమేష్‌నాయక్ తెలిపారు. మండలానికి 938 గృహాలు మంజూరయ్యాయన్నారు. రెండున్నర ఎకరా పైబడి మాగాణి, ద్విచక్ర వాహనం లేనివారు ఈ గృహాలు పొందడానికి అర్హులన్నారు. ఒక్కో గృహానికి రూ. 2 లక్షలు అందజేస్తారన్నారు. 4న దేవరపల్లి, జీ కొట్టాల, నీలూరు, గజరాంపల్లి, ఖాదర్‌పేట, అనుంపల్లి గ్రామాల్లో సభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ పేర్కొన్నారు.

తెలుగు మీడియంను కొనసాగించాలి

- ఏపీయూటీఎఫ్ నాయకులు

గుంతకల్లుటౌన్: మున్సిపల్ పాఠశాలలో ఇంగ్లీష్ మీడియంతో పాటు తెలుగు మీడియం కొనసాగించాలని ఏపీయూటీఎఫ్ నాయకులు డిమాం డ్ చేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద గురువారం ఏపీయూ టీఎఫ్ నాయకుల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీయూటీఎఫ్ అధ్యక్షుడు ఎస్‌వీవీ రామయ్య మాట్లాడుతూ మున్సిపల్ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులను ఏకీకృత సర్వీస్ పరిధిలోకి తేవాలన్నారు. కొన్ని ప్రాథమిక పాఠశాలలను ప్రాథమికోన్నత పాఠశాలలుగా అప్‌గ్రేడ్ చేయాలన్నారు. పరస్పర బదిలీలు, స్పౌజ్ ఆధారిత బదిలీలు వెంటనే చేపట్టాలన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని మున్సిపల్ కమిషనర్ వై సత్యనారాయణకు అందజేశారు. కార్యక్రమంలో ఏపీయూటీఎఫ్ కార్యదర్శి రాఘవేంద్ర, రామ్మోహన్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



కమిషనర్‌కు వినతి పత్రాన్ని అందజేస్తున్న ఏపీయూటీఎఫ్ నాయకులు

బాధితురాలికి ఆర్థికసాయం

పామిడి: అనారోగ్యంతో బాధపడుతు న్న శాంతమ్మ అనే మహిళకు వైఎస్ఆర్ చారిటబుల్ ట్రస్టు అధినేత పెరుమళ్ల జీవానందరెడ్డి వైద్యం కోసం ఆర్థిక సాయం అందించారు. గత కొంతకాలంగా చేతి ఎ ముక సమస్యతో ఆమె తీవ్రంగా బాధపడుతూ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. స్థానిక డీఆర్‌డీఏ-వెలుగు కార్యాలయంలో పని చేస్తున్నా ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగానే ఉండటంతో ఈమె పరిస్థితిని తెలుసుకున్న జీవానందరెడ్డి ప్రభుత్వ ఆస్పత్రిలో ఆమె పరామర్శించి వైద్యం కోసం ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో వైఎస్ఆర్ ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

కత్రిమలలో రైతు సేవలో రెవెన్యూశాఖ

పామిడి : మండలంలోని రైతుల భూ సమస్యల పరిష్కారానికే రైతు సేవలో రెవెన్యూ శాఖ అనే కార్యక్రమాన్ని నిర్వహి స్తున్నట్టు వీఆర్వో ఓబులేసు పేర్కొన్నారు. గురువారం మండలంలోని కత్రిమల గ్రా మంలో రైతుసేవలో రెవెన్యూశాఖ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముగ్గురు రైతులు తమ భూములకు సంబంధించి అడంగల్ ఆన్‌లైన్ నమోదుకు వినతులు అందజేసినట్లు వీఆర్వో తెలిపారు.

ఇంటి రుణం కోసం దరఖాస్తు చేసుకోండి

పామిడి : నగర పంచాయతీ పరిధిలో ఇల్లు లేని నిరుపేదలు కేంద్ర ప్రభుత్వ ప్రధానమంత్రి ఆవాస్ యోజనా, హౌసింగ్ ఫర్ ఆల్ పథకం కింద దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ డీ గౌస్‌పీరా, కమిషనర్ నాసీర్ హుసేన్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో ఈనెల 6న ఆదివారం నిర్వహించే మేళాలో ఆధార్, రేషన్ కార్డు, బ్యాంకుఖాతా జిరాక్స్ కాపీలతోపాటు కుటుంబ సభ్యుల ఫొటోలు రెండు జతపరచి దరఖాస్తు చేసుకోవాలన్నారు.

జక్కలచెరువులో రాష్ట్ర స్థాయి భజన పోటీలు

గుత్తిరూరల్: మండలంలోని జక్కలచెరువు గ్రామంలో ఈ నెల 6వ తేదీన రాష్ట్రస్థాయి భజన పోటీలు నిర్వహిస్తున్నట్టు గ్రామ పెద్దలు తెలిపారు. ఆదివారం బొలికొండ రంగనాథస్వామి కల్యాణోత్సవం సందర్భంగా ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మొదటి బహుమతిగా రూ. 15 వేలు, రెండవ బహుమతిగా రూ. 12 వేలు, మూడవ బహుమతిగా రూ. 10వేలు, నాల్గవ బహుమతి కింద రూ. 8 వేలు, ఐదవ బహుమతికి రూ. 6 వేలు, ఆరవ బహుమతికి రూ. 5 వేలు, ఏడవ బహుమతికి రూ. 4 వేలు, ఎనిమిదివ బహుమతి కింద రూ.3 వేలు, తొమ్మిదవ బహుమతిగా రూ. 2 వేలు, పదవ బహుమతిగా రూ. 1 వెయ్యి అందిస్తామని తెలిపారు.

గ్రామాల్లో మద్యాన్ని విక్రయిస్తే కఠిన చర్యలు

పామిడి: మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లో మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ రవిశంకర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని నీలూరు, తంబళ్లపల్లి గ్రామాల్లో సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. ఎవరైనా మద్యాన్ని విక్రయిస్తే సమాచారం అందజేయాలన్నారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ యల్లప్ప, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పశు సంవర్థక శాఖ సమీక్షా సమావేశం

గుత్తి: స్థానిక పశు వైద్య కేంద్రంలో గురువారం పశు సంవర్థక శాఖ ఆధ్వర్యంలో గుత్తి, పామిడి, పెద్దవడుగూరు మండలాల పశు వైద్యాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పశు సంవర్థక శాఖ అసిసెంట్ డైరెక్టర్ టీవీ సుధాకర్ మాట్లాడుతూ తొలకరి వర్షాలతో గొర్రెల్లో నోటిపుండ్లు, ముచ్చువ్యాధి వ్యాప్తి చెందుతుందన్నారు. ముందస్తుగానే ఇందుకు టీకాలు వేశామని ఎక్కడైన గొర్రెలకు వ్యాధి ఉందంటే అధికారులు స్పందించాలన్నారు. అదే విధంగా రిలయన్స్ పౌండేషన్ ఎన్జీఓ ఆధ్వర్యంలో ప్రతి మండలంలోని గ్రామాల్లో పర్యటించి పశు సంవర్థక శాఖ ఆధ్వర్యంలో రైతులకు ఉపయోగపడే కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో జక్కలచెరువు, పెద్దవడుగూరు, క్రిష్టపాడు, పామిడి, ఎద్దులపల్లి పశు వైద్యాధికారులు అరవిందరెడ్డి,కమలమ్మ, భారతి, తేజశ్వని, తులసిరామిరెడ్డి, టెక్నికల్ మోనివేటర్ జయరామ శర్మ, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీ సుధాకర్

ఎన్టీఆర్ గృహ నిర్మాణాలపై గ్రామసభలు

విడపనకల్లు: మండలంలోని మాళాపురం, కరకముక్కల, ఉండబండ, హావళిగి గ్రామాల్లో ఎన్టీఆర్ గృహ నిర్మాణాలపై అధికారులు గురువారం గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా హౌసింగ్ ఏఈ రామక్రిష్ణ మాట్లాడుతూ మండలంలో 4 వేలకుపైగా ఇళ్లకు జియో ట్యాగ్ చేశారని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరికీ ఆన్‌లైన్‌లో పేర్లను పరిశీలించి అర్హత ఉన్న వారికి పీఎంజీవై ఇళ్లను మంజూరు చేస్తామన్నారు. ఆన్‌లైన్‌లో లేని వారికి ఎన్టీఆర్ గృహాలను మంజూరు చేస్తామని పేర్కొన్నారు. 5వ తేదీ వరకు గ్రామ సభలు నిర్వహించి లబ్ధిదారులను ఎంపిక చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ షకిలాబేగం, డీటీ చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

పాలకవర్గ నిర్లక్ష్యం వల్లే నీటి ఎద్దడి

మాజీ ఎమ్మెల్యే కొట్రికె మధుసూదన్ గుప్తా



గుత్తి: గుత్తి, పామిడి మున్సిపాలిటీల్లో తీవ్ర తాగునీటి ఎద్దడి తలెత్తడానికి పాలక వర్గ నిర్లక్ష్యమే కారణమని మాజీ ఎమ్మెల్యే కొట్రికె మధుసూదన్ పేర్కొన్నారు. గురువారం ఆయన తన స్వగృహంలో విలేకరుల సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు నీటి కోసం నానా అవస్థలు పడుతున్నారన్నారు. తాను 2013లో ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు మిడ్ పెన్నార్ నుంచి ఎంపీఆర్ డ్యాంకు నీటిని తెప్పించి అక్కడి నుంచి గుత్తి, పామిడికి 0.34 టీఎంసీల నీటిని కేటాయించమన్నారు. అప్పట్లో ప్రభుత్వం ఆమోదం కూడా లభించిందన్నారు. ఇందుకు సంబంధించి రూ. 110 కోట్ల అంచనా వ్యయంతో రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు. ఈ ప్రాజెక్టును తెచ్చుకోవడంలో పాలక వర్గం కృషి చేయపోవడమే నీటి ఎద్దడికి ప్రధాన కారణమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి వలి సాహెబ్, నాయకులు నాగరంగ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ర్యాగింగ్ దుష్ఫలితాలతో జీవితాంతం బాధే

ఫ్రెషర్స్ డేలో వక్తలు



సదస్సులో మాట్లాడుతున్న ఎంవీఐ మాధవరెడ్డి

గుంతకల్లు: ర్యాగింగ్ లాంటి అనర్థదాయకమైన చర్యల ద్వారా తప్పటడుగు వేస్తే కారకులు, బాధితులకు పర్యవసానాలు జీవితాంతం వేదిస్తాయిని వక్తలు పేర్కొన్నారు. గురువారం ఉదయం స్థానిక ఎస్కేపీ డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్ డే సందర్భంగా ర్యాగింగ్ వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎన్‌సీసీ విభాగం ఆధ్వర్యంలో చేపట్టగా ప్రిన్సిపాల్ జ్ఞానేశ్వర్ అధ్యక్షత వహించారు. మోటారు వాహనాల తనిఖీ అధికారి మాధవరెడ్డి, వన్‌టౌన్ ఎస్ఐ నగేష్ బాబు ముఖ్య అతిథులుగా హాజర య్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు చదువుల్లో ఓ గోల్‌ను ఏర్పరచుకుని దాన్ని సాధించడానికి నిరంతరం సాధన చేయాలని సూచించారు. ర్యాగింగ్ జోలికి వెళ్లకుండా బుద్ధిగా చదివి, మంచి మార్కులను సాధించి తల్లిదండ్రులకు ఆనందం కలిగించి, బంగారు భవితకు బాటలు వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు పీ జనార్ధన శాస్త్రి, కొండారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'చెట్లతోనే మనిషి మనుగడ'



మొక్కలు నాటుతున్న ప్రిన్సిపాల్ నరహరిప్రసాద్

పామిడి: చెట్లతోనే మానవుని మనుగడ ముడిపడి ఉందని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నరహరి ప్రసాద్ పేర్కొన్నారు. కళాశాల ఆవరణలో గురువారం అధ్యాపకులు, విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థి మొక్కల పెంపకాన్ని బాధ్యతగా భావించాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీఓ జయరామ్, అధ్యాపకులు బాస్కర్‌రెడ్డి, సురేష్, రమణ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రైల్వే బాత్రూంలో పడిపోయిన కోతి... ప్రయాణికుల ఇబ్బంది

గుంతకల్లు: స్థానిక రైల్వే స్టేషన్‌లోని ఓ వెయిటింగ్ హాల్‌లోని బాత్రూంలోకి ఓ మర్కటం జొరబడటంతో ప్రయాణికులు గురువారం రాత్రి తీవ్ర ఇబ్బంది పడ్డారు. సాయంత్రం ఐదు కోతులు కలిసి ఒకదాని పైబడి తీవ్రంగా గాయపరిచాయి. ఈ దాడిలో కోతికి కడుపు చిరిగిపోయి పొట్టలోని ప్రేగులు బైటకొచ్చాయి. దీంతో ఆ మర్కటం 5-6 నెంబర్ ప్లాట్‌ఫారంలోని మగవారి వెయిటింగ్ హాల్‌లోకి జొరబడి, బాత్రూంలో తలదాచుకుంది. ఆ తర్వాత అక్కడి నుంచి బైటకు పోలేక మరణావస్థలో కొట్టుమిట్టాడింది. దీంతో ఏంచేయాలో తెలియక ప్రయాణికులు ఇబ్బందిపడ్డారు. బాత్‌రూములోకి వెళ్లలేక ఉన్న ఒక టాయిలెట్‌ను ఉపయోగించుకోవాల్సి వచ్చింది.

ప్రత్యేక ఓటరు నమోదుకు 5,892 దరఖాస్తులు

ఉరవకొండ: ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం ద్వారా నియోజ కవర్గంలోని ఐదు మండలాల్లో ఫారం-6 కింద 5,892 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ అనిల్‌కుమార్ తెలిపారు. స్థానిక కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 18 నుంచి 19 సంవత్సరాలలోపు 2,958 ఫారం-6 దరఖాస్తులు 19 ఏళ్ల పైనున్నవారి నుంచి 2,933 ఫారం-6 దరఖాస్తులు వచ్చాయన్నారు. 862 ఫారం-7, మార్పుల చేర్పులకు 1,446, పోలింగ్ కేంద్రాల మార్పుకు 150 దరఖాస్తులు వచ్చినట్లు ఆయన తెలిపారు. అలాగే మండలంలో అర్హులైన లబ్ధిదారుల ఎంపికకు ఇంటింటి సర్వే పక్కాగా నిర్వహించాలని వీఆర్వో, కార్యదర్శులకు సూచించారు.

మండల వ్యాప్తంగా మూడు బృందాలుగా ఏర్పడి లబ్ధిదారుల జాబితా తయారు చేయాలన్నారు.

పశు గ్రాసం కొరత తీర్చాలి : బీజేపీ కిసాన్ మోర్చా

గుత్తి: మండలంలో సకాలంలో వర్షాలు కురవక కరువు తాండవిస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం పశుగ్రాసం కొరత తీర్చాలని బీజేపీ కిసాన్‌మోర్చా మండల అధ్యక్షుడు పాలమూరి బాబయ్య, బీజేపీ మండల అధ్యక్షుడు రంగరాజు పేర్కొన్నారు. స్థానిక మన్రోసత్రంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ జూన్ మాసంలో వేసిన వేరుశనగ పంట వర్షాలు లేక ఎండ దశకు చేరుకుందన్నారు. ఎక్కడా గడ్డి మొలకలు కూడా లేక పోవడంతో పశువుల అల్లాడుతున్నాయన్నారు.

కార్యక్రమంలో కిసాన్‌మోర్చా జిల్లా కార్యదర్శి బావిగడ్డ ఓబులయ్య, బీజేపీ జిల్లా కార్యదర్శి మల్లికార్జున, మండల ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, కిసాన్‌మోర్చా మండల కార్యదర్శి బలరాముడు,నాయకులు లక్ష్మన్న, వెంకటరాముడు, సుంకన్న, తదితరులు పాల్గొన్నారు.

6న రంగనాథస్వామి కల్యాణం

గుత్తిరూరల్: మండలంలోని జక్కల చెరువు గ్రామంలో వెలసిన బొలికొండ రంగనాథస్వామి ఆలయంలో ఆదివారం ఉదయం కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఈఓ నాగేంద్రరావు గురువారం తెలిపారు. ఆదివారం ఉదయం స్వామివారికి అభిషేకాలు, సహస్ర నామార్చనలు, కలశస్థాపన, గణపతి పూజ, ఉదయం 11-05 గంటలకు శ్రీదేవి, భూదేవి సహిత బొలికొండ రంగనాథస్వామి కల్యాణం నిర్వహిస్తున్నామన్నారు. సాయంత్రం స్వామివారి పల్లకీ ఊరేగింపు, ఊంజల సేవ నిర్వహిస్తామని వారు తెలిపారు.

తల్లిపాలే శ్రేయస్కరం

గుత్తి: తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరమని సీడీపీఓ సుగుణమ్మ పేర్కొన్నారు. ఐసీడీఎస్ కార్యాలయం వద్ద గురువారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. మానవహారం నిర్వహించి తల్లిపాలే బిడ్డకు శ్రీరామ రక్ష అంటూ పుట్టిన బిడ్డకు గంటలోపే ముర్రుపాలు తాపాలంటూ నినాదాలు చేశారు. స్థానిక మార్కెట్‌యార్డులో ప్రాజెక్టు కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిపాల వారోత్సవాల కార్యక్రమాన్ని ఈ నెల 7వ తేదీ వరకు ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించాలన్నారు.

గేట్స్ అధినేతకు ఘన సన్మానం

గుంతకల్లురూరల్: మండలంలోని అయ్యవారిపల్లి గ్రామ సమీపంలో వెలసిన ఆంజనేయస్వామి ఆలయం వద్ద స్వచ్ఛందంగా బోరు వేసిన గేట్స్ ఇంజనీరింగ్ కళాశాల అధినేత వీకే సుధీర్‌రెడ్డికి సర్పంచు దామోదర్‌రెడ్డి గురువారం సన్మానం చేశారు. ఈ సందర్భంగా సర్పంచు మాట్లాడుతూ గ్రామ శివారులో వెలసిన ఆంజనేయస్వామి ఆలయంలో పెళ్లిళ్ల సీజన్‌లో ఎక్కువగా వివాహాలు జరుగుతుంటాయన్నారు. ఆలయం వద్ద ఉన్న బోరు నిరుపయోగంగా మారడంతో భక్తులకు తీవ్ర ఇబ్బందులు కలిగేవన్నారు. గ్రామస్థుల అభ్యర్థన మేరకు ఆలయం వద్ద భక్తుల అవసరాలను తీర్చేందుకు గాను బోరును వేయించిన వీకే సుధీర్‌రెడ్డికి గ్రామస్థులు కృతజ్ఞతలు తెలియజేశారు. బోరును వీకే సుధీర్‌రెడ్డి వేయించగా, గుంతకల్లుకు చెందిన వ్యాపారి కోళ్లపారం సుధాకర్‌రెడ్డి మోటార్‌ను అమర్చేందుకు విరాళాన్ని అందజేశారు.

బేతాపల్లిలో

రైతు సేవలో రెవెన్యూ శాఖ

గుత్తిరూరల్: మండలంలోని బేతాపల్లి గ్రామంలో గురువారం రైతుసేవలో రెవెన్యూ శాఖ కార్యక్రమాన్ని డిప్యూటీ తహసీల్దార్ మునివేలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో భూ సమస్యలుంటే అర్జీల రూపంలో ఇవ్వాలని రైతులకు తెలిపారు. రైతులనుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో ఆర్ఐ సూర్యనారాయణ, సర్పంచు నాగేంద్ర, వీఆర్వోలు, తదితరులు పాల్గొన్నారు.

యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

- అర్బన్ సీఐ రాజ

గుంతకల్లుటౌన్: యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని అర్బన్ సీఐ రాజా పేర్కొన్నారు. స్థానిక గంగానగర్‌లో అర్బన్ సీఐ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం మెరుగైన సమాజం కొరకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ చెడు వ్యసనాలకు బానిసై జీవితాన్ని నాశనం చేసుకోవద్దని సూచించారు.

బెల్టు షాపులు నిర్వహిస్తే, పేకాట, మట్కారాస్తే పోలీసుల దృష్టికి తీసుకుని రావాలన్నారు. కార్యక్రమంలో వన్‌టౌన్ ఎస్ఐ నగేశ్‌బాబు, వార్డు ఇన్‌చార్జ్ రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఎమ్మార్ టీకా కార్యక్రమం



విద్యార్థులకు టీకాలు వేస్తున్న వైద్య సిబ్బంది

గుంతకల్లుటౌన్: పట్టణంలోని అంబేద్కర్‌నగర్, వీవీ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో గురువారం పిల్లలకు ఎమ్మార్ టీకాలు వేశారు. ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ కమలమ్మ ఆధ్వర్యంలో మూడు బృందాలు ఏర్పాటు చేశారు. ఏరియా ఆసుపత్రి పీపీ యూనిట్ సూపర్‌వైజర్ భగవాన్ దాస్ ఆధ్వర్యంలో అంబేద్కర్‌నగర్, పాతగుంతకల్లులోని వీవీ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో చదివే విద్యార్థులకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 9 నెలల నుంచి 15 సంవత్సరాల పిల్లలను తప్పనిసరిగా టీకాలు వేయించాలన్నారు. ఈ వ్యాక్సిన్ ద్వారా తట్టు, రుబెల్లా వ్యాధులను నివారించవచ్చునన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు దాదాపు 500 మంది విద్యార్థులకు టీకాలు వేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వీవీ ఇంగ్లీష్ మీడియం పాఠశాల హెచ్ఎం కళావతి, డైరెక్టర్ మంజులా వెంకటేష్, సూపర్‌వైజర్లు జయరామ్, రియాజ్, చంద్రకాంత, ఏఎన్ఎంలు జ్యోతి, మహాలక్ష్మీ, లక్ష్మీదేవి, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

రెండు దేవాలయాల్లో చోరీకి యత్నం

చిలమత్తూరు : మండలంలోని కమ్మయ్యగారిపల్లి, శెట్టిపల్లి గ్రామాల్లోని రెండు దేవాలయాల్లో చోరీకి బుధవారం రాత్రి దుండగులు విఫలయత్నం చేశారు. మొదట గంగమ్మ ఆలయంలో తాళాలు బద్దలకొట్టి గంట, 25కేజీల బియ్యం, హుండీలోని సుమారు రూ.2వేల నగదు, 3కేజీల దీపాల నూనె అపహరించారు. అనంతరం పక్కనే ఉన్న శెట్టిపల్లి గ్రామానికి వెళ్లి అక్కడ శ్రీచౌడేశ్వరీదేవి ఆలయ తాళాలు పగలకొట్టి చోరీకి ప్రయత్నించారు. అయితే ఆలయ పూజారి నారాయణ అలికిడి విని కేకలు వేయడంతో గ్రామస్థులు వెంటనే అక్కడకు చేరుకున్నారు. దీంతో దుండగులు తాము అంతకు ముందే అపహరించిన వస్తువులను కూడా అక్కడే వదిలి పారిపోయారు.

సరిహద్దు పెట్రోల్ బంక్‌లకు ధరల సెగ

- ఆంధ్రా, కర్ణాటక ధరలలో భారీ వ్యత్యాసం
- చిలమత్తూరు మండలంలో మూతపడుతున్న బంకులు



మండలంలోని కొడికొండ చెక్‌పోస్టులో మూతపడ్డ ఏపీ అసోసియేట్ పెట్రోల్ బంకు

చిలమత్తూరు : పక్కనున్న కరాణటక రాష్ట్రంతో పో ల్చితే నవ్యాంధ్రలో ప్రస్తుతం పెట్రోల్, డీజిల్ ధరలు అధికంగా ఉంటున్నాయి. రెండేళ్లుగా పక్క రాష్ట్రంలో కన్నా మనరాష్ట్రంలో డీజిల్‌పై రూ.3, పెట్రోల్‌పై రూ.2 ధర అధికంగా ఉండేది. అయితే జీఎస్‌టీ అమలు నేపథ్యంలో కర్ణాటక ప్రభుత్వం పెట్రోలియం ఉత్ప త్తులపై ప్రవేశ రుసుము తొలగించింది. దీంతో ఇటీవ ల కర్ణాటకలో ధరలు మరింత తగ్గాయి. అయితే మన రాష్ట్రంలో మాత్రం వాటి ధరలు ఏమాత్రం తగ్గలేదు. కర్ణాటకతో పోల్చితే ప్రస్తుతం మన రాష్ట్రంలో డీజిల్‌పై ధరలు లీటరుకు రూ.7, పెట్రోల్‌పై రూ. 5.50 అధికం గా ఉంటున్నాయి. ఈ ధరల వ్యత్యాసం కారణంగా కర్ణాటక సరిహద్దులకు అనుబంధంగా ఉన్న పెట్రోల్ బంకులపై తీవ్ర ప్రభావం చూపుతోంది. వినియోగదా రులు కర్ణాటకకు వెళ్లి పెట్రోల్, డీజిల్ కొనుగోలు చేస్తున్నారు. దీంతో ఇక్కడ ఉన్న పెట్రోల్ బంక్‌ల వి క్రయాలు భారీగా పడిపోయాయి. దీంతో ఇక్కడి బంకులు నష్టా లు చవిచూస్తు న్నా యి. కావున నిర్వహణ భారమై పెట్రోల్ య జమానులు బంకు ల ను మూసివేయ డానికి సిద్ధపడుతున్నారు. కర్ణాటక రాష్ట్రానికి సరి హద్దులో ఉన్న చిలమత్తూరు మండలంలో ప్రస్తుతం 10పెట్రోల్ బంక్‌లు ఉ న్నాయి. పక్కనున్న రాష్ట్రంలో డీజిల్, పెట్రోల్ ధరలు తక్కు వగా ఉండటంతో... ఇక్కడి బంకులు వ్యాపారాలు లేక వెలవెలబోతున్నా యి. ఫలితంగా నిర్వహణ భారమై ఇప్పటికే రెండు బంకులను మూసివేశారు. కొడికొండ చెక్‌పోస్టులోని జేపీ అసోసియేషన్ పెట్రోల్‌బంక్‌ను, కొడికొండలోని నంజుండేశ్వర కిసాన్‌సేవ కేంద్రం పెట్రోల్‌బంక్‌ను ఇప్పటికే మూసివేశారు. మిగిలిన బంకులను కూడా మూసివేస్తామని వాటి యజమానులు పేర్కొంటున్నారు.


సిబ్బంది జీతాలు ఇవ్వలేకపోతున్నాం



కర్ణాటక రాష్ట్రంతో పోల్చితే ఇక్కడ డీజిల్, పెట్రోల్ ధరలు అధికంగా ఉంటున్నాయి. ఫలితంగా అమ్మకాలు భారీగా తగ్గిపోయాయి. గతంలో నెలకు 3లక్షల లీటర్ల డీజిల్, పెట్రోల్ విక్రయించేవారం. ప్రస్తుతం నెలకు 30వేల లీటర్లు మాత్రమే విక్రయిస్తున్నాం. దీంతో ఆదాయం భారీగా తగ్గిపోయింది. సిబ్బంది జీతభత్యాలు, కరెంటు బిల్లులు చెల్లించలేకపోతు న్నాం. పరిస్థితి ఇలాగే కొనసాగితే బంకును మూసేస్తాం. ఒకే దేశం, ఒకే పన్ను విధానంలో భాగంగా జీఎస్‌టీ అమలు చేయాలి.

- పాపన్న, ఈశ్వర్‌ఫిల్లింగ్ సెంటర్

అమ్మకాలు బాగా తగ్గిపోయాయి



ధరల్లో వ్యత్యాసం కారణంగా అమ్మకాలు భారీగా తగ్గిపో యాయి. గతంలో నెలకు 6లక్షల లీటర్ల పెట్రోల్, డీజిల్ విక్రయించేవారం. జిల్లాలోనే మా పెట్రోల్ బంక్ అమ్మకాల్లో మొదటి స్థానంలో ఉండేది. ప్రస్తుతం నెలకు 10నుంచి 12లీటర్లు మాత్రమే విక్రయిస్తున్నాం. నిర్వహణ కష్టసాధ్యంగా మారుతోంది.

- నారా రామక్రిష్ణయ్య, సాయిగణేష్ ఫిల్లింగ్ స్టేషన్


లోకల్ గైడ్

హిందూపురం మార్కెట్‌లో కూరగాయల ధరలు



టమోట రూ.60, ఉల్లి 15, మిరప 60-80, బీరకాయ 40, ఉర్లగడ్డ 30, వంకాయ 20, బెండకాయ 60, క్యారెట్ 60, బీన్స్ 60, కోసు 30, మునగ 80, ముల్లంగి 30, బటాణి 120, సీమవంకాయ 60, నెమలికోసు 80, దొండకాయ 60, బీట్‌రూట్ 20, క్యాబేజి 30, తెల్లగడ్డలు 120, కాకరకాయ 60, సొరకాయ 30, గోరు చిక్కుడు 60, చిక్కుడు 60, క్యాప్సికమ్ 60, అల్లం : 80

పట్టుగూళ్ల ధరలు



కనిష్ఠం (సీబీ) రూ.301.00, (బైవోల్టీన్) 358.00,గరిష్ఠం (సీబీ)415.00,(బైవోల్టీన్) 447.00, సగటు (సీబీ) 358.00, (బైవోల్టీన్) 402.00.

చింతపండు ధరలు

కర్పూలి 10 కిలోలు రూ.600-1575, ఫ్లవర్ రకం రూ.350-850, బోటురకం రూ.200-250

హిందూపురంలో సినిమాలు

శ్రీనివాస - దండుపాళ్యం -2, విష్ణు - పిదా, గురునాథ్- గౌతమ్‌నంద, అమృత్ - రారండోయ్ వేడుక చూద్దాం లక్ష్మీ - డీజే దువ్వాడ జగన్నాథం, బాలాజీ - బాహుబలి -2

తల్లిపాలతోనే బిడ్డకు ఆరోగ్యం


ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

హిందూపురం టౌన్ : పుట్టినప్పటి నుంచి రెండేళ్ల వరకు తల్లిపాలు ఇవ్వడంవల్ల బిడ్డ ఆరోగ్యవంతంగా ఎదుగుతుందని ఏసీడీపీఓ శ్రీలత అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా గురువారం మండలంలోని చలివెందులలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీడీపీఓ మా ట్లాడుతూ తల్లిపాల విశిష్టతపై గర్భిణులు, బాలింతలకు వివరించారు. ముర్రుపాలు తాగడంవల్ల బిడ్డకు ప్రయోజనాలు తెలియజేశారు. ప్రతి తల్లి బిడ్డకు రెండేళ్ల వయసు వరకు పాలు తాపాలన్నారు. ఈ కార్యక్ర మంలో సూపర్‌వైజర్ పుల్లమ్మ, హెచ్ఎం ప్రసాద్, శోభారాణి, విజయ లక్ష్మి, అరుణమ్మ, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు. అలాగేఎస్‌సడ్లపల్లి, ఎన్టీఆర్ కాలనీలో తల్లిపాల వారోత్సవాలపై అంగనవాడీ కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగనవాడీ కార్యకర్తలు లక్ష్మీదేవి, రాజేశ్వరీ, ఖాసింబీ, మంజుల తదితరులు పాల్గొన్నారు.

శిరివిరంలో రైతు సేవలో రెవెన్యూశాఖ

లేపాక్షి : రాష్ట్ర ప్రభుత్వం రైతుల సమస్యలు తీర్చేందుకు ప్రతిష్ఠా త్మకంగా చేపట్టిన రైతు సేవలో రెవెన్యూశాఖ కార్యక్రమం గురువారం శిరివరంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఆనంద్ కుమార్ మాట్లాడుతూ రైతు సమస్యలపై నిర్వహించిన కార్యక్రమానికి పట్టాదారు పాసుపుస్తకాలు 6, రుణాలు 4, అడంగల్ 2, ఆధార్ అనుసంధానం 15, అందినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ మురళీ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

'వాసవీ విన్నర్స్'లో పాదపూజ



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఇన్‌చార్జ్ ఎంఈఓ సురేష్‌బాబు, అశ్వత్థనారాయణస్వామి తదితరులు

హిందూపురం టౌన్: పట్టణంలోని వాసవీవిన్నర్స్ పాఠశాలలో గురువారం తల్లిదండ్రుల పాద పూజోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎంఈఓ సురేష్‌బాబు బూడిదగడ్డపల్లి అశ్వత్థనారాయణస్వామి మాట్లాడుతూ... తల్లిదండ్రుల ను గౌరవించాలని సూచించారు. ఎంత ఎత్తుకు ఎదిగినా తల్లిదండ్రులు లేనిదే మనం లేదని భావించాలి. ప్రస్తుత సమాజంలో తల్లి, తండ్రి, గురువు, దైవం, పెద్దలను గౌరవిస్తున్నవారే ఉన్నత శిఖరాలకు చేరుకుం టున్నారన్నారు. తల్లిదండ్రులు బిడ్డల ఎదుగుదలకు కృషి చేస్తారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు తల్లిదండ్రుల పాదాలకు పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కుమార్‌రాజ్, కళాశాల అధ్యక్షుడు కు మార్, ఉపాధ్యక్షుడు దాసాసతీష్, కార్యదర్శి అనీల్‌కుమార్, అశోక్, మధుసూదనయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికులే ఆర్టీసీకి దేవుళ్లు : ఈడీ

హిందూపురం అర్బన్: ప్రయాణికులే ఆర్టీసీకి దేవుళ్లని ఆర్టీసీ ఆపరేషన్ విభాగం ఈడీ జయరావ్ పేర్కొన్నారు. ఆయన గురు వారం స్థానిక ఆర్టీసీ కార్యాలయంలో విలేక రుల సమావేశంలో మాట్లాడారు. ప్రయాణి కులను గమ్యస్థానానికి సురక్షితంగా చేర్చే బాధ్యత ఆర్టీసీ వారిదే అన్నారు. ప్రయాణి కులతో మర్యాదగా ప్రవర్తించాలని కండక్టర్, డ్రైవర్లకు సూచించామన్నారు. ముఖ్యంగా ఏపీ ఆర్టీసీ బస్సులు కర్ణాటకలో ఏఏ రహదా రుల్లో ప్రయాణిస్తే ఆర్టీసీ లాభాలబాటలో న డుస్తుందో పరిశీలించామన్నారు. అలాగే జిల్లా వ్యాప్తంగా నాలుగు బృందాలు పర్యటి స్తున్నట్లు తెలిపారు. ఆర్టీసీ లాభాలబాటలో నడిచేందుకు తీసుకునే చర్యలపై శుక్రవారం అనంతపురంలో డిపో మేనేజర్లతో సమావే శం ఉంటుందన్నారు. ప్రస్తుతం పురం డిపో లో నష్టాలు తగ్గుముఖం పట్టాయన్నారు. అ యితే బెంగళూరు రోడ్డు మరమ్మతులు చేప డుతున్న కారణంగా బెంగళూరుకు వెళ్లే బస్సుల్లో నష్టాలు వస్తున్నాయని పేర్కొన్నా రు. హిందూపురం - కదిరి బస్సులు ప్రతి రోజు 20 సర్వీసులు తిరుగుతున్నాయని అతి తక్కువ నష్టం వస్తుందన్నారు. ఈ నష్టాన్నీ త్వరలో పూరిస్తామన్నారు. అన్ని రహదారు లను అనాలసిస్ చేసి లాభాలు వచ్చేందుకు కార్యచరణ రూపొందిస్తామన్నారు. ప్రస్తుతం కొన్ని ఆప్రాంతాలకు వెళ్లే బస్సుల్లో డీజిల్ ధరకూడా రావడంలేదన్నారు. ఆర్టీసీ బస్సు ప్రయాణంపై గ్రామాల్లో అవగాహన కార్య క్రమాలు చేపట్టాలని డీఎంకు సూచించారు. విద్యార్థులకు కొడికొండ చెక్‌పోస్టు నుంచి ప్రత్యేక బడిబాట బస్సు నడపనున్నట్లు తె లిపారు. సీనియర్ సిటిజన్‌లకు ఆర్టీసీలో 25 శాతం సబ్సిడీ ఉంటుందని ఈ విషయంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ రమాకాంత్, డీఎం గోపీనాథ్ ఉన్నారు.

తాగునీటి కోసం ఆందోళన

చిలమత్తూరు : మండలంలోని వీరాపురం గ్రామ పంచాయతీ పరిధిలోని లక్ష్మీ పురంలో నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరుతూ ఆ గ్రామస్థులు గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. తమ గ్రామంలోని తాగునీటి పథకం బోరులో నీరు ఎండిపోవడంవల్ల ఫిబ్రవరి నుంచి తాగునీటి సమస్య నెలకొందన్నారు. అప్పటి నుంచి ఆదెప్ప అనే రైతు బోరును అద్దెకు తీసుకుని అధికారులు నీరు సరఫరా చేశారని, లీజు సొమ్మును చెల్లించలే దన్న కారణంతో ఆ రైతు రెండు రోజులుగా నీటి సరఫరాను ఆపివేశాడన్నారు. ఇటీవల ఎంపీ నిమ్మల కిష్టప్ప నిధులతో అధికారులు తమ గ్రామంలో బోరువేశా రన్నారు. అందులో సమృద్ధిగా నీరు పడిందని దానికి మోటారు బిగించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. ఈ విషయమై ఎంపీడీఓ శివానందనాయక్‌ను వివరణ కోరగా కొత్తగా వేసిన బోరుకు రెండురోజుల్లో మోటా రును బిగించి తాగునీటి సమస్యను పరిష్కరిస్తామన్నారు.


తాగునీటి కోసం ఆందోళన చేస్తున్న లక్ష్మీపురం వాసులు

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

హిందూపురం టౌన్ : పట్టణంలోని 17,18,31వ వార్డుల్లో సీసీ రోడ్డు నిర్మాణానికి గురువారం టీడీపీ నాయకులు భూమిపూజ చేశారు. జడ్పీ సబ్‌ప్లాన్ కింద, 14వ ఫైనాన్స్ నిధులు రూ.15లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ జేపీకే రాము, కౌన్సిలర్లు హిదాయతుల్లా, సునీత, ముబీనాఖానం, ఎమ్మెల్యే పీఏ వీరయ్య, టీడీపీ నాయకులు నాగరాజు, సనావుల్లా, ఆంజనేయులు, సుమోశీన, గోపీ, నజీర్‌అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఆమ్మవారి వేషధారణలు


అష్టలక్ష్మీ అమ్మవారి వేషధారణలో చిన్నారులు

హిందూపురం అర్బన్: పట్టణ పరిధిలోని వివేకానంద మిలీనియం పాఠశాలలో గురువారం విద్యార్థులు నిర్వహించిన వరలక్ష్మీ అమ్మవారి వేశధారణలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. శ్రావణమాసంలో రెండో శుక్రవారం వచ్చే విశిష్టపండుగే వరలక్ష్మీ పండుగ. అమ్మవారిని భక్తి శ్రద్ధలతో పూజిస్తే కష్టనష్టాలు తొలగి సుఖశాంతులు కలుగుతాయని భక్తుల నమ్మకం. ఈ పవిత్ర పండుగ ను పురస్కరించుకుని పాఠశాల విద్యార్థులు అష్టలక్ష్మీ అమ్మవారి వేశధారణలో అందరినీ అకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో కరెస్పాండెంట్ బైసాని రాంప్రసాద్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


అరటి పిలకలు, చెరుకుమోసుల విక్రయాలు


ప్రత్యేక అలంకరణలో అమ్మవారి ప్రతిమ



పలు రకాలు పూలు, పండ్లు

'పురం'లో వరలక్ష్మీ పండుగ జోరు

హిందూపురం అర్బన్: శ్రావణమాసం హిందువులకు పవిత్రమైనది. అందులోనూ సిరులు కురుపించే వరలక్ష్మీ పండుగను ప్రతిఒక్కరూ ఘనంగా చేసుకుంటారు. ఆ తల్లిని పూజిస్తే కష్టాలు తొలగి సకల సౌభాగ్యాలు కలుగుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఇందులో భాగంగా గురువారం సాయంత్రం పట్టణంలో అమ్మవారి పూజా సామగ్రితో పాటు, తమలపాకులు, రంగు రంగుల పువ్వులు, ఆర్టిఫిషియల్ పువ్వులు, అరటిగెలలు, చెరుకు మోసులు, పండ్లు కొనుగోలు చేసేందుకు ప్రజలు పోటీపడ్డారు. ముఖ్యంగా అమ్మవారి ముఖంతో చీరకట్టులో సింహాసనంపై కూర్చున్న విగ్రహాన్ని అందంగా అలకంరించారు. వీటితోపాటు ప్లాస్టిక్ పువ్వులు డెకరేషన్‌కు చాలా బాగా అకట్టుకోవడంతో భక్తులు కొనుగోలు చేశారు. మార్కెట్ కొనుగోలు దారులతో కిటకిటలాడింది. ధరలు తారాస్థాయిలో ఉన్నా కొనుగోలుకు ఆసక్తి చూపారు.


పూజా సామగ్రి కొనుగోలు చేస్తున్న ప్రజలు

ప్రభుత్వాసుపత్రిలో అనాథ శవం


ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్న మృతదేహం

హిందూపురం అర్బన్: ప్రభుతాసుపత్రిలో అనాథశవం పడివుంది. ఎందుకొచ్చాడో తెలియదుకానీ హిందూపురం మార్చరీ గదివద్ద పడిఉన్నాడు. పోస్టుమార్టం నిర్వహించే గదివద్ద బుధవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తి(42) పడి ఉండటాన్ని స్థానికులు గమనించి పోలీసులకు సమచారం అందించారు. ఏఎస్‌ఐ జయలలిత సంఘటనా స్థలం చేరుకుని కేసు నమోదు చేసుకున్నారు. మృత దేహాన్ని గుర్తించిన వారు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో తెలపాలన్నారు. అనంతరం మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు.

అభివృద్ధితోనే ముందుకెళ్తాం

పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బీకే


లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే బీకే పార్థసారథి

పరిగి : ప్రజలకు సంక్షేమ పథ కాలను అందించడంతో పా టు రాష్ట్రాభివృద్ధే లక్ష్యంగా టీడీపీ ప్రభు త్వం ముందుకె ళ్తుందని పెనుకొండ ఎ మ్మెల్యే బీకే పార్థసా రథి పేర్కొన్నారు. ఆయన గురువారం మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమా ల్లో పాల్గొన్నారు. పైడేటి గ్రామంలో రూ.15 లక్షలతో నిర్మించిన రెండు అంగన్‌వాడీ భవనాలను, రూ.2లక్షలతో రచ్చకట్టను ప్రారంభించారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రం విడిపోయిన తరువాత చంద్రబాబు నాయుడు నాయకత్వంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి ప్రజల మన్ననలు పొందామన్నారు. పెనుకొండ, హిందూపురం పరిసర ప్రాంతాల్లో యువత ఉపాధికి కియా, బెల్, నాసెన్, తదితర పరిశ్రమలను నెలకొల్పడానికి ప్రభుత్వం ముమ్మర ప్రయత్నాలు చేస్తోందన్నారు. వచ్చే రెండేళ్లలో పెనుకొండ నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు. పరిగి మండల కేంద్రంలో రూ.7కోట్లతో అండర్ డ్రైనేజీ, రోడ్డు తదితర కార్యక్రమాలతో సుందరంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలిపారు. రూ.22కోట్లతో మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రతి గ్రామానికి రూ.20లక్షలతో సీసీ రోడ్ల నిర్మించనున్నట్లు తెలిపారు. ఎన్టీఆర్ గృహకల్ప కింద పేదవారికి ఎన్టీఆర్ మోడల్ కాలనీ నిర్మాణానికి స్థలాలు సేకరిస్తున్నట్లు తెలిపారు. గతంలోనే స్థలాలున్నవారికి ఇళ్లను మంజూరు చేసినట్లు తెలిపారు. అనంతరం పీ నర్సాపురంలో ఎన్టీఆర్ సుజలస్రవంతి పథకాన్ని ఎన్ ముద్దిరెడ్డిపల్లిలో సీసీరోడ్లు, ధనాపురంలో ఎన్టీఆర్ సుజలస్రవంతి పథకం, వన్నంపల్లి, జంగాలపల్లిలో అంగనవాడీ కేంద్రాలను ప్రారంభించారు.

ఈ కార్యక్రమంలో ఎంపీపీ సత్యనారాయణ, జడ్పీటీసీ సభ్యుడు సూర్య నారాయణ, వైస్ ఎంపీపీ చౌడప్ప, మండల కన్వీనర్ గోవిందరెడ్డి, జిల్లా తెలుగు యువత నాయకులు హనుమయ్య, ఊటకూరు సర్పంచ్ ఈశ్వరప్ప తదితరులు పాల్గొన్నారు.

రోజు రోజుకు జగన్ గ్రాఫ్ పడిపోతోంది : బీకే

పరిగి : రోజురోజుకు ప్రతిపక్ష నాయకులు జగన్ గ్రాఫ్ పడిపోతోందని ఎమ్మెల్యే బీకే పార్థసారథి అన్నారు. పభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను చూసి ఓర్వలేక అనవసర రాద్ధాంతం చేస్తున్నారని, ఆయనకు సొంత తెలివిలేకనే ప్రశాంత్ కిషోర్‌ను అరువుగా తెచ్చుకున్నారని విమర్శించారు. పైడేటిలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతిపక్షం రోజు రోజుకు దిగజారిపో తోందన్నారు. ప్రభుత్వం చేపట్టిన అనేక కార్యక్రమాలను ఉద్దేశ్యపూర్వ కంగా విమర్శించడం తగదన్నారు. వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీతో ఢీకొనలేక బెంబేలెత్తిపోతోందన్నారు. అందుకే ఇతరులను అరువుగా తెచ్చుకుని ఎన్నికల్లో నెగ్గాలని ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ 140స్థానాలకు పైగా గెలుపొందడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన

హిందూపురం టౌన్ : అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అగ్నిమాపక శాఖాధికారులు తెలియజేశారు. గురువారం అగ్నిమాపక యంత్రాలు వెళ్లలేని ప్రాంతాలైన హస్నాబాద్, అహ్మద్‌నగర్, సదాశివనగర్‌లోని ఇరుకు వీధుల్లో అగ్నిమాపక ద్విచక్ర యంత్రాన్ని తీసుకెళ్లి అక్కడి ప్రజలకు వివరించారు. గ్యాస్ సిలెండర్‌లు పేలినప్పుడు ఎలక్ట్రికల్ షార్ట్‌సర్క్యూట్ అయినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక అధికారి అశ్వర్థ, సిబ్బంది రామాంజనేయులు, సమర్థరామ్ పాల్గొన్నారు.

డీఐవైపీలో రాణించిన పురం విద్యార్థి


బహుమతి అందుకుంటున్న విద్యార్థి తేజసాయి

హిందూపురం టౌన్ : మదనపల్లిలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో చదువుతున్న పురం విద్యార్థి తేజసాయి డైనమిక్ ఐడియాస్ బైయింగ్ ఆస్పిరెంట్స్ పోటీల్లో రాణించినట్లు విద్యార్థి తండ్రి సీజే మనోహర్ తెలిపారు. తేజసాయి మిట్స్‌లో బీటెక్ థర్డ్ ఇయర్ ఇంజనీరింగ్ చదువుతున్నాడు. ఈడీసీ వారు నిర్వహించిన ఈ పోటీల్లో మూడో బహుమతి కింద రూ.3వేలు పారితోషికం అందజేసినట్లు తెలిపారు. ఇప్పటి వరకు పలు పోటీల్లో పాల్గొని అవార్డులు సాధించారని తెలిపారు.

మృతి చెందిన జీవాల విక్రయం


మృతి చెందిన గొర్రెను ద్విచక్రవాహనంలో తీసుకెళ్తున్న దృశ్యం

హిందూపురం అర్బన్: పురంలోని మాంసం దుకాణాలలో మృతి చెందిన జీవాల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. రోగాల బారిన పడి మృతి చెందిన గొర్రెలు, మేకలను తక్కువ ధరకే పెంపకం దారులు అమ్మతున్నారు. సంపాదనే ధ్యేయంగా పెట్టుకున్న వ్యాపారులు నిబంధనలు పక్కన పెట్టి లాభాలు గడించవచ్చని వాటిని కొనుగోలు చేస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లోపంవల్ల ఏ మాత్రం భయం లేకుండా రోగాల బారిన పడిన, మృతి చెందిన జీవాలను మాంసం దుకాణాల్లో కొనుగోలు చేసి విక్రయిస్తున్నారు. అటువంటి వాటిని కర్ణా టక ప్రాంతం నుంచి తీసుకొచ్చి ఇక్కడ విక్రయిస్తున్నట్లు తెలిసింది. గురువారం ఎస్‌బీఐ ఎదురుగా ఉన్న మంసం దుఖాణాల్లో మృతి చెందిన గొర్రెను విక్రయించారు. అది అంత్రాక్స్ వ్యాధితో మృతి చెంది ఉంటే ఆ మాంసం తిన్న వారికి కూడా వ్యాధి వచ్చే అవకాశాలు ఉన్నాయి. గత ఏడాది శిరివరం, కర్ణాటక బార్డర్ చింతలపల్లి ప్రాంతాల్లో గొర్రెలు అంత్రాక్స్ వ్యాధితో చనిపోయాయి. శిరివరానికి చెందిన ఓ విద్యార్థి అంత్రాక్స్ బారిన పడిన విషయం తెలిసిందే. అయితే ఇవేమీ తమకు పట్టనట్లు వ్యాపారులు, అధికారులు వ్యవహరిస్తున్నారు. ఇలాగే కొనసాగితే పట్టణ ప్రజలు వ్యాధుల బారిన పడకమానదు.

వరలక్ష్మీవ్రతానికి తరలిరండి : త్రిశక్తిమయి పీఠం

కదిరిటౌన్ : హేవళంభినామ సంవత్సరం శ్రావణ శుక్రవారం ద్వాదశి సందర్భంగా వరలక్ష్మీవ్రతం నిర్వహిస్తున్నట్లు శ్రీ త్రిశక్తిమయిపీఠం కార్యవర్గ సభ్యులు తెలిపారు. కదిరి పట్టణంలోని ఇందిరా నగర్ కాలనీలోని శ్రీ త్రిశక్తిమయి పీఠంలో శ్రీవరలక్ష్మీవ్రతం త్రిశక్తి మయిస్వామి అమృతహస్తాలతో ఉదయం 9.30 గంటల నుంచి 11 గంటల వరకు నిర్వహిస్తామన్నారు. ముఖ్య అతిథిగా టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కందికుంట వెంకటప్రసాద్ సతీమణి యశోద హాజరవుతున్నట్లు తెలిపారు. భక్తాదులు అందరూ హాజరై అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

భయం..భయంగా..

- కూలడానికి సిద్ధంగా ఉన్న భవనాల్లోనే పాఠశాలల నిర్వహణ
- అర్జీలు ఇచ్చినా మంజూరు కాలేదంటున్న ఉపాధ్యాయులు





మెయిన్ స్కూల్‌లో నెర్రలు చీలిన పాఠశాల పైకప్పు, అన్ని తరగతులను ఒకే గదిలో నిర్వహిస్తున్న దృశ్యం,శిథిలావస్థకు చేరుకుంటున్న పాఠశాల

నంబులపూలకుంట : ప్రభుత్వం లక్షలాది రూపాయలు వెచ్చించి పేద విద్యార్థులకు విద్యాబుద్దులు నేర్పించేందుకు నెలకొల్పిన పాఠశాల భవనాలు ఎప్పుడు కూలుతాయోనన్న స్థితికి చేరుకున్నాయి. భయాందోళనలో బిక్కు బిక్కు మంటూ ఉపాధ్యాయులు విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధించే పరిస్థితి నెలకొంది. మండల వ్యాప్తంగా 43 ప్రాథమిక, 11 ప్రాథమికోన్నత పాఠశాలల్లో 3200 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. వీటిలో ఎన్పీకుంట మెయిన్ స్కూల్, యర్రవంకలవారిపల్లి, దిగువతూపల్లి, గంగినాయినివారిపల్లి, ముడపలజీవి పాఠశాలలు ఎప్పుడు కూలుతాయోనన్న ఆందోళన నెలకొంది. ఎన్పీకుంట మెయిన్ స్కూల్‌లో చాలా రోజులుగా చిన్నపాటి వర్షానికి భవనం కారడమే కాకుండా.. పై కప్పు పెచ్చులు ఊడిపోతున్నాయి. భవనం పై భాగం తీర్లతో నిర్మించడంతో అవి తుప్పు పట్టి కూలడానికి సిద్ధంగా ఉన్నాయి. ఈ భవనంలో పాఠశాల నిర్వహించాలంటే భయమేస్తోందని ఉపాధ్యాయులే అంటున్నారు. నూతన పాఠశాల భవనం మంజూరు చేయాలని యేడాది క్రితం దరఖాస్తు చేసుకున్నా.. నేటికీ మంజూరు కాలేదని తెలుపుతున్నారు. ఈ పాఠశాల సమీపంలోనే ప్రభుత్వం మరు గుదొడ్లు నిర్మించినా అవి కూడా నిరుపయోగంగా ఉన్నాయి. పాఠశాలకు సమీపంలో ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని విద్యార్థులు మరుగుదొడ్లకు వెళ్లేందుకు జంకుతున్నారు. మరుగుదొడ్ల కోసం వాటర్ ట్యాంక్‌ను ఏర్పాటు చేసినా.. అందులో నీరు లేదు. దీంతో మరు గుదొడ్లు నిరుపయోగంగా మారిపోయాయి. అలాగే మండల కేంద్రంలోని ఇందిరా కాలనీలో ప్రభుత్వ పాఠశాల భవనం లేక పోవడంతో 2005 సంవత్సరం నుంచి ఆర్డీటీ గ్రామ పాఠశాల భవనంలో కొనసాగిస్తున్నారు. ప్రభుత్వం నుంచి గతంలో ఒక సారి భవన నిర్మా ణానికి నిధులు మంజూరైనా.. ప్రభుత్వ స్థలం చూపక పోవడంతో నిధులు వెనక్కు వెళ్లి పోయాయి. ఇదిలా ఉంటే లక్షలాది రూపాయలు వ్యయం చేసి భవనాలు నిర్మించినా విద్యార్థులు లేక కొన్ని పాఠశాలలు మూత పడ్డాయి. కమ్మలవాండ్లబురుజు, బలిజిపల్లి, యర్లంపల్లి, అరవవాండ్లపల్లి, దండేవారిపల్లి, పాపన్నగారి పల్లి, సున్నపుగుట్టతండా, కొండలోల్లపల్లి, చీమల చెరువుపల్లి, వడ్డిపల్లి, డీ కొత్తపల్లి, కటకంవారిపల్లి, నాగంవారిపల్లి, బందార్లచెట్లపల్లి, డీ.గొల్లపల్లి, జోగివారి పల్లి, పడమరనడింపల్లి గ్రామాల పాఠశాలలు మూత పడ్డాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నూతన భవనాల నిర్మాణాలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

భవనం కూలుతుందేమోనని భయం



మా పాఠశాలలో 65 మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తు న్నారు. పాఠశాల భవనం చిన్నపాటి వర్షానికి కూడా కారుతోంది. పై కప్పుపెచ్చులు ఊడి విద్యార్థుల పై పడతా యేమోనని ఆందోళనగా ఉంది. వర్షం వచ్చిందంటే విద్యార్థులకు శిథి లావస్థలో ఉన్న పాఠశాలలో పాఠ్యాంశా లు బోధించాలంటే భయంగా ఉంది.

- శ్రీనివాసులు, హెచ్‌ఎం, మెయిన్ స్కూల్

ఎనిమిదేళ్లుగా ఆర్డీటీ బడిలోనే...



ఎనిమిది సంవత్సరాలుగా ఆర్డీటీ బడిలోనే విద్యార్థులకు విద్యా బోధన చేస్తు న్నాం. పాఠశాల భవన నిర్మాణానికి నిధులు మంజూరు అయినా.. స్థలం చూపక పోవడంతో నిధులు వెనక్కు వెళ్లిపో యాయి. దీంతో నూతన పాఠశాల నిర్మాణానికి నోచుకోలేదు.

- నాగసుబ్బమ్మ, ఇందిరా కాలనీ పాఠశాల

నూతన భవనాలకు ప్రతిపాదనలు పంపాం

మండలంలో పాక్షికంగా దెబ్బతి న్న పాఠశాలలు వివరాలు , నూతన పాఠశాల భవనాల మంజూరు కు ప్రతిపాద నలను ఉన్నతాధికారులకు పంపిం చాం. మండలంలోని దిగువతూపల్లి పాఠశాలకు నూతన భవనం మంజూఐంది. నిధులు రాగానే పనులు ప్రారంభిస్తాం.

- రషీద్, ఎస్ఎస్ఏ ఇంజనీర్, నంబులపూలకుంట

లోకల్ గైడ్

localguide

కదిరి మార్కెట్‌లో కూరగాయల ధరలు



వంకాయ కిలో రూ.26, టమోటా 45, బెండ 40, బీరకాయ 30, కాకరకాయ 50, క్యారెట్ 80, బీట్‌రూట్ 40, బీన్స్ 60, ముల్లంగి 40, పచ్చిమిర్చి 40, ఉర్లగడ్డ 22, కోసుగడ్డ 25, మునగ 60, కాప్సికమ్ 60

కదిరి సినిమాలు

సంగం - గౌతమ్‌నంద, **రాధిక** - నక్షత్రం

,వేమల - ఫిదా , **మౌనిక** - డీజే దువ్వాడ జగన్నాథం

ఎమ్మెల్యే డైరీ

కదిరిటౌన్ : స్థానిక ఎమ్మెల్యే అత్తార్ చాంద్‌బాష శుక్రవారం నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటారు.

ప్రైవేటు పాఠశాలల్లో ఎంఆర్ వ్యాక్సిన్



తనకల్లు సాయిబాబా విద్యానికేతన్‌లో వ్యాక్సిన్ వేస్తున్న దృశ్యం

తనకల్లు : మండల పరిధిలోని కొక్కంటిక్రాస్‌లో ఉన్న సాయిబాబా విద్యానికేతన్, సరస్వతి ఇంగ్లీష్‌మీడియం పాఠశాలలో గురువారం ఎంఆర్ వ్యాక్సిన్‌ను పిల్లలకు వేశారు. ఈ వ్యాక్సిన్ వేయడం వలన చిన్నారులు నిమోనియా, విరేచనాలు, మెదడువాపు వంటి వ్యాధులకు గురి కాకుండా ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని కొక్కంటి డాక్టర్ వెంకటరమణ ప్రారంభించారు. పాఠశాల ప్రధానో పాధ్యాయుడు ఎం సలీంబాష, ఉపాధ్యాయులు రవీంద్ర, గౌస్‌మోద్దీన్, దాదాబాష, నసీబ్ జాన్, సరస్వతి పాఠశాల కరస్పాండెంట్ నరేష్, ఏఎన్ఎం రమణమ్మ, హెల్త్ అసిస్టెంట్ మనోహర్, అంగన్‌వాడీ కార్యకర్త లక్ష్మీదేవీ, ఆశ కార్యకర్త అరుణమ్మ, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

తలుపులలో...

మండలకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కస్తూర్బా గురుకుల పాఠశాలలో గురువారం వైద్యాధికారి లక్ష్మీరామ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు మీజిల్స్‌,రుబెల్లా వ్యాక్సిన్‌ను వేశారు. గురువారం 600 మంది విద్యార్థులకు వ్యాక్సిన్ వేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం సునీతమ్మ, జిలాన్‌బాషా, ఇన్‌చార్జ్ ఎస్ఓ లక్కమ్మ, ఎంపీహెచ్‌ఈఓ జోసఫ్, వైద్య సిబ్బంది ప్రభాకర్, రామచంద్ర, లక్ష్మీనారాయణ, కవిత, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

గృహనిర్మాణ లబ్ధిదారుల ఎంపికకు గ్రామసభలు

తనకల్లు : గృహనిర్మాణ పథకం కింద నిజమైన లబ్ధిదారులను గుర్తించడానికే గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రమేష్‌బాబు పేర్కొన్నారు. గురువారం మండలంలోని కొర్తికోట గ్రామంలో ఎంపీడీఓ అధ్యక్షతన గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 101 మంది లబ్ధిదారులను ఎంపిక చేయాల్సి ఉందని తెలిపారు. మండలంలోని ఈతోడులో తహసీల్దార్ లక్ష్మేనాయక్ ఆధ్వర్యంలో, చీకటిమానిపల్లిలో ఎంఈఓ ఖాసింఖాన్ అధ్యక్షతన గ్రామ సభలు నిర్వహించారు. ఈఓఆర్‌డీ ఆదినారాయణ, ఆర్ఐ దేవేంద్రనాయక్, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

తలుపులలో నేటి నుంచి...

తలుపుల : మండలానికి ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం కింద మంజూరైన 2827 పక్కా గృహాల లబ్ధిదారుల ఎంపిక కోసం శుక్రవారం గ్రామ సభలను నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ, తహసీల్దార్‌లు పోలప్ప, శివయ్యు తెలిపారు. మండలాన్ని మూడు టీంలుగా విభజించినట్లు వారు తెలిపారు. ఎంపీడీఓ టీం ఉడమలకుర్తిలోను తహసీల్దార్ టీం గుండువారిపల్లిలోనూ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ టీం కుర్లిలోనూ ఉదయం 10 గంటల నుంచి గ్రామ సచివాలయాల్లో సర్పంచుల అధ్యక్షతన గ్రామ సభలను నిర్వహిస్తారన్నారు.

బ్లూమూన్ పాఠశాలలో టెన్నికాయిట్ రాష్ట్రస్థాయి టోర్నీ

కదిరిఅర్బన్ : స్థానిక బ్లూమూన్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఈ నెల 19, 20, 21 తేదీలలో 32 వ రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు బ్లూమూన్ విద్యా సంస్థల చైర్మన్ శివశంకర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ టోర్నమెంట్‌లో ఉత్తమ ప్రతిభ కనపరచిన క్రీడా కారులను జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు.

తాగునీటి కోసం బోరుబావుల తవ్వకం

తలుపుల : మండలకేంద్రంలోని కోట, పూలబజారులలో తాగునీటి శాశ్వత పరిష్కారం కోసం గురువారం సర్పంచు డీఫీ ఫయాజ్ అహ్మద్ బోరుబావులను తవ్వే పనులను పూజలు చేసి ప్రారంభించారు. నెల రోజుల నుంచి తలుపులలోని కోట, పూలబజారు, ఎస్టీ కాలనీ, దేవలం బజారులలో తాగునీరు లేక ప్రజలు అనేక ఇక్కట్లు పడుతున్నారు. పంచా యతీ నిధుల నుండి బోరుబావులను తవ్వి శాశ్వత నీటి పరిష్కారం చేస్తామని సర్పంచు తెలిపారు.

బయటి వ్యక్తులతో మధ్యాహ్న భోజనం తయారీ



విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న దృశ్యం

నంబులపూలకుంట : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ అచ్చమ్మ ఆధ్వర్యంలో గురువారం మధ్యాహ్న భోజనాన్ని బయటి వంట మనుషులతో తయారీ చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భోజన ఏజన్సీ నిర్వాహకుల్లో మార్పు రాకపోవడంతో బయటి వంట మనుషులను ఏర్పాటు చేసి, వారి ద్వారా నాణ్యమైన భోజనాన్ని విద్యార్థుల కు అందిస్తామన్నారు. విద్యార్థులు ఎవరూ కూడా క్యారీయర్‌లు తెచ్చుకోవద్దని తెలిపారు. మెనూ ప్రకారం భోజనం విద్యార్థుల కు వడ్డించక పోతే తమ దృష్టికి తీసుకు రావాలని పేర్కొన్నారు.

వాహనాలకు నెంబర్ ప్లేట్లు తప్పని సరి

నంబులపూలకుంట : వాహన చట్ట ప్రకారం వాహనాలు డ్రైవ్ చేసేటప్పుటు వాటికి సంబంధించిన నెంబర్ ప్లేట్లు తప్పకుండా ఉంచుకోవాలని ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు. మండల కేంద్రంలో పోలీసు స్టేషన్‌లో వాహనాలను తనిఖీ చేసి, డ్రైవర్లకు సూచనలు, సలహాలు ఇచ్చారు. లైసెన్స్‌లు లేని వారికి వాహనాలు ఇస్తే యజమానులే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించడం వల్ల రెండు నెలలుగా ప్రమాదాలు తగ్గుముఖం పట్టాయన్నారు. ఉండాలన్నారు. అతివేగంతో వాహనాలు నడుపరాదన్నారు. కార్యక్రమంలో పోలీసులు, వాహనాల డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీ కొన్న ఆర్టీసీ బస్సు

- ఇద్దరికి గాయాలు

నంబులపూలకుంట : కదిరి - రాయచోటి ప్రధాన రహదారిలో వంక మద్ది క్రాస్ సమీపంలో ద్విచక్ర వాహనాన్ని ఆర్టీసీ బస్సు గురువారం రాత్రి ఢీ కొంది. ఈ ప్రమాదంలో మండలంలోని పోరెడ్డివారిపల్లికి చెందిన ఇరువురికి గాయాలయ్యాయి. మండల కేంద్రం నుంచి చిన్నరెడ్డి, నాగార్జున ద్విచక్ర వాహనంలో స్వగ్రామానికి వెళ్తుండగా ఆర్టీసీ బస్సు ఢీ కొంది. ఈ ప్రమాదంలో చిన్నరెడ్డికాలు పాదం పూర్తిగా తెగిపోయింది. ఎస్ఐ రమేష్‌బాబు సంఘటనా స్థలానికి చేరుకుని చిన్నరెడ్డి కాలుకు రక్తస్రావం కాకుండా బట్టచుట్టి కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి కారులో తరలించారు. గాయపడిన నాగార్జునను 108 వాహనంలో కదిరి ఆసుపత్రికి తరలించారు. సంఘటనా స్థలాన్ని ఆర్ఐ మురళినాయక్ పరిశీలించి, తహసీల్దార్ నాగరాజుకు సమాచారం అందించారు.

నూతన పింఛన్ల పంపిణీ

కదిరిరూరల్ : మండలంలోని కుమ్మరవాండ్లపల్లి పంచాయతీ, పట్నం పంచాయతీల్లో నూతనంగా మంజూరైన పింఛన్లను గ్రామ సర్పంచులు బీ లక్ష్మీదేవి, డీ మహేష్ బాబులు పంపిణీ చేశారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో 35 మంది నూతనంగా మంజూరైన పింఛన్లను సర్పంచు లక్ష్మీదేవి చేతుల మీదుగా వారికి అందజేశారు. పట్నం గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామ సర్పంచు మహేష్‌బాబు ఆధ్వర్యంలో పింఛన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శులు విశ్వనాథరెడ్డి, నాగేశ్వరరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు రమణమ్మ, శారదమ్మ, జన్మభూమి కమిటీ సభ్యులు ఆంజనేయులు, శ్రీనివాసులు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలే బిడ్డకు ఆరోగ్య రక్ష



ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

తలుపుల : పుట్టిన బిడ్డకు ముర్రుపాలను పట్టించాలని, వాటిలో బిడ్డకు అవసరమైన రోగనిరోధక శక్తి ఉంటుందని కదిరితూర్పు సీడీపీఓ షాజిదాబేగం పేర్కొన్నారు. గురువారం తల్లిపాల వారోత్సవాలలో ముఖ్య అతిథిగా ఆమె పాల్గొన్నారు. అంగన్‌వాడీ కేంద్రం - 1 వద్ద కార్యకర్తలతో మాట్లాడుతూ తప్పని సరిగా బాలింతలు రెండు సంవత్సరాల పాటు బిడ్డలకు పాలు ఇవ్వాలని, అనంతరం రాగిజావ తాపాలన్నారు. అనంతరం తల్లిపాల వారోత్సవాల ర్యాలీని సీడీపీఓ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ జ్ఞానేశ్వరి, సూపర్‌వైజర్లు పుష్పావతి, పద్మావతమ్మ, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు చోట్ల మద్యం కేసులో ముగ్గురి అరెస్టు

తనకల్లు : తనకల్లు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో నల్లచెరువు మండలం బాలేపల్లితండాకు చెందిన గోపాల్‌నాయక్ రెండు లీటర్ల నాటు సారా కలిగి ఉండటంతో ఎక్సైజ్ పోలీసులు అతడిని అరెస్టు చేసి, కోర్టుకు హాజరుపరిచారు. అలాగే నల్లచెరువు మండలంలోని చిన్నయల్లంపల్లికి చెందిన చంద్ర 24 బాటిళ్ల మద్యం కలిగి ఉండటంతో అతడిని అరెస్టు చేశారు. అతడి వద్ద నుంచి 24 బాటిళ్ల మద్యం, సూపర్ ఎక్సెల్ ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. తనకల్లు మండలం బుడ్డయ్యకోటకు చెందిన వెంకటరమణ అక్రమ మద్యం ఎనిమిది బాటిళ్లు కలిగి ఉండటంతో అతడిని అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరిచినట్లు తనకల్లు ఎక్సైజ్ సీఐ హరిక్రిష్ణ తెలిపారు. ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని అమడగూరు, ఓడీసీ, నల్లచెరువు, తనకల్లు మండలాల్లో బెల్టుషాపుల పై ఉక్కుపాదం మోపినట్లు వివరించారు.

నేడు కదిరిలో డ్రైవింగ్ లైసెన్స్ మేళా

తలుపుల : కదిరిలోని ఎస్‌టీఎస్ఎన్ డిగ్రీ కళాశాల మైదానంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు డ్రైవింగ్ లైసెన్స్ మేళాను నిర్వహిస్తున్నట్లు అర్హులైన వారు ఈమేళాలో పాల్గొనాలని ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. కదిరి ఆర్టీఓ శేషాద్రిరెడ్డి సహకారంతో ట్రాన్స్‌పోర్టు, నాన్‌ట్రాన్స్‌పోర్టు డ్రైవింగ్ లైసెన్స్‌లను అర్హులైన వారికి ఇవ్వడానికి ఈ మేళాను ఉపయోగించుకోవాలని ఎస్ఐ తెలిపారు.

నల్లచెరువు : మండలంలోని డ్రైవింగ్ లైసెన్స్‌లు లేకుండా ఉన్న వారు శుక్రవారం కదిరిలో జరిగే మేళాకు హాజరు కావాలని ఎస్ఐ ప్రసాద్‌బాబు తెలిపారు. గురువారం ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ వాహనాలు నడుపుకుంటూ జీవనం సాగించే డ్రైవర్లు లైసెన్స్‌లు కలిగి ఉండాలని తెలిపారు.

దౌర్జన్యం చేస్తున్నారంటూ ఫిర్యాదు

కదిరిటౌన్ : కదిరి పట్టణంలోని శిరీషాబేగం, బీ నసరత్‌బేగం, ఎం రుక్సానాలు 103/1415లో గల పట్టా సర్వే నెంబర్ 280-13, 278/1ఏ లో 0.02 సెంట్లు ప్లాట్‌లను ముగ్గురి పేర్లతో రెవెన్యూ అధికారులు ప్లాట్ నెంబర్ 98ను 2006 సంవత్సరంలో మంజూరు చేశారు. అయితే ఆ స్థలం మాది అంటూ రెడ్డివంశీ, బొమ్మల రవి, కిరోసిన్ డీలర్ హైదర్‌వలి, మహబూబ్‌బాష, బిందెల బాష దొంగ పట్టాలు సృష్టించి దౌర్జన్యం చేస్తున్నారని గురువారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వారి నుంచి మాకు ప్రాణహాని ఉందని ఫిర్యాదులో తెలిపారు. వారిని పిలిపించి మాకు న్యాయం చేయాలని శిరీషాబేగం, బీ నసరత్‌బేగం, ఎం రుక్సానా పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజేష్ తెలిపారు.

ఐదుగురు జూదరుల అరెస్టు

నంబులపూలకుంట : మండలంలోని తూపల్లిలో జూదం ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు. జూదం ఆడుతున్న సమాచారం తెలుసుకుని గురువారం దాడి చేశారు. ఈ దాడిలో జూదరుల వద్ద ఉన్న రూ. 1620 , మొబైల్‌ను స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం వారిని కోర్టుకు హాజరు పరచనున్నట్లు తెలిపారు.

ఆర్టీసీ రాయితీలపై అవగాహన కల్పించండి :ఈడీ



ఆర్టీసీ కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఈడీ జయరావు, ఆర్ఎం చిట్టిబాబు

కదిరి : ఆర్టీసీ సంస్థ ప్రయాణికులకు కల్పిస్తున్న రాయితీల గ్రామాల్లోకి వెళ్లి గురించి అవగాహన కల్పించాలని ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఆపరేషన్) జయరావు పేర్కొన్నారు. ఆయన గురువారం స్థానిక ఆర్టీసీ డిపోను తనిఖీ చేశారు. ఈడీతో పాటు ఆర్టీసీ రీజనల్ మేనేజర్ చిట్టిబాబు ఉన్నారు. అనంతరం కదిరి డిపో గ్యారేజీ సిబ్బంది, ఆర్టీసీ బస్సు డ్రైవర్లు, ఆఫీస్ సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఈడీ మాట్లాడుతూ ప్రతి నెలా రూ. 1,20,000పైగా ఆర్టీసీకి నష్టం వస్తోందన్నారు. ముఖ్యంగా పల్లె వెలుగు బస్సుల్లో నష్టాలు వస్తున్నాయని, ఆ ప్రాంతాల్లో అధికంగా ఆటోల్లో ప్రయాణించడం వల్లనేనన్నారు. ఆటోల్లో ప్రయాణాల వలన కలిగే నష్టాల గురించి ఆర్టీసీ సిబ్బంది వివరించాలన్నారు. వీటిని అధిగ మించడానికి ఆర్టీసీ సంస్థ ప్రయాణికులకు కల్పిస్తున్న సౌకర్యాలు, రాయితీలపై గ్రామ సభల ద్వారా ప్రయాణికులకు వివరించాలన్నారు. ప్రయాణికులకు అనుకూలంగా డ్రైవర్లు, కండెక్టర్లు వ్యవహరించాలన్నారు. ముఖ్యంగా సీనియర్ సిటిజన్‌లకు ఆర్టీసీ బస్సుల్లో 28 శాతం రాయితీ ఉంటుందన్నారు. సంస్థ అభివృద్ధికి ప్రతి కార్మికుడు కృషి చేయాలన్నారు. అనంతరం ఆయన డీఎం కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఆర్టీసీలో 65 శాతం నష్టాలు తగ్గాని, ఇంకా తగ్గించాల్సి ఉందన్నారు. కదిరి నుంచి అనంతపురానికి ఎక్స్‌ప్రెస్ సర్వీసులతో పాటు ఆర్డినరీ సర్వీసులను నడపాలని డీఎంకు తెలిపారు. కర్ణాటక రాష్ట్రం నుంచి ఆంధ్రప్రదేశ్‌కు వస్తున్న సర్వీసులపైన ఈ నెలాఖరులో ఒప్పందం కుదిరే అవకాశం ఉందన్నారు. కర్ణాటకలోని ముఖ్యమైన ప్రాంతాలకు జిల్లాలోని గుంతకల్లు, కళ్యాణదుర్గం, రాయదుర్గం, మడకశిర, కదిరి, అనంతపురం డిపోల నుంచి అధిక సర్వీసులను నడుపుతామన్నారు. అలాగే కదిరి నుంచి నూతన రాజధాని అమరావతికి, విజయవాడకు త్వరలో అదనంగా నూతన ఇంద్ర బస్సులు ఏర్పాటు చేస్తామ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డిపోమేనేజర్ సూర్యనారాయణ, అసిస్టెంట్ మేనేజర్ హంపన్న, ఆర్టీసీ కార్యాలయ సూపరింటెండెంట్ హరిమోహన్, ఆర్టీసీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

డిపోలో మొక్కలు నాటిన ఈడీ

తొలిసారిగా కదిరి డిపోలో తనిఖీలకు వచ్చిన సందర్భంగా ఆర్టీసీ డిపో గ్యారేజీ ఆవరణలో ఈడీ జయరావు మొక్కలు నాటారు. అలాగే ఆర్టీసీ రీజనల్ మేనేజర్ చిట్టిబాబు, చీఫ్ ట్రాఫిక్‌మేనేజర్ రవికాంత్ మొక్కలు నాటారు. ఆర్టీసీ కార్మికులు పర్యావరణ పరిరక్షణ పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు.

గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో

డీటీడబ్ల్యూఓ ఆకస్మిక తనిఖీ



ఎస్టీ హాస్టల్‌ను ఎస్సీ హాస్టల్‌లోకి మార్పు చేయడానికి ఉత్తర్వులు అందజేస్తున్న దృశ్యం

తనకల్లు : మండల పరిధిలోని చెన్నరాయ స్వామిగుడి ప్రాజెక్టు వద్ద ఉన్న గిరిజన బాలికల గురుకుల పాఠశాలను జిల్లా గిరిజన సంక్షేమ శాఖాధికారి కొండలరావు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో నీటి సమస్యతో బాలికలు ఇబ్బందులు పడుతున్నారన్న ఆంధ్రజ్యోతి కథనానికి ఆయన స్పందించినట్లు తెలిపారు. పాఠశాలను తనిఖీ చేసి విద్యార్థినులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. విద్యుత్ మోటారు రిపేరీ అయ్యే వరకు కావాల్సినన్ని నీటిని ట్యాంకర్లతో సరఫరా చేయాలని సంబంధిత ప్రిన్సిపాల్‌కు ఆదేశాలు జారీ చేశారు. పాఠశాల ఆవరణలో రూ. 4.50 లక్షల రూపాయలతో నిర్మిస్తున్న డోబీఘాట్ నిర్మాణాలను పరిశీలించారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. పనుల నాణ్యతలో రాజీ పడవద్దని తెలిపారు. విద్యార్థులకు వండి వడ్డిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులతో కలసి వివరాలు తెలుసుకున్నారు. ఏదైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఏఎస్‌డబ్ల్యూఓ పక్కీరయ్య, పాఠశాల ప్రిన్సిపాల్ లక్ష్మీ గుర్రప్ప, ఉపాధ్యాయుడు షాకీర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీ హాస్టల్‌ను ఎస్సీ హాస్టల్‌లోకి మార్చాలని ఉత్తర్వులు

తనకల్లులోని ఎస్టీ బాలుర హాస్టల్ గదుల పైకప్పు కూలిపోతుండటంతో హాస్టల్‌లో ఉండటానికి విద్యార్థులు నిరాసక్తత వ్యక్తం చేశారు. ఈ సంవత్సరం కొత్తగా హాస్టల్‌లో ఎవరినీ చేర్చుకోలేదు. కొంత మంది విద్యార్థులు టీసీలు తీసుకెళ్లిపోయారు. విద్యాసంవత్సరం ప్రారంభంలో హాస్టల్‌ను తనిఖీ చేసిన డీటీడబ్ల్యూఓ కలెక్టర్‌తో చర్చించి ఖాళీగా ఉన్న ఎస్సీ హాస్టల్‌లోకి మార్చడానికి ఉత్తర్వులు అందజేస్తానని తెలిపారు. ఆ మేరకు వార్డెన్ లక్ష్మేనాయక్‌కు గురువారం ఉత్తర్వులు అందజేశారు. అంతే కాక ఎస్సీ హాస్టల్‌లో విద్యుత్, మంచినీరు, పెయింటింగ్, చిన్న, చిన్న రిపేరీలు ఉంటే వెంటనే చేయించాలని ఆదేశించారు. కొత్తగా హాస్టల్ లోకి విద్యార్థులను చేర్చుకోవాలని సూచించారు.

రైతుసేవలో రెవెన్యూశాఖ

నల్లచెరువు : మండలంలోని ఎస్.మొలకలపల్లి గ్రామ పంచాయతీలో సర్పంచు సుజాతమ్మ అధ్యక్షతన రైతు సేవలో రెవెన్యూశాఖ కార్యక్రమం నిర్వహించారు. సర్పంచు అధ్యక్షతన తహసీల్దార్ ఏ కళావతి గురువారం గ్రామంలో పర్యటించి రైతుల నుంచి భూసమస్యల ఫిర్యాదులను స్వీకరించారు. చిన్న, చిన్న సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. పట్టాదారు పాసుపుస్తకాలు, 1బీ , అడంగల్ తదితర వాటిని త్వరలోనే పరిష్కరిస్తామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ దివ్యా, మల్లికార్జున, వీఆర్ఓ రఘునాథరావు, సర్వేయర్ మహబూబ్‌బాష, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తలుపులలో...

మండలంలోని గంజివారిపల్లిలో గురువారం తహసీల్దార్ శివయ్య ఆధ్వర్యంలో రైతు సేవలో రెవెన్యూశాఖ కార్యక్రమంలో భాగంగా రెవెన్యూ సదస్సును ప్రాథమిక పాఠశాల ఆవరణలో నిర్వహించారు. రెవెన్యూ సదస్సులో వేపమానిపేట సర్పంచు ఎం.పురుషోత్తమ్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. రైతుల భూ సమస్యల కోసం ప్రభుత్వం గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. రైతుల నుండి భూ సమస్యల పైన ఏడు ఫిర్యాదులు అందినట్లు తహసీల్దార్ శివయ్య తెలిపారు. అందులో మిటేషన్‌లు, ఆన్‌లైన్‌లో మార్పులు, భూసర్వే కి వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ కిష్టప్ప, వీఆర్ఓ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

కదిరిటౌన్ : రైతుసేవలో రెవెన్యూశాఖ కార్యక్రమంలో భాగంగా గురువారం మున్సిపల్ పరిధిలోని కుటాగుళ్ళ, సైదాపురం గ్రామాల్లో గ్రామ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమం తహసీల్దార్ పీవీ రమణ అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా ఇన్‌చార్జ్ ఆర్డీఓ విశ్వనాథ్ హాజరై మాట్లాడారు. గ్రామసభకు 34 ఫిర్యాదులు వచ్చాయని వారు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ క్రిష్ణమూర్తి, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ హుస్సేన్‌పీరా, వీఆర్ఓలు యశోద, రైతులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించాలి

కదిరిటౌన్ : నల్లచెరువు మండలం ఉబిచెర్ల గ్రామం నుంచి కదిరి వచ్చే విద్యార్థులకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని విద్యార్థి సత్తా నాయకులు అరుణ్ డిప్యూటీ తహసీల్దార్ కాటంబాబుకు గురువారం వినతి పత్రం అందజేశారు. పట్టణంలోని పాఠశాలలు, కళాశాలలకు వచ్చే విద్యార్థులు బస్సు సౌకర్యం లేక కాలినడకనే పాఠశాలకు, కళాశాలలకు వస్తున్నారన్నారు. విద్యార్థులు పాసులు తీసుకున్నా ప్రయోజనం లేదన్నారు. అలాగే పాఠశాలలో నెలకొన్న తాగునీరు, నోటు పుస్తకాలు తదితర సమస్యలను పరిష్కరించాలని కోరారు.

నత్తనడకన ఎన్టీఆర్ గృహ నిర్మాణాలు

మడకశిర రూరల్ : అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో మండలంలో ఎన్టీఆర్ గృహాల నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. మండలానికి 250 ఇళ్లు మంజూరయ్యాయి. హౌసింగ్ కార్యాలయంలో తగినంత సిబ్బంది లేకపోవడం, ఉన్న తాధికారి సకాలంలో రాకపోవడంతో నిర్మాణాలు మందకొడిగా సాగుతున్నాయి. ఉన్న హౌసింగ్ ఏఈ బదిలీ కావడంతో బిల్లులు సకాలంలో చెల్లించలేకపోతున్నారు. చాలా మంది లబ్ధిదారులు బిల్లుల కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.

నేడు వరమహాలక్ష్మీ వ్రతం

పావగడ: శ్రావణమాసం తొలి శుక్రవారం నిర్వహించే వరమహాలక్ష్మీ వ్రతాన్ని నియోజక వర్గ వ్యాప్తంగా ఘనంగా జరుపుకోనున్నారు. ఈ వ్రతాన్ని ఆచరిస్తే సిరిసందపలు వస్తాయని, ఆర్థికంగా కూడా చాలా మెరుగుపడుతుందని నమ్మకం. ఈ నేపథ్యంలో తాలూకా వ్యాప్తంగా శుక్రవారం పావగడ పట్టణంలో పూలు, అరటి పండ్లు కొనేందుకు అధిక సంఖ్యలో తరలివచ్చారు. పూలు బారు రూ.110లు పలికినా కూడా అధిక సంఖ్యలో వాటిని కొనుగోలుచేసేందుకు ముందుకొచ్చారు.

గుడిబండ: స్థానిక లక్ష్మీదేవి ఆలయంలో శుక్రవారం వరలక్ష్మీ పూజా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మట్కా బీటర్ల అరెస్ట్

అగళి: ఇరిగేపల్లి, బొమ్మరసనపల్లికు చెందిన రాజన్న, లింగరాజులు ఆయా గ్రామాల్లో మట్కా రాస్తుండగా అరెస్ట్‌చేసినట్లు ఎస్‌ఐ రాంబాబు గురువారం తెలిపారు. వారి నుంచి మట్కాపట్టీలు, రూ.2,930లను స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఐదుగురు జూదరుల....

మడకశిర అర్బన్: గుడిబండ మండలం నాచేపల్లి వద్ద గురువారం ఐదుగురు జూదరులను అరెస్ట్‌చేసి వారి వద్ద నుంచి 11,870 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ ఖాజా హుస్సేన్ తెలిపారు. సిబ్బందితో వెళ్లి దాడి చేసిపట్టుకున్నట్లు తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరచనున్నట్లు చెప్పారు.

బాదన్న హంతకులను కఠినంగా శిక్షించాలి

మడకశిర టౌన్: కళ్యాణదుర్గం మార్కెట్ యార్డు మాజీ చైర్మన్, రాష్ట్ర వాల్మీకి ఫెడరేషన్ డైరెక్టర్ బోయ బాదన్నను హత్యచేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని వాల్మీకి సంఘం నాయకులు, పట్టణ టీడీపీ అధ్యక్షుడు మనోహర్ గురువారం అన్నారు. స్థానికంగా విలేకరులతో మాట్లాడుతూ.. సమస్యలుంటే సామరస్యంగా పరిష్కరించుకోవాలే కాని, ఇలా హత్య చేయడం దారుణమని అన్నారు. ఈ సమావేశంలో నాయకులు మాజీ చైర్మన్ ఓబన్న, ఓబులేసు, మాదవరాజు, డాక్టర్ రామ్మూర్తి, తిప్పేస్వామి, గోవిందప్ప తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సామూహిక సీమంతాలు

గుడిబండ: మండలంలోని భైరేపల్లి గ్రామంలో గురువారం ఐసీడీఎస్ అధికారుల ఆధ్వర్యంలో ఘనంగా సామూహిక సీమంత కార్యక్రమాన్ని నిర్వహించారు. గర్భవతులకు పసుపు, కుంకుమ, గాజులు, పండ్లు, పూలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ కో ఆర్డినేటర్ శ్రీవాణి, సూపర్‌వైజర్లు లీలావతి, తిరుపాల్‌బాయి, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాల్లో అప్రమత్తతపై అవగాహన

మడకశిర రూరల్: ఆచార్య ఎన్‌జీరంగ అగ్రికల్చర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఫైర్ ఆఫీసర్ విజయకుమార్, లీడింగ్ ఆఫీసర్ నరసింహులు అగ్నిప్రమాదాలు, వాటి నివారణకు చేపట్టాల్సిన మార్గాలపై అవగాహన కల్పించారు. ఏదైనా అగ్నిప్రమాదం చోటుచేసుకుంటే మంటలను అదుపుచేసేందుకు ఎలాంటి చర్యలు చేపట్టాలనేదానిపై వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డీన్ రమణ, అధ్యాపకులు శ్రీనివాసులు, అశోక్‌కుమార్, సోమేశ్వర రావు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతు సేవలో రెవెన్యూశాఖ

అమరాపురం : మండల పరిధిలోని బసవనపల్లిలో గురువారం రైతు సేవలో రెవెన్యూ శాఖ కార్యక్రమం సర్పంచు శివలింగమ్మ అధ్యక్షతన జరిగింది. తహసీల్దార్ రామశేఖర్ మాట్లాడుతూ.. పట్టాదారుపాసుపుస్తకం, వెబ్‌ల్యాండ్ నమోదు, ఆధార్ అనుసందానం, వన్‌బీ, అడంగల్, భూ సర్వే తదితర సమస్యలను సత్వరమే పరిష్కారానికి ఈ సభలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ భాగ్యలక్ష్మీ, వీఆర్‌ఓ రవికుమార్, నాయకులు మల్లికార్జున, భీమన్న, మల్లేశ్వర, పరమేశ్వరప్ప, నరసింహప్ప, రాజశేఖర్ తదితరులు ఉన్నారు.

బైక్ ఢీ, వ్యక్తికి తీవ్రగాయాలు

అమరాపురం : మండల కేంద్రంలోని వైఎస్ఆర్ సర్కిల్ సమీపంలో రోడ్డుపై వెళ్తున్న వ్యక్తిని ద్విచక్రవాహనం ఢీకొనడంతో అతనికి తీవ్రగాయాలయ్యాయి. ఎస్‌ఐ వెంకటస్వామి తెలిపిన సమాచారం మేరకు.. గురువారం పట్టణానికి చెందిన రాజప్ప తహసీల్దార్ కార్యాలయం వైపు నడుచుకుంటూ వెళ్తుండగా.. ఎదురుగా వచ్చిన బైక్ ఢీకుంది. దీంతో రాజప్ప రోడ్డుపై పడడంతో తలకు బలమైన గాయమైంది. అతనిని చికిత్స నిమిత్తం మడకశిర ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అతనిని బెంగుళూరు నిమాన్స్‌కు తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడులు

మడకశిర రూరల్: ఆధునిక వ్యవసాయ పద్ధతులతోనే అధిక దిగుబడులు సాధించవచ్చునని ఎఫ్‌టీసీ ఏడీఏ గురుమూర్తి తెలిపారు. గురువారం మరువపల్లి గ్రామంలో రైతులతో గ్రామస్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయశాఖ ఆధ్వర్యంలోని పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఏఓ ముస్తాక్‌అహ్మద్, ఎంపీఈఓలు పురుషోత్తం, మారుతీ, జానకీరామ్, రైతులు పాల్గొన్నారు.

పురసేవ యాప్‌తో లాభాలు అనేకం

మడకశిర టౌన్: పురసేవ యాప్‌తో అనేక లాభాలు ఉన్నాయని, దాన్ని సద్వినియోగం చేసుకోని సమస్యలను పరిష్కరించుకోవాలని మున్సిపల్ ఆర్‌డీ ఎస్.రవీంద్రబాబు అన్నారు. గురువారం సాయంత్రం స్థానిక మున్సిపల్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... పురసేవ యాప్ ద్వారా సమస్యను అందులో తెలపడం వల్ల సమస్య పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవంతో పాటు ఫిర్యాదు చేసిన వ్యక్తికి ఫోన్ ద్వారా సమస్య పరిష్కారమైందని సమాచారం కూడా అందించడం జరుగుతుందన్నారు. అదేవిధంగా మున్సిపాల్టీ పరిధిలో జీఐఎస్ బేస్ యాప్ సర్వే ద్వారా ఎన్ని భవనాలున్నాయి, అందుకు సంబంధించిన వివరాలు, రోడ్లు తదితర 59 రకాల సమాచారాన్ని సేకరించి అందులో పొందుపరచడం జరుగుతోందన్నారు. ప్రజలు కూడా వివరాలు క్షుణ్ణంగా అందులో తెలుసుకునేందుకు ఆస్కారముంటుందన్నారు. మడకశిర మున్సిపాల్టీకి ఎస్సీ సబ్‌ప్లాన్ ద్వారా రూ.1.40 కోట్ల నిధులు మంజూరు కాగా మొదటి విడతగా రూ.53 లక్షలు, ప్రస్తుతం పనులు చేపట్టవచ్చన్నారు. 14వ ఫైనాన్స్ ద్వారా రూ.1.78 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. తాగునీటి సమస్య తలెత్తకుండా అందుకు అనుగుణంగా నిధులు రూ.2 కోట్ల వరకు మంజూరయ్యాయన్నారు. అదేవిధంగా రూ.40 కోట్లతో పట్టణంలో తాగునీటి శాశ్వత పరిష్కారానికి ప్రతిపాదనలు పంపినట్లు వివరించారు. పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు రింగురోడ్డు, డివైడర్స్, సెంటర్‌లైటింగ్ వంటి వాటిని ఏర్పాటుచేసేందుకు చర్యలు చేపట్టినట్లు వివరించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ శరణ్యసుబ్బరాయుడు, కమిషనర్ సంఘం శ్రీనివాసులు, వైస్ చైర్మన్ పూలతోట పరమేష్, కౌన్సిలర్లు రాజు, జేఎస్ నాగరాజు, మనోహర్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డీ

తల్లిపాలపై అవగాహన ర్యాలీ

అమరాపురం: మండల పరిధిలోని కొర్రేవు, హొసహట్టి గ్రామాల్లో తల్లిపాల వారోత్సవాలను గురువారం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్యామల ఆధ్వర్యంలో గ్రామ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పార్వతమ్మ,మంజునాథ్, అంగన్ వాడీ కార్యకర్తలు రుద్రమ్మ, త్రివేణి, అనుసూయమ్మ తదితరులు పాల్గొన్నారు.

మడకశిర రూరల్... మండలంలోని సింగేపల్లి, మరువపల్లి అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలను గురువారం నిర్వహించారు. తల్లిపాల విశిష్టతను సీడీపీఓ ఇందిరాదేవి వివరించారు. ఈకార్యక్రమంలో గ్రామ కార్యదర్శి గోవిందప్ప, సూపర్‌వైజర్లు తిరుపాల్‌బాయి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియమాలు తప్పనిసరిగా పాటించాల్సిందే

అమరాపురం: స్థానిక ప్రజలకు ఎస్‌ఐ వెంకటస్వామి ట్రాఫిక్ నియమాలపై గురువారం అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నియమాలు తప్పక పాటించాలని, డ్రింక్ అండ్ డ్రైవ్ చేయకూడదని, ద్విచక్రవాహనదారులు హెల్మెట్లు ధరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

అగళి: స్థానిక పోలీసుస్టేషన్‌లో రోడ్డుప్రమాదాలపై ఎస్‌ఐ రాంబాబు గురువారం అవగాహన కల్పించారు. అనంతరం వాహనాలను తనిఖీ చేశారు. వాహనదారుల వద్ద డ్రైవింగ్ లైసెన్స్, రికార్డులను పరిశీలించారు. ఓవర్ లోడ్‌తో వెళ్తున్న ఆటోను పట్టుకుని హెచ్చరించారు. ఎస్‌ఐ వెంట సిబ్బంది తదితరులు ఉన్నారు.

మద్యం దుకాణం సీజ్

రొళ్ల: స్థానిక మారుతీ మద్యం దుకాణాన్ని గురువారం సీజ్ చేసినట్లు సీఐ వాసుదేవచౌదరి తెలిపారు. ఆ దుకాణంలో మద్యాన్ని అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు తెలిపారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



కారుపై విరిగి పడిన విద్యుత్ స్తంభం

అగళి: మండల పరిధిలోని పీ.బ్యాడిగెర గ్రామానికి చెందిన మాజీ సర్పంచు కిష్టప్ప కుమారుడు రమేష్ అగళి నుంచి పీ.బ్యాడిగెరకు కారులో వెళ్తుండగా మలుపు వద్ద విద్యుత్ స్తంభాన్ని ఢీకున్నాడు. దీంతో విద్యుత్ స్తంభం విరిగి కారుపై పడింది. అయితే అక్కడ ట్రాన్స్‌ఫార్మర్ సమస్య వల్ల గత కొద్ది రోజులుగా విద్యుత్ లేదు. దీంతో భారీ ప్రమాదం తప్పినట్లైంది. కారులోని రమేష్, ఇద్దరు పిల్లలకు ఎలాంటి ప్రమాదం జరగలేదు.

విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ

అమరాపురం : స్థానిక ఎస్సీబాలికల వసతి గృహం, ఎస్సీకాలనీలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మండలంలోని ఆర్‌ఎస్‌ఎస్, సేవా భారతి ఆధ్వర్యంలో మంజునాథ్ ఎలెక్ట్రికల్ వారి సహకారంతో రూ.50వేల విలువచేసే నోటుపుస్తకాలు, బ్యాగులు, వాటర్ క్యాన్లు, పెన్నులు తదితర వాటిని గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ వెంకటస్వామి దాతను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీబాలికల హాస్టల్ మ్యాట్రిన్ ప్రసన్నకుమారి, ఏఎస్‌ఐ ఈరన్న, మంజునాథ్, నిరంజన్, లింగేష్, నాగభూషణ తదితరులు పాల్గొన్నారు.



నోటుపుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎస్‌ఐ

స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు

మడకశిర అర్బన్/రూరల్ : అమరాపురం రోడ్డులో పోలీసుస్టేషన్ వద్ద, కదిరేపల్లి క్రాస్, నీలకంఠాపురం, ఉక్కుడం రంగాపురం, వైబీహళ్లి క్రాస్ వద్ద స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేసినట్లు ఎస్‌ఐ కేఎం లింగన్న తెలిపారు. వాహనాల మితిమీరిన వేగాన్ని తగ్గించడానికి వీటిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అంతేకా కుండా రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఆటో డ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణికులను తరలించరాదని, వాహనాలు లైసెన్స్ కలిగి ఉండాలని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మట్కా, జూదం తదితర అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తుంటే తమకు తెలియజేయాలని సూచించారు.



కదిరేపల్లి వద్ద స్పీడ్ బ్రేకర్ వేయిస్తున్న ఎస్‌ఐ

ఎట్టకేలకు రోడ్డు నిర్మాణ పనులు పూర్తి

గోరంట్ల రూరల్ : స్థానిక ఎస్‌పీవీఎం డిగ్రీ కళాశాలకు వెళ్లే దారిలో అర్ధాంతరంగా ఆగిపోయిన సీసీ రోడ్డు పనులను పూర్తిచేశారు. రోడ్డు ఏర్పాటు కోసం జెడ్పీ నిధులను రూ.6 లక్షలు మంజూరుకాగా నిధులు చాలక రోడ్డు పని నిలిచిపోయింది. దీంతో వీధివాసులు రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. స్పందించిన మండల కన్వీనర్ సోమశేఖర్ ఎంపీడీఓ ఆజాద్‌తో చర్చించి పీఆర్‌జీఎఫ్‌తో రూ.3 లక్షలతో అసంపూర్తిగా ఉన్న సీసీ రోడ్డు పనిని పూర్తిచేశారు. దీంతో వీధి ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

వాటర్ ట్యాంకర్ బోల్తా



గోరంట్ల రూరల్ : పట్టణంలోని నవత కూడలిలో గురువారం వాటర్‌ట్యాంకర్ బోల్తాపడింది. పట్టణంలో నీటి సరఫరా నిమిత్తం ఏర్పాటు చేసిన గేట్‌వాల్వ్ కోసం తీసిన గోతిలో ట్యాంకర్ పడింది. పక్కనే ఉన్న టీబంకు మూసేయడంతో అక్కడ జనసంచారం లేకపోవడం పెను ప్రమాదం తప్పినట్లైంది. సమీపంలో విద్యుత్ స్థంభానికి తగిలి ఉంటే తీవ్ర ప్రమాదం జరిగి ఉండేది. పట్టణంలో ఇలాంటి గోతులు అధికంగా ఉన్నాయి. పంచాయతీ రోడ్డు కూడలిలో ఇటీవల గ్యాస్ సిలెండర్ తీసుకెళ్తున్న ఆటో బోల్తా పడింది. ఇది జరిగి నెలరోజులు గడవకముందే మళ్లీ ఈ ప్రమాదం చోటుచేసుకుంది. పంచాయతీ అధికారులు గేట్‌వాల్వ్ గోతులను బాగు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

సామూహిక సీమంతాలు

రొద్దం : ఆర్.లోచర్లలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గురువారం సామూహిక సీమంతాలు నిర్వహించారు. గర్భిణీలతో ఆ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం గర్భిణీలకు పూలు, పళ్లు, పసుపు, కుంకుమ అందజేశారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ పుష్పలత, గర్భిణీలు తీసుకోవాల్సిన పౌష్ఠికాహారం, పాటించాల్సిన జాగ్రత్తల గురించి సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో అంగనవాడీ కార్యకర్తలు బీకే సునీత, నాగమణి, శకుంతల, అంజినమ్మ, రామక్క తదితరులు పాల్గొన్నారు.

బేల్దార్‌కు గాయాలు

సోమందేపల్లి : స్థానిక పోస్టాఫీస్ సమీపంలో ద్విచక్రవాహనం ఢీకొన్న ప్రమాదంలో గ్రామానికి చెందిన గంగాధర్ అనే బేల్దార్ గాయపడ్డాడు. రోడ్డు దాటుతుండగా సోమందేపల్లి నుంచి పాలసముద్రం వైపు వెళ్లే ద్విచక్రవాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో బేల్దార్ కాలు విరిగింది. వెంటనే స్థానికులు అతన్ని పెనుకొండ ఆసుపత్రికి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్‌ఐ ప్రసాద్ తెలిపారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

సోమందేపల్లి : మండలంలోని పందిపర్తికి చెందిన ప్రజలకు ఎస్‌ఐ ప్రసాద్ గురువారం ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఉదయం 3 గంటల సమయంలో జాతీయ రహదారిపై స్టాప్ అండ్ వాష్ కార్యక్రమాన్ని చేపట్టారు.

నీటి సమస్య పరిష్కరించాలి : వైసీపీ

గోరంట్ల రూరల్ : చాలా కాలంగా గోరంట్లలో తిష్టవేసిన మంచినీటి సమస్యను ప్రభుత్వం పరిష్కరించాలని వైసీపీ కన్వీనర్ ఫక్రుద్దీన్ కోరారు. మూడు నెలలకోసారి కొళాయిలకు నీరు వదులుతున్నారని, అలాగే మండల వ్యాప్తంగా రైతులు, కూలీలు ఇతర రాష్ట్రాలకు వలస వెళ్తున్నారని అన్నారు. హంద్రీనీవా ద్వారా గోరంట్ల మండలంలోని చెరువులకు సాగునీరు తీసుకురావడం ద్వారా ప్రజలను కాపాడాలని ఆయన కోరారు.

భూమి కాజేశారంటూ కలెక్టర్‌కు ఫిర్యాదు

పెనుకొండ రూరల్ : అనేక సంవత్సరాలుగా సాగుచేస్తున్న తమ భూమిని కాజేశారని కురుబవాండ్లపల్లికి చెందిన అంజినమ్మ కలెక్టర్‌కు ఫిర్యాదు చేసింది. గురువారం ఏపీ టూరిజం అతిథిగృహంలో అధికారులతో సమీక్ష అనంతరం బయటకు వస్తున్న కలెక్టర్‌ను ఆమె కలిసింది. ఎర్రమంచి పొలాలకు సంబంధించి 488సర్వేనంబరులో 4.6ఎకరాల భూమిని 20సంవత్సరాల క్రితం తనకు ప్రభుత్వం ఇచ్చిందని, ఇంతవరకు తన ఆధీనంలోనే ఆ భూమి ఉందని, ఆ భూమిని తన తమ్ముడైన నాగేంద్రకు బదిలీచేశారని బాధితురాలు మొరపెట్టుకుంది. వెంటనే కలెక్టర్ స్పందించి ఆర్డీఓ రామ్మూర్తిని పిలిపించి సమస్య పరిష్కరించాలని ఆదేశించారు.

రైతు సేవలో రెవెన్యూ శాఖ

రొద్దం : ఆర్.లోచర్ల, పి.రొప్పాలలో రైతు సేవలో రెవెన్యూశాఖ గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు పలు భూ సమస్యలు పరిష్కరించుకున్నారు. అంతేకాకుండా గ్రామాల్లో ఇళ్లులేని నిరుపేద లబ్ధిదారులను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ తహసీల్దార్ రామక్రిష్ణ, ఆర్ఐ నరేష్, వీఆర్ఓ అనీల్‌కుమార్, రెవెన్యూ సిబ్బంది, రైతులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

పాలసముద్రంలో తల్లిపాల వారోత్సవాలు

గోరంట్ల రూరల్: మండలంలోని పాలసముద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గురువారం తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం జరిగింది. ఏసీడీపీఓ ఉమాశంకరమ్మ, సూపర్‌వైజర్ సారమ్మలు పాల్గొన్నారు. పుట్టిన బిడ్డకు ముర్రుపాలు తాపడంవల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో అంగనవాడీ కార్యకర్తలు పద్మావతమ్మ, అరుణ, సునంద తదితరులు పాల్గొన్నారు.

నీటి కోసం మహిళల రాస్తారోకో



ఖాళీ బిందెలతో రోడ్డుపై బైఠాయించిన మహిళలు

రొద్దం : తురకలాపట్నంలో నీటి సమస్యను పరిష్కరించాలని ఆ గ్రామానికి చెందిన మహిళలు గురువారం పావగడ, పెనుకొండ రోడ్డుపై రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నెల రోజులుగా నీరులేక పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోయారు. గ్రామంలో పలువురు మోటార్లు బిగించుకుని పెద్ద పెద్ద సంపులు ఏర్పాటు చేసుకోవడంతో పబ్లిక్ కొళాయిలకు నీరు రావడం లేదన్నారు. మరికొందరు పూల మొక్కలకు, మల్బరీ తోటలకు నీరు పెట్టుకోవడంతో ఇబ్బంది పడుతున్నామన్నారు. ఈ విషయాన్ని ఎంపీడీఓ జయచంద్రారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. సంఘటనా స్థలానికి చేరుకున్న సర్పంచ్‌తో వారు వాగ్వాదానికి దిగారు. రెండు రోజుల్లోపు కొత్త బోరువేసి నీటి సౌకర్యం కల్పిస్తామని ఎంపీడీఓ, సర్పంచ్ శివయ్య హామీ ఇవ్వడంతో వారు శాంతించారు. హెడ్‌కానిస్టేబుల్ నర్సింహులు, సిబ్బంది రేణుక, మల్లికార్జున చంద్రశేఖర్‌లు ధర్నా చేపడుతున్న మహిళలకు సర్దిచెప్పి పంపించారు.

ఫిర్యాదు చేసినా స్పందించరా..!

తహసీల్దార్ కార్యాలయంలో వ్యక్తి ఆత్మహత్యాయత్నం

గోరంట్ల రూరల్ : తనపై దౌర్జన్యానికి పాల్పడి, తన గుడిసెలను తొలగించిన వ్యక్తుల పై ఫిర్యాదు చేసినా అధికారులు స్పందించకపోవడంపై మండలంలోని మల్లాపల్లి బీసీ కాలనీకి చెందిన నర్సింహులు తహసీల్దార్ కార్యాలయంలో వంటిపై కిరోసిన్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వివరాలు.. ఆ కాలనీలోని రస్తా స్థలంలో నర్సింహులు పూరీ గుడిసె ఉంది. పక్క పొలానికి చెందిన నంజుండప్ప, శివానందలు ఈ విషయమై కోర్టుకు వెళ్లగా స్టేటస్కో ఆర్డర్ ఇచ్చారు. దీంతో రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. ఆలోపే నంజుండప్ప, శివానంద తన అనుచరులతో దౌర్జన్యంగా అతని గుడిసెను తొలగిస్తూ సామగ్రిని ట్రాక్టర్‌లో తీసుకెళ్లారు. వీరి దౌర్జన్యంపై నర్సింహులు తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి బుధవారం అధికారులకు ఫిర్యాదు చేశారు. అధికారులు స్పందించలేదు. దీంతో నర్సింహులు తన కుటుంబ సభ్యులైన నర్సమ్మ, లక్ష్మీదేవమ్మ, గంగప్ప, వెంకటనర్సమ్మలతో గురువారం వచ్చి తహసీల్దార్ కార్యాలయం ప్రధాన ద్వారం కిరోసిన్ క్యాన్‌తో బైఠాయించి నిరసన తెలిపాడు. వంటిపై కిరోసిన్ పోసుకొంటుండగా డీటీ గిరి, ఆర్ఐ మహబూబ్‌బాషా గమనించి అతను ఆత్మహత్యకు పాల్పడకుండా ఆపారు. వారి దౌర్జన్యంపై పోలీసులకు ఫిర్యాదుచేసి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. వెంటనే వీఆర్ఓ శ్రీనివాసులును గ్రామానికి వెళ్లి పరిస్థితి పరిశీలించాలని ఆదేశించారు. దీంతో డీటీనే స్వయంగా రావాలని మళ్లీ కిరోసిన్‌ను వంటిపై పోసుకునే ప్రయత్నం చేయగా సిబ్బంది వారించారు. న్యాయం జరిగేవరకు కార్యాలయం వద్దే ఉంటామని వారు బైఠాయించారు.



కిరోసిన్ క్యాన్‌తో బైఠాయించిన నర్సింహులు కుటుంబ సభ్యులు

నేడు గోరంట్లలో మంత్రుల పర్యటన

గోరంట్ల రూరల్ : పలు కార్యక్రమాల్లో పాల్గొనడానికి రాష్ట్ర మంత్రులు దేవినేని ఉమామహేశ్వర్‌రావు, జవహర్, పరిటాల సునీత కాలువ శ్రీనివాసులు, ఎంపీ నిమ్మలకిష్టప్ప, ఎమ్మెల్యే పార్థసారథి గోరంట్లలో శుక్రవారం పర్యటించనున్నారు. రూ.5 కోట్లతో చిత్రావతి నదిపై నూతన వంతెన నిర్మాణానికి భూమి పూజ, పంచాయతీ బస్టాండు కూడలిలో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ, అనంతరం బహిరంగ సభలో వారు పాల్గొంటారు. ఇందుకోసం జరుగుతున్న ఏర్పాట్లపై ఎంపీ నిమ్మలకిష్టప్ప గురువారం సమీక్షించారు.ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని అభిమానులు ఎన్‌బీకే ఫ్యాన్స్, టీడీపీ నాయకులు, కార్యకర్తలు చాలాకాలంగా డిమాండ్ చేస్తూ వచ్చారు. తమ కోరిక నెరవేరబోతుండటంపై వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో నిమ్మల శిరీష్, యువశేఖర్, శ్రీనివాసులు, రుషభదేవడు, తదితర నాయకులు పాల్గొన్నారు.



ముస్తాబవుతున్న ఎన్టీఆర్ విగ్రహం

వ్యవసాయ గోడౌన్ నిర్మాణం పూర్తి

సోమందేపల్లి : స్థానికంగా రూ.24.60 లక్షల పీఆర్ నిధులతో తలపెట్టిన వ్యవసాయ గోడౌన్ నిర్మాణం పూర్తి అయింది. వ్యవసాయశాఖ గోడౌన్ లేకపోవడంతో వేరుశనగ, కందులను ప్రైవేట్ గోడౌన్‌లో రైతులు నిలువ చేసుకునేవారు. దీంతో రైతులకు కూపన్లు ఓ చోట... పంపిణీ మరో చోట జరిగేది. ప్రస్తుతం తహసీల్దార్, వ్యవసాయశాఖ కార్యాలయాలకు సమీపంలోనే ఈ గోడౌన్‌ను నిర్మించారు.



వ్యవసాయ గోడౌన్



అంగన్‌వాడీలకు అవగాహన

కొత్తచెరువు : గాంధీనగర్ పాఠశాలలోని అంగన్ వాడి కేంద్రంలో కార్యకర్తలకు అవగాహన కార్యక్రమాన్ని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రశాంతి నిర్వహించారు. పిల్లల్ని ఆరోగ్యవంతుల్ని చేయాల్సిన బాధ్యత అంగన్‌వాడి కార్యకర్తలపై ఉందన్నారు.

విద్యార్థులకు ఎమ్మార్ టీకాలు

బుక్కపట్నం : స్థానిక ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లోని విద్యార్థులకు ఎంఆర్ టీకాలను గురువారం డాక్టర్ సునీల్ ఆధ్వర్యంలో వేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ గోపాల్ నాయక్, వైద్య సిబ్బంది రామ్మోహన్‌చౌదరి, షఫి తదితరులు పాల్గొన్నారు.

కొత్తచెరువులో... స్థానిక శాంతినికేతన్, విశ్వభారతి, శిశసాయి గోబుల్ పాఠశాల, మదరసాతో పాటు మరికొన్ని పాఠశాలల్లో ఎంఆర్ వ్యాక్సిన్‌ను 1119 మంది విద్యార్థులకు వేసినట్లు వైద్యాధికారి డాక్టర్ అజయ్‌కుమార్‌రెడ్డి గురువారం తెలిపారు. ఇందులో సూపర్‌వైజర్లు కంబగిరిస్వామి, నరసింహులు, సిబ్బంది పాల్గొన్నారు.



పుట్టపర్తిలో టీకా కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ నాగరాణి

పుట్టపర్తి రూరల్‌లో... స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో ఎమ్మార్ వ్యాక్సిన్ వేసే కార్యక్రమాన్ని వెంగళమ్మచెరువు సర్పంచ్ నాగరాణి, వైద్యాధికారిణి నివేదిత ప్రారంభించారు. గురువారం నాలుగు పాఠశాలల్లో 614 మంది చిన్నారులకు వ్యాక్సిన్ వేసినట్టు డాక్టర్ పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో స్కూల్‌కమిటీ ఛైర్మన్ సుధీర్‌రెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్ పర్వీన్‌బాను, హెచ్‌ఎం బాబు, ఉపాధ్యాయినీఉపాధ్యాయులు, పీహెచ్‌సీ సిబ్బంది సుధాకర్, భాస్కర్, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పుట్టపర్తిలో... నగరపంచాయతీ పరిధిలోని ఆర్‌వీ జానకిరామయ్య ఉన్నత, ప్రాథమిక, ప్రైవేటు పాఠశాలల 850 మంది విద్యార్థులకు టీకాలు వేశామని వైద్యాధికారి నాగరాజునాయక్ పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో సూపర్‌వైజర్లు గోపి, నాగమ్మ, హెచ్‌ఎంలు రామాంజనమ్మ, రామకృష్ణ, వైద్య సిబ్బంది అజీజ్‌ఖాన్, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టపరిహారంపై వాగ్వాదం

ఓబుళదేవరచెరువు : పంటనష్టపరిహారం జాప్యంపై వ్యవసాయ ఏడీఏ రామసురేష్ బాబును రైతులు, వైసీపీ, బీజేపీ, సీపీఐ, సీపీఎం నాయకులు నిలదీశారు. ప్రజా సమస్యలపై వివిధ శాఖల అధికారులతో ఎంపీపీ జీఎండీ ఇస్మాయిల్ అధ్యక్షతన గురువారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. పంటనష్టపరిహారం జాప్యంపై దాదాపు 40 నిమిషాల పాటు సమావేశంలో రైతులు, అధికారుల మధ్య వాగ్వివాదం జరిగింది. చివరకు అధికారులు వారికి సర్ది చెప్పారు. ఆ తర్వాత సమావేశం యథావిధిగా సాగింది. గృహాల మంజూరులో తమను పట్టించుకోవడం లేదని వైసీపీ ఎంపీటీసీలు వాపోయారు. అనంతరం వివిధ శాఖల వారిగా సమస్యలు అధికారులతో సమీక్షించారు. సమావేశంలో జడ్పీటీసీ ఓబుళరెడ్డి, ఎంపీపీ ఇస్మాయిల్, డిప్యూటీ తహసీల్దార్ మహబూబ్‌పీరా, ఎంపీడీఓ కావలి నాగరాజు, పశువైద్యాధికారి శ్రీరాములనాయక్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లలితమ్మ, హౌసింగ్ ఏఈ సంపత్‌కుమార్, ఏపీఎం నాగమణితో పాటు ఇతర శాఖ అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

ఓబుళదేవరచెరువు : మండల పరిధిలోని సున్నంపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు అయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు... గోరంట్ల మండలం బూదిలికి చెందిన నరసమ్మ, నరసింహప్ప, నరేష్ బైక్‌పై కదిరికి బయలుదేరారు. సున్నంపల్లి వద్ద వీరి బైక్‌కు కుక్క అడ్డురావడంతో వీరు కింద పడ్డారు. గాయపడ్డ వీరిని 108 వాహనంలో కదిరికి తరలించారు.

బైక్ అదుపు తప్పి...

ఓబుళదేవరచెరువు (అమడగూరు):మండలంలోని జౌకుల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదం లో పూల కుంటపల్లికి చెందిన గంగాదేవీ గాయపడింది. కందుకూరుపల్లి నుంచి పూలకుంట పల్లికి తన భర్తతో కలిసి గంగాదేవి బైక్‌లో బయలుదేరింది. జౌకుల వద్ద స్పీడ్ బ్రేకర్ల వద్ద బైక్ అదుపు తప్పడంతో ఆమె కింద పడి తీవ్రంగా గాయపడింది. ఆమెకు వెంటనే 108 వాహనంలో ఈఎంటీ సలీంబాష, సాంబశివ ప్రథమ చికిత్స చేసి కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



గాయపడిన గంగాదేవీ

'సమాచార హక్కు' అధ్యక్షుడిగా మహమ్మద్‌అలీ

ఓబుళదేవరచెరువు : సమాచార హక్కు ప్రజా చైతన్య వేదిక మండల అధ్యక్షుడిగా కే.ఎన్.మహ్మద్‌అలీ (షాను) ను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు హబీబుల్ రెహమాన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా అలీ మాట్లాడుతూ.. సమాచార హక్కుపై ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు కృషి చేస్తానన్నారు.

చంద్రన్న బీమా పంపిణీ

బుక్కపట్నం : మండల కేంద్రంలో సాకే రామాంజినమ్మకు చంద్రన్నబీమా మొత్తాన్ని గురువారం సర్పంచ్ యశోద అందజేశారు. పక్షీరప్ప మరణించడంతో చంద్రన్న బీమా కింద తక్షణసాయంగా రూ.5 వేల నగదును అందజేశామని, రూ.25 వేలు బ్యాంకు ఖాతాలో జమ అవుతుందని సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ వెంకటనారాయణరెడ్డి, ఆస్పత్రి కమిటీ ఛైర్మన్ సుబ్బారెడ్డి, టీసీ.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

మండలానికి చేరిన యూనిఫాం

కొత్తచెరువు : మండలంలోని 45 పాఠశాలలకు చెందిన యూనిఫాం వచ్చినట్లు ఎంఈఓ భాస్కర్‌రెడ్డి తెలిపారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నతపాఠశాలల 2,353 మంది విద్యార్థులకు, 4706 జతల దుస్తులు వచ్చాయి. ఒక్కొక్కరికి రెండు జతల చొప్పున త్వరలో పంపిణీ చేస్తామని అన్నారు.

విషజ్వరంతో వృద్ధుడి మృతి

ఓబుళదేవరచెరువు : మండల పరిధిలోని కుసుమవారిపల్లికి చెందిన కుంచెపు నరసింహులు (62) విషజ్వరంతో బాధపడుతూ గురువారం మృతి చెందాడు. బంధువులు తెలిపిన వివరాల మేరకు... ఎనిమిది రోజులుగా తీవ్ర జ్వరంగా ఉండటంతో కొండకమర్ల, నల్లమాడలో వైద్య చికిత్సలు చేయించినా ఫలితం లేక పోయిందన్నారు. రెండురోజుల క్రితం బత్తలపల్లి ఆర్డీటీ వైద్యశాలలో వైద్య సేవలు అందించారు. గురువారం ఇంటిలో మృతి చెందాడు.

బదిలీ టీచర్లకు సన్మానం

ఓబుళదేవరచెరువు : నల్లగుట్లపల్లి ప్రభుత్వ పాఠశాల నుంచి బదిలీ అయిన టీచర్లు శ్రీవాణి, రామకుమార్, లక్ష్మీప్రసన్నలను గురువారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ లలితమ్మ, హెడ్‌మాస్టర్ రంగప్ప, సీఆర్‌పీలు చెన్నక్రిష్ణ, నరసింహులు, సుధాకర్, హైస్కూల్ సిబ్బంది శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఎన్టీఆర్ గృహాలు

నల్లమాడ : మండలంలోని చారుపల్లి, గోపేపల్లి, రెడ్డిపల్లి పంచాయతీ పరిధిలోని అర్హులు అందరికి ఇళ్ళు మంజూరు చేస్తామని హౌసింగ్ ఏఈ హరిప్రకాశ్‌రెడ్డి తెలిపారు. గురువారం చారుపల్లి, గోపేపల్లి పంచాయతీ కేంద్రాల్లో గ్రామ సభలు నిర్వహించారు. చారుపల్లి పంచాయతీలో 239 మందికిగాను 78 మందిని , గోపేపల్లి పంచాయతీలో 89 మందికి గాను 59 మందిని ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ అబ్దుల్‌హమీద్, ఎంపీడీఓ రాబర్ట్ విల్సన్ తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి రూరల్‌లో.. ఎన్టీఆర్ గ్రామీణ గృహ నిర్మాణాల కోసం మండలంలోని నిడిమామిడి, వెంగళమ్మచెరువు, అమగొండపాళ్యంలో హౌసింగ్ ఏఈ నారాయణరెడ్డి, ఎంఈఓ వెంకటరమణనాయక్, తహసీల్దార్ సత్యనారాయణ ఆధ్వర్యంలో గ్రామసభలు గురువారం నిర్వహించారు. నిడిమామిడిలో 143 దరఖాస్తుల్లో 61 మందిని, అమగొండపాళ్యంలో 20 దరఖాస్తుల్లో ఆరుమందిని అర్హులుగా గుర్తించినట్టు తహసీల్దార్ తెలిపారు. వెంగళమ్మచెరువులో సమాచారలోపం కారణంగా గ్రామసభను శుక్రవారానికి వాయిదా వేశారు. నిడిమామిడిలో కార్యదర్శులు జయపాల్‌రెడ్డి, అజయ్, సర్పంచ్ జయమ్మ, జడ్పీటీసీ యశోదాబాయి పాల్గొన్నారు.

బుక్కపట్నంలో.. ఇళ్ల నిర్మాణం కోసం దరఖాస్తు చేసుకున్న వారి విచారణలో భాగంగా గురువారం కృష్ణాపురం గ్రామంలో రెవెన్యూ అధికారులు గ్రామసభ నిర్వహించారు. ఈ గ్రామసభలో ఎంపీడీఓ విజయలక్ష్మి, హౌసింగ్ ఏఈ శ్రీనివాసులు, వీఆర్‌ఓలు దరఖాస్తుదారులను విచారించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నారాయణస్వామి, అప్పస్వామి, గంగాధర్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కొత్తచెరువులో... మండలంలోని బండ్లపల్లి, ఐరగంపల్లి గ్రామాల్లో ఇల్లు లేని పేదలను గుర్తించడానికి గురువారం గ్రామసభలు నిర్వహించారు. దాదాపు వందమందికి పైగా అర్జీలు ఇచ్చారు. వీటిని ప్రజాసాధికర సర్వేలో గుర్తించి ఇళ్లను మంజూరు చేయనున్నట్టు ఎంపీడీఓ రఘుగుప్తా తెలిపారు. ఈకార్యక్రమంలో కార్యదర్శులు పాల్గొన్నారు.

ఓబుళదేవరచెరువులో.. మండలంలోని గ్రామ పంచాయతీల వారీగా గృహ లబ్ధిదారులను గుర్తించుటకు శుక్రవారం నుంచి ఈ నెల పదో తేదీ వరకు గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ కావలి నాగరాజు, గృహనిర్మాణశాఖ ఏఈ సంపత్‌కుమార్ తెలిపారు. 4న అల్లాపల్లి, డబురువారిపల్లి, 5న తంగేడుకుంట, మామిళ్లకుంట్లపల్లి, 7న సున్నంపల్లి, కొండకమర్ల, 8న తిప్పేపల్లి, ఓ.డీ.చెరువు, 9న చింతమానుపల్లి, ఇనగలూరు, మిట్టపల్లి, 10న తుమ్మలకుంట్లపల్లి, వెంకటాపురం గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ గ్రామ సభల్లో ఎంపీడీఓ, హౌసింగ్ ఏఈ, పంచాయతీ కార్యదర్శి, వీఆర్‌ఓ, తహసీల్దార్, వర్క్‌ఇన్‌స్పెక్టర్‌లతో కూడిన బృందాలు పాల్గొంటారని తెలిపారు.

తల్లిపాలపై ర్యాలీ

ఓబుళదేవరచెరువు (అమడగూరు) : తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా గురువారం రెడ్డివారిపల్లిలో అవగాహన ర్యాలీ నిర్వహిం చారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీదేవమ్మ, ప్రభుత్వ వైద్యాధికారి వెంకటేశులు మాట్లాడుతూ.. తల్లిపాలు బిడ్డలకు అమృతం లాంటివని, కావున ప్రతి తల్లి పుట్టిన బిడ్డకు ముర్రుపాలు తాపించాలని సూచించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు మంజులాదేవీ, జ మృత్యుంజయ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కా ర్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త రోజీ, ఆశ కార్యకర్తలు, గర్భవతులు, బాలింతలు పాల్గొన్నారు.

పుట్టపర్తి: తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా గురువారం పురవీధుల్లో మున్సిపల్ ఛైర్మన్ బెస్త చలపతి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం యనమలపల్లి అంగన్‌వాడి కేంద్రాన్ని పరిశీలించారు. ఈకార్యక్రమంలో వైస్‌ఛైర్మన్ కడియాల రాము, కమిషనర్ విజయభాస్కర్‌రెడ్డి, కన్వీనర్ రామాంజినేయులు, కౌన్సిలర్లు ఆదినారాయణమ్మ, చెన్నకృష్ణమ్మ, గుట్లపల్లి గంగాధర్, గంగాద్రి, అంగన్‌వాడి టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

రైతు సేవలో రెవెన్యూ శాఖ

కొత్తచెరువు : మండలంలోని కనిశెట్టిపల్లి, తిరుమలదేవరపల్లి గ్రామాల్లో రైతు సమస్యలపై రెవెన్యూ గ్రామసభను గురువారం నిర్వహించారు. అడంగల్‌లో పేర్ల నమోదు, పట్టాదారు పాసుపుస్తకాలతో పాటు వివిధ సమస్యలపై రైతులు అర్జీలు ఇచ్చారు. తహసీల్దార్ వసంతకుమార్, ఆర్‌ఐ మహ్మద్, వీఆర్‌ఓ ఓబిలేశు పాల్గొన్నారు.

ఓబుళదేవరచెరువులో.. మండలంలోని డబురువారిపల్లిలో రైతుసేవలో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో గ్రామ సభ గురువారం నిర్వహించారు. ఇన్‌చార్జ్ ఆర్డీఓ విశ్వనాథం మాట్లాడుతూ.. రైతులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొస్తే వాటిని సాధ్యమైనంత త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎల్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ మహబూబ్‌పీరా, ఆర్‌ఐ శర్మ, వీఆర్‌ఓ సుధాకర్ పాల్గొన్నారు.

నల్లమాడలో.. నల్లమాడ పంచాయతీ కార్యాలయంలో గురువారం మండల అధికారులు రైతుసేవలో రెవెన్యూశాఖ గ్రామసభలు నిర్వహించారు. ఈ గ్రామసభలో కొత్తపాసుపుస్తకాలు , అడంగల్ , 1బీల కోసం 36 మంది రైతులు ఫిర్యాదులు, వినతులు అందజేశారు. ఈ సమస్యలను త్వరితగతిన పరిశీలించి , అర్హులకు న్యాయం చేస్తామని తహసీల్దార్ అబ్దుల్‌హమీద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ అబ్దుల్‌హమీద్, డిప్యూటీ తహసీల్దార్ జయరామిరెడ్డి, ఆర్‌ఐలు నాగరాజు, శ్రీధర్, వీఆర్‌ఓలు సోమశేఖర్‌రెడ్డి, ముబారక్, అబ్బానీ, పెద్దన్న, రవన్న తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు ఎంఆర్ వ్యాక్సిన్ వేయించాలి

కనగానపల్లి: మీజిల్స్, రుబెల్లా వ్యాధులు రాకుండా 9 నెలల నుంచి 15 సంవత్సరాల పిల్లలందరికీ ఎంఆర్ వ్యాక్సిన్ తప్పనిసరిగా వేయించాలని వైద్యాధికారులు నారాయణ స్వామినాయక్, శ్రీహర్ష పేర్కొన్నారు. మామిళ్లపల్లి ప్రాథమికోన్నత, జిల్లాపరిషత్ పాఠశాలల విద్యార్థులకు గురువారం వైద్య సిబ్బంది వ్యాక్సిన్ వేశారు. ప్రతి పాఠశాలతో పాటు ఇంటింటికీ తిరిగి పిల్లలకు ఎంఆర్ వ్యాక్సిన్ వేయిస్తామన్నారు. హెచ్ఎం శంకర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

10,500 మంది రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ జమ

రాప్తాడు: గత ఏడాదికి సంబంధించిన ఇన్‌పుట్ సబ్సిడీ నగదును ఇప్పటి వరకూ 10,500 మంది రైతుల ఖాతాకు రూ.20.13 కోట్లు జమ చేసినట్లు మండల వ్యవసాయాధికారి అరుణ్‌కుమార్ తెలిపారు. ఇంకా 1752 మంది రైతులకు 3.05 కోట్లు ఖాతాల్లో జమ కావాల్సి ఉందన్నారు. రైతుల పూరి వివరాలు ఖజానా కార్యాలయానికి పంపామని, త్వరలోనే సొమ్ము జమ అవుతుందన్నారు.

తోపుదుర్తిలో గ్రామ సభ

ఆత్మకూరు: మండలంలోని తోపుదుర్తి గ్రామంలో గురువారం పక్కా గృహాల నిర్మాణాలపై గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సొంత ఇళ్లు లేని నిరుపేదలకు పక్కా గృహాల నిర్మాణాలపై అవగాహన కల్పించారు. ప్రభుత్వం వేల రూపాయలు ఖర్చు చేసి పక్కా గృహాలు మంజూరు చేస్తున్నట్లు ఎంపీడీఓ ఆదినారాయణ తెలిపారు. ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. త్వరలో అర్హులకు ఇళ్లు మంజూరు చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ బాషా, పంచాయితీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రామగిరి: మండలంలో శుక్రవారం నుంచి గ్రామసభలు జరుగుతాయని హౌసింగ్ ఏఈ రాజేష్ ఓ ప్రకటనలో తెలిపారు. స్మార్ట్‌పల్స్ సర్వే ఆధారంగా ఇల్లులేని పేదలను గుర్తించి గృహాలను మంజూరు చేస్తామన్నారు. మండలంలో 3 బృందాలుగా ఏర్పడి ఈ సభలు నిర్వహిస్తామన్నారు. ఎంపీడీఓ గంతిమర్రి, తహసీల్దార్ రామగిరి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎంసీ.పల్లిలో గ్రామసభల్లో పాల్గొంటారని, సభలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చికిత్స పొందుతూ విద్యార్థి మృతి

ఆత్మకూరు: మండలంలోని పి సిద్దరాంపురం గ్రామానికి చెందిన అనూరాధ(12) కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పది రోజుల క్రితం ఇంట్లోనే కిరోసిన్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంగతి తెలిసిందే. కుటుంబసభ్యులు తొలుత బాధితురాలిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో కర్నూలుకు తరలించారు. పదిరోజులుగా చికిత్స పొందుతూ మృతి చెందడంతో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఆత్మకూరులో 7వ తరగతి చదువుతుండగా ఈ సంఘటనలో మృతి చెందడంతో రోదించారు.

అనాథ మృతదేహాలకు అంత్యక్రియలు



మృతదేహాలను తరలిస్తున్న దృశ్యం

అనంతపురం వైద్యం : ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో ఇటీవల మృతి చెందిన పద్మావతి, రాముడు మృతదేహాలకు గురువారం ప్రభుత్వం అందించిన మహాప్రస్థానం వాహనాల్లో తరలించి సాయి సంస్థ ఆధ్వర్యంలో గురువారం అంత్యక్రియలు చేశారు. ఈసందర్భంగా సాయిసంస్థ నిర్వాహకులు విజయసాయికుమార్ మాట్లాడుతూ ఇటీవల ఆస్పత్రిలో వీరిద్దరూ మృతి చెందగా వీరికి సంబంధించిన బంధువులు ఎవరూ రాలేదన్నారు. ఆస్పత్రి, నగరపాలక సంస్థ అధికారుల అనుమతితో అంత్యక్రియలు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి డిప్యూటీఆర్ఎంఓ జమాల్‌బాషా, సాయిసంస్థ సభ్యులు కిరణ్‌కుమార్, బాలు, నారాయణస్వామి పాల్గొన్నారు.

రక్తదానంపై యువతలో అవగాహన పెరగాలి : ఆర్ఎంఓ

అనంతపురం టౌన్ : రక్తదానం ఆవశ్యకతపై యువతలో అవగాహన పెరగాలని ప్రభుత్వాస్పత్రి ఆర్ఎంఓ డాక్టర్ శివకుమార్ అన్నారు. నెహ్రూ యువకేంద్ర, ప్రగతిపథం యూత్ అసోసియేషన్, విజన్ యూత్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ పక్షోత్సవాల్లో భాగంగా గురువారం టీటీడీసీలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఆర్ఎంఓ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. యువతీయువకులు రక్తదానం చేయడానికి ముందుకురావాలన్నారు. రక్తదానం వల్ల ఒకరి ప్రాణాన్ని కాపాడడమేకాక మన శరీరంలోని రక్తనాళాల్లో ఏర్పడిన బ్లాక్‌లు తొలగి, రక్తప్రసరణ బాగా జరిగి రుగ్మతలు ఏర్పడకుండా ఉంటుందన్నారు. 18-60 సంవత్సరాల్లోపు 45 కిలోలకుపైగా బరువు కలిగి ఆరోగ్యవంతులైనవారందరూ రక్తదానం చేయవచ్చునన్నారు. అనంతరం దాదాపు 50 మంది యువతీయువకులు రక్తదానం చేశారు.

విద్యార్థులకు తీవ్రమైన నీటి కష్టాలు

కనగానపల్లి: మండలంలోని మామిళ్లపల్లి జిల్లాపరిషత్ పాఠశాలలో విద్యార్థులకు నీటికష్టాలు తీవ్రమయ్యాయి. పాఠశాలలో ఉన్న ఒక్కబోరు ఇటీవలే పూర్తిగా ఎండిపోయింది. బోరుబావిని పట్టించుకునేవారే లేకపోవడంతో తాగునీటి కష్టాలు మొదలయ్యాయి. పాఠశాలలో 236 మంది విద్యార్థులు ఉన్నారు. పాఠశాలలో గ్లాసు నీరు కూడా అందుబాటులో లేకపోవడంతో మధ్యాహ్న భోజన సమయంలో విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు కూడా ఇబ్బందులు పడుతున్నారు. ఇంటి నుంచి తెచ్చుకున్న నీటితో గొంతులు తడుపుకుంటున్న విద్యార్థులు... ప్లేట్లు, చేతులు శుభ్రం చేసుకోవడానికి పాఠశాలకు దూరంగా ఉన్న బావులను ఆశ్రయిస్తున్నారు. తాగేందుకే నీరు లేకపోవడంతో కాలకృత్యాలు తీర్చుకోవడం గగనంగా మారింది. కాగా హెచ్ఎం శంకర్‌రెడ్డి మాట్లాడుతూ ట్యాంకర్ నీరు తెప్పిస్తున్నా చాలడం లేదన్నారు. పాఠశాలకు ఉన్న బోరు ఇటీవల అడుగంటిందని, ఆర్‌డబ్ల్యుఎస్, పంచాయతీ అధికారులకు కూడా సమస్యను తెలియజేశామన్నారు. ఇక విధి లేక ట్యాంకర్ ద్వారా నీరు తెప్పిస్తున్నామని చెప్పారు.


బోరుబావి వద్ద ప్లేట్లు శుభ్రం చేస్తున్న విద్యార్థులు

ప్రారంభానికి సిద్ధంగా అంగన్‌వాడీ కేంద్రం

బోగినేపల్లి (రాప్తాడు): మండలంలోని బోగినేపల్లిలో నూతనంగా నిర్మించిన అంగన్‌వాడీ భవనం ప్రారంభానికి సిద్ధంగా ఉందని ఎంపీపీ దగ్గుపాటి ప్రసాద్, టీడీపీ మండల ఇన్‌చార్జి ధర్మవరపు మురళి తెలిపారు. గతంలో అంగన్‌వాడీ భవనం అద్దె ఇంట్లో ఇరుకు గదుల్లో కొనసాగుతుండేదని, దీంతో సిబ్బంది, చిన్నారులు ఇబ్బందిపడేవారన్నారు. సమస్యను మంత్రి పరిటాల సునీతకు తెలుపగా రూ.7 లక్షల నిధులు మంజూరు చేయించారన్నారు. ఆ నిధులతో నూతన భవనం నిర్మించి తాగునీరు, విద్యుత్ సౌకర్యం కల్పించారు. త్వరలో మంత్రి అంగన్‌వాడీ భవనాన్ని ప్రారంభిస్తారన్నారు.



నూతనంగా నిర్మించిన అంగన్‌వాడీ భవనం

పశువుల తాగునీటి తొట్టె ఏర్పాటు

బుక్కచెర్ల (రాప్తాడు): మండలంలోని బుక్కచెర్ల గ్రామంలో పశువులకు తాగునీరు అందించేందుకు తొట్టె ఏర్పాటు చేసినట్లు ఏపీఓ చెన్నకేశవులు తెలిపారు. ఉపాధి హామీ నిధులు రూ.22 వేల వ్యయంతో నిర్మాణ పనులు పూర్తి చేశామన్నారు. గ్రామంలో పశువులకు అవసరమైన నీరు అందించేందుకు ఈ తొట్టెలు ఎంతో ఉపయోగకరమన్నారు. గ్రామ ప్రజలు నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలన్నారు.


నీటితో కళకళలాడుతున్న పశువుల తాగునీటి తొట్టె

లబ్ధిదారులకు నూతన పింఛన్ల పంపిణీ

అనంతపురం సప్తగిరిసర్కిల్: అనంతపురం రూరల్ మండలం పాపంపేట, ఆకుతోటపల్లిలో నూతనంగా మంజూరైన పింఛన్ లబ్ధిదారులకు గురువారం పంపిణీ చేశారు. జడ్పీటీసీ వేణుగోపాల్, టీడీపీ నాయకులు డిష్ నాగరాజు, చంటి ముఖ్యఅతిథులుగా హాజరై పింఛన్ అందజేశారు. మండల వ్యాప్తంగా అర్హులైన వారికి కొత్త పింఛన్లు మంజూరయ్యాయన్నారు. అందులో పాపంపేటకు 21, ఆకుతోటపల్లిలో 13 మందికి కొత్త పింఛన్లు మంజూరయ్యాయి. ఇంకా అర్హులు పింఛన్ రాకపోతే దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆకుతోటపల్లి ఎంపీటీసీలు వెంకటరమణ, ఆనంద్, పాపంపేట వార్డు మెంబర్ సాలమ్మ, టీడీపీ నాయకులు కుమ్మర రామాంజినేయులు, దస్తగిరి, పేరం హరి, జన్మభూమి కమిటీ సభ్యులు నిజాం, గోవిందు, లక్ష్మీదేవి, అలివేలమ్మ, తెలుగుయువత మండల కార్యదర్శి హరీష్‌రెడ్డి, డీలర్లు వెంకటరాముడు, డీసీ బాబు, నారాయణ, రాధాక్రిష్ణ, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సర్వేలో అర్హులైన లబ్ధిదారుల ఎంపిక


అక్కంపల్లిలో గ్రామ సభ నిర్వహిస్తున్న అధికారులు

అనంతపురం సప్తగిరిసర్కిల్: అర్హులైన లబ్ధిదారుల ఎంపికకే ప్రజాసాధికార సర్వే నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఓబులమ్మ పేర్కొన్నారు. గురువారం అనంతపురం రూరల్ మండలం పరిధిలోని కామారుపల్లి, అక్కంపల్లి, చిన్నంపల్లి గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించారు. ఎంపీడీఓ ఓబులమ్మ, ఈఓఆర్డీ లక్ష్మీనరసింహ, ఆయా గ్రామాల సర్పంచ్‌లు లబ్ధిదారుల ఎంపిక చేపట్టారు. ప్రజాసాధికార సర్వేలో ఇళ్ళులేని వారి వివరాలు సేకరిస్తామన్నారు. తద్వారా అర్హులైన వారి వివరాలను జిల్లా కలెక్టర్‌కు పంపడం జరుగుతుందన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో అక్కంపల్లి సర్పంచ్ రామలక్ష్మీబాయ్, చిన్నంపల్లి సర్పంచ్ కొండయ్య, పంచాయితీ కార్యదర్శులు మధుసూదన్, జయప్రసాద్, హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ నాగేంద్ర పాల్గొన్నారు.

పరిటాల రవీంద్ర ట్రస్ట్ ద్వారా వీధి దీపాల ఏర్పాటు

ఆత్మకూరు : మండల కేంద్రంలోని ఆంజనేయస్వామి దేవాలయం దగ్గర గురువారం రాత్రి పరిటాల రవీంద్ర ట్రస్ట్ ద్వారా ఏర్పాటు చేసిన పెద్ద ఫోకస్సింగ్ లైట్లను ప్రారంభించారు. వీటిని మండల టీడీపీ కన్వీనర్ సూరి, మండల సీనియర్ నాయకుడు దుబ్బ ఈశ్వర్‌రెడ్డి ప్రారంభించారు. రూ.70 వేలకు పైగా ఖర్చు చేసి లైట్లు ఏర్పాటు చేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. వీటి ఏర్పాటుతో ఆంజనేయ స్వామి పరిసర ప్రాంతమంతా కాంతులతో రాత్రి వేళల్లో అత్యధికంగా వెలుతురు వచ్చి ప్రజలకు ఇబ్బందిలేకుండా ఉండడానికి ఏర్పాటు చేయించిన పరిటాల కుటుంబానికి కృతజ్ఞతలు తెలిపారు. వీటి ఏర్పాటుకు కృషి చేసిన మండల టీడీపీ ఇన్‌చార్జ్ బాలాజీకి మండల టీడీపీ నాయకులు అభినందనలు తెలిపారు. మండలంలో అనేక చోట్ల ఇలాంటి పెద్దలైట్లు ఏర్పాటు చేసినట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రవీంద్రరెడ్డి, కందుల ఓబులపతి, గుజ్జుల రామదాసు, ఆనంద్, బొమ్మయ్య, రవి, పూల ఓబులపతి తదితరులు పాల్గొన్నారు.

బొమ్మేపర్తిలో రెవెన్యూ సభ

రాప్తాడు: రైతు సేవలో రెవెన్యూ కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని బొమ్మేపర్తిలో సభ నిర్వహించినట్లు తహసీల్దార్ నాగభూషణం తెలిపారు. వెబ్‌ల్యాండ్ నవీకరణ, మార్పులు చేర్పులు, భూసమస్యలు పరిష్కరిస్తామన్నారు. రైతులు భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరగకుండా ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామాల్లోనే గ్రామ సభలు ఏర్పాటు చేశామన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామ సభల్లో అందించిన అర్జీలను వెంటనే పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎర్రిస్వామి, ఆర్ఐ బోగన్నగౌడ్, వీఆర్ఓ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రైతుసేవలో రెవెన్యూ శాఖ

రామగిరి: మండలంలోని మాదాపురంలో రైతు సేవలో రెవెన్యూ శాఖ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. తహసీల్దార్ ఆదినారాయణ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించి రెవెన్యూ సమస్యలపై వినతులు స్వీకరించారు. రైతుల వారి భూములకు సంబంధించి సమస్యలున్నా, పాసుపుస్తకాలు పోయినా దరఖాస్తులు ఇవ్వవచ్చని తెలిపారు. 16మంది రైతులు దరఖాస్తులు ఇచ్చారని, వీటిని సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తామని అధికారులు తెలిపారు. ఈకార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అనంతపురం సప్తగిరిసర్కిల్: అనంతపురం రూరల్ మండలం పరిధిలోని పలు గ్రామాల్లో శుక్రవారం గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు మండల అధికారులు తెలిపారు. మండలంలోని పూలకుంట, చియ్యేడు, ఏ నారాయణపురం, రాచానపల్లి, కొడిమి గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహిస్తామన్నారు. ఉదయం 10 గంటల నుంచి 2 గంటల వరకూ గ్రామ సభలు కొనసాగుతాయన్నారు. రైతులు తమ సమస్యలను అధికారులకు తెలియజేసుకోవచ్చన్నారు.


అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ నాగభూషణం

ఆంధ్రజ్యోతి శింగనమల
శుక్రవారం 04, ఆగస్టు 2017
13
|శింగనమల |నార్పల |బుక్కరాయసముద్రం |గార్లదిన్నె |యల్లనూరు |పుట్లూరు|

బంగారు దుకాణంలో చోరీ

నార్పల: మండల కేంద్రంలోని బంగారు దుకాణంలో బుధవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. వివరాల్లోకి వెళితే హుసేన్ పీరా అనే వ్యక్తి గాంధీ సర్కిల్ వద్ద జువెలరీ షాపు నిర్వహిస్తున్నాడు. బుధవారం పనులు ముగించుకుని షాపుకు తాళాలు వేసి ఇంటికెళ్లాడు. ఇదే అదునుగా భావించిన దొంగలు దుకాణంలో ఉన్న మూడున్నర తులాల బంగారు, నాలుగు వేల నగదును ఎత్తుకెళ్లారు. దీనిపై పోలీసులుకు బాధితుడు ఫిర్యాదు చేయగా ఏఎస్ఐ రామచంద్రారెడ్డి సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. నిందితుల కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలని వినతి

పుట్లూరు : మండలంలోని అరకటవేముల గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కరించాలని గురువారం సీపీఎం నాయకులు తహసీల్దార్ పుల్లన్నకు వినతిపత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ గ్రామంలో ఒక్కొక్కరికి రోజుకు 10 బిందెల చొప్పున ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారన్నారు. ట్యాంకరు రెండ్రోజులకోసారి వస్తోందని, దీంతో నీటికోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో కార్యదర్శి పెద్దయ్య, పెద్దకొండయ్య, ఓబులపతి ఉన్నారు.

రైతు సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు



గ్రామసభలో పాల్గొన్న తహసీల్దార్ గోపాల్‌రెడ్డి తదితరులు

గార్లదిన్నె: ఆన్‌లైన్‌లో భూముల వివరాలు లేని రైతులకు కోసం ప్రభుత్వం రైతు సేవలో రెవెన్యూ శాఖ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ గోపాల్‌రెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా గురువారం పెనకచెర్ల గ్రామంలో నిర్వహించిన గ్రామసభకు 4 వినతులు వచ్చినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ నాగరాజు, ఆర్ఐ కిరణ్మయి, టీడీపీ నాయకులు రామచంద్రారెడ్డి, నరసింహారెడ్డి, వీఆర్వో ముత్యాలు పాల్గొన్నారు.

నేటి గ్రామసభలు : మండలంలో శుక్రవారం కల్లూరు, కృష్ణాపురం, ఎంపీఆర్‌డ్యాం గ్రామాల్లో ఎన్టీఆర్ గ్రామీణ హౌసింగ్‌పై గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ భాస్కర్‌రెడ్డి తెలిపారు.

జూలాకలువ (శింగనమల): గ్రామాల్లో భూ సమస్యలు పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఆర్ఐ దేవపుత్ర తెలిపారు. గురువారం జూలా కాలువలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో వీఆర్ఓ ఈశ్వర్‌రెడ్డి, గుప్తా, ప్రకాశ్, రైతులు పాల్గొన్నారు.

యల్లనూరులో : మండలంలో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు ఒక అర్జీ వచ్చినట్లు తహసీల్దార్ నాగరాజు తెలిపారు. వెన్నపూసపల్లి గ్రామంలో నిర్వహించిన సదస్సులో అడంగళ్‌లో మార్పు కోసం ఒక అర్జీ వచ్చిందన్నారు. దీన్ని వెంటనే పరిష్కరించామని తహసీల్దార్ తెలిపారు. శుక్రవారం పాతపేట గ్రామంలో గ్రామసభ ఉంటుందన్నారు.

రాష్ట్ర కమిటీ సమావేశాలు విజయవంతం చేయండి

నార్పల: జిల్లా కేంద్రంలోని రామకృష్ణ ఫంక్షన్ హాల్‌లో 10, 11, 12వ తేదీల్లో జరిగే రాష్ట్ర కమిటి సమావేశాలను విజయవంతం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి ప్రభాకర్, సీఐటీయూ జిల్లా నాయకుడు ప్రభుదాస్ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక సీపీఎం ఆధ్వర్యంలో పోస్టర్లు విడుదల చేశారు. కార్యక్రమానికి పెద్దఎత్తున కార్యకర్తలు, నాయకులు తరలిరావాలన్నారు. కార్యక్రమంలో బొట్టు నల్లప్ప, నాగన్న, సూరి, నాగేంద్ర, ప్రసాద్ పాల్గొన్నారు.

తొమ్మిది మంది బైండోవర్

నార్పల: మండల కేంద్రంలో మట్కా నిర్వహిస్తున్న తొమ్మిది మందిని గురువారం బైండోవర్ చేసినట్లు ఎస్ఐ రాంప్రసాద్ తెలిపారు. వీరిని తహసీల్దార్ ఎదుట హాజరుపరిచి రూ.లక్ష పూచికత్తుపై విడుదల చేశామన్నారు.





పుట్లూరు, యల్లనూరులో నూతన వసతి గృహాలను ప్రారంభిస్తున్న విప్, ఎమ్మెల్సీ

వసతి గృహాలను ప్రారంభించిన విప్

పుట్లూరు : మండలకేంద్రంలోని ఆదర్శ పాఠశాల వద్ద నూతనంగా నిర్మించిన బాలికల వసతిగృహాన్ని, బీసీ హాస్టల్ భవనాన్ని గురువారం విప్, ఎమ్మెల్యే యామినీబాల ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో విద్యకు పెద్దపీట వేస్తున్నామన్నారు. ఎన్నడూలేనివిధంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేశామన్నారు. వీటితో పాటు ప్రతి ఏడాది స్కాలర్‌షిప్‌లు ఇస్తున్నామన్నారు. జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు ఆరోపణలు చేస్తున్నాయన్నారు. ప్రతి మండలంలో హాస్టళ్లను ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా విద్యను బోధించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని పేర్కొన్నారు. అనంతరం పలు సమస్యలపై మండల అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పలుశాఖల అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

యల్లనూరులో : మండలంలోని చిలమకూరు ఆదర్శ పాఠశాల హాస్టల్ భవనాన్ని గురువారం విప్ యామినీబాల, ఎమ్మెల్సీ శమంతకమణితో కలిసి ప్రారంభించారు. రూ.1.28కోట్లతో నిర్మించిన హాస్టల్ భవనాన్ని విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుందని విప్ తెలిపారు. చంద్రబాబునాయుడు ప్రభుత్వం కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ఉండాలన్న ఉద్దేశంతోనే అధునాతన సౌకర్యాలతో కూడిన హాస్టళ్లను నిర్మించారన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రోడ్డు సౌకర్యం కల్పించండి : యల్లనూరు-తిమ్మంపల్లి ప్రధాన రహదారికి ఆదర్శ పాఠశాల సుమారు కిలోమీటర్ దూరం ఉంటుందని, రోడ్డు సౌకర్యం లేకపోవడంతో పిల్లలు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రోడ్డు సౌకర్యం కల్పించాలని మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ బోగాతి నారాయణరెడ్డి, సర్పంచ్ రత్నమయ్య ఎమ్మెల్సీను కోరారు. కార్యక్రమంలో మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ ప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చెన్నకేశవ ఆలయంలో పూజలు : మండలంలోని వెన్నపూసపల్లి చెన్నకేశవస్వామి ఆలయంలో గురువారం విప్, ఎమ్మెల్సీ ప్రత్యేకపూజలు నిర్వహించారు. వర్షాకాలం మొదలై రెండు నెలలు పైబడి కావస్తున్నా వర్షాలు కురవకపోవడంతో వర్షం రాక కోసం పూజలు చేశామని గ్రామస్థులు తెలిపారు.

నకిలీ మొక్కజొన్న విత్తనాలతో పంట నష్టం

బుక్కరాయసముద్రం : నకిలీ విత్తనాలు రైతులను నట్టేట ముంచుతున్నాయి. ప్రస్తుత ఖరీఫ్‌లో వేరుశనగ పంటకు ప్రత్యామ్నాయంగా మొక్కజొన్న పంటను మండల పరిధిలోని రేగడి కొత్తూరు, పొడరాళ్ల గ్రామాల్లో 100 ఎకరాలు రైతులు సాగుచేశారు. కంకిలో మాత్రం విత్తనాలు ఏర్పడలేదు. సాధారణంగా పంట 70 రోజులకు కంకిలో విత్తనాలు ఏర్పాడాలి. ఇప్పటి వరకు విత్తనం ఏర్పడకపోవడంతో గురువారం మండల ఏఓ చిన్నమ్మకు నకిలీ విత్తనాలపై ఫిర్యాదు చేశారు. అనంతపురం గుత్తిరోడ్డులోని శ్రీ వెంకటేశ్వర కాంప్లెక్స్ ఎరువుల దుకాణంలో నూజువీడు కంపెనీ విత్తనాలు తీసుకున్నామని రైతులు ఏఓకు వివరించారు. నకిలీ విత్తనాలు ఇచ్చిన కంపెనీ, ఎరువుల దుకాణంపై చర్యలు తీసుకోవాలని రైతులు, వడియపం పేట గ్రామ సర్పంచ్ సుబ్బరాయుడు డిమాండ్ చేశారు. శుక్రవారం సాగు చేసిన పంటను పరిశీలించి జేడీకి నివేదిక పంపుతున్నట్లు ఆమె తెలిపారు.



ఏఓకు మొక్క జొన్న కంకులను చూపిస్తున్న రైతులు

ఎస్సీ, ఎస్టీ కేసుల విచారణ

గార్లదిన్నె : మండల పరిధిలోని కల్లూరు, పెనకచెర్ల గ్రామంలో ఎస్సీ,ఎస్టీ కేసులను గురువారం ఎస్సీ, ఎస్టీ సెల్ డీఎస్పీ మహబూబ్‌బాషా విచారించారు. పెనకచెర్ల గ్రామంలో నారాయణమ్మ అనే మహిళను అదే గ్రామానికి చెందిన నారాయణ కులం పేరుతో దూషించాడని ఇటీవలే అతనిపై ఆమె ఫిర్యాదు చేసింది. అదే విధంగా కల్లూరు గ్రామంలో ఓబిలేసు అనే వ్యక్తిపై కొందరు గ్రామస్తులు ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయించారు. ఈ రెండు కేసులను గురువారం రాత్రి డీఎస్పీ విచారించి బాధితులతో చర్చించారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

గార్లదిన్నె : మండల పరిధిలోని మర్తాడు గ్రామంలో రామాంజనేయులు అనే వ్యక్తి గురువారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. 108 సిబ్బంది తెలిపిన వివరాల మేరకు మర్తాడు గ్రామంలో రామాంజనేయులు, సంధ్యారాణి దంపతులు కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగించేవారు. రామాంజనేయులు గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతుండేవాడు. గురువారం మనస్థాపం చెందిన అతను ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగు మందు తాగాడు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు, చుట్టుపక్కలవారు చికిత్స నిమిత్తం 108 వాహనం ద్వారా అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో గుడిసె దగ్ధం



పూర్తిగా కాలిపోయిన గుడిసె

బుక్కరాయసముద్రం : మండల పరిధిలోని గోవిందంపల్లి బీజేపీ కాలనీలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో గుడిసె గుడిసె దగ్ధమైంది. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు మేరకు బీజేపీ కాలనీలో నివాసముంటున్న పోతలయ్య, భార్య ఎర్రమ్మ కూలి పనిచేసుకుని జీవనం సాగించేవారు. మంగళవారం వీరి కూమారుడుకు ఆరోగ్యం సరిగాలేకపోవడంతో చికిత్స కోసం హైదరాబాద్‌కు వెళ్లారు. గురువారం విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కావడంతో గుడిసె దగ్ధమైంది. గుడిసెలో పొగ రావడంతో చుట్టుపక్కల వారు అగ్నిమాపక శాఖ వారికి సమాచారం అందించారు. వెంటనే వారు అక్కడికి చేరుకుని మంటలు ఆర్పివేశారు. ఇంట్లో ఉన్న రూ.20వేల నగదు, బియ్యం, టీవీ, నిత్యాసర వస్తువులు, బీరువాతో పాటు బట్టలు అగ్నికి ఆహుతయ్యాయి. రూ.లక్ష ఆస్తినష్టం వాటిల్లినట్లు బాధితులు వాపోయారు.

బదిలీ అయిన ఉపాధ్యాయులకు సన్మానం

నార్పల: మండలంలోని పులసలనూతల ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వివేకానందరెడ్డి, నార్పల ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు సువర్ణమ్మ, వరలక్ష్మి, విజయలక్ష్మి, బాబా ఫక్రుద్దీన్ బదిలీ కావడంతో గురువారం ఎంఈఓ క్రిష్టయ్య, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ బదిలీ అయిన ఉపాధ్యాయులు పిల్లల పట్ల ఎంతో శ్రద్ధ తీసుకుని క్రమశిక్షణతో విద్యను అందించారని కొనియాడారు. నలుగురు ఉపాధ్యాయులు పాఠశాలకు రూ.8 వేలు విలువచేసే స్పీకర్లను ఉచితంగా అందించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు గంగాధర్, ఈశ్వరయ్య, వెంకటేశ్వర్లు, గంగాద్రి, సంజప్ప పాల్గొన్నారు.

ఎంఆర్ వ్యాక్సిన్‌ను వంద శాతం వేయించాలి

బుక్కరాయసముద్రం : ప్రభుత్వం అమలు చేస్తున్న (ఎంఆర్) మీజిల్స్, రుబెల్లా వ్యాక్సిన్‌ను పిల్లలందరికీ వేసి వంద శాతం పూర్తి చేయాలని అదనపు వైద్యశాఖాధికారి అనిల్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం బుక్కరాయసముద్రం, కొర్రపాడు పీహెచ్‌సీ కేంద్రాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎంఆర్ వ్యాక్సిన్‌ను ఎంత మంది పిల్లలకు వేశారు, ఇంకా వేయాల్సిన వారు ఎందరున్నారని ఆరాతీశారు. కార్యక్రమంలో ఆయా ఆస్పత్రుల వైద్యాధికారులు దయాకర్, సత్యసాయి, సీహెచ్ఓ సీమా, రేణుకమ్మ, సాంబమ్మ పాల్గొన్నారు.

గార్లదిన్నెలో : మండలంలో తొమ్మిది నెలల నుంచి 15 సంవత్సరాల వయస్సులోపు పిల్లలందరికీ ఎంఆర్ వ్యాక్సిన్ తప్పనిసరిగా వేయించాలని వైద్యాధికారి అన్వర్‌బాషా తెలిపారు. గురువారం 13 పాఠశాలల్లో ఎంఆర్ వ్యాక్సిన్ కార్యక్రమం చేపట్టామన్నారు. 1261 మంది పిల్లలకు వ్యాక్సిన్ వేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్ఓ నాగరాజు, వైద్య సిబ్బంది ధనుంజయ పాల్గొన్నారు.

నార్పలలో : మండలంలోని కర్లపాడికి ప్రభుత్వ పాఠశాలలో వైద్యాధికారి పుష్పలత ఆధ్వర్యంలో విద్యార్థులకు ఎంఆర్ వ్యాక్సిన్‌ను వేశారు. కార్యక్రమంలో ఎంఈఓ కిష్టయ్య, ఎంపీహెచ్ఈఓలు సుబ్రమణ్యం, అక్కులప్ప, ఏఎన్ఎం సుగుణ, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

తరిమెల (శింగనమల)లో : చిన్నారులకు ఎంఆర్ వ్యాక్సిన్ తప్పనిసరిగా వేయించాలని తరిమెల సర్పంచ్ ఆదినారాయణ సూచించారు. గురువారం తరిమెల పాఠశాలలో పిల్లలకు ఎంఆర్ వ్యాక్సిన్ వేశారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు శశికళ, కేశవయ్య, అనిల్, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, హెచ్ఎం సుంకన్న పాల్గొన్నారు.









బుక్కరాయసముద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న ఏడీఎంహెచ్ఓ, గార్లదిన్నె, నార్పల, తరిమెలలో విద్యార్థులకు ఎంఆర్ టీకాలు వేస్తున్న వైద్య సిబ్బంది

ఆంధ్రజ్యోతి
4
తాడిపత్రి
శుక్రవారం 04, ఆగస్టు 2017
● తాడిపత్రి ● తాడిపత్రి రూరల్ ● యాడికి ● పెద్దపప్పూరు● పెద్దవడుగూరు

ప్రభుత్వాసుపత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా అజేంద్ర



తాడిపత్రిటౌన్ : స్థానిక ప్రభుత్వాసుపత్రి ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్‌గా అజేంద్ర గురువారం నియమితులయ్యారు. ఇంతకుముందు ఇన్‌చార్జిగా ఉన్న పవన్‌కుమార్ కర్నూలు ప్రభుత్వాసుపత్రికి అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా బదిలీపై వెళ్లారు. ఇక్కడే వైద్యుడిగా పనిచేస్తున్న అజేంద్రను ఆ పదవిలో నియమించినట్లు ఆస్పత్రి వర్గాలు తెలిపాయి.

ఖరీఫ్ సాగు ప్రశ్నార్థకం

- జూలైలో కురవని వర్షం
- అతి తక్కువ విస్తీర్ణంలో వేరుశనగ సాగు
- వేసిన పంట ఎండిపోతున్న వైనం
- దిక్కుతోచని స్థితిలో అన్నదాత

తాడిపత్రిరూరల్ : ఎప్పటిలాగే ఈసారి కూడా ఖరీఫ్ సీజన్ రైతులకు నిరాశే మిగిల్చింది. మండల వ్యాప్తంగా వేరుశనగ సాగు 24 హెక్టార్లల్లో సాగై రికార్డు నమోదు చేసింది. దీంతో వర్షాభావంతో ఏ ఖరీఫ్‌లోను లేనివిధంగా అతితక్కువగా రైతులు వేరుశనగను సాగుచేశారు. జూన్ నెలలో సాధారణ వర్షపాతం 72 ఎంఎం ఉండగా రికార్డుస్థాయిలో 112 ఎంఎం వరకు వర్షపాతం నమోదైంది. దీంతో రైతుల్లో ఆశలు చిగురించి ఎక్కువమంది వేరుశనగ విత్తనాన్ని కొనుగోలు చేశారు. జూలై నెలలో సాధారణ వర్షపాతం 79ఎంఎం పడాల్సి ఉండగా 29 ఎంఎం మాత్రమే కురిసింది. మరో వర్షం కోసం ఎదురుచూస్తున్న రైతులకు నిరాశే మిగిలింది. అటు వ్యవసాయాధికారులు ఆగస్టు 1 వరకు మాత్రమే విత్తుకోవడానికి డెడ్‌లైన్ చెప్పారు. ఆగస్టు 13 సాగు సమయం పూర్తయినా జూలై 30న ఓ మోస్తరు వర్షం కురవడంతో కొందరు రైతులు ధైర్యం చేసి వేరుశనగ విత్తనాన్ని విత్తారు. బుధవారం వరకు వేసిన వేరుశనగ పంట లెక్కగడితే 24హెక్టార్లు మాత్రమే సాగయింది. ప్రస్తుతం వర్షాలు వచ్చినా వేరుశనగ పంటను వేసుకోవద్దని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. ప్రత్యామ్నాయ పంటలైన కంది, పొద్దుతిరుగుడు, జొన్న, నవధాన్యాలు వంటి పంటలు వేసుకోవాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.



బీడుగా ఉన్న భూమి

వర్షపాత లోటు : ఏడాదికేడాది వర్షపాతం తక్కువగా ఉండడంతో రైతులు అప్పుల్లో కూరుకుపోతున్నారు. జూన్ నెలలో అధిక వర్షపాతం నమోదు కావడంతో కొందరు రైతులు ముందుగా వేరుశనగ విత్తనాన్ని విత్తుకున్నారు. జూలై నెలంతా వర్షమే లేకపోవడంతో వేరుశనగ పంట ఎండుదశకు వచ్చింది. దీంతో రైతులు ఏంచేయాలో దిక్కుతోచనిస్థితిలో ఉన్నారు. అటు పంటవేయని రైతులు వేరుశనక్కాయలు అమ్ముకోవడానికి మిల్లుల చుట్టూ తిరుగుతున్నారు.

ప్రత్యామ్నాయ పంటలే శరణ్యం : భూములు సాగుచేసి వర్షం కోసం ఎదురుచూస్తున్న రైతులకు ప్రత్యామ్నాయ పంటలే శరణ్యమయ్యాయి. ప్రస్తుతం వర్షపాతం తక్కువ నమోదైనా తట్టుకునే పంటలు మాత్రమే వేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. దీంతో రైతులు అటువైపు మొగ్గుచూపక తప్పలేదు. ప్రత్యామ్నాయ పంటలైన జొన్న, పొద్దుతిరుగుడు, కొర్ర, అలసంద, కంది తదితర పంటలు వేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.



ఎండుముఖం పట్టిన వేరుశనగ పంట

తక్కువ విస్తీర్ణంలో వేరుశనగ సాగైంది
రవీంద్ర, వ్యవసాయాధికారి



ఈఏడాది ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి జూలై నెలలో తక్కువ వర్షపాతం ఉండడంతో రైతులు వేరుశనగ పంటను తక్కువగా వేశారు. ప్రస్తుతం రైతులకు సబ్సిడీతో కూడిన నవధాన్యాల కిట్లు ఇస్తున్నాం. వర్షపాతం తక్కువగా ఉన్నా ఈ పంటలు తట్టుకొని మంచి దిగుబడులు ఇస్తాయి. విత్తనం కావాలనుకునే రైతులు కార్యాలయాల్లో సంప్రదించాలి.

లోకల్ గైడ్



తాడిపత్రి మార్కెట్‌లో

కూరగాయల ధరలు

పచ్చి మిరపకాయలు-రూ.50, టమోట-60, ఉల్లిగడ్డలు-20, ఉర్లగడ్డలు-20, అంకర వంకాయలు- 30, ముల్లంకాయలు: 40, చిక్కుడుకాయలు-40, మొటిక్కాయలు- 25, బెండకాయలు-25, బీరకాయలు-30, కాకరకాయలు-40, క్యారెట్-50, క్యాబేజీ-20, క్యాలీఫ్లవర్-25, బీట్ రూట్- 25, దోసకాయలు:20, ముల్లంగి : 20, బీన్సు - రూ.40.

తాడిపత్రి సినిమాలు

బీహెచ్ మహల్ : మాయామాల్ (సెల్ ఫోన్ :08558222772), లక్ష్మీనారాయణ : డీజే (సెల్‌ఫోన్: 9848957005), విజయలక్ష్మి: నిన్నుకోరి (సెల్‌ఫోన్: 08558-223078), వరలక్ష్మి: బాహుబలి-2 (సెల్‌ఫోన్:08558-223078), జయలక్ష్మి: ఫిదా (సెల్‌ఫోన్: 08558-223078), సాయితేజ: నిన్నుకోరి (సెల్‌ఫోన్: 08558 -221100), దాదా: నక్షత్రం

యాడికి: లక్ష్మీప్రియ: నిన్నుకోరి (సెల్‌ఫోన్: 90592 90284)

మాంసం ధరలు

చికెన్ (కేజీ) : రూ.150, స్కిన్‌లెస్ చికెన్ : 170, మటన్ : 440, చేప: 120, గుడ్లు (100) : రూ.410

గ్యాస్ సమాచారం

అందుబాటులో ఉన్న సిలిండర్లు
ఇండియన్ : 355 హెచ్‌పీ గ్యాస్ : 340

ఎమ్మెల్యే డైరీ

తాడిపత్రి : ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్‌రెడ్డి శుక్రవారం ప్రజలకు అందుబాటులో ఉంటారు.

గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించండి

యాడికి : మండలంలోని గుడిపాడు, కుందనకోట గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించాలని పెన్నాసిమెంటు ఫ్యాక్టరీ యాజమాన్యాన్ని ఆయా గ్రామాల ప్రజలు కోరారు. గురువారం మండలంలోని గుడిపాడు గ్రామంలో సిమెంటు ఫ్యాక్టరీ నిర్మాణంపై జాయింట్ కలెక్టర్ రమామణి అధ్యక్షతన నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో గ్రామస్థులు పాఠశాలకు అదనపు తరగతి గదులు నిర్మించి ఉన్నత పాఠశాల చేయాలని, రోడ్లు, తాగునీటి వసతి కల్పించాలని కోరారు. దీనికి ఫ్యాక్టరీ యాజమాన్యం స్పందిస్తూ ఇదివరకే పాఠశాలను అభివృద్ధి చేశామని, తాగునీటి వసతి కల్పించామని, అవకాశముంటే గ్రామాలను మరింత అభివృద్ధి చేసేందుకు కృషిచేస్తామన్నారు. అనేకమందికి ఫ్యాక్టరీలో ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధిని కల్పిస్తున్నామని తెలిపారు. సమావేశంలో తహసీల్దార్ బ్రహ్మయ్య, గుడిపాడు గ్రామసర్పంచ్ వన్నూర్‌బీ, ఫ్యాక్టరీ యాజమాన్యం లక్ష్మీకాంతం, సుధాకర్‌రెడ్డి, గ్రామపెద్దలు దామోదర్, సంజీవరాయుడు, బాలాంజనేయులు, ఉపసర్పంచ్ వెంకటనారాయణ, నరేంద్ర, నాగరాజు పాల్గొన్నారు.

వాహనదారులకు సీఐ కౌన్సెలింగ్

తాడిపత్రిటౌన్ : పట్టణంలోని రామచంద్ర లాడ్జి సమీపంలో గురువారం సీఐ భాస్కర్‌రెడ్డి ద్విచక్రవాహనదారులు, ఆటోడ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. సీఐ మాట్లాడుతూ ద్విచక్రవాహనదారులు హెల్మెట్లు తప్పకుండా ధరించాలన్నారు. మితిమీరిన వేగంతో వాహనం నడపకూడదన్నారు. ఆటోడ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణికులకు ఎక్కించుకోకూడదన్నారు. ప్రతిఒక్కరు లైసెన్సులు తప్పనిసరిగా కలిగిఉండాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ ఆంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.



వాహనదారులతో మాట్లాడుతున్న సీఐ

సమస్యలు పరిష్కరించాలని ఉపాధ్యాయుల ధర్నా

తాడిపత్రిటౌన్ : మున్సిపల్ పాఠశాలల్లోని సమస్యలు, ఉపాధ్యాయుల సమస్యల తీర్చాలంటూ రాష్ట్ర ఉపాధ్యాయ సంఘాల పిలుపు మేరకు గురువారం స్థానిక సంఘాలు మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించాయి. ఏపీటీఎఫ్ పట్టణాధ్యక్షుడు సూర్యనారాయణరెడ్డి అధ్యక్షతన జరిగిన ధర్నా కార్యక్రమానికి ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రఘురామిరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ మున్సిపల్ పాఠశాలల్లో తెలుగు మాధ్యమాన్ని తప్పనిసరిగా కొనసాగించాలన్నారు. ఉపాధ్యాయుల సర్వీస్ రూల్స్‌లోని అసంబద్ధాలను సవరించాలన్నారు. పండిట్స్, వ్యాయామ ఉపాధ్యాయ పోస్టులకు పదోన్నతులు కల్పించాలన్నారు. మున్సిపల్ ఉపాధ్యాయ, విద్యారంగంలో ఉన్న సమస్యలన్నింటిని వెంటనే పరిష్కరించాలని, లేకపోతే ఈనెల 17న డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ఎదుట వేలాదిమందితో ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. ధర్నాలో ఏపీటీఎఫ్ జిల్లాకార్యదర్శి డేనియల్, యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు పుల్లన్న, మున్సిపల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ స్టేట్ సెక్రెటరీ ఎర్రిస్వామి, జయచంద్ర, ఓబయ్య, ఉపేంద్ర, రాధాకృష్ణ, ఉపాధ్యాయినులు వరలక్ష్మి, గౌరికుమారి, ఎన్జీవో అసోసియేషన్ ప్రెసిడెంట్ వాసుమూర్తి, పెద్దారెడ్డి, అంకాలు, నిరంజన్, 200మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రఘురామిరెడ్డి

ఎమ్మార్పీఎస్ రిలేదీక్షలకు బీజేపీ మద్దతు

తాడిపత్రిటౌన్ : ఎస్సీ వర్గీకరణ సాధన కోసం తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా ఎమ్మార్పీఎస్ నాయకులు చేస్తున్న రిలేదీక్షలకు గురువారం బీజేపీ నాయకులు మద్దతు తెలిపారు. బీజేపీ జిల్లాధ్యక్షుడు అంకాల్‌రెడ్డి మాట్లాడుతూ 24 సంవత్సరాలుగా ఎస్సీ వర్గీకరణ కోసం అలుపెరగని పోరాటం చేస్తున్నారన్నారు. ఈ విషయాన్ని ప్రధాని నరేంద్ర మోదీ దృష్టికి తీసుకెళ్లి పార్లమెంటులో బిల్లుకు చట్టబద్ధత కల్పించేవిధంగా కృషిచేస్తామని తెలిపారు. ఎస్సీ వర్గీకరణ విషయంలో మాదిగలకు తీరని అన్యాయం జరుగుతోందన్నారు. మద్దతు తెలిపినవారిలో బీజేవైఎం జిల్లాధ్యక్షుడు హరీష్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యులు అంబటి రామక్రిష్ణారెడ్డి, పట్టణాధ్యక్షుడు ఆంజనేయులు, జడ్‌ఆర్‌సీసీ మెంబర్ ప్రతాప్‌రెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా ధ్యక్షుడు రామాంజనేయులు, మహిళా అధ్యక్షురాలు విజయలక్ష్మి పాల్గొన్నారు.

యాడికిలో : ఎస్సీ వర్గీకరణ చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు మండలకేంద్రంలో రిలేదీక్షలు చేపట్టారు. ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంటు సమావేశాల్లో ప్రవేశపెట్టాలని, అంతవరకు దీక్షలు కొనసాగిస్తామని వీరన్న పేర్కొన్నారు. దీక్షలో లక్ష్మన్న, రామాంజనేయులు, వీరయ్య, శేఖర్ పాల్గొన్నారు.



రిలేదీక్షల్లో పాల్గొన్న బీజేపీ నాయకులు

ఉపాధ్యాయుడికి సన్మానం

పెద్దవడుగూరు : మండలంలోని గుత్తి అనంతపురం గ్రామ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న వెంకటరామిరెడ్డి బదిలీ కావడంతో గ్రామ సర్పంచ్ పద్మావతి, ఉపాధ్యాయులు గురువారం ఘనంగా సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ వృత్తిపట్ల అంకితభావంతో పనిచేయడమే కాకుండా విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను బోధించారన్నారు. ఈయన బదిలీపై వెళ్లడం పాఠశాలకు లోటన్నారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు ప్రసాద్‌యాదవ్, ఉపాధ్యాయులు వెంకటరవి, ఆదిలక్షుమ్మ పాల్గొన్నారు.



వెంకటరామిరెడ్డిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

రైతుసేవలో రెవెన్యూశాఖ

తాడిపత్రిరూరల్ : రైతుసేవలో రెవెన్యూశాఖను ప్రతి ఒక్కరైతు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ యల్లమ్మ కోరారు. మండలంలోని చుక్కలూరు గ్రామంలో గురువారం తహసీల్దార్ యల్లమ్మ ఆధ్వర్యంలో రైతుసేవలో మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో రైతుల వద్దనుంచి అర్జీలు రాగా వాటిని అక్కడే పరిష్కరించినట్లు తహసీల్దార్ తెలిపారు. రైతుల సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరిస్తామని ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ మల్లేష్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దవడుగూరులో : మండలంలోని చిత్రచేడు గ్రామంలో రెవెన్యూ అధికారులు ఆర్ఐ క్రాంతికుమార్, వీఆర్వో రంగస్వామి రైతుల వద్దకే రెవెన్యూ కార్యక్రమం నిర్వహించారు. ఏళ్ల తరబడి ఉన్న భూసమస్యలను గ్రామసభల్లో దరఖాస్తు చేసుకుంటే వాటిని సత్వరమే పరిష్కరిస్తామన్నారు. ముఖ్యంగా భూసరిహద్దుల విషయాల్లో రైతులు తరచూ గొడవలు పడడం, పోలీసులు, కోర్టుల చుట్టూ తిరగాల్సివస్తోందన్నారు. మొత్తం ముగ్గురు రైతులు ఆన్‌లైన్ సమస్యలపై ఫిర్యాదులు చేసినట్లు వారు తెలిపారు.

ఎన్టీఆర్ గృహాల మంజూరుపై గ్రామసభ

తాడిపత్రిరూరల్ : మండలంలోని యర్రగుంటపల్లి, రావివెంకటాంపల్లి గ్రామాల్లో ఇన్‌చార్జి ఎంపీడీఓ చలపతి ఆధ్వర్యంలో గురువారం గ్రామసభలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రజా సాధికారిక సర్వేలో ఇళ్లు లేనివారు ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్నారన్నారు. ఇందులోభాగంగా లబ్ధిదారుల జాబితా వచ్చిందన్నారు. ఎంపికైన లబ్ధిదారుల్లో అర్హులు ఎవరని విచారణ చేసి పేర్లు నమోదు చేస్తామని ఆయన తెలిపారు.

ధ్యానంతోనే మానసిక ప్రశాంతత

పెద్దవడుగూరు : స్థానిక ఓంశాంతి నిలయంలో బ్రహ్మకుమారి అంబిక, ఓంశాంతి సభ్యులు గురువారం రాఖీ పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. రాఖీ విశిష్టత గురించి ఆమె తెలియచేశారు. కార్యక్రమానికి ఎంపీపీ దేవమ్మ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం అంబిక మాట్లాడుతూ ప్రస్తుతం సమాజంలో ధన వ్యామోహంతో తమ ఆరోగ్యం గురించి శ్రద్ధ లేనందువల్ల అనారోగ్య సమస్యలకు గురై తమ జీవితాలను అర్ధంతరంగా ముగిస్తున్నారన్నారు. ప్రతిరోజూ అమృత ఘడియ వేళల్లో ధ్యానం చేయడం వల్ల మానసిక ప్రశాంతత కలగడమే కాకుండా అనారోగ్య సమస్యలు దరిచేరవన్నారు. ధ్యానం చేయడం వల్ల చెడు ఆలోచనలు, చెడు అలవాట్లు దరిచేరవన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ కొండూరు కేశవరెడ్డి, సుబ్బారావు, కేశవరెడ్డి పాల్గొన్నారు.

బెల్టుషాపు నిర్వాహకుడి ఇంట్లో సోదాలు

పెద్దపప్పూరు : మండలకేంద్రంలోని ముత్యాలరెడ్డి అనే బెల్టుషాపు నడుపుతున్న వ్యక్తి ఇంట్లో గురువారం ఎస్ఐ శ్రీహర్ష ఆధ్వర్యంలో సోదాలు చేశారు. అంతకుముందు అతను బెల్టుషాపు నిర్వహించేవాడు. సోదాల అనంతరం నిర్వాహకుడిని పిలిచి బెల్టుషాపు నిర్వహిస్తే కఠినచర్యలు తీసుకొని కేసు నమోదు చేస్తానని హెచ్చరించారు.

ఆటో బోల్తా : డ్రైవర్‌కు గాయాలు

యాడికి : మండలకేంద్రంలోని లక్ష్మీప్రియ థియేటర్ వద్ద గురువారం ఆటో బోల్తాపడి డ్రైవర్ చైతన్య(19)కి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలమేరకు బస్టాండు వైపు నుంచి రాయలచెరువు వైపు ఆటోలో వెళుతుండగా ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి అదుపుతప్పి ఆటో బోల్తాపడడంతో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. స్థానికులు అతన్ని చికిత్స నిమిత్తం 108వాహనంలో స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యంకోసం కర్నూలు ఆస్పత్రికి తరలించారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థికసాయం



బాధితురాలికి నగదును అందజేస్తున్న సర్పంచ్

తాడిపత్రిరూరల్ : మండలంలోని రమేష్‌రెడ్డికాలనీలో జూలై 31న హసేనబీ అనే మహిళ మృతిచెందింది. చంద్రన్న బీమా పథకం కింద సర్పంచ్ చింబిలి వెంకటరమణ గురువారం తన కార్యాలయంలో మృతురాలి కుటుంబానికి రూ.5వేలు అందచేశారు. పదిరోజుల తర్వాత రూ.25వేలు బ్యాంకులో డిపాజిట్ అవుతుందని సర్పంచ్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్‌రెడ్డి నియోజకవర్గ ప్రజలకు చంద్రన్న బీమా పథకం వర్తించేలా ప్రీమియం కట్టారన్నారు. మృతురాలి కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట



ఎక్స్‌కవేటర్‌తో రహదారికి అడ్డువేయిస్తున్న పోలీసులు

పెద్దపప్పూరు : మండలకేంద్రంలోని నదీపరివాహక ప్రాంతంలో ఇసుక అక్రమంగా రవాణాకు కిలోమీటరు మేర అడ్డుకట్ట వేసినట్లు ఎస్ఐ శ్రీహర్ష తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠినంగా చర్యలు తీసుకొని కేసులు నమోదు చేస్తామన్నారు. మండలంలో ఎవరైనా ఇసుకను అక్రమంగా తరలిస్తుంటే తమకు సమాచారం ఇవ్వాలని, వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని ఆయన తెలిపారు.

కిసాన్ క్రెడిట్‌కార్డుల పంపిణీ

యల్లనూరు : మండలంలోని సొసైటీ బ్యాంకు తరపున కిసాన్ క్రెడిట్ కార్డులను ఖాతాదారులకు అందిస్తున్నట్లు సీఈఓ వీరనారప్ప తెలిపారు. ఖాతాదారులందరికీ ఈ కిసాన్ క్రెడిట్ కార్డులను అందిస్తున్నామన్నారు. ఖాతాదారులు ఏ ఏటీయంలోనైనా తమ ఖాతాలో ఉన్న మొత్తాన్ని ఈ కార్డు ద్వారా పొందగలుగుతారన్నారు.

రైతులకు జిప్సం, జింక్ అందజేత

నార్పల: మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయంలో గురువారం 67 మంది రైతులకు జిప్సం, జింక్ పంపిణీ చేసినట్లు వ్యవసాయాధికారి వెంకట్‌కుమార్ తెలిపారు. ఎవరికైనా జింక్, జిప్సం కావాల్సిన వారు స్థానిక వ్యవసాయ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.





ఎంఆర్ టీకాపై అవగాహన కల్పిస్తున్న వైద్యులు, యాడికిలో విద్యార్థికి వ్యాక్సిన్ వేస్తున్న వైద్య సిబ్బంది

ప్రతి చిన్నారికీ ఎంఆర్ టీకా వేయించాలి

తాడిపత్రిటౌన్ : పట్టణంలోని 9 నెలల నుంచి 15సంవత్సరాల్లోపు పిల్లలందరికీ తల్లిదండ్రులు ఎంఆర్ టీకాలు వేయించాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ధామస్‌రెడ్డి సూచించారు. గురువారం స్థానిక ప్రభుత్వాసుపత్రిలో ఎంఆర్ వ్యాక్సిన్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గత 7-8సంవత్సరాల నుంచి పోలియోను పూర్తిగా నిర్మూలించినవిధంగానే తట్టు, రుబెల్లా వ్యాధుల నిర్మూలనకు ప్రభుత్వం ఎంఆర్ టీకాలను అందిస్తోందన్నారు. అన్ని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో, అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్ణయించిన తేదీల్లో ఎంఆర్ వ్యాక్సిన్లు వేస్తున్నారని, తల్లిదండ్రులు గుర్తించి తమ పిల్లలకు టీకాలు వేయించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యులు శ్రీనివాసరెడ్డి, సూర్యప్రకాష్‌రెడ్డి, ఆదినారాయణరెడ్డి, స్వప్నసుబ్బారెడ్డి, సతీష్, రవిశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

పెద్దవడుగూరులో : మీజిల్స్, రుబెల్లా వ్యాధుల నివారణకు ఎంఆర్ టీకాను వేయించాలని డాక్టర్లు శ్రీధర్‌రెడ్డి, వెంకటరామిరెడ్డి సూచించారు. మండలంలోని కండ్లగూడూరు, కదరగుట్టపల్లి, బుర్నాకుంట, మల్లేపల్లి, బందార్లపల్లి, మండలకేంద్రంలోని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో విద్యార్థులకు గురువారం విద్యార్థులకు మీజిల్స్, రూబెల్లా వ్యాధులు రాకుండా టీకాలు డాక్టర్లు వేశారు. 9 నెలల నుంచి 15 సంవత్సరాల్లోపు పిల్లలు కలిగిన తల్లిదండ్రులు ఈ టీకాను తప్పకుండా వేయించాలన్నారు. ప్రస్తుతం 98 శాతం పిల్లలకు టీకాలు వేశామన్నారు.

యాడికిలో : మండలపరిధిలోని రాయలచెరువు, రామరాజుపల్లి, తూట్రాళ్లపల్లి తదితర గ్రామాల్లోని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో విద్యార్థులకు గురువారం వైద్యులు ఎంఆర్ వ్యాక్సిన్లు వేశారు. మీజిల్స్, రుబెల్లా వ్యాధులు సోకకుండా టీకాలు వేస్తున్నట్లు వైద్యులు జహాన్, ప్రవీణ్‌కుమార్ తెలిపారు. మొత్తం 3,490మంది విద్యార్థులకు వ్యాక్సిన్లు వేశామన్నారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది కోదండరామిరెడ్డి, నారాయణ, జుబేదా పాల్గొన్నారు.

తల్లిపాలే బిడ్డకు శ్రేష్ఠం



సమావేశంలో మాట్లాడుతున్న వైద్యాధికారి

పెద్దపప్పూరు : తల్లిపాలే బిడ్డకు శ్రేష్ఠమైనవని వైద్యాధికారి విష్ణుమూర్తి పేర్కొన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మండలకేంద్రంలోని అంగన్‌వాడీ సెంటర్‌లో గురువారం గర్భవతులు, బాలింతలకు తల్లిపాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారి మాట్లాడుతూ తల్లిపాలలో ఉండే ప్రొటీన్లు, విటమిన్లు, పోషక పదార్థాలు ఏ పాలలోనూ ఉండవన్నారు. ప్రతి తల్లీ తమ బిడ్డకు తల్లిపాలు తప్పకుండా ఇవ్వాలన్నారు. మంచి ఆరోగ్యంతో పాటు రోగనిరోధక శక్తి పెంపొందుతుందన్నారు. తల్లిపాలు ఇవ్వని పక్షంలో పిల్లల్లో రోగనిరోధక శక్తి మందగించి ఎదుగుదల లోపిస్తుందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ దేవమణి, కార్యకర్తలు, బాలింతలు, గర్భవతులు పాల్గొన్నారు.

యాడికిలో : తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరమని ఏసీడీపీఓ కవిత పేర్కొన్నారు. గురువారం స్థానిక 9వ నెంబర్ అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల్లో ఆమె మాట్లాడుతూ బిడ్డ పుట్టిన వెంటనే గంటలోపు తల్లి ముర్రుపాలను బిడ్డకు తాగించాలన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్‌వైజర్ పార్వతమ్మ, అంగన్వాడీ కార్యకర్తలు మహాలక్ష్మి, హైమావతి పాల్గొన్నారు.

గోవుల అక్రమ రవాణాను అరికట్టండి

తాడిపత్రిరూరల్ : వందలాది ఆవులు, ఎద్దులను కంటైనర్లలో చెన్నైకు అక్రమంగా తరలిస్తున్నారని, వీటిని వెంటనే అడ్డుకోవాలని రాయలసీమ వీహెచ్‌పీ అధ్యక్షుడు రాధాక్రిష్ణ డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద వీహెచ్‌పీ ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 2న బక్రీద్ సందర్భంగా ఖుర్బానీ పేరుతో అనేక గోవులను చంపడానికి సిద్ధపడుతున్నారని అన్నారు. హిందువుల ఆరాధ్య దైవమైన గోమాతను చంపడం వల్ల మనోభావాలు దెబ్బతింటాయని, దీనివల్ల సమాజంలో అశాంతి నెలకొనే ప్రమాదం ఉందన్నారు. గోవధ నిషేధ చట్టాన్ని కఠినంగా చేపట్టాలని డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసులను కోరారు. అనంతరం వినతిపత్రం అందచేశారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ జిల్లా సేవా ప్రముఖ్ రామాంజనేయులు, గంగాధర్‌యాదవ్, వీహెచ్‌పీ నాయకులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న వీహెచ్‌పీ నాయకులు

మోడల్‌స్కూల్‌ను తనిఖీ చేసిన ఎంఈఓ

యల్లనూరు : మండలంలోని చిలమకూరు ఆదర్శ పాఠశాలను గురువారం ఎంఈఓ చంద్రశేఖర్ తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. విద్యార్థుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. గురువారం నుంచి ప్రారంభమైన హాస్టల్ భవనాన్ని కూడా ఆయన పరిశీలించారు.

అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేస్తాం



గ్రామసభ నిర్వహిస్తున్న తహసీల్దార్ పుల్లన్న

పుట్లూరు : మండలంలోని ఇళ్లు లేని నిరుపేదలను గుర్తించి అర్హులైన వారికి ఇళ్లను మంజూరు చేస్తామని తహసీల్దార్ పుల్లన్న పేర్కొన్నారు. మండలంలోని కందికాపుల గ్రామంలో గురువారం ఇళ్లులేని లబ్ధిదారుల ఎంపికపై గ్రామసభ నిర్వహించారు. ఇళ్లులేని నిరుపేదలను వారి ఇళ్ల వద్దకే వెళ్లి పరిశీలించి ఎంపిక చేస్తామన్నారు. ఏమైనా సమస్యలుంటే ముందుగా హౌసింగ్ ఏఈకి తెలపాలని సూచించారు. గ్రామసభల్లో వచ్చిన అర్జీలను తహసీల్దార్ స్వీకరించారు. కార్యక్రమంలో సివిల్ సప్లయ్ అధికారి నాగేంద్రప్రసాద్, జూనియర్ అసిస్టెంట్ ఉదయ్, వీఆర్వోలుపాల్గొన్నారు.

గార్లదిన్నెలో : ఇళ్లులేని పేదలకు ఎన్టీఆర్ పక్కా గృహాలు మంజూరు కోసం గురువారం మండలంలోని ఇల్లూరు, పెనకచెర్ల, కోటంక గ్రామాల్లో అధికారులు 3 టీంలుగా ఏర్పడి గ్రామసభలు నిర్వహించారు. సర్వేలో అర్హులను గుర్తించి గృహాలు మంజరు చేస్తామని ఎంపీడీఓ బాస్కర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ గోపాల్‌రెడ్డి, ఎంఈఓ చంద్రానాయక్, ఈఓఆర్డీ వేణుగోపాల్‌రెడ్డి, హౌసింగ్ వర్క్సు ఇన్‌స్పెక్టర్, వీఆర్ఓలు, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వర్షం కోసం భజన



భజన చేస్తున్న గ్రామస్థులు

గార్లదిన్నె: మండలంలోని ఇల్లూరు గ్రామంలో ఐదురోజుల నుంచి గ్రామస్తులు భజన కార్యక్రమం చేపట్టారు. 6వ రోజైన గురువారం గ్రామంలోని పురవీధుల గుండా తిరిగి భజనలతోపాటలు పాడారు. గ్రామస్తులు భజన చేసేవారికి నీరుపోస్తూ మొక్కులు తీర్చుకున్నారు. శుక్రవారం ఉదయం శివుడికి నిండుబిందెలతో జలాభిషేకం చేస్తామని గ్రామస్థులు తెలిపారు.

గర్భిణులకు సామూహిక సీమంతాలు

రాచేపల్లి (శింగనమల): మండలంలోని రాచేపల్లి అంగన్‌వాడీ సెంటర్‌లో గురువారం గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఉపసర్పంచ్ లక్ష్మీనరసమ్మ గర్భిణులకు పూలు, గాజులు, పసుపు కుంకుమ ఇచ్చి సీమంతాలు చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు సుధామణి, లీలావతి, ప్రమీల, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

నేడు విప్ రాక

శింగనమల: మండలంలోని నాగులగుడ్డం తండాలో శుక్రవారం ప్రభుత్వ విప్ బీ యామినీబాల పర్యటించనున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ శ్రీలత తెలిపారు. గురువారం టీడీపీ నాయకులు దాసరి గంగాధర్‌తో కలిసి ఆమె మాట్లాడుతూ నాగులగుడ్డం తండా తాగునీటి అభివృద్ధి పథకాన్ని విప్ ప్రారంభిస్తారన్నారు.

టీడీపీ మైనార్టీ మండల అధ్యక్షుడిగా ఫక్రుద్దీన్



శింగనమల: టీడీపీ అనుబంధ మైనారిటీ మండల అధ్యక్షుడిగా చిత్రచేడు ఫక్రుద్దీన్ ఎన్నుకున్నట్లు మండల అధ్యక్షుడు గుత్తా ఆదినారాయణ తెలిపారు. రెండోసారి తనను ఎంపిక చేయడంపై ప్రభుత్వ విప్ యామినీబాల, ఎమ్మెల్సీ శమంతకమణి, నియోజకవర్గ సమన్వయకర్త బలపనూరు అశోక్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

సినిమా గైడ్

ఉరవకొండ

మల్లేశ్వరి : ఫిదా
వెంకటేశ్వర : దువ్వాడ జగన్నాథమ్
బాలాజీ : గౌతమ్‌నందా

నేటి నుంచి గ్రామ సభలు

వజ్రకరూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో ఎన్టీఆర్ గృహనిర్మాణాలపై గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు హౌసింగ్ ఏఈ షౌకత్‌అలీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులు మూడు టీంలుగా ఏర్పడి గ్రామసభలు నిర్వహిస్తామన్నారు. ఈ నెల 4, 5, 8 తేదీల్లో మూడు టీంలు గ్రామసభలను నిర్వహిస్తాయన్నారు. ప్రజలకు గృహ నిర్మాణాలపై సమస్యలుంటే గ్రామసభలో అధికారుల దృష్టికి తీసుకు రావాలని వెల్లడించారు.

ఎదురుచూపులు

హంద్రీనీవా నీటి కోసం ఎదురు చూస్తున్న రైతాంగం
నియోజకవర్గంలో 1.5 లక్షల ఆయకట్టు
చురుగ్గా సాగుతున్న పనులు, టెండర్లు


డిస్ట్రిబ్యూటరీ-2 కాలువ

ఉరవకొండ: హంద్రీనీవా ఆయకట్టుకు ఈ ఖరీఫ్ సీజన్‌లోనైనా సాగునీరు వచ్చేనా అని రైతులు ఎదురు చూస్తున్నారు. డిస్ట్రిబ్యూటరీలో ప్రధాన కాలువ పనులు పూర్తి అయినా సాగునీరు అందని పరిస్థితి ఉంది. హంద్రీనీవా సుజల స్రవంతి పథకంలో కడప, కర్నూలు, చిత్తూరు జిల్లాల్లో మొదటి దశలో 1.18 లక్షల ఎకరాలకు సాగునీరు అందివ్వాల్సి ఉంది. జిల్లాలో హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ కింద 3 లక్షల ఆయకట్టు ఉంది. ఇందులో ఉరవకొండ నియోజకవర్గంలోనే 1.5 లక్షల ఆయకట్టు ఉంది. ఈ ఆయకట్టుకు సాగునీరు అందితే నియోజకవర్గంలోని పొలాలు సస్యశ్యామలమవుతాయి. 33, 34 ప్యాకేజీల్లో 20,500 ఎకరాల ఆయకట్టు ఉంది. 34వ ప్యాకేజీలో డీ-1, డీ-2 కింద 17,500 ఎకరాలకు సాగునీరు అందివ్వాల్సి ఉంది. 34వ ప్యాకేజీలోని డీ-1, డీ-2 పరిధిలో నింబగల్లు నుంచి కనేకల్లు మండలం బెదురుకుంట వరకు 11 సూపర్ ప్యాకేజీ పనుల డిజైన్లకు ప్రతిపాదనలు పంపారు. ఈపనులు ఇంకా చేపట్టాల్సి ఉంది. ప్రధాన కాలువ పనులు పూర్తికాగ మైనర్ కాలువ పనులు చేపట్టాల్సి ఉంది. డీ-1లో మూడు మైనర్ కాలువలు, డీ-2లో తొమ్మిది మైనర్ కాలువలకు పనులు పూర్తి కావాల్సి ఉంది. డీ-2 పరిధిలో వ్యాసాపురం, బిదురుకుంట వద్ద భూ సేకరణలో సమస్యలు నెలకొని ఉన్నాయి. 33వ ప్యాకేజీలో ఉరవకొండ, విడపనకల్లు, వజ్రకరూరు మండలాల్లో 5 వేల ఎకరాలకు సాగునీరు అందనుంది. డీ-1లో హోతూరు వద్ద బ్లాస్టింగ్ పనులకు అనుమతులు రావాల్సి ఉంది. 36వ ప్యాకేజీలో 86 వేల ఎకరాల ఆయకట్టుకు నీరు అందించాల్సి ఉంది. ఈ ప్యాకేజీ కి సంబంధించిన పనులకు టెండర్లు పూర్తి కాగా కాంట్రాక్టర్లు అగ్రిమెంట్ చేసుకోవాల్సి ఉంది. ఈ కాలువ పనులు పూర్తి అయితే ఉరవకొండ నియోజకవర్గంలో పాటు కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజకవర్గాలకు లబ్ధి చేకూరుతుంది. పనులకు సంబంధించి టెండర్ల ప్రక్రియ పూర్తి అయింది. త్వరలోనే పనులు చేపట్టేందుకు అధికారులు సిద్ధపడుతున్నారు.

ఆటకట్టుకు నీరందిస్తాం : రామకృష్ణ, హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ డీఈ

34వ ప్యాకేజీ ద్వారా డీ-1లకు సాగునీరు అందించడానికి చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే నింబగళ్లు వరకు సూపర్ ప్యాసెస్ పనులు పూర్తి అయ్యాయి. కాలువకు నీరు వస్తే తాత్కలికంగా పైపులు వేసైనా సాగునీరు అందిస్తాం. 11 సూపర్ ప్యాసెస్ పనులకు ప్రతిపాదనలు పంపాం. కాలువ మీద పర్యటించి పనులను వేగవంతం చేస్తున్నాము. వ్యాసాపురం నుంచి బెదురుకుంటం వరకు భూసేకరణలో సమస్యలు ఉన్నాయి.

ఆయకట్టుకు నీరందించాలి : మధుసూదన్ నాయుడు, సీపీఎం రైతు సంఘం నాయకుడు

హంద్రీనీవా డిస్ట్రిబ్యూటరీ పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలి. కాలువకు సాగునీరు అందించి రైతులను ఆదుకోవాలి. పాలకులు డిస్ట్రిబ్యూటరీ పనులపై నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఇప్పటికే 50 శాతం పనులు పూర్తి అయ్యాయి. మిగిలిన పనులు పూర్తి చేసి సాగునీరు అందించాలి

పింఛన్ల కోసం వృద్ధుల అవస్థలు

ఉరవకొండ: పింఛన్ల పంపిణీ కేంద్రాల వద్ద సర్వర్లు మొరా యించడంతో ఉరవకొండలో గంటల తరబడి వృద్ధులు, వికలాంగు లు పడిగాపులు కాశారు. పీటీ-5 పింఛన్ పంపిణీ కేంద్రం వద్ద గురువారం మధ్యాహ్నం 12 గంటల వరకు పింఛన్లు పంపిణీ చే యలేదు. అన్ని చోట్ల సర్వర్లు పని చేయకపోవడంతో అక్కడే గంటల తరబడి వేచి చూశారు. ఈ నెల 5వ తేదీలోపు పంపిణీ పూర్తి చేయాలని ఆదేశాలు ఉండటంతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు.


పింఛన్ల కోసం వేచి ఉన్న వృద్ధులు

నీటి ట్యాంకులు ఏర్పాటు చేయాలి


వినతి పత్రాన్ని అందజేస్తున్న సీపీఐ నాయకులు

ఉరవకొండ: మండలకేంద్రంలోని పలు వార్డుల్లో తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారని సీపీఐ నాయకులు సర్పంచు నర్రా సుజాత దృష్టికి గురువారం తీసుకెళ్లారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో సర్పంచుకు వినతి పత్రాన్ని అందజేశారు. శివరామిరెడ్డి కాలనీ, హామాలీ కాలనీ, ఒక వార్డు, డ్రైవర్స్ కాలనీలో ట్యాంకులను ఏర్పాటు చేయాలని విన్నవించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు వన్నూర్ సాబ్, చెన్నరాయుడు, మల్లి, పాల్గొన్నారు.

లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ


చెక్కు పంపిణీ చేస్తున్న మేనేజర్, ఎక్సైజ్ సీఐ

ఉరవకొండ: మండలంలోని షేక్షానుపల్లితండాకు చెందిన 14 మంది గిరిజనులకు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా మంజూరైన చెక్కులను ఆంధ్ర బ్యాంకు మేనేజర్ జయకుమార్, ఎక్సైజ్ సీఐ పవన్‌కుమార్ గురువారం అందజేశారు. 14 మందికి ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఒక్కొక్కరికి రూ. 1 లక్ష మంజూరైందన్నారు. వీటిలో రూ. 60 వేలు సబ్సిడీ ఇస్తారన్నారు. కార్పొరేషన్ మంజూరు చేసిన రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. కార్యక్రమంలో మాజీఎంపీటీసీ సభ్యులు పాలే నాయక్, టీఎన్‌ఎస్‌ఎఫ్ నాయకులు రమేశ్ నాయక్ పాల్గొన్నారు.

ఇన్‌పుట్ సబ్సిడీ ఇంకెప్పుడు ఇస్తారు..? సీపీఐ

కూడేరు: గత ఏడాది రావాల్సిన ఇన్‌పుట్ సబ్సిడీ ఇంకెంతకాలానికి ఇస్తారంటూ సీపీఐ నాయకులు మండపడ్డారు. గురువారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మండల కార్యదర్శి పెరుగు సంగప్ప, రమణ, నారాయణమ్మ తదితరులు మాట్లాడుతూ... 2016 సంవత్సరంలో వేరుశనగ పంట నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ సక్రమంగా అందలేదని ఆరోపించారు. అర్హులైన రైతులందరికి పరిహారం అందిస్తామని ప్రకటించిన ప్రభుత్వం మండలంలో వందల మంది అర్హులకు అన్యాయం చేసిందాన్నారు. వెంటనే అర్హులకు న్యాయం చేసే చర్యలు తీసుకోవాలని కోరారు.

రెండో రోజూ కొనసాగిన ఎమ్మార్ వ్యాక్సిన్


విడపనకల్లులో టీకా వేస్తున్న వైద్య సిబ్బంది


వ్యాక్సిన్ వేస్తున్న ప్రోగ్రామ్ ఆఫీసర్ ఇషాద్ అహ్మద్ (కూడేరు)

విడపనకల్లు: మండలకేంద్రంలోని విశ్వ భారతి ఇంగ్లీష్ మీడియం పాఠశాల, వివేకానంద ఇంగ్లీష్ మీడియం పాఠశాల, సుభోదయం ఇంగ్లీష్ మీడియం పాఠశాల్లో రెండవ రోజు వైద్య సిబ్బంది ఎమ్మార్ వ్యాక్సిన్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీహెచ్‌ఓ నాగరంగయ్య మాట్లాడుతూ రెండవ రోజు వ్యాక్సిన్ వేసే కార్యక్రమం 98 శాతం పూర్తి చేశామన్నారు. మధ్యాహ్నం 2 గంటల వరకు టీకాలు వేసి సాయంత్రం 4 గంటల వరకు విద్యార్థులను వైద్యుల పర్యవేక్షణలో ఉంచారు. టీకాలు వేసే కార్యక్రమాన్ని ఈ నెల 15వ తేదీ వరకు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ శర్మాస్ వలి, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

కొనకొండ్లలో..

వజ్రకరూరు: మండలంలోని కొనకొండ్ల గ్రామంలో ఆరోగ్య సిబ్బంది చిన్నారులకు గురువారం ఎమ్మార్ వ్యాక్సిన్ వేశారు. గ్రామంలోని ప్రభు త్వ, ప్రైవేట్ పాఠశాలల్లో, అంగన్‌వాడీ కేంద్రాలు, జడ్పీ ఉన్నత పాఠశాలలో దాదాపు 1,800 చిన్నారులకు ఎమ్మార్ టీకాలు వేశారు. తల్లిదండ్రులు తమ పిల్లలను కేంద్రాలకు తీసుకుని వచ్చి ఎమ్మార్ వ్యాక్సిన్ వేయించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ చంద్రశేఖర్ రెడ్డి, ఎంపీహెచ్ఈఓలు శ్రీరాములు, వెంకటేశ్వర్లు, సూపర్‌వైజర్లు మెహరున్నిసా, శ్రీనివాసులు, ఆరోగ్య కార్యకర్తలు పద్మావతి, గాయత్రి, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కూడేరు: మీజిల్స్, రూబెల్లా వ్యాధులు ప్రాణాంతకమైనవని ప్రతి చిన్నారికి ఎంఆర్ వ్యాక్సిన్ వేయించాలని ప్రోగ్రామ్ ఆఫీసర్ ఇషాద్ అహ్మద్ తెలిపారు. మీజిల్స్, రూబెల్లా నివారణ కోసం రెండవ రోజు మండలంలోని కరుట్లపల్లి, ఛోళసముద్రం, ఎంఎంహళ్ళి, కొర్రకోడు, కొర్రకోడు డ్యాం, హంసాపల్లి తదితర గ్రామాల్లో దాదాపు 1070 మంది చిన్నారులకు వ్యాక్సిన్ అందించినట్లు వైద్యులు తెలిపారు.

కార్యక్రమంలో పారా మెడికల్ అధికారి నాగన్న, డాక్టర్ తిప్పయ్య, సీహె చ్ఓ శ్రీనివాసులు, సూపర్‌వైజర్లు నాగేం ద్రప్రసాద్, సరోజమ్మ, శాంతకుమారి, ఏఎన్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలు


సామూహిక సీమంతాలు నిర్వహిస్తున్న దృశ్యం

విడపనకల్లు: మండలంలోని గడేకల్లు గ్రామంలోని ఎనిమిది అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ శ్రీదేవి మాట్లాడుతూ పుట్టిన వెంటనే బిడ్డకు తల్లిపాలు తాపాలన్నారు. మూఢ నమ్మకాలతో ముర్రుపాలను నేలపాలు చేస్తున్నారని, దీనితో పిల్లల ఆరోగ్యాన్ని పాడు చేస్తున్నారన్నారు. గర్భవతులు, బాలింతలు పౌష్ఠికాహారాన్ని తీసుకుని ప్రసవ సమయాల్లో తల్లీబిడ్డల ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. చిన్న పిల్లల్లో శారీరక పెరుగుదల ఉండాలంటే గడ్డు, పాలు, పౌష్ఠికాహారాన్ని తీసుకోవాలన్నారు. అనంతరం గర్భవతులకు సామూహిక సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు వనతి, కళ్యాణి, రాజమ్మ, నిర్మల, భీమక్క, గాయత్రి, భారతిదేవి, తదితరులు పాల్గొన్నారు.

కూడేరు: మండలంలోని ముద్దలాపురం గ్రామంలో గురువారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు తల్లిపాల విశిష్ఠత గూర్చి గర్భవతులు, బాలింతలకు వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, గర్భవతులు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.